
# కాళిదాస ప్రత్యభిజ్ఞ





సాహితీ తత్త్వవిశారద

ప్రణీత బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాస రావు

# కాళిదాస ప్రత్యభిజ్ఞ



ప్రణేత

సాహితీ తత్త్వవిశారద

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాస రావు

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# విషయసూచి


| అధ్యాయము | | పుట |
|---|---|---|
| 1) | స్వరూప ప్రత్యభిజ్ఞ | 1 - 55 |
| 2) | రచనా ప్రత్యభిజ్ఞ | 56 - 120 |
| 3) | సౌందర్య ప్రత్యభిజ్ఞ | 121 - 190 |
| 4) | సామరస్య ప్రత్యభిజ్ఞ | 191 - 247 |


Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# స్వరూప ప్రత్యభిజ్ఞ

భాగవత మయింది. రామాయణ మయింది . భారత మయింది. సాహిత్య తత్త్వాన్వేషణ యాత్రలో మూడు గొప్ప మజిలీలు దాటి వచ్చా మిప్పటికి. అవి మూడూ పురాణేతిహాసాల పరిషత్తులో విశిష్ట సభ్యులు. వాటికా విశిష్టత కల్పించిన వారు వ్యాస వాల్మీకుల లాటి మహర్షులు. పోతే అలాటి మహర్షుల స్థాయి కెదిగి వారి సృష్టి చిత్రాలను మరొక రీతిలో చిత్రించి చూపిన మహా కవి ఒకడున్నాడు. అతడొకడే ఉన్నాడు మహా కవి. ఎవడతడు. ఇంకెవడు. పురా కవీనాం గణనా ప్రసంగే - కనిష్ఠికా 2 ధిష్ఠిత కాళిదాసా- అద్యాపి తత్తుల్య కవే రభావా - దనామికా సా 2 ర్థవతీ బభూవ - అని భావుక లోకం చేత ఎక్కడ లేని ప్రశంస లందుకొన్న కాళిదాస మహాకవి. గతంలోనే కాదు. ఇప్పుడీ వర్తమానంలోనూ - మన ప్రాచ్య దేశాల లోనే కాదు - పాశ్చాత్య దేశాలలోనూ కవి అన్నా మహా కవి అన్నా ఒక్క కాళిదాసే - మరెవరికీ లేదలాంటి హక్కనిపించుకొన్న వాడాయన. వాల్మీక్యాదుల వంటి ఋషికల్పుడైన కవి గనుకనే ఆయన మహా కవి శబ్ద వాచ్య డయినాడు. మహత్త్వ మాయనలోని ఋషిత్వాన్ని సూచిస్తే - కవి శబ్ద మాయన లోని కవితా ప్రాభవాన్ని చాటుతుంది. మరెవరిలో లేదింతటి ప్రతిభ . మిగతా వారందరూ కవులే గాని మహా కవులు గారు. అందుకే నేమో ఆలంకారిక మూర్ధన్యు డానందవర్ధనుడు ద్విత్రాః పంచషా వా మహా కవయ ఇతి గణ్యంతే అని వ్యాస వాల్మీకుల ప్రక్కన కాళిదాసు కొక్కనికే సింహాసనం వేసి కూచోబెట్టాడు. ఋషులలో కవి కవులలో ఋషి కాళిదాసు. రాజ్యాశ్రమ మునిం మునిః అని ఆయనే ఒకచోట వర్ణిస్తాడు. వసిష్ఠాదులు మునులయితే రఘువంశ రాజులు రాజ్యమనే ఆశ్రమంలో మునులట. అలాగే వ్యాసాది మహర్షులు అరణ్య సీమలలో నివసించిన ఋషులయితే - ఈయన పట్టణాలలో నివసిస్తూ వచ్చిన ఋషి. ప్రాచీనులలో నవీను డీయన. నవీనులలో ప్రాచీనుడు. ప్రాచీనులైన

మహర్షుల లాగా అత్యున్నతమయిన స్థాయికెదిగి జీవిత రహస్యాలను దర్శించిన వాడు. నవీనమయిన దృక్పథంలో వాటినే అతి సుందరంగా ఆవిష్కరించిన వాడు. దర్శించినపుడు సత్యద్రష్ట. వర్ణించినపుడు సౌందర్య స్రష్ట. ప్రాచేత సాదులు సౌందర్య దూరులని కాదు. కావలసినంత ఉంది సౌందర్య సృష్టి వారి రచనలలో. కాని సౌందర్య మనేది అప్రధానం వారికి. సత్యమే సర్వ ప్రధానం. కాళిదాసు కలా కాదు. సత్య సౌందర్యాలు రెండూ ప్రధానమే. దర్శించిన ప్రతి సత్యాన్నీ ఎంతగానో భావించి ఆ భావించిన ప్రతి ఒక్క భావాన్నీ ఎంతో మనోహరంగా వర్ణిస్తాడు. ఆ సత్య దర్శనమే ఆయన ప్రాచీనత అయితే - ఈ సౌందర్యారాధనమే ఆయన నవీనత. రెండూ కలిసి ఆయనగారి ప్రత్యేకత.

ఎప్పటివాడీ కాళిదాసు ఏమిటీయన జీవితం. ఎప్పటి వాడో ఏమో గాని ఎన్ని కథలో అల్లుకొని ఉన్నాయి ఈ మహా కవి చుట్టూ. అవి కట్టు కథలో అసలు కథలో ఏ మాత్రమూ మన కంతుపట్టని కథలు. తుదకు కాశీ మజిలీ కథలలాంటి కల్పనా కథలలో ఒక సంపుటం సంపుటమే ఉందాయన కథ. వినోద కథా కల్పవల్లి అని ఒక అద్భుతమైన కథా సంపుటమే ఉన్నది. భోజ కాళిదాస కథలనేవి ఇక చెప్పనే అక్కర లేదు. ఎవడో ఈ భోజుడీయన కాయన కేమిటో ఆ సంబంధం. భోజుడనే వాడు లేకపోలేదు . చరిత్రలో ఉన్నాడొక మహాపురుషుడు . ఏదో ఒక చోట ఈ దేశంలో రాజ్య మేలిన వాడే. రాజమాత్రుడే గాక శాస్త్ర జగత్తులో కావ్య జగత్తులో కూడా ప్రశంసా పాత్రుడాయన. సరస్వతీ కంఠాభరణ మాయన వ్యాకరణజ్ఞతకు - శృంగార ప్రకాశ మాయన అలంకారజ్ఞతకు - పాతంజల దర్శన వృత్తి ఆయన యోగ శాస్త్రజ్ఞతకు పెద్ద పెద్ద గీటు రాళ్ళు. అంతే కాదు. భోజ చంపువని వన్నె కెక్కిన ఆయన రామాయణ చంపువు లాంటి చంపూ కావ్య మిప్పటికి పుట్టలేదు. ఇక పుట్టబోదు. కాళిదాసు కవిత్వమూ ఆయన కవిత్వమూ కవల

పిల్లలలాగా ఒకదాని కొకటి తీసిపోవు. అంతటి ప్రతిభాశాలి భోజుడంటే. విద్యా ఖేలన భోజ అని - భోజ క్షమాపతి విద్యా పరిపాక అని - తర్వాత వచ్చిన కృష్ణ రాయాదులను వర్ణించేటపుడు కూడా విద్యా విషయంలో మన కవులు భోజ రాజునే వరవడిగా తీసుకొన్నారంటే ఎంతటి మహానుభావుడో చూడండి ఆయన. అలాంటి విద్వత్కవి చక్రవర్తి ఆస్థానంలో వర్తించాడు కాళిదాసు లాంటి మహా కవి అంటే మంచిదే. బంగారానికి పరిమళ మబ్బిందనే సంతోషించవచ్చు. కాని నిజంగా వర్తించాడా అనేదే ఇప్పుడు సందేహం. మనం కాదు. చరిత్రకులే వెలిబుచ్చుతున్నా రీసందేహం. దీని నిజా నిజాలు ఎలా ఉన్నా ఒకటి మాత్రం నిజం. ఎవరు కల్పించారో ఏమో గాని ఆ కథలూ ఆ శ్లోకాలూ అతిలోక మయినవి. అతి మనోజ్ఞ మయినవి. కాళిదాసే వ్రాశాడన్నా తప్పులేదన్నంత గొప్ప రచన లవి.

పోతే ఈ మహా కవి ఏ కాలం వాడనే విషయంలో నాకొక ఆలోచన ఉంది మొదటి నుంచీ. అది ఈ ఐతిహాసికుల ఊహకు కూడా చాలా వరకు సరిపడే ఆలోచనే. కాళిదాసు గుప్తరాజుల కాలానికి చెందిన వాడని నా నమ్మకం. కొందరాయన క్రీస్తుకు పూర్వమని అతిశయోక్తిగా చెబితే చెప్పవచ్చు. అది అంతా వట్టి ఊహా గానం. శంకర భగవత్పాదులను గూర్చి చెప్పినట్టే ఉంటుందది. క్రీస్తుకు పూర్వం కాదేమి కాదు. తప్పకుండా గుప్తుల కాలం వాడే ఆయన. గుప్త చక్రవర్తులు క్రీస్తు తరువాత మూడవ శతాబ్దం నుంచి పరిపాలించా రీ దేశాన్ని. ఉజ్జయిని వారికి రాజధాని అయి ఉండాలి. స్వర్ణ యుగమని పేరు వారి రాజ్య పాలనకు. సరిగా బ్రిటను దేశంలో ఎలిజబెత్తు యుగం లాంటి దది. ఎలిజ బెత్తు ఆస్థానంలో షేక్స్పియరు లాంటి మహా కవి ఉన్నట్టే ఉన్నాడు కాళిదాస మహా కవి ఈ గుప్త రాజుల ఆస్థానంలో. గుప్తుల దగ్గర నవ రత్నాలని తొమ్మిది మంది మేధావంతు లుండే వారని - ఘట కర్పరాదులు వారేనని - వారిలో కాళిదాసొక రత్న మని - చరిత్రకులు

చెప్పేమాట. తొమ్మిది మంది కవులే కానక్కర లేదు. ఒక్కొక్క డొక్కొక్క శాస్త్రంలోనో కళలోనో ప్రవీణుడై ఉండవచ్చు. ఘట కర్ప రాదు లాయా శాస్త్రాలలో నయితే - కాళిదాసు కవితా కళలో సానదీరిన జాతి రత్న మయి ఉంటాడు . అసలు రాజైన వాడు సమర్థుడయి ప్రజాను రంజకంగా రాజ్యం చేసినప్పుడే దేశంలో ఒక ప్రశాంతమయిన వాతావరణ మేర్పడేది. అది ఏర్పడితేనే అన్ని విద్యలకు కళలకు అభ్యుదయ మనేది . ఇది పాశ్చాత్య దేశాలలో ఎలిజ బెత్తు కాలంలో విన్నాము. వచ్చి పోయి అదే కాలానికి చెందిన మన దేశంలో కృష్ణ రాయల పాలనలో విన్నాము. ప్రస్తుతమీ గుప్త రాజుల కాలం కూడా అలాంటిదే . సుభిక్షంగా ఉన్నదప్పుడు దేశం. సుఖ శాంతి మయంగా ఉంది. అందుకే కాళిదాసు లాంటి మహా కవు లవతరించారు. మహా కావ్య సృష్టి చేయగలిగారు. రాజ ధాని ఉజ్జయిని లోనే నివసించా డాయన. స్వస్థాన వేష భాషాభిమతాః అన్నట్లు స్వస్థాన మంటే ఎనలేని అభిమాన మాయనకు. అందుకే నేమో వక్రః పంథా యదపి భవతః ప్రస్థితస్యోత్తరాశాం - సౌధోత్సంగ ప్రణయ విముఖో మాస్మభూ రుజ్జయిన్యాః - అని కీర్తిస్తాడు మేఘ సందేశంలో. తనకే గాదు ఉజ్జయిని సౌధోత్సంగ సుఖం. మేఘుడికి కూడా సంక్రమిస్తే బాగుండునని ఆయన ఆశ. ఉజ్జయిని ఆయన దృష్టికొక ప్రణయిని. విడ రాని బంధం దానితో ఆ కవికున్న ప్రణయ బంధం. విధివశాత్తూ దానికి దూరవుయినా దాని సౌభాగ్యాన్ని తలచుకొని కలవరిస్తున్నాడు. అసలు జీవితంలో అతడలా దూరం కావలసి వచ్చిందనే చారిత్రకులు చెబుతున్నారు కూడా. ఆంధ్ర చక్రవర్తి గౌతమీ పుత్ర శాతకర్ణి ఆయనను తన రాజ్యాని కరణంగా తెచ్చుకొన్నాడని ప్రతీతి. తదీయ జ్ఞాపకార్థమే గౌతమి అనే స్త్రీ పాత్ర నొకటి శాకుంతలంలో కల్పించాడని - స్వదేశ వియోగం భరించ లేకనే యక్షుడి మీద నెపం పెట్టి తానే కథ నాయకుడిగా మేఘదూతం రచించాడని చెబుతారు.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

గుప్తుల కాలంలోని వాడే కాళిదాసన్నందు కసలు చరిత్ర వరకూ పోనక్కర లేదు. ఆయన కావ్యాలలోనే అంతర్గతమైన ప్రమాణ మెంతో కనిపిస్తుంది మనకు. రఘు వంశ మనే మహాకావ్య మాయన వ్రాశాడంటే అది చాలా వరకు గుప్త రాజ వంశాన్ని మనసులో పెట్టుకొనే వ్రాశాడని నా అభిప్రాయం. దిలీపుడు , రఘువు, అజుడు - వీరు చంద్రగుప్త సముద్ర గుప్త కుమార గుప్తులే. సందేహం లేదు. వారిని వర్ణించేటప్పుడలాగే సూచిస్తూ వచ్చాడు కవి. దిలీప ఇతి రాజేందు - రిందుః క్షీర నిధా వివ - నవోదయం చంద్ర మివ - అని ఇలా చంద్రుడితో పోల్చి వర్ణిస్తాడు దిలీపుణ్ణి. మరి రఘుమహారాజునైతే నదీ ముఖేనేవ సముద్ర మావిశత్తని సముద్రంతో పోల్చి వర్ణిస్తాడు. పోతే బ్రాహ్మే ముహూర్తే కిల తస్య దేవీ - కుమార కల్పం సుషువే కుమారమని అజమహారాజును కుమార స్వామితో పోల్చి చెబుతాడు. చంద్ర సముద్ర కుమార నామాలను పేర్కొనటంలో భంగ్యంతరంగా చంద్రగుప్త సముద్ర గుప్త కుమార గుప్తులనే ధ్వనింప జేస్తున్నాడు. చరిత్ర కాదు గదా. ఇది కావ్యం. అంచేత సూటిగా గాక చాటుగా సూచిస్తున్నాడు తన భావాన్ని కవి కావ్య మార్గంలో. తన అభ్యుదయానికి కారకులయిన ఆ రాజులంటే ఆయన కంత గౌరవం. ఆ గౌరవంతోనే వారి గొప్పతనాన్ని కావ్య రూపంగా కొనియాడి వారి పేరు చిరస్థాయి గావించాడు. ఆ అభిమానంతోనే అడపా దడపా ఆ వంశీయు లందరికీ సాధారణమైన గుప్త శబ్దాన్ని పేర్కొంటూ వచ్చాడు. కుబేర గుప్తాం దిశ ముష్ణ రశ్మౌ - తస్మిన్ వనం గోప్తరి గాహమానే - జుగోపాత్మాన మత్రస్తః - అని ఇలా గుప్త శబ్దాన్ని అనేక రూపాలలో ఉదాహరిస్తాడు. అంతేగాక రఘు మహారాజు జీవితాన్ని - ఆయన దండయాత్రను - చివర కాయన నిర్యాణాన్నీ మిగత రఘువంశ రాజు లెవరికీ వర్ణించనంత సమగ్రంగా వర్ణించాడు కావ్యంలో. అసలు రవి వంశమని గాక రఘు వంశమని కావ్యానికి నామ కరణం చేయటంలోనే కనిపిస్తుంది ఆ మహారాజు కాయన ఇచ్చిన ప్రాధాన్యం. చరిత్ర చదివితే నిజంగా సముద్రగుప్తు డిలాటివాడే. ఉత్తరమే గాక దక్షిణానికి కూడా

దండెత్తి వచ్చాడు సముద్ర గుప్తుడు. ఆంధ్ర ద్రవిడ కేరళాది రాష్ట్రాలన్నీ జయించి ఆయా రాజులను పాదాక్రాంతులను చేసికొని తన పరాక్రమానికి చిహ్నంగా విక్రమాదిత్య విక్రమార్క అనే బిరుదులు కూడా ధరించి నట్లుంది చరిత్రలో. సరిగా కాళిదాసు రఘు మహారాజు దండ యాత్ర నిలాగే వర్ణించాడు. రఘువు దక్షిణ భారతానికి వచ్చి ఇక్కడ ఉన్న రాజు లందరినీ ఓడించటం సముద్ర గుప్తుడు చేసిన పనికి సూచకమే. అంతేగాక విక్రమాదిత్య అనే ఆయన బిరుదు కూడా విడిచి పెట్టక దానిని పురూరవుడికి తగిలించి అతడు కథా నాయకుడుగా విక్రమోర్వశీయ మనే నాటకం కూడా రచించాడు. ఇది ఇంకా బలపరుస్తున్నది కాళిదాసు గుప్తుల కాలంలో జీవించిన వాడని - వారి ఆస్థాన కవేనని చెప్పటాన్ని.

ఇంతకూ ఆయన దేశకాలాలను గూర్చి ఇంతకన్నా మనకు చర్చ అక్కర లేదు. ఇదయినా ఎందుకంటే దేశకాలాల ప్రభావం కొంత వరకు పనిచేస్తుంది కవి మనసు మీద. అవి అతనికి నిసర్గ సిద్ధంగా ఉన్న భావాలను వెలికి తీసి వాటికి మెరుగు పెడతాయి. దీనికే సంస్కార మని పేరు. నిసర్గ సంస్కార వినీత బుద్ధిః అని ఆయనే వర్ణించా డొకచోట. నిసర్గానికి సంస్కార మనేది తోడు కావాలట. అప్పుడే పరిపూర్ణత ఒక మానవుడికి. ముఖ్యంగా కళాకారుడికి. నిసర్గాన్నే ప్రతిభ అని శక్తి అని వ్యవహరిస్తారు. సంస్కారాన్నే వ్యుత్పత్తి అని పేర్కొంటారు ఆలంకారికులు. వ్యుత్పత్తినే నిపుణత అన్నాడు మమ్మటుడు. ఇది లోక శాస్త్ర కావ్యాద్య వేక్షణాత్. లోకంతో అతనికుండే సంబంధం వల్ల - శాస్త్ర కావ్యాది పరిచయం వల్ల ఏర్పడుతుందట. లోక మంటే అతడు జీవించిన దేశ కాలాది వాతావరణం. ఇంతకు ముందే చెప్పాము కాళిదాసు గుప్తుల కాలం వాడని. ఆ కాలంలో ఈ దేశమూ ఈ ప్రజా జీవితమూ ఎలా ఉండేది. స్వర్ణ యుగమని గదా వర్ణించాము. స్వర్ణ యుగ మన్నప్పుడది ఎలా ఉంటుందో మన మూహించుకోవచ్చు. రాజులు సర్వ సమర్థులు

Yallamraju Srinivasa Rao
www.andhravedanta.in

సమవర్తనులయి ప్రజలను పాలిస్తుంటే ప్రజా బాహుళ్యం సకల సుఖ శాంతులూ అనుభవించే వారు. ఇది రఘువంశంలో దిలీపాదుల రాజ్య పాలన వర్ణించటం లోనే అభివ్యక్తం చేశాడు కవి. చాలా దీర్ఘంగా చేశాడా వర్ణన. అంత దీర్ఘంగా ఏ వర్ణనా చేయడు కాళిదాసు. చేశాడంటే దానిలో ఏదో ఒక అభిప్రాయ ముంటుంది. తన రోజులలో రాజుల పరిపాలనే గుర్తుకు వచ్చి ఉంటుందా యనకు రఘువంశ రాజుల పాలన వర్ణించటంలో. లేకుంటే అంత సహజంగా హృదయంగమంగా వర్ణించ లేడు. తా ననుభవించి వ్రాసినప్పుడే కవి అంత ఆవేశ పరుడై వ్రాయ గలిగేది. నిజంగా అలాగే వ్రాశాడు ఆ ఘట్టం. మచ్చు కొకటి రెండు శ్లోకాలు చూడండి తెలిసి పోతుంది. ప్రజానాం వినయాధానాత్ - రక్షణాత్ భరణాదపి - సపితా పితర స్తాసాం - కేవలం జన్మ హేతవః. ప్రజలకు తగిన శిక్షణ ఇవ్వటం వల్లనూ - వారిని కాపాడటం వల్లనూ - అన్న వస్త్రాలు సమకూర్చి పోషించటం వల్లనూ ఆ దిలీపుడే వారికి తండ్రి అట. మరి వారి వారి తండ్రులుంటారు గదా వారేమయినారని అడిగితే చెబుతున్నాడు కేవలం జన్మ హేతవః అని. కేవలం వారికి భౌతిక మయిన జన్మ నిచ్చిన వారేనట వారు. కాగా మిగతా భరణ రక్షణాదులన్నీ చూస్తున్న తండ్రి రాజు గారే. ఎంత గొప్ప పాలన అయి ఉండాలది. పోతే ఆ రాజులు ప్రజల నుంచి పన్నులు వసూలు చేయటంలో కూడా ఎలాటి ఔదార్య ముండేదో చెబుతున్నాడు. ప్రజానామేవ భూత్యర్థం - స తాభ్యో బలి మగ్రహీత్ - సహస్ర గుణ ముత్స్రష్టు - మాదత్తేహి రసం రవిః. ప్రజలనుంచి పన్నులు వసూలు చేశారంటే అది మరలా వారికోసం ఖర్చు పెట్టటానికే నట. దీనికొక చక్కని ఉపమానం చెబుతున్నాడు కవి. వేసవిలో సూర్య భగవాను డెక్కడెక్కడి జలాన్నీ కిరణాలతో పీల్చి వేస్తాడు. ఎందుకో తెలుసా. మరలా వర్షర్తువులో దానికి వేయి రెట్లు వర్షించటానికే. ఎంత చక్కని ఔపమ్యమో చూడండి ఇది. అందుకే ఉపమా కాళిదాసస్య అన్నారు. ఇంతకూ ప్రజా ప్రభుత్వాలు కాకపోయినా ప్రజలను కన్న బిడ్డల లాగా చూచేవారా రాజులు. ప్రజలంటే అసలు బిడ్డలని కూడా

అర్థమే. శాకుంతలంలో దుష్యంతుడు ప్రజాః ప్రజాః స్వా ఇవ పాలయిత్వా - ప్రజలను ప్రజలలాగే పాలించేవాడట. ఒక సత్యాన్ని ఎంత సత్యంగా చెప్పాడు. ఎంత ప్రియంగా చెప్పాడు మహాకవి.

ఇది కాళిదాసు జీవించిన రాజకీయ వాతావరణం. ఇదీ ఆనాటి లోక వ్యవస్థ . ఇలాంటి వ్యవస్థ ఆయన కెంత స్ఫూర్తి నిచ్చి ఉంటుందో ఆలోచించండి. భోగభాగ్యాలతో తులతూగే కాలమది. కాని చిత్రమేమంటే ఎంత భోగ లాలసులో వారంత త్యాగశీలురు. ఇహం మీద ఎంత దృష్టో పరం మీదా అంతే దృష్టి వారికి . అంతే కాదు. భౌతికావసరా లయిన అన్న పాన వసన నివసనాదులను అనుభవిస్తూ అక్కడికే నిలిచి పోయిన జాతి కాదు అప్పటి జాతి. వైజ్ఞానికంగా కూడా ఎంతో ఎత్తుల కెదిగిన జాతి. అప్పుడే అది స్వర్ణ యుగ మనిపించు కొంటుంది. లేకుంటే లోహ యుగమో లోష్ట యుగమో అయి ఉండేది. విజ్ఞానమంటే దాని కిదంత లేదు ఇయత్త లేదు. శ్రుతులు స్మృతులు ఇతిహాసాలు పురాణాలు - ఒకటేమిటి సమస్త విద్యలు సకల కళలు అభ్యసించా రప్పటి మేధావులు. లోకమే గాక శాస్త్ర కావ్యాదులు కాడా అవేక్షణ చేస్తేనే గదా అది సమగ్రమైన వ్యుత్పత్తి. అందులో శాస్త్రాదుల లంటే చతుర్దశ విద్యలు . కావ్యాదులంటే చతుష్షష్టి కళలని ఆది శబ్దమే మనకు సూచిస్తున్నది. కాళిదాసు కటు వేద వేదాంగాలలో ఎలాంటి అభినివేశమో విద్యలూ కళలలో కూడా అలాటి అభినివేశమే ఉంది. ప్రపేదిరే ప్రాక్తన జన్మ విద్యాః అని అమ్మవారి విద్యలను వర్ణించినా ఆయన కుమార సంభవంలో - అది అమ్మవారికి సంక్రమించిన విద్యలని తోచదు నాకు. కాళిదాసుకు సంక్రమించిన అతని ప్రాక్తన విద్యా వైభవమే. దిలీపుడి లాగా వాటినే బహుముఖంగా వికసింప జేసుకొని బహుశ్రుతుడై ఉంటాడాయన. విద్యానాం పార దృశ్వనః - తస్య ధర్మ రతే రాసీత్ వృద్ధత్వం జరసా వినా. అన్ని విద్యల ఆవలి తీరం చూచి చూచి ఆదిలీపుడు జర లేకుండానే వృద్ధుడ య్యాడట.

ఆయన అయ్యాడో లేదో గాని కాళిదాసు అయి ఉంటాడటు వయో వృద్ధుడు కాకున్నా విద్యా వృద్ధుడు. అలాగే ప్రియ శిష్యా లలితే కళా విధౌ. అజుడు ప్రియా వియుక్తుడై వలవిస్తూ లలిత కళలలో నాకెంత ప్రియమైన శిష్యురాలవని వాపోతాడు. లలిత కళలని ఈనాడు మనమనే మాట ఏనాటి మాటో చూడండి. సంగీత నాట్య చిత్రలేఖనాదు లయిన కళ లన్నింటిలో ఎంత ప్రవేశమో లేనివా డయితే పని గట్టుకొని ఆ విలాప సన్నివేశంలో ఈ మాట స్మరించ లేడు మహా కవి. ఈ చెప్పిన అన్ని విద్యలలో కళలలో ఆయన కభిరుచి అభినివేశమూ ఉన్నదనేది కేవలం మన ఊహాగానం కాదు. లేదా ఆయన ఆ మాట లుదాహరించాడు కాబట్టి అలాటి ప్రజ్ఞ ఆయన కుండ వచ్చునని భావించటం కాదు. మొగమున్నది అద్దమున్న దన్నట్టు ఆయన మన కందించి పోయిన నిక్షేపాలలాంటి కావ్యాలున్నాయి. సహృదయులం మనమున్నాము. చుడవచ్చు గ్రహించవచ్చు.

కావ్యాలలో నాటకాలలో లలిత కళలను గూర్చి ఎంతగా పరామర్శిస్తాడో చెప్పనలవి గాదు. ఇంతెందుకు. మొట్టమొదటి రచన అని మనం భావించే మాళవికాగ్నిమిత్ర నాటకంలోనే కళలలో ఆయనకెంత పరిణతి ఉందో గమనించ వచ్చు. నాయిక మాళవిక ఒక గొప్ప నాట్య కత్తె. ఆవిడను ఆ కళలో తీర్చి దిద్దిన వాడు గణదాసనే ఆచార్యుడు. అతడొక పాత్ర నాటకంలో. మరి ఆ నట్టువరాలి నాట్య భంగిమలు వర్ణించా డవి అతిలోకం. నాట్య కళా మర్మజ్ఞుడైతే గాని అలా వర్ణించ లేడు. మరి సంగీతంలో కూడా ఆరితేరినదే మాళవిక . సంగీత శాలలు నాట్య శాలలు ఎక్కడ బడితే అక్కడ సాక్షాత్కరిస్తాయి ఆయన నాటకాలలో. ఆనాటి రాజు లలాటి రమ్యమైన మందిరాలు నిర్మించి అందులో చక్కని సంగీత నాట్య ప్రదర్శనలు చూచే వారు కాబోలు. అగ్ని మిత్రుడి కదే పిచ్చి. భూలోకం నుంచి దేవలోకానికి కూడా రవాణా చేశాడీ నాటక రంగాన్ని కాళిదాసు. విక్రమోర్వశీయంలో సాక్షాత్తూ



Vallabhajosyula Sriramachandra Rao / www.andhravedanta.in

భరతమునే సూత్రధారుడై లక్ష్మీనారాయణ పరిణయ మనే నాటకం వేయిస్తాడు దేవలోకంలో . అందులో నాయిక ఊర్వశే. పురుషోత్తముడని సంభోధించటానికి మారుగా పురూరవుడని సంబోధించి శాపం నెత్తికి తెచ్చు కొంటుంది కూడా. అగ్ని మిత్రుడికి నాట్య కళ మీద ఎంత వ్యామోహమో బహుశా పురూరవుడికి సంగీత కళ మీద అంత ఉండి ఉంటుంది. ఊర్వశి వియోగ దశలో ఎన్ని పాటలు పాడాడో ఎన్ని రాగాలలో ఎన్ని దరువులు వేస్తూ పోయాడో ఆ అనాహత నాదాన్ని అంతరంగం లోనే వినాలి మనం. వీణ అంటే ఎంతో ఇష్టమై ఉంటుంది కాళిదాసుకు. వీణాగానం వర్ణించని సందర్భమే లేదాయన కావ్యాలలో నాటకాలలో. ఉత్సంగేవా మలిన వసనే సౌమ్య నిక్షిప్య వీణాం అని మేఘదూతంలో యక్షకాంత అన్నీ మానినా గానం మాత్రం మానలేదు. రఘువంశంలో కడపటి చక్రవర్తి అగ్ని వర్ణుడికి వీణ ఎంత ప్రియ మయిందంటే వాడి ప్రియురాలి అంత ప్రియ మయింది. ఒడిలో ఒకటి తప్పితే ఒకటి ఎప్పుడూ ఉండవలసిందే. వల్లకీచ హృదయంగమ స్వనా - వల్గువాగపిచ వామలోచనా. వల్లకి అయినా వామ లోచనయినా ఏదో ఒకటి. రెండూ ఏకకాలంలో నేమో కూడా. మరి అజమహారాజు గతప్రాణమై పడిపోయిన కాంత శరీరాన్ని కూడా వీణ తంత్రులు సవరించినట్టే గారాబంగా సవరిస్తూ కూచున్నాడు. అసలు సంగీత మంటే గాత్రం తరువాత జంత్రం వీణే జ్ఞాపకం వస్తుంది కాళిదాసుకు.

పోతే ఇక చిత్రలేఖన మనేది ఆ రాజులందరికీ సర్వ సాధారణ మయినట్టు వర్ణిస్తాడు కవి. అగ్ని మిత్రుడేమి - విక్రముడేమి - దుష్యంతుడేమి - అందరూ గొప్ప చిత్రకారులే. ప్రియురాలి వియోగ మెప్పుడు సంభవిస్తే అప్పుడొక చిత్ర ఫలకం పట్టుకొని కూచుంటారు. రకరకాల వర్ణాలతో అద్భుతంగా నాయిక ఆకారాన్ని చిత్రించి ఆరాటాన్ని మరచి పోతుంటారు. చిత్రే నివేశ్య పరికల్పిత సత్త్వ యోగా. అసలు బ్రహ్మదేవుడీ శకుంతల బొమ్మ



Yellamraju Srinivasa Rao
www.advaitavedanta.in

నొకటి గీచి దానికి ప్రాణం పోశాడా అంటాడు దుష్యంతుడు. ఉన్మీలితం తూలిక యేవ చిత్రం. ఈ పార్వతీ దేవి నవ నవలాడే ఈ దేహ యష్టి చక్కని కుంచెతో నిర్మించిన ఒక చిత్ర పటమా అని భావిస్తాడు కవి. అజమహారాజంత బాధనెలా తట్టుకో గలిగాడో తెలుసా మీకు. పగలా ఇందుమతి చిత్రపటాలు చూస్తూ - రాత్రులావిడ స్వప్నంలో సాక్షాత్కరిస్తే చూస్తూ - కాలం గడిపాడట. చిత్ర పటాలు గీయటమూ అవి గోడల మీద అలంకరించటమో అప్పటి కాకాలంలోనే ఉందన్న మాట. ఇక ఈ చిత్రానికి సహోదరమైన శిల్పకళ ఉండనే ఉంది. అసలు చిత్రమేమంటే చిత్రమే కదిలితే నాట్య కళ. కదలకుంటే శిల్ప కళ. మాళవిక నలాగే వర్ణిస్తాడు కవి రెండు పద్యాలలో. అద్భుతమైన పద్యాలవి. చిరస్మరణీయాలు. పునః పునరనుసంధానాత్మకాలు. ఒకటి ఆవిడ నాట్యమాడే సోయగాన్ని చూపితే ఇంకొకటి ఆడి ఆడి ఆవిడ ఒకభంగిమలో నిలుచున్న దృశ్యాన్ని చూపుతుంది. అప్పుడా మూర్తి నిజంగా ఒక శిల్ప ఖండమే నని తోస్తుంది కవి వర్ణించిన తీరు చూస్తే.

అసలా మాటకు వస్తే నాట్య కళ ఒక్కటే చాలు. సకల కళలకు ఆల వాల మది. అందులో చలన మున్నది. నిలకడ ఉన్నది. చలించిన పుడది నాట్యం నిలిచి నప్పుడు శిల్పం. చిత్రం. తత్తద్భావ రేఖల నభినయించే టపుడది సాహిత్యం. దానికి ప్రేరక మైన నేపథ్య గానం సంగీతం. అందుకే నేమో నాట్యం భిన్న రుచే ర్జనస్య బహుధా ప్యేకం సమారాధనం . భిన్న రుచులున్న ఎవరికే గాని అభిన్నమైన ఆకర్షణ నాట్య మేనట. ఇంకా ఒక సూక్ష్మ ముంది ఇందులో. శబ్ద మర్థ మివి రెండే ఉన్నది సృష్టిలో. భౌతిక సృష్టిలో అవే. కళా సృష్టిలోనూ అవే. భౌతిక సృష్టిలో అవి నామ రూపా లయితే కళా సృష్టిలో శబ్దార్థాలు. ఇందులో శబ్ద భాగాన్ని సంగీత సాహిత్యాలు పంచుకొంటే - అర్థ భాగాన్ని నాట్య శిల్ప చిత్రాలు పంచుకొన్నాయి. అవి మరలా దేని పాటికవి తెగదెంపులు చేసుకొన్నవి కావు. ప్రధానోప సర్జన భావమే ఇక్కడ

మనం చూడవలసింది. అలాటి సమన్వయం చేసుకొన్న మహా కవి ఎవడైనా ఉన్నాడంటే అతడు కాళిదాసే. రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్ అనే శ్లోకంలో నామ రూపాలకు లేదా శబ్దార్థాలకుండే ఈ సామరస్యాన్నే సూచించాడు కవి ఇందులో మొదటిది శ్రవణేంద్రియ గోచర మయితే రెండవది నయనేంద్రియ గోచరం. దీనిని బట్టే శ్రవ్య దృశ్య విభాగమేర్పడింది కావ్య ప్రపంచంలో. కాళిదాసందుకే మూడు కావ్యాలూ మూడు నాటకాలూ రచించి తాను ప్రతిపాదించిన సూత్రాన్ని సోదాహరణంగా నిరూపించాడు. ఇది నేను దీని తరువాత వచ్చే రచనా ప్రత్యభిజ్ఞలో విపులంగా చర్చిస్తాను. అలమిహైతావతా వాక్సందర్భేణేతి విరతోస్మి.

పోతే ఇది కళా ప్రపంచ మయితే ఇక శాస్త్ర ప్రపంచంలో కాళిదాసెంత సిద్ధ హస్తుడో అత డక్కడక్కడ విసిరే మాటలను బట్టే తెలుసు కోవచ్చు. వేద వేదాంగాలే గాదు. పురాణేతిహాసాలే గాదు. ధర్మ శాస్త్రాది స్మృతి గ్రంథాలే గాదు. తర్క వ్యాకరణాదులే గాదు. షడ్దర్శనాలే గాదు. అంతవరకు ప్రచలితమై ఉన్న రామాయణ భారత భాస సౌమిల్లకాదుల సాహిత్య గ్రంథాలే గాదు. ఇంకా ఆయా తంత్రాగమాది రహస్యాలే గాదు. భారతీయ విజ్ఞాన క్షేత్ర మంతా గాలించిన పెద్దమనిషి ఆయన. ఎంతగా వాటిని జీర్ణించు కొన్నాడో వాటి సంస్కార ముద్గర రూపంగా ఆయన రచనలలో ఎనిపిస్తూనే ఉంటుంది. అరుంతుద మివాలానం - అనిర్వాణస్య దంతినః అంటాడు. నిర్వాణ మంటే గజ స్నానానికి సాంకేతిక పదం. స్నానం చేయించక పోతే ఒక ఏనుగ కెంత చికాకో అంత చిరాకుగా ఉందట సంతానం లేక దిలీప మహారాజుకా రాజ్య పాలన. ఎప్పుడు చూచాడో ఈ గజ శాస్త్ర మాయన. వక్త్రోష్మణా మలిన యంతి పురోగతాని - లేహ్యాని సైంధవ శిలా శకలాని వాహాః. ప్రొద్దున్నే కోష్ఠ శుద్ధి కోసం గుర్రాల ముందు సైంధవ లవణ శకలాల నుంచే వారట సాహిణులు. ఇదెప్పుడు చదివాడో ఈ అశ్వ శాస్త్రం. రోగోప సృష్ట తను దుర్వసతిం



Vallamrajusrinivasarao
www.advaitavedanta.in

ముముక్షుః ప్రాయోపవేశన మతి ర్నృపతి ర్బభూవ. దీర్ఘ వ్యాధితో డొల్ల అయిన శరీరాన్ని స్వయంగానే వదిలేయా లనుకొన్నాడట అజ మహారాజు. ఎక్కడ ఆ వదిలేయా లనుకొన్నది. తీర్థే తోయ వ్యతికర భవే జహ్ను కన్యా సరయ్వోః - గంగా సాగర సంగమంలో. నదీ సంగమ మొక పవిత్రమైన తీర్థం. అందులో వదిలేస్తే ఆత్మ హత్యా దోషం లేదు. లేకుంటే మహా పాతక మది. ఇది ఒక ధర్మ సూక్ష్మం. ధర్మ శాస్త్ర జ్ఞాన మెంత ఉన్నవాడో చూడండి కవి. ఇలాటి ధర్మ సూక్ష్మ మొకటి ఉండటం వల్లనే అలా వర్ణించా డా రాజు అస్త మయం. కాకపోతే యోగేనాంతే తనుత్యజాం. యోగంతో శరీరాన్ని విడిచి పెట్ట వలసిన ఇక్ష్వాకు రాజులు రోగంతో విడిచారని చెబితే ఏమి మర్యాద. విడిచిన ఆ రాజుకూ లేదు చెప్పిన ఈ కవికీ లేదు. ఇక సంగీత శాస్త్రం సంగతి చెప్ప బని లేదు. నిష్ణాతుడందులో. ఎంత నిష్ణాతుడు కాకుంటే యఃపూరయన్ కీచక రంధ్ర భాగాన్ - తాన ప్రదాయిత్వ మివోప గంతుం అని వర్ణించగలడా కుమార సంభవంలో. తానానికి సాధనంగా వేణువును తీసుకోట మేమిటి. ఈనాడే సంగీత విద్వాంసుడినైనా అడిగి చూడండి. వీణ తప్ప తానం చక్కగా పలికే జంత్రం మరొకటి లేదు అదే ప్రమాణం తానానికని చెపుతాడు. కాని కాళిదాసు వంశవాద్యమే ప్రమాణ మయినట్టు వర్ణించాడు. మహా మహోపాధ్యాయుడు మల్లినాథుడు వ్యాఖ్యానిస్తూ నిజమే వంశ మాత్ర సాధ్యం తానమంటే నని శాస్త్ర ప్రమాణం కూడా చూపి సమర్థిస్తాడు. ఎంత లోతైన పరిజ్ఞానమో చూడండి మరి. తర్క వ్యాకరణాలిక ఎక్కడ బడితే అక్కడే పలుకుతాయి. విలక్షణమైన శబ్ద ప్రయోగం వ్యాకరణ జ్ఞతను సూచిస్తే - ఆయా సందర్భాలలో వచ్చే పాత్రల సంభాషణ లాయన తర్క ప్రావీణ్యాని కద్దం పడతాయి.

ఒక్క సూక్ష్మ మిక్కడ మనం సహృదయులుగా గుర్తుంచుకో వలసి ఉంది. ధనవంతులలో లాగానే కవులలో కొందరు పొదుపరు లుంటారు. కొంద రెతుబారు లుంటారు. పొదుపరుల సంఖ్యే తక్కువ. ఎంత చొరవ ఉన్నా శబ్దాన్ని వారెలాగంటే అలా ఖర్చు చేయరు. శబ్ద రాశిని ధనరాశి లాగా

చూచుకొంటారు. అలాగని లోభులు కారువారు. ఎంత శబ్ద సంపద ఉన్నా దాని నెప్పుడెంతవరకెలా వాడుకోవాలో తెలుసు వారికి. దగ్గర ఉంది గదా అని దుర్వ్యయం చేయరు. అలా పొదుపుగా వాడినప్పుడే దానికి విలువ పెరుగుతుంది. అందమిస్తుంది. ఇలాంటి శబ్ద ప్రయోగ కళా విశారదుడు కాళిదాసు. తరువాత వచ్చిన భారవి మాఘ నైషధ కర్తల లాగా ఎతుబారి కాడు. అవసరమున్నా లేకున్నా తమకున్న శబ్ద సంపద నత్యధికంగా విచ్చల విడిగా ఖర్చు పెట్టారు వారు. ఒక మధురమైన పదార్థమొక మోతాదులో తింటే బాగుంటుంది గాని మోతాదు మించి తింటే ఏమవుతుంది. మొగం మొత్తుతుంది. అలాగే మొత్తుతుంది వారి కావ్యాలు చదువుతుంటే సహృదయులకు. ఒక్క కాళిదాసు రచనల లోనే అలాంటి ఉద్వేజన కలగనిది. లాక్షణికమైన పద ప్రయోగం చేయలేని వాడు కాడాయన. ఎంత ప్రౌఢమైన శబ్దమైనా ప్రయోగించ గలడు. శబ్ద శాస్త్ర పారంగతుడు. ఎంత పారంగతుడంటే శాస్త్ర పరిభాషను చివరకు కావ్య పరిభాషగా కూడా మార్చి చూపగలవాడు. వాలిని వధించి అతని స్థానంలో సుగ్రీవుడి కభిషేకం చేశాడు శ్రీరాముడు. అది ఎలా ఉందంటే ధాతోః స్థాన ఇవాదేశ మని పేర్కొంటాడు మహాకవి. ధాతువు స్థానంలో ఆదేశం లాగా ఉందట. దృశ్ అనే ధాతువుందంటే దానికి పశ్య అనే రూపం ఆదేశంగా వస్తుంది భాషలో. అంటే ఆ ముందున్న రూపాన్ని తొలగించి దానికి మారుగా ఇది చోటు చేసుకొంటుంది. అది ఇక కనపడదు మన కంటికి. అలాగే వాలి కనపడకుండా పోయి సుగ్రీవుడే ఇప్పుడు రాజ్యం చేస్తున్నాడు. కావ్య భాషలో చెబితే చూడండి ఈ వ్యాకరణ పరిభాష ఎంత మనోహరంగా ఉందో. అలాగే దేవతల నందరినీ తారకాసురుడి సైనికులు స్వర్గం నుంచి తరిమి కొడితే అది ఎలా ఉందో కవి వర్ణిస్తున్నాడు. అపవాదైరివోత్సర్గాః కృత వ్యావృత్తయః పరైః. వ్యాకరణంలో ఉత్సర్గ సూత్రాలని అపవాద సూత్రాలని రెండు రకాలున్నాయి. ఒకటి సర్వ సామాన్యంగా వర్తించ వలసి ఉంటే అది ఉత్సర్గం. అలా వర్తించకుండా దాని నడ్డుకొనేది అపవాదం.

ప్రస్తుతం దేవతల స్వైర విహారాని కడ్డు తగులుతున్న రాక్షస సైన్యాన్ని అపవాద సూత్రంతోనూ వారిచేత దెబ్బ తిని పోయిన దేవతలను ఉత్సర్గ సూత్రంతోనూ పోల్చి చెప్పట మెంత అందమిస్తున్నదో చూడండి రచనకు. ఇలాటి అందం మాఘ భారవి ప్రభృతులలో లేదు. వ్యాకరణాన్ని కూడ కావ్యంగా మలిచి చెప్పటం కాళిదాసుకే తెలిసిన విద్య.

వ్యారకణ మేమిటి. తర్కం కూడా ఇంతే కాళిదాసు చేతిలో. వ్యాకరణం పదమైతే ఇది ప్రమాణం. కాణాదం పాణినీయంచ సర్వ శాస్త్రోప కారక మన్నారు పెద్దలు. పద ప్రమాణాల పరిజ్ఞాన ముంటే అది సకల శాస్త్రాలకూ జవాబు చెప్పగలదట. పద ప్రమాణాలంటే భంగ్యంతరంగా శబ్దార్థాలే. ఏది చెప్పాలో అది అర్థం. దేనితో చెప్పాలో అది శబ్దం. శబ్ద ప్రౌఢి ఎంతగా ఉందో కవిలో తత్ప్రతిపాదితమైన అర్థ రచనలో కూడా అంతే ప్రౌఢి. పూర్వాపరాలకు హేతు హేతుమద్భావ మేమాత్రమూ బెసగ కుండా ఎంతో పకడ్బందీగా సాగుతుంది రచన. ఇది ముఖ్యంగా ఆయన పాత్రల చేత అక్కడక్కడ సాగించే సంవాదాలలో తార్కాణ మవుతుంది మనకు. మచ్చుతునకగా ఒక దిలీప సింహ సంవాదన్నే తీసుకొని చూడవచ్చు. మాటకు మాట ఎంత పొందికగా సాగిందో చదివి తీరాలి సహృదయులు. వాకోవాక్యమని పేరు తర్కానికి. అంటే మాటకు మాట అనే అర్థం. అది కాళిదాసులో విశ్వతో ముఖంగా మనకు దర్శన మిస్తుంది.

ఇక షడ్దర్శనాల పాండిత్యమూ కొట్టిన పిండి మహా కవికి. వాటి సంస్కార మెప్పటి కప్పుడుగ్గరం లాగా పరిమళిస్తూనే ఉంటుంది రచన లన్నింటిలో. న్యాయ వైశేషికాలు రెండూ హేతువాదం క్రిందికే వస్తాయి. వాటికి నిదర్శనం వెతుకుకో నక్కర లేదు. అన్యూనానతి రిక్తంగా సాగిన ఆయా పాత్రల సంభాషణ లన్నీ దానికి నిదర్శనాలే. పోతే సాంఖ్య యోగ పరిజ్ఞానం చెప్పనక్కర లేదు. ఆయా దేవతలు బ్రహ్మాదులను గూర్చి చేసే స్తోత్రాలలో

మనకు ద్యోతిత మవుతూనే ఉంటుంది. రఘుమహారాజు నిర్యాణాన్ని వర్ణించటంలో ఆయనకున్న యోగ శాస్త్రాభి నివేశం ప్రకాశిత మవుతుంది. పరమేశ్వరుని తపశ్చర్యను వర్ణించటంలో కూడా అది మనకు విశద మవుతుంది. అష్టాంగ యోగమూ - తత్తద్విభూతి ప్రాప్తీ - ఇలాటి యోగ రహస్యాలన్నీ సందర్భోచితంగా సూచిస్తూనే పోతాడు కవి. యోగేనాంతే తనుత్యజామని రఘువంశ రాజుల అవసాన దశను వర్ణించటంలో ధారణా ధ్యాన సమాధుల ద్వారా ప్రాణోత్క్రమణ చెందటమే ముక్తి దాయకమని తన నమ్మకాన్ని చాటు తున్నాడు కూడా.

పోతే ఇవన్నీ ఒక ఎత్తు. ఆయన గారి మీమాంసా పరిజ్ఞాన మొక ఎత్తు. మీమాంస అనేదొకటి గాదు. రెండు. పూర్వ మీమాంస. ఉత్తర మీమాంస. మాతుమిచ్ఛా మీమాంసా. వేదానికర్థం ఫలానా అని నిర్ణయించటానికే మీమాంస అని పేరు. అది కొందరు కర్మ అంటే మరి కొందరు బ్రహ్మ మన్నారు. మొదటి వారు పూర్వ మీమాంసకులు. రెండవ వారు ఉత్తర మీమాంసకులు. అసలు పూర్వ మీమాంసకులకే మీమాంసకులనే పేరు రూఢమయింది. కాగా ఉత్తర మీమాంసకులను మీమాంసకులని గాక వేదాంతులనే పేరుతో వ్యవహరిస్తారు. వేదం చెప్పిన కర్మ కలాప మంతా బ్రహ్మ జ్ఞానం లోనే పర్యవసిస్తుంది - అదే వేద తాత్పర్యమని చెబుతారు కాబట్టి వీరు వేదాంతు లయ్యారు. అది ఒప్పుకోరు మీమాంసకులు. వారికి బ్రహ్మ మనేది లేదు. బ్రహ్మం లేకుంటే బ్రహ్మ జ్ఞాన మసలే లేదు. వారు గడించాలని చెప్పే జ్ఞాన మేక్కటే. అది విధి నిషేధ రూపమైన కర్మ జ్ఞానం. జ్ఞాన మాత్రమే గాక తదనుష్ఠానం కూడా. అదే ఫలకారి వారి దృష్టిలో. ఇదుగో ఈ ద్వివిధమైన జ్ఞానమూ ఎంత పుష్కలంగా ఉండాలో అంతగా ఉంది కాళిదాసుకు. కర్మజ్ఞానంలోనూ బ్రహ్మజ్ఞానంలో నూ నిష్ణాతుడాయన. ఈ ద్వివిధ శాఖలను గూర్చి ఆయన అక్కడక్కడ ప్రస్తావ వశంగా చేసిన పరామర్శల లోనే మనకు

బాగా స్పష్ట మవుతుంది. రఘువంశంలో ఋష్యాశ్రమాలు అక్కడ జరిగే జపహోమాది క్రియలు ఎంతో శాస్త్రీయమైన సంప్రదాయంలో ఆరితేరిన శ్రోత్రియుడి లాగా వర్ణిస్తాడు కవి. శాకుంతలంలో ఋషివాటిక నెప్పుడు వర్ణించినా మనకా వాతావరణం కండ్లకు కట్టినట్టుగా కనిపిస్తుంది. వైదికమైన కర్మ కలాపం సాంప్రదాయిక మయిన రీతిలో భాసింప జేస్తాడు. అగ్ని హోత్రాలు అగ్ని శరణాలు మహర్షు లతిధులై వచ్చినపుడు రాజులు వారినందులో ప్రవేశ పెట్టి అక్కడనే వారిని కలుసు కోవటం - మంత్రవిదులయిన మహర్షులు చేసే శాంతిక పౌష్టికాది క్రియలు - రాజ్యానికేవయినా అరిష్టాలు సంభవిస్తే వాటి నుచ్చాటనం చేసే విధానాలు - ఇలాటి కలాప మెక్కడ బడితే అక్కడ సాక్షాత్కరిస్తాయి. తపః ప్రభావం వల్ల వారికి లభించే అలౌకిక సిద్ధులను కూడా సందర్భోచితంగా వర్ణిస్తాడు కవి. కణ్వ మహర్షి కగ్ని హోత్రుడే శకుంతలా గర్భ వృత్తాంతాన్ని వెల్లడించటం - ఆవిడను అత్త వారింటికి పంపేటపు డక్కడి వనదేవతలే ఆవిడకు కావలసిన నేపథ్యాన్ని ప్రసాదించటం - ఇదంతా అలౌకికమే. పశు విశసనాదులు కూడా శాస్త్ర విహితం గనుక హేయం కాదనే కాళిదాసు నమ్మకం. పశుమారణ కర్మ దారుణో ప్యను కంపా మృదురేవ శ్రోత్రియః అంటాడు శాకుంతలంలో. ఒక మత్స్యోప జీవి జీవికను రాజపురుషులు పరిహసించి నపుడది సమర్థించుకొంటూ అతడాడిన మాట ఇది . యజ్ఞంలో పశువును శపణం చేసినంత మాత్రాన శ్రోత్రియుని కఠినాత్ముడన వచ్చునా అలాగే నన్ను అన రాదంటాడు వాడు. అసలు బ్రహ్మ దేవుని దేవతలు స్తోత్రం చేసినపుడు వారి నోట అప్రయత్నంగా దొరలిన ఒక మాట ఇది. ఉద్ఘాతః ప్రణవో యాసాం - న్యాయై స్త్రిభి రుదీరణం - కర్మ యజ్ఞః ఫలం స్వర్గః తాసాం త్వం ప్రభవో గిరాం. ఓంకారంతో ఆరంభమయి - ఉదాత్తాది స్వరభేదాలతో ఉచ్చారితమై - యజ్ఞమే కర్మ స్వర్గమే ఫలంగా అవతరించిన వేద వాక్కులకు నీవే గదా జన్మ స్థానమని కీర్తిస్తారు వారు. మీమాంసా శాస్త్ర సారమంతా మూట గట్టి చెప్పిన మాట ఇది.



Vallabhaneni Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

మరి పూర్వ మీమాంసలో ఎంత ప్రవేశమో ఉత్తర మీమాంస అయిన వేదాంత దర్శనంలో కూడా అంత ప్రవేశమే మహాకవి కని పేర్కొన్నాము. మీమాంసకులు వేద ప్రామాణ్యమే గాని ఈశ్వర సద్భావాన్ని అంగీకరించరు. ఒక విధంగా కర్మ జడులయిన నాస్తికులు వారు. నాస్తి పరలోకః అని కాకపోయినా నాస్తి ఈశ్వరః యేషాం అని అర్థం చెప్పవలసి ఉంటుంది వారి విషయంలో. ఈశ్వరుడే లేడు వారికి. శాస్త్రమే వారి సర్వస్వం. అది అపౌరుషేయం. ఏ పురుషుడూ నిర్మించింది కాదని వారి విశ్వాసం. మనబోటి అల్పజ్ఞుడైన పురుషుడు కాకపోయినా సర్వజ్ఞుడైన పరమ పురుషుడు నిర్మించాడని చెప్పటంలో ఆ క్షేపణ ఏముందని వేదాంతుల ప్రశ్న. తస్య నిశ్వ సితం వేదాః అన్నారు. తస్య నిశ్వసితం యదృగ్వేదో యజుర్వేద స్సామవేదో 2 ధర్వాంగిరసః అని వేదమే ఘోషిస్తున్నది. పరమాత్మ నిశ్వసితమే వేద చతుష్టయ మట. అంటే ఏమని అర్థం. పురుషుడు నిశ్వసించినట్టు అవలీలగా తన సంకల్ప బలం చేతనే ఋగాది వేద వాఙ్మయ మంతటినీ సృష్టించాడు సర్వజ్ఞుడైన ఈశ్వరుడు. లేకుంటే జడమైన ప్రపంచానికెలా అస్తిత్వం లేదో తత్ప్రతిరూపమైన వాఙ్మయ ప్రపంచానికీ లేదు. ఇది మీమాంసకులు గుర్తించక పోవటం శోచనీయం. కాళిదాసు మీమాంసాభిమాని అయినా ఆ అంధ కూపంలోనే పడిపోలేదు. అది జీవిత గమ్యాన్ని కొంత వరకే గాని చివర దాకా కొనిపో లేదని తెలుసు నాయనకు . కనుకనే దానికి పూరక మైన వేదాంత దర్శనాన్ని అభ్యసించాడు. అందులోనూ ద్వైత విశిష్టాద్వైత భూమికలను కూడా దాటి పోయి సరాసరి అద్వైత రంగంలోనే ప్రవేశించాడు. దాని పరోక్షా పరోక్ష జ్ఞానాలను రెంటినీ ఆకళించు కొన్నాడు. ఆత్మా నాత్మలను రెంటినీ ఆత్మ స్వరూపంగా చూడటమే అద్వైత హృదయం. అది పూర్తిగా హృదయంగమం చేసుకొన్న వాడు కాళిదాసు. దాని సంస్కార మక్కడక్కడా తొంగి చూస్తూనే ఉంటుందాయన కావ్యాలలో.

తారకుని బాధలు పడలేక సత్యలోకానికి వెళ్ళి దేవతలు పరమేష్ఠిని గూర్చి చేసిన స్తోత్ర మొక్కటి చాలు ఆయన అద్వైత విజ్ఞాన పరిపాక రసజ్ఞతను చవిచూడటానికి. నమ స్త్రి మూర్తయే తుభ్యం - ప్రాక్సృష్టేః కేవలాత్మనే. సృష్టికి పూర్వం కేవల మాత్మ స్వరూపుడేనట ఆ పరమాత్మ. శుద్ధమైన ఆ చైతన్యమే సత్త్వ రజస్తమో గుణాల మూలంగా విభక్తమై త్రిమూర్తులుగా భాసిస్తున్నదట. అప్పటికి సగుణ మనేది ఏదో గాదు. నిర్గుణ మైన తత్త్వమే సగుణంగా కనిపిస్తున్నది. అమూర్తమైన దశలో నిర్గుణం. మూర్తమైన దశలో సగుణం. అంతే కాదు. జగద్యోనిః - ఈ దృశ్యమానమైన జగత్తుకు కూడా యోని ఆ పరమాత్మే. యోని అనగానే కార్య కారణ భావాన్ని మరలా శంకించ రాదు. ఆత్మాన మాత్మనా వేత్సి - సృజస్యాత్మాన మాత్మనా . తన్ను తానే సృష్టించు కొంటున్నాడట జగద్రూపంగా. ఉపాదాన నిమిత్త కారణాలు రెండూ ఆ ఈశ్వరుడే. అంత మాత్రమే కాదు. త్వా మామనంతి ప్రకృతిం - తదర్థిన ముదాసీనం - త్వామేవ పురుషం విదుః- పురుషార్థ ప్రవర్తిని అయిన ప్రకృతీ - తన్నిమిత్తంగా భోగాప వర్గాలు అనుభవించే పురుషుడు కూడా ఆ పరమాత్మే నని పేర్కొంటారు. దీనిని బట్టి ఏమని అర్థం చేసుకోవాలి మనం. జీవ జగదీశ్వరులని త్రివిధ రూపాలుగా కనపడే సృష్టి ఊరక ఒక ఆభాసే గాని వస్తు రూపంగా చూస్తే చివర కొకే ఒక ఆత్మ చైతన్యమే. పరిపూర్ణాద్వైత భావమిది. ఈ భావాన్నే మూట గట్టి ఒక్క మాటలో బయట పెట్టాడు మహా కవి చివరకు. త్వమేవ హవ్యం హోతాచ - ధ్యాతా ధ్యేయంచ యత్పరం అని. హోతా హవ్యం - భోజ్యం భోక్తా - ధ్యాతా ధ్యేయం - ఇలా ద్వంద్వ రూపంగా భాసించే సృష్టి అంతా పరమాత్మే నట. నారాయణ పరో ధ్యాతా - ధ్యానం నారాయణః పరః అనే నారాయణ సూక్త మిందులో తొంగి చూస్తున్నది. సృష్టి నంతటినీ గాలిస్తే ఉన్నవి రెండే పదార్థాలు. ఒకటి విషయం. మరొకటి విషయి. ఆత్మానాత్మ లన్నా ఇవే. గ్రహించే దొకటైతే గ్రహణ గోచర మవుతున్న దొకటి. ఇంతకు తప్ప వేరొక పదార్థమే లేదు. ఏదైనా ఉంటే అది ఈ రెండు

శాఖలలో దేనిలోనో ఒకదానిలో చేరి పోవలసిందే. తప్పదు. కాగా ఈ రెండూ కూడా మరలా ఒక్కటే సుమా అని ప్రబోధించటమే అద్వైతులు మ్రోగించే విజ్ఞాన భేరి. అది మరలా ఎంతగా బజాయించి చెబుతున్నాడో చూడండి మహాకవి.

ఇలాగే రఘువంశంలో దేవతలు చేసిన స్తోత్రంలో కూడా ఇంకొక మారు బజాయించి చూపాడు మనం మరచి పోకుండా ఆ వేదాంత దుందుభిని. నమో విశ్వ సృజే - త్రేధా స్థితాత్మనే అంటూ. కుమార సంభవంలోని భావమే ఇక్కడా దర్శనమిస్తుంది మనకు. అయితే అక్కడ బ్రహ్మను గూర్చిన స్తోత్రమయితే ఇక్కడ విష్ణువును గూర్చి చేసిన స్తోత్ర పాఠం. బ్రహ్మేమిటి విష్ణువేమిటి రుద్రుదేమిటి. మహాకవికి ముగ్గురూ సమానమే. ఒకరెక్కువ ఒకరు తక్కువ అని చూచే వీరవైష్ణవుడో వీరశైవుడో కాడు కాళిదాసు. కాళిదాసనే పేరున్నందుకు శైవుడో శాక్తేయుడో కావలసిన వాడాయన. కాని అది వాచారంభణం వికారో నామధేయ మన్నట్టు కేవలం నామమాత్రమే. యధార్థాని కాయన త్రిమూర్తులనూ అమూర్తమైన ఒకే ఒక తత్త్వంగా దర్శించిన మహానుభావుడు. అందుకే త్రేధా స్థితాత్మనే అని వర్ణిస్తున్నాడు. ఇంకా విశదంగా వర్ణించాడు కూడా వారి ముగ్గురికీ భేదం లేదని కుమార సంభవంలోనే మరొక చోట. శివ పార్వతుల వివాహ మహోత్సవం ఓషధీ ప్రస్థంలో జరుగుతూంది. అక్కడ ముక్కోటి దేవతలూ - మహర్షులూ - వారందరికీ ఆరాధ్యులయిన బ్రహ్మ విష్ణు మహేశ్వరులూ అందరూ కలుస్తారు. అప్పుడు క్రొత్తగా పెండ్లికొడుకైన ఈశ్వరుణ్ణి చూచి బ్రహ్మ విష్ణువూ జయ జయ ధ్వనులతో కీర్తించారని చెబుతూ ఇలా అంటాడు మహా కవి. ఏకైవ మూర్తి ర్బిభిదే త్రిధా సా - సామాన్య మేషాం ప్రథమావ రత్వం. ఒకే మూర్తి మూడు మూర్తులుగా భాసిస్తున్నది. అందులో ఒకటి హెచ్చు ఒకటి తగ్గని లేదు. హెచ్చు తగ్గులుంటే ముగ్గురికీ ఉన్నాయి. ఒకరికి వేడుక జరుగు తుంటే మిగతా ఇద్దరూ ఆయనకా



Vallabhaneni Srinivasa Rao www.advaitavedanta.in

వేడుక జరిపే సేవకు లవుతుంటారు. సందర్భాన్ని బట్టి సేవ్య సేవక భావం వారి కేర్పడుతుంది. అది వారికొక వినోదం. వారిలో వారికి భేదం లేనప్పుడితరుల కెందుకీ పనికి మాలిన భేద దృష్టి అని వాపోతాడు కాళిదాసు.

అసలు మూర్తిని మూర్తిగా చూచినప్పుడే ఇలాంటి పొరబాటు. అమూర్తమైన తత్త్వమే మూర్తమయినదని భావిస్తే ఇలాటి పొరబాటు దొరలదు. అలా ఏకత్వ దృష్టితో భావించిన మహానుభావుడు కాబట్టి ఆయన కుమార సంభవంలో బ్రహ్మ రుద్రులను వర్ణించినా అదే అద్వైత భావం. రఘువంశంలో ఆది విష్ణువును వర్ణించినా అదే అద్వైత భావం. అద్వైత భావమే ప్రతి ఫలించి కనిపిస్తుంది ప్రతి మాటలోనూ మనకు. రసాంతరాణ్యేక రసం - యథాదివ్యం పయో శ్నుతే. మేఘ మండలంలో నుంచి వచ్చిన జల మేక రూపమైనా నేలమీద పడేసరి కది స్థల భేదాన్ని బట్టి అనేక రూపాలుగా మారి కనిపిస్తుంది. అలాగే ఏకరూపుడైన పరమాత్మే ఉపాధి భేదాన్ని బట్టి శివ కేశవాది రూపాలుగా జీవ జగదాది రూపాలుగా భాసిస్తున్నాడట. ఏకస్త్వం సర్వ రూప భాక్. సూత్ర ప్రాయంగా చాటిన ఒక్కమాటలో ఉపనిషదర్థమంతా తొంగి చూస్తున్నది. ఏకం రూపం బహుధా యః కరోతి - రూపం రూపం ప్రతిరూపో బభూవ - అనే ఉపనిషద్భావాలకూ వీటికీ తేడా ఏముంది. ఒక ఉపనిషత్తు లనే కాదు. ఉపనిషత్సారమైన భగవద్గీతాది గ్రంథ తాత్పర్యం కూడా చోటు చేసుకొంటూనే ఉంటుందాయన మాటలలో. అభ్యాస నిగృహీతేన మనసా - అజస్య గృహ్ణతో జన్మ - త్వయ్యావేశిత చిత్తానాం - త్వత్సమర్పిత కర్మణాం - అనవాప్త మవాప్తవ్యం నతేకించన విద్యతే - ఇలాటి వాక్యాలెన్నో గీతా వాక్యాలనే ప్రతిధ్వనిస్తుంటాయి.

ఈ విధంగా శ్రుతి స్మృతి మార్గంలో అద్వైత విజ్ఞానాన్నే మనోగతం చేసుకొన్న కాళిదాసు దానినమలు పరుచుకొని జీవిత లక్ష్యాన్ని సాధించటంలో మాత్రం సమాధి యోగ మనుసరిస్తాడు. అదే లోకానికి ప్రబోధిస్తాడు. చిత్ర

మేమంటే అద్వైత వేదాంతులలో రెండు తెగల వారున్నారు. ఒకరిది కేవలం విచార మార్గం. జ్ఞానాన్ని అందుకొన్న తరువాత అదే అనుష్ఠానంగా భావిస్తారు వారు. జ్ఞానానంతరం అనుష్ఠాన మంటూ వేరే లేదు వారికి. వారికున్న అనుష్ఠాన మల్లా శ్రవణ మననాలతో అందుకొన్న బ్రహ్మ జ్ఞానం లోక దేహ వాసనలతో జారి పోకుండ పదే పదే అనుసంధానం చేసుకోవటమే. దీనికే నిది ధ్యాసనమని పేరు. ఇలాటి వారికి జ్ఞాన నిష్ఠ తప్ప యోగమూ ఉపాసనా అంటూ మరొక ప్రక్రియ ఏదీ లేదు. అక్కర లేదు. పోతే మరి కొందరున్నారు అద్వైతులలో. వారు శ్రవణ మననాల ద్వారా వారిలాగా జ్ఞానాన్ని పరిపూర్ణంగా ఆర్జించిన వారే. అంతవరకూ తేడా లేదు. కాని అది జీవితంలో అలాగే అనుభవానికి తెచ్చుకోవాలంటే బరువు పడతారు వారు. నిది ధ్యాసనకు మారుగా అందుకోసం యోగ మార్గాన్ని అవలంబిస్తారు. ధారణా ధ్యాన సమాధుల ద్వారా నాడీ శుద్ధి - ప్రాణ శుద్ధి - చిత్త శుద్ధి కావించుకొని చివరకా యోగా భ్యాస బలంతో బ్రహ్మ రంధ్రం ద్వారా ప్రాణోత్క్రమణం చేసుకొని ఆదిత్య మండలాన్ని భేదించుకొని సత్యలోకం చేరి అక్కడ మరలా ఈ యోగం జ్ఞానంగా మారి తరిస్తారు. అంటే ఏమన్న మాట. సిద్ధాంతం నిర్గుణ జ్ఞానమని అంగీకరించినా దాన్ని సగుణ మార్గంలో శిక్షణ పొంది అనుభవానికి తెచ్చుకొంటారు వారు. ఇందులో మొదటి వారిది సాక్షాన్మోక్ష ప్రదమైతే - వీరిది పరంపరయా. సద్యో ముక్తి వారిదైతే క్రమముక్తి వీరిది. చివరికిద్దరి అనుభవమూ ఒక్కటే అయినా మొదటి నుంచీ చివరి దాకా అద్వైత రూపంగా వారిది నడిస్తే - మొదట ద్వైత రూపంగా నడచి ఆఖరుకది అద్వైత రూపంగా పరిణమిస్తుంది వీరిది.

భగవద్గీతాది వేదాంత గ్రంధాలలో ఈ రెండు ప్రక్రియలూ కనపడతాయి మనకు. ఇంతెందుకు. ఎనిమిదవ అధ్యాయమైన అక్షర పరబ్రహ్మ యోగం సమాధి యోగాన్ని వర్ణిస్తే ఆ వెంటనే తొమ్మిదవదైన రాజ విద్యా రాజ

గుహ్య యోగం కేవల జ్ఞాన నిష్ఠను నిరూపిస్తుంది. భగవత్పాదులు దానికి అవతారిక వ్రాస్తూ ఇలా అంటారు. అష్టమే నాడీ ద్వారేణ ధారణా యోగః సగుణ ఉక్తః - తస్యచ ఫలం అగ్న్యర్చి రాది క్రమేణ కాలాంతరే బ్రహ్మ ప్రాప్తి లక్షణమేవ అనావృత్తి రూపం నిర్దిష్టం. తత్ర అనేనైవ ప్రకారేణ మోక్ష ప్రాప్తి ఫల మధిగమ్యతే నాన్యథేతి తదాశంకా వ్యావివర్త యిషయా శ్రీ భగవా నువాచ. అష్టమాధ్యాయంలో నాడీ శుద్ధి ద్వారా సగుణమైన ధారణా యోగం చెప్పాడు భగవానుడు. దాని ఫలం అర్చిరాది క్రమేణ కాలాంతరంలో అనా వృత్తి రూపమైన బ్రహ్మ సాయుజ్యం పొందటమని కూడా పేర్కొన్నాడు. అయితే బ్రహ్మ సాయుజ్య మిలాగే పొందాలి మరొక విధంగా పొందలేమేమో అని అశంక కలగ వచ్చు శ్రోతలకు . అలాటి ఆశంకను తొలగించటానికే ప్రస్తుతమీ నవమాధ్యాయంలో మరలా కేవల జ్ఞాన నిష్ఠను ప్రతిపాదిస్తున్నాడు శ్రీకృష్ణ భగవానుడు.

దీనిని బట్టి మనకర్థ మవుతున్న దేమంటే సమాధియోగ మెంత గొప్పదైనా అది జ్ఞానానికెంత ఆవశ్యకమైనా సగుణ రూపంగా సాగే ప్రక్రియ అది. జ్ఞానం లాగా నిర్గుణంగా సాగేది కాదు. కాకున్నా నిర్గుణంగా పర్యవసిస్తుంది చివరకు. అలా నిర్గుణంగా పర్యవసించేటప్పు డెందుకీ సగుణ మార్గాన్ని అవలంబించట మంటే అది కేవలం శిక్షణ కోసం. జీవోపాధులైన మనః ప్రాణాల స్పందన జీవుడి బ్రహ్మనిష్ఠ కడ్డు తగులు తుంటాయి. వాటి అడ్డంకి తొలగించుకొనే ప్రయత్నమే ఈ యోగసాధన. ఇది సగుణమైన మార్గంలోనే కాని గమ్యంలో కాదు గనుక తెలిసే దీన్ని తాత్కాలికంగా అవలంబిస్తారు కొందరద్వైతులు. మధ్యలో సాధన కోస మలా అవలంబించినా ఆద్యంతాలలో అద్వైత జ్ఞానాన్నే నమ్ముకొన్న వారు కాబట్టి వీరు పాతంజలాది యోగుల లాగా ద్వైత మార్గ గాములు కారు. అద్వైతాను యాయులే. కనుకనే యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం - తద్యోగైరపి గమ్యతే అని గీతాచార్యుడు

వీరిని జ్ఞాన యోగుల క్రిందనే జమ కట్టాడు గాని కేవల సమాధి యోగుల కోవలో చేర్చ లేదు. ఇదీ మనమర్థం చేసుకోవలసిన విషయం.

ప్రస్తుతం మన కాళిదాస మహా కవి ఇలాంటి అద్వైత జ్ఞాన సంపన్నుడైన యోగ మార్గావలంబి . సిద్ధాంత మాయనది అద్వైతమే సందేహం లేదు. వేద్యంచ వేదితా చాసి - ప్రాక్సృష్టే ః కేవలాత్మనే - ఆత్మాన మాత్మన్యవ లోక యంతం - అద్వైత జ్ఞానం లేని వాడైతే ఇలాంటి మాట లనలేడు. అనటానికి మనసు రాదు. కాని వచ్చిన గొడవేమంటే దాన్ని అనుభవానికి తెచ్చుకోవటంలో మాత్ర మాయన పాఠకులకు యోగాభ్యాసాన్ని సిఫారసు చేస్తాడు. యోగేనాంతే తనుత్యజామని రఘువంశ రాజుల నిష్క్రమణను వర్ణించటం లోనే అర్థ మవుతుం దాయనకు యోగం మీద ఉన్న మోజు. యోగంతో శరీరాన్ని వదిలేస్తారట ఆ రాజులు. యోగమంటే ఇక్కడ సమాధియోగం. జ్ఞాన యోగం కాదు. జ్ఞానంలో అయితే వదిలేసే ప్రసక్తే లేదు. శరీర మనేది ఒకటుంటే గదా జ్ఞానికది వదిలేయటానికి. సర్వం యదయ మాత్మా. తానూ తాను చూచే సమస్త ప్రపంచమూ ఆత్మే జ్ఞానికి. అలాంటప్పుడిక శరీర మెక్కడిది. అదీ ఆత్మ స్వరూపమే. కరచరణాదులుగా కనపడ దతనికి. శుద్ధ చైతన్యంగానే అనుభవానికి వస్తుంటుంది. అలాంటి దాన్ని వదిలేయట మంటే అది కుందేటి కొమ్మును వదిలేశాడని చెప్పటం లాంటిది. శరీరమూ శరీరంతో పాటు సమస్తోపాధులూ ప్రారబ్ధం తీరగానే జ్ఞానికి అతని చైతన్య సాగరంలో తరంగాల లాగా కలిసి పోతాయి. నతస్య ప్రాణా ఉత్క్రామంతి - ఇహైవ సమవ నీయంతే అని శాస్త్రం. అలాంటప్పుడు తనువును త్యజించా రంటా డేమిటి కాళిదాసు. ఇది జ్ఞానంతో గాదు. యోగంతో నని జవాబు. యోగంతో గనుకనే ఒక తనువనే కర్మ - త్యజించటమనే క్రియా - త్యజిస్తున్నానే ఒక కర్త - ఇలాటి వ్యవహార మేర్పడుతున్నది. ఇదంతా ద్వైత భూమిని దాటి పోని వ్యవహారం. అద్వైత భూమికలో నైతే కర్మ కర్తృ క్రియా భేద మనేదాని కాస్కారమే లేదు. అది తెలిసే యోగేన అని జాగ్రత్తగానే మాట ప్రయోగించాడు మహా కవి.

ఇలాంటి సమాధి యోగమెలా అభ్యసించాలో దానితో శరీర త్యాగం చేసి ఎలా సిద్ధి పొందాలో రఘు మహా రాజు జీవితంలో సోదాహరణంగా నిరూపించా డాయన. పరిచేతు ముపాంశు ధరణాం - కుశపూతం ప్రవయాస్తు విష్టరం. దర్భాసనం మీద కూచొని ధరణా యోగాన్ని అలవరుచు కొంటున్నాడట. ప్రణిధానంతో మరుతః పంచ శరీర గోచరాన్. ప్రాణాపానాదులైన అయిదు వాయువులనూ అరికట్టాడట. తరువాత గుణత్రయాన్ని జయించి సమలోష్ట కాంచనుడై సంచిత కర్మల నన్నింటినీ జ్ఞానాగ్నిలో దగ్ధం చేశాడట. చివరకీ సాధన బలంతో తమసః పరవూప దవ్యయం పురుషం అని వర్ణిస్తాడాయన నిష్క్రమణాన్ని. ఈ చివరిమాట వింటుంటే మనకు వేదాహ మేతం పురుషం మహాంతం - ఆదిత్య వర్ణం తమసః పరస్తాత్తనే శ్రుతి వాక్యమూ - తమసః పరముచ్యతే - సతం పరం పురుషముపైతి దివ్యమనే స్మృతి వాక్యాలూ జ్ఞప్తికి వస్తాయి. ఇవన్నీ యోగి తన అవసానంలో పరతత్త్వాన్నే చెందినట్టు వర్ణించినా అది కాలాంతరంలోనే సమకాలంలో కాదని అర్థం చేసుకోవాలి మనం. ప్రాణ శక్తి హృదయంలోనూ భ్రూమధ్యంలోనూ చేర్చుకొని తరువాత శిరః కపాలాన్ని భేదించుకొని దాన్ని సూర్య రశ్మిలో కలిపి దానితో ఆదిత్య మండలం చేరి తద్ద్వారా హిరణ్య గర్భ లోకాన్ని ప్రవేశించి అక్కడ కేవల జ్ఞాన నిష్ఠ నవలంబించి అది ఫలించగానే ముక్తు డవుతాడు యోగి. దీనికే క్రమముక్తి అని పేరు పెట్టారు వేదాంతులు. కాళిదా సిలాంటి క్రమముక్తినే వర్ణించా డనుకోవాలి ఆ రాజుల చరిత్రలో. అయితే పరమాత్మ దర్శనమని పరమ పురుష ప్రాప్తి అని అపవర్గమని మాటలు ప్రయోగిస్తుంటాడు. వాటికి మల్లినాథాది వ్యాఖ్యాతలు జ్ఞానపరంగానే అర్థం చెబుతారు కూడా. అది ఓదనం పచతి అన్నట్టు భవిష్యత్తులో కలగబోయే మోక్ష ఫలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుగా చేసిన వర్ణనే గాని మరేదీ గాదని మనం గ్రహించాలి. కనుకనే యోగ సమాధినా రఘుః సమాధి యోగం తోనే ప్రాణ త్యాగం చేశాడు రఘుమని కంఠోక్తిగానే వర్ణించాడు కాళిదాసు.

ఇలాటి యోగ దీక్ష రఘు వంశ రాజులకే నేమి. ఆ మాటకు వస్తే సర్వజ్ఞుడైన పరమేశ్వరుడికే అంటగట్టాడు కవి. మన్మథుడు తన మంది మార్బలంతో స్థాణ్వాశ్రమంలో అడుగు పెట్టాడో లేదో అనతి దూరాన ఒక నిశ్చల సమాధిలో కూచున్న మహా యోగిని దర్శిస్తాడు. ఎలా ఉన్నదా విగ్రహం. దేవదారు వృక్షం క్రింద ఒక వేదిక. ఆ వేధిక మీద పరచిన ఒక వ్యాఘ్ర చర్మం. దాని మీద వీరాసనం వేసుకొని సర్పజాతంతో జటాజూటం పైకి కట్టుకొని అక్ష మాల రెండు పేటలుగా చెవులకు తగిలించి కృష్ణా జినం మెడకు చుట్టి స్తిమితోగ్ర వీక్షణాలు క్రిందికి పరపి ప్రాణ పంచక సంచార మరికట్టి మనస్సు నిటు నటు కదల కుండా హృదయ కుహరంలో బంధించి నిశ్చల సమాధిలో నిమగ్నమైన విగ్రహమది. అంతే కాదు. కపాల నేత్రాంతర లబ్ధ మార్గైః జ్యోతిః ప్రరోహై రుదితైః శిరస్తః అని వర్ణిస్తాడు. కపాల రంధ్రం నుంచి కాంతి కిరణాలు పైకి చిమ్ముతున్నాయట. చూడండి. ఇక్కడ వ్యాఘ్రాజినమూ వీరాసనమూ జటాధారణమూ నాసికాగ్ర వీక్షణమూ మనః ప్రాణ నిరోధనమూ కపాల భేదనమూ - ఇలాంటి పద ప్రయోగాలే సూచిస్తున్నాయి మనకిదంతా సమాధియోగ సామగ్రియే నని. అసలా మాటకు వస్తే జ్ఞాన పరిభాష వేరు. యోగ పరిబాష వేరు. పరిభాషను బట్టే చెప్పవచ్చు నిది జ్ఞానమా యోగమా అని. కాళిదాసిలాంటి సందర్భాలలో వాడే మాట లేపైనా చూచండి. అవి చాలా వరకు యోగ భాషే గాని జ్ఞాన భాష కాదు.

ఇలా అన్నాము గదా అని ఆ మహా కవి కసలద్వైత దృష్టి లేదని మరలా అపోహ పడరాదు. అద్వైత జ్ఞాన సంపన్నుడని ముందే పేర్కొన్నాము. ఎంత యోగ శాస్త్రజ్ఞుడో అంత జ్ఞాన శాస్త్రజ్ఞు డాయన. అయితే జ్ఞానమే అనుష్ఠాన మంతకన్నా మరేదీ అక్కర లేదని తృప్తిపడిన వాడు కాడాయన. జ్ఞానం వల్ల ఆశించే ఆ మహా ఫలాన్ని యోగ సమాధి ద్వారా అందుకోవాలనే దృష్టి ఆయనది. ఆ దృష్టితోనే ఒక రఘు వంశ రాజుల జీవితాన్ని వర్ణించినా - ఒక

పరమేశ్వరుని సమాధి దీక్ష వర్ణించినా - ఒక జగన్మాత తపశ్చర్య వర్ణించినా. ఆఖరుకు శాకుంతలంలో దుష్యంతుడు స్వర్గసీమకు వెళ్ళితే అక్కడ మరీచాశ్రమంలో ఆ ప్రజాపతి కఠోర తపశ్చర్య వర్ణించినా ఒకే బాణీలో వర్ణిస్తూ పోతాడు. అద్వైత జ్ఞానమెంత ఉన్నా దానికి సాధన తోడు కావాలి - ఆ సాధన యోగ సాధనే నని ఆయన అభిప్రాయం. అంతేగాని అద్వైత దృష్టి లేని వాడని కాదు. దాని పట్ల విముఖత కలవాడనీ కాదు. మీదు మిక్కిలి పరోక్షాపరోక్ష రూపమైన రెండు జ్ఞానాలు పుష్కలంగా ఉన్న మహనీయుడు. ఇంతెందుకు మూడు నాటకాలు వ్రాశాడు కాళిదాసు. మూడింటిలోనూ మొదట్లో నాంది పద్యాలు మూడు వ్రాశాడు. అవి మూడూ మూడు రత్నాలు. మూడు వజ్రాలు వాటి ప్రకాశ మింతా అంతా కాదు. అనంతం. అసలు నాటక కథకూ వాటి భావాలకూ సంబంధం లేదు. నాందీ పద్యమైనా వస్తు నిర్దేశం చేయాలని వ్రాసిన వాడు కాడాయన. ఆశీ రూపంగా రచించిన వాడు. ఆశీః అంటే ప్రబలమైన కోరిక. కవిగా నాకూ శ్రోతలుగా మీకూ ఇదే జీవితంలో ఉండవలసిన ఏకైక లక్ష్యమని ఆయన వీటి ద్వారా సూచించిన వివక్షితం.

ఏకైశ్వర్యే స్థితోపి ప్రణత బహు ఫలే యస్స్వయం కృత్తి వాసాః
కాంతా సమ్మిశ్ర దేహో ప్యవిషయ మనసాం యఃపరస్తాత్ యతీనాం
అష్టాభి ర్యస్య కృత్స్నం జగదపి తనుభి ర్బిభ్రతో నాభిమానః
సన్మార్గాలోక నాయ వ్యపనయతు స వస్తామసీం వృత్తి మీశః

చూడండి. మాళవికాగ్నిమిత్రంలో నాందీ శ్లోక మిది. ఇందులో మొదటి పాదం అర్థం - రెండవ పాదం కామం అనే పురుషార్థాలను చెబుతున్నాయి. అవి రెండూ పనికి రావని వర్ణించటం ద్వారా జగత్తు మీద మమకారం పోగొట్టుకోవాలని - అలాగే మూడవ పాదంలో దేహాభిమానం లేదని చెప్పటం ద్వారా జీవ భావమనే అహంకారం పోగొట్టు కోవాలని బోధ పడుతున్నది. అయితే అవి రెండూ పోగొట్టుకోవాలంటే అవిద్యా రూపమైన తమస్సు పనిచేస్తున్నంత వరకూ సాధ్యం కాదు. మరి ఆ తమస్సు పోవాలంటే

సన్మార్గమనే ఆలోకం కావాలి. ఇది సన్మార్గ లోకనాయ అనే నాలుగవ పాదంలో సూచన చేస్తాడు కవి. మంచిది . ఈ ఆలోకం సాధకుడి కెలా లభిస్తుందని అడిగితే ఏమి టాయన మనకిచ్చే సలహా. అది విక్రమోర్వ శీయ నాందీ శ్లోకంలో మన కందిస్తున్నా డాయన. ఎలాగా .

వేదాంతేషు యమాహు రేక పురుషం వ్యాప్య స్థితం రోదసీ
యస్మి న్నీశ్వర ఇత్య నన్య విషయః శబ్దో యధార్థాక్షరః
అంతర్యశ్చ ముముక్షు భి ర్నియమిత ప్రాణాది భిర్మృగ్యతే
సస్థాణుః స్థిర భక్తి యోగ సులభో నిశ్శ్రేయ సా యాస్తు వః

ఔపనిషదః పురుషః అని ఉపనిషత్తులన్నీ ఒకే ఒక పూర్ణమైన తత్త్వాన్ని వర్ణించాయి. అది బాహ్యంగా ఈ రోదసి నంతా వాపించింది. బాహ్యంగా ఎలా వ్యాపించిందో మన ఆంతర్యంలో కూడా అలాగే నిండి నిబిడీ కృతమై ఉంది. ముముక్షు వైన వాడు దాని నంతరంగం లోనే వెదకి పట్టుకో వచ్చు. స్థిరమైన భక్తి యోగ ముంటే చాలు. అది సులభమే నని చె ంతాడు. మరి సులభ మన్నారే ఏమంత సులభమా. ఎలాగా సులభమది చెప్పమని ప్రాధేయ పడితే బయట పెడ తున్నా డా రాజ రహస్యం మనకు చివరిదైన శాకుంతల పద్యం ద్వారా.

యా సృష్టిః స్రష్టురాద్యా వహతి విధి హుతం యా హవిర్యా చ హోత్రీ
యేద్వే కాలం విధత్తః శ్రుతి విషయ గుణా యా స్థితా వ్యాప్య విశ్వం
యామాహు స్సర్వ బీజ ప్రకృతి రితి యయా ప్రాణినః ప్రాణ వంతః
ప్రత్యక్షాభిః ప్రపన్న స్తనుభి రవతు వ స్తా భి రష్టాభి రీశః

ఇందులో పరమేశ్వరుడి అష్టమూర్తులు వర్ణించాడు కాళిదాసు. భూమి రాపో నలో వాయుః అని భగవద్గీతలో భగవానుడు సెలవిచ్చిన మాటల కివి మారు మాటలు. పృథివ్యాదు లైన అయిదు మహా భూతాలు - మనో బుద్ధ్యహంకారాలు మూడూ - వెరసి అష్ట మూర్తులివి. చరాచర సృష్టి అంతా ఈ అష్ట మూర్తులే. ఈ అష్ట మూర్తులూ కల ఆ అష్ట మూర్తి ఎవరో కాదా



Vallabhajosyula Brahmasri Rao www.advaitavedanta.in

పరమాత్మే. అమూర్తమైన ఆయన మూర్తులే ఇవి. అమూర్త మాయన స్వరూపం. మూర్త మాయన విభూతి. సువర్ణం స్వరూప మనుకొంటే కటక కుండలాద్యాభరణాలు దాని విభూతి. స్వరూప విభూతులకు రెంటికీ భేదం లేదు. ఒకటి వస్తువు. మరొకటి దాని ఆభాస. వస్తువు మనకు కనపడక పోయినా ఆభాస కనపడుతుంది. అలాగే కదా కన పడుతున్నది ప్రస్తుత మీ చరా చర ప్రపంచమూ మనకు ప్రత్యహం. కనపడే ఈ ప్రపంచ సృష్టిని బట్టి ఆ సృష్టి కర్త స్వరూపాన్ని సులభంగా అనుభవానికి తెచ్చుకోవచ్చు. సర్వం ఖల్విదం బ్రహ్మ. ఇదంతా ఆ స్వరూపమే తద్వ్యలక్షణంగా ఇందులో ఏదీ లేదని అంతా స్వరూప భావనతో చూడటమే అనుభవం. అప్పుడు పరోక్షంగా ఉండిపోయిన స్వరూపం కూడా ఈ విభూతి పర్యాలోచన ద్వారా అపరోక్షంగానే అనుభవానికి రాక మానదు. ఇది యదేవేహ తదముత్ర - యదముత్ర తదన్విహ అనే ఉపనిషద్వాక్యాని కెలా అర్థం పడుతున్నదో చూడండి. దీనిని బట్టి కాళిదాస మహా కవి కున్న పరిపూర్ణాద్వైత దృష్టి మనకు బాగా స్పష్ట మవుతున్నది.

అద్వైత క్షేత్రంలో కూడా కాళిదాసు సాగించిన వ్యవసాయం కొంత దూరం పోయి మరొక క్రొత్త మలుపు తిరిగింది. కేవలాద్వైతమే గాక ఆయన మనసునది శివాద్వైత రూపంగా ఆవేశించింది. శివాద్వైతమనీ శాక్తాద్వైతమనీ శుద్ధాద్వైతమనీ దాని కనేక నామధేయాలు. ఇది కాశ్మీర దేశంలో అవతరించిన సిద్ధాంతం. అద్వైత సిద్ధాంతమే ఇది కూడా. కాని ఇది వైదికం కాక తాంత్రిక మయి కూచుంది. శైవాగమాలు వైదికమైన అద్వైతాన్ని శివాద్వైతంగా మార్చాయి. కాశ్మీర దేశస్థులైన విద్వాంసులు మొదటి నుంచీ శివ దీక్షా పరులు. మహా మేధావులు కావటం మూలాన ఔపనిషద మైన అద్వైత భావాలను కూడా చక్కగా ఆకళించు కోగలిగారు. కాని అంతకు ముందు నుంచీ తమ మనసులలో నాటు కొని ఉన్న శివదృష్టిని వదలలేక పోయారు. తన్మూలంగా అద్వైతంలో బ్రహ్మ తత్త్వానికి మారుగా శివతత్త్వాన్ని జోడించారు వారు. నాస్మి కో దోషః. బ్రహ్మానికే లక్షణాలు చెప్పారో అవే వారు శివతత్త్వానికి కూడా వర్ణిస్తారు కాబట్టి

రెంటినీ పర్యాయ పదాలుగా భావించ వచ్చు తప్పులేదు. కాని తేడ ఎక్కడ వస్తుందంటే వారు శివతత్త్వంతో పాటు శక్తి తత్త్వాన్ని కూడా అంగీకరించారు. శక్తి నంగీకరిస్తే తప్పులేదు. పరాస్య శక్తిః స్వాభావికీ అని వేదమే చాటుతున్నది. పరమాత్మ నాశ్రయించి ఆయన మాయా శక్తి ఉందనేంత వరకూ అద్వైతు లంగీకరించినదే. కాని వారాశక్తి పరమేశ్వరాధీనగానే తప్ప స్వతంత్రమైన ఒక పదార్థంగా ఒప్పుకోరు. ఒప్పుకొంటే ద్వైతం వచ్చి పడి అద్వైతానికే ముప్పు వాటిల్లు తుందని వారి అభిప్రాయం. కాగా ఈ శివాద్వైతు లలా కాక శక్తిని స్వతంత్రమైన ఒక తత్త్వంగా భావిస్తారు. శివ తత్త్వ మెలాంటిదో శక్తి తత్త్వం కూడా అలాంటిదే వారికి. ఇది ఒక తేడా అయితే మరొకటి కూడా ఉంది వారి సిద్ధాంతంలో. అద్వైతుల మాయా వాదాన్ని అంగీకరించ రీ శివాద్వైతులు. మాయ దేనికి ఇదొక తడికె మధ్యలో- పరమాత్మ సర్వ స్వతంత్రుడు గదా ఆయన తన పాటికి తాను స్వేచ్ఛగానే చేస్తున్నాడీ సృష్టి స్థితి లయాలన్నిటినీ. ఆయన సృష్టియే గనుక అద్వైతులు చెప్పినట్టిది మిథ్య కాదు అనృతం కాదు. అసత్తంతకన్నా కాదని గట్టిగా వాదిస్తారు. అందుకే దీనికి స్వచ్ఛంద వాద మని కూడా ఒక పేరు వచ్చిందీ శివాద్వైతానికి. ఇలాంటి ఒకటి రెండు ముఖ్యమైన తేడాలు తప్ప మిగతా దంతా ఇది ఔపనిషదమైన అద్వైత సిద్ధాంతమే. సందేహం లేదు. పోతే వీరి సాధన మార్గమంతా ప్రత్యభిజ్ఞ మీద ఆధారపడి ఉంది. అభిజ్ఞ అంటే గుర్తించటం. ప్రత్యభిజ్ఞ అంటే మరలా గుర్తించటం. మరలా గుర్తించట మనేది ఎప్పుడు జరుగుతుంది. మొదట గుర్తించి దాన్ని మరచి పోయినప్పుడు. మనమొక వస్తువెక్కడో దాచి పెడతాము . పెట్టినప్పుడు మనకది గుర్తే. కాని తరువాత దాని ఊసే మనం పట్టించు కోలేదు. ఆయా వ్యాసంగాలలో పడి దాని విషయం మరచిపోయాము. కొన్నాళ్లకు దానికి సంబంధించిన కాగితాలేవో చూస్తుంటే అది మరలా మనకు జ్ఞప్తికి వస్తుంది. ఇదుగో ఈ జ్ఞప్తికి రావటాన్నే ప్రత్యభిజ్ఞ అని పేర్కొంటారు,. ఇది మన జీవితంలో ఎలాగో జీవిత గమ్యమైన తత్త్వంలో కూడా అలాగే నని చాటుతారు

శివాద్వైతులు. జీవులమని భావిస్తున్న మనమంతా అసలు ఈశ్వర స్వరూపులమే. అయినా ఆ సత్యాన్ని ఎందువల్లనో మరచి పోయాము. అలా మరచి కూడా అర్బుద న్యర్బుదాలైన అనేక జన్మలు గడచిపోయాయి. కనుకనే దానికి మారుగా మనకీ సకల క్లేశ నివాసమైన సంసారం దాపుర మయింది. ఇప్పుడీ భవ బంధం నుంచి విముక్తులమై బయట పడాలంటే మరలా మనమా సహజమైన ఈశ్వర స్వరూపాన్ని జ్ఞప్తి చేసుకోవాలి. జ్ఞప్తి దాని పాటి కది రాదు. జ్ఞాపకమైన సాధన మేదో ఒకటుండాలి. ఆ సాధనం కూడా ఏదో కాదు. ఆ ఈశ్వర చైతన్యంలో నుంచి వచ్చిన దానికి సజాతీయ మైనదే కావాలి . దానిలో నుంచి వచ్చిన దైతేనే మరలా దాని వద్దకు మనలను చేర్చగలదు. దీనినే తార్కికులు లింగ మని పేర్కొంటారు. దూరాన పర్వతం మీద నిప్పుందో లేదో మనం చూడలేదు. కాని పొగ మాత్రం మనకు కనిపిస్తుంటుంది. ఈ కనిపించే ధూమాన్ని బట్టి నిప్పుందని దాని అస్తిత్వాన్ని పట్టుకో గలిగాము. ఎందువల్ల. ధూమ మనేది అగ్ని నుంచి జనించింది గనుకనే అగ్నిని మరలా మనకు చూప గలిగింది. ఇదే దానికి లింగం లేదా అభిజ్ఞానం.

అలాగే ప్రస్తుతమీ పృథివ్యాది రూపంగా అష్టధా భిన్నమైన ప్రపంచం కూడా ఒక అభిజ్ఞానమే ప్రపంచాతీత మయిన తత్త్వానికి. ప్రపంచం మనకు ప్రత్యక్షంగా కనపడుతున్నదే గాని ఆ తత్త్వం మనకలా కనపడటం లేదు. అది మన స్వరూపమే అయినా ఎప్పటి నుంచో మరచిపోయాము మనం . మరలా ఆ విస్మరించిన మన ఆత్మ స్వరూపాన్ని మనమందు కోవాలంటే అందులోనుంచే ఆవిర్భవించిన ఈ సృష్టే ఒక అభిజ్ఞానం . దీనిని పట్టుకొని ప్రయాణం చేస్తే తజ్జన్యమే గనుక అగ్నిని ధూమం లాగా ఇదే మన బుద్ధుల నా స్వరూపం దగ్గర చేర్చ గలదు. ఇందులో ఉన్న రహస్య మేమంటే తజ్జలానితి అన్నట్టు చరాచర ప్రపంచ మంతా తజ్జన్యమూ తదాత్మకమే . సువర్ణ జన్యమైన కటక కుండలాదు లన్నీ సువర్ణాత్మకాలే గదా . అలాగే ఈ వన నదీ పర్వతారణ్య పశు మృగ మనుష్యాదికమైన సృష్టి కూడా తదాత్మకమే. అంటే ఇందులో ప్రతి అణువూ శుద్ధ సంవిద్రూప మయిన శివతత్త్వమే . కాబట్టి ప్రతి వస్తువూ

సృష్టిలో ఆ శివతత్త్వాన్ని గుర్తు చేసే అభిజ్ఞానమే. అయితే అది మానవుడి అనుభవానికి రావాలంటే దానికొక షరతున్నది. ఇది దాని కభిజ్ఞానమని గుర్తించి దీని ద్వారా దాన్ని బాగా విమర్శిస్తూ పోవాలి. ఎంతెంత విమర్శిస్తూ పోతే అంతంత ఈ అభిజ్ఞాన మా అభిజ్ఞేయ మయిన తత్త్వంగా మారుతూ పోతుంది. విమర్శ పూర్తి అయ్యే సరికిక అభిజ్ఞానం వేరుగా గోచరించదు మనకు. అది కూడా అభిజ్ఞేయమైన తత్త్వంలోనే లీన మవుతుంది. కాగా అది మన స్వరూపమే గనుక మనకు భిన్నంగా ఏదీ లేదనే అద్వైత భావం అయత్నంగానే మన అనుభవానికి వస్తుంది. ఆ భావం ప్రకాశమైతే దాన్ని చేర్చే ఈ ప్రపంచమొక అభిజ్ఞానమైతే దీని ద్వారా దాని నందుకొనే సాధన విమర్శ. అభిజ్ఞానాన్ని విమర్శిస్తూ ఆత్మ ప్రకాశాన్ని అవగతం చేసుకోటమే ప్రత్యభిజ్ఞా హృదయం.

ఇది ఎంతగా హృదయ గతం చేసుకొన్నాడో చెప్పలేము. ప్రత్యభిజ్ఞా దర్శనం కాళిదాసు తరువాత ఎంతో కాలానికి వచ్చినట్లు మనకు కనిపిస్తున్నా దాని బీజావాపన మాయన కాలానికి ముందే జరిగిందని నా అభిప్రాయం. ఏ సిద్ధాంత మయినా ఒక్కసారి హఠాత్తుగా లోకంలో ఆవిర్భవించదు. శంకరుల అద్వైత విజ్ఞానం ఆయనతోనే సృష్టి అయిందా. అంతకు పూర్వమెన్నో శతాబ్దాల క్రిందట ఉపనిషత్తులతోనే ఆరంభ మయింది. సూత్ర ప్రాయంగా ఉన్న ఆ అద్వైత విజ్ఞానమే ఆయన కాలానికి భాష్య రూపంగా పెరిగి ఒక మహా వృక్ష మయింది. ఎంతగా అయిందంటే అద్వైతమంటే శంకరుడే - శంకరుడంటే అద్వైతమన్న ప్రఖ్యాతి ఏర్పడింది లోకంలో. కాని చారిత్రకంగా దాని వయస్సంతకన్న చాలా పెద్దది. అలాగే ప్రస్తుతమీ శివద్వయ సిద్ధాంతం కూడా కాళిదాసు తరువాత ఎంతో కాలానికి వచ్చిన ఉత్పలదేవ సోమ దేవ అభినవ గుప్త యోగ రాజ క్షేమ రాజాదులకు మాత్రమే దక్కిన సొత్తు కాదు. వారు దానిని చిలవలు పలవలుగా తీర్చి శాఖోప శాఖలుగా విస్తరించిన మహోను భావులు కావచ్చు. కాని చరిత్రలో దాని పునాదులు మనకజ్ఞాతంగా ఎప్పటినుంచో

ఉండవచ్చు. కాళిదాసు కాలానికే అది అక్కడక్కడ పండితుల విచారంలో ప్రచారంలో రూపు దిద్దుకొని ఉంటుంది. ఆ రూపు బహుశా కాళిదాసు చూపు నాకర్షించి ఉండి ఉంటుంది.

దీనికొక కారణ మసలు కాళిదాసు సహజంగా శైవ మతావలంబి కావటం. కాళిదాసనే పేరే చెబుతుందాయన కాళి ఉపాసకుడైన శైవుడని. పోతే ఇప్పుడు బహుళ ప్రచారంలో ఉన్న శ్యామలా దండకాదు లాయన రచనలే నని మనం విశ్వసించేట్టయితే ఆయన శైవ మతాభి నివేశాన్ని మనం కాదన లేము. దీనికి తోడాయన జన్మస్థాన ముజ్జయిని అనుకొంటే అందులో వెలసిన మహా కాలు డాయన ఆరాధ్య దైవ మయి ఉండాలి. అదే పనిగా మేఘ సందేశంలో ఆ దేవుని స్మరిస్తాడు కూడా. అంతేకాదు. అతడు రచించిన నాటకాలు మూడింటిలో కూడా నాందీ పద్యాలు శివ శక్తి పరాలే. రఘువంశాదిలో చేసిన వాగర్థావివ అనే స్తోత్రం శివ స్తోత్రమే. కుమార సంభవ కథ అంతా శైవైక పరాయణమే. కావ్యాల్లో నాటకాల్లో తరుచు శివ నామస్మరణమే. కడకు శాకుంతలం భరత వాక్యంలో తానాసించిన జీవిత లక్ష్యం సమీక్షించి చూచినా మన కర్థ మవుతుందాయన శివ భక్తి పారవశ్యం. మమాపిచ క్షపయతు నీల లోహితః - పునర్భవం పరిగత శక్తి రాత్మ భూః అని ముక్త కంఠంతో వాపోతాడు. ఆ నీలలోహితు డా ఆదిశక్తితో కూడా తనకు సాక్షాత్కరించి తన్ని సంసార బంధం నుంచి విముక్తుణ్ణి చేయాలట. ఇంకా లోతుకు దిగి చూచామంటే ఆయన రచన లన్నిటిలో కల్పించిన నాయికా నాయకు లెవరో కారు. శివ శక్తులకు కేవలం ప్రతీకలే నని చెప్పినా చెప్పవచ్చు. ఇది ఉత్తరోత్తరా నేనే విశదీకరించి చెప్పబోతాను. అలమిహ బహు ప్రపంచ నేన. ఇంతకూ కాళిదాసు సహజంగా శైవ మతాభిమాని అని గ్రహిస్తే చాలు.

అయితే ఆయన గొప్ప ఏమంటే సహజంగా శైవుడే అయినా మన తెలుగు కవి పోతన లాగా ఇంతింతై వటుడింతయై అన్నట్టు బాగా ఎదిగి

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

పోయాడు. ఉద్బాహురివ వామనః అని ఆయనే చెప్పినట్లు వామనుడు త్రివిక్రము డయినాడు. శైవైక దృష్టి అద్వైత దృష్టిగా మారాడు. ఆ దృష్టితో చూస్తే అతనికి శివుడేమిటి విష్ణువేమిటి బ్రహ్మ ఏమిటి. అఖరుకు ఆది శక్తి అయిన అమ్మవా రేమిటి. అందరూ ఏకంగానే కనిపించారు. స్త్రీపుంసా వాత్మ భాగౌ తే . స్త్రీ పురుషులనే తత్త్వాలు రెండూ రెండుగా మారిన ఆత్మ భాగాలే. ఆ ఆత్మ సంవిద్రూపంగా కేవలమే ననే రహస్యం తెలుసుకొన్నాడు. అయితే అంతకు ముందే తన జీవితంతో పెనవేసుకొన్న శివదృష్టి పూర్తిగా వదల లేదు. జీవన్ముక్తుడికి ప్రారబ్ధం లాగా ఇంకా కొంచె మంటు కొని ఉన్నది. అలా అంటుకోవటం వల్లనే కాబోలు తన రచనలలో అద్వైత భావ మెంత ప్రదర్శిస్తున్నా అక్కడక్కడ సమయం వచ్చినప్పుడల్లా అది కొంచెం తొంగి చూస్తూనే ఉంటుంది. మాతృభి రాదృతాభిః - న్యస్తం పురస్తాత్ పుర శాస నస్య - తద్ద్వారవా న్మంగళ మండన శ్రీః అని ఈశ్వరుడి పరివారమైన బ్రాహ్మ్యాది సప్త మాతృ - కలనూ ఆయన వివాహ మహోత్సవంలో స్మరించక తప్పలేదాయనకు. అలాగే తాసాంచ పశ్చాత్ కనక ప్రభాణాం - కాళీ కపాలా భరణా చకాశే అని అంతవరకూ తనకిష్ట దేవత అయిన కాళీ మాతను కూడా భక్తి పూర్వకంగా భావించకుండా ఉండ లేక పోయాడు. కానీ ఇలాంటి వన్నీ ప్రస్తావోచితంగా చేసిన వర్ణనలే గాని కేవల శైవాభిమానంతో చేసినవి కావు. ఆవగింజంత బూది మై నలది కొనిన - వెలది గుమ్మడి కాయంత వెర్రి పుట్టు ననే శ్రీ నాథోక్తికి గురి అయ్యేంత మతోన్మాది కాడు కాళిదాసు.

కనుకనే కేవల శైవాన్ని కాక అద్వైత దృష్టితో శైవాన్ని చూచి సమన్వయించుకొన్నాడు. ఈ సమన్వయ దృష్టితోనే శివాద్వైతి అయ్యాడాయన. అంతకు ముందున్న శివాద్వైతుల దర్శనాన్ని పరిశీలించటం వల్లనో లేక తనకు సమకాలికు లైన అలాంటి కొందరు దార్శనికుల తోడి సాహచర్యం వల్లనో శివాద్వైతుల సమన్వయ మార్గ మాయనకు బాగా వచ్చి ఉంటుంది. కాని దానిని కూడా ఆయన సక్తుమివ తిత ఉనా అన్నట్లు బాగా

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

జల్లెడ పట్టి ఎంతవరకో అంతవరకే గ్రహించాడు గాని ఉన్నదంతా బంగారమని బావుకో లేదు. వైదికానికి విరుద్ధమైన కేవల తాంత్రిక మార్గాన్ని ఆయన త్రొక్క లేదు. ఉపనిషత్తుకు సహోదరమైన శివాద్వయ దర్శన మేదో దాన్నే పట్టుకొని సాగించాడు తన ప్రయాణం. అలాంటిదొక్క ప్రత్యభిజ్ఞా సిద్ధాంతమే. అది అద్వైతానికీ శివాద్వైతానికీ కూడా సమానమే. సోహమ్మని అద్వైతు లంగీకరించిన ప్రత్యభిజ్ఞనే శివోహమని శివాద్వైతులు కూడా అంగీకరించక తప్పదు. అలాంటప్పుడిక తేడా ఏముందని. మహా అయితే మాయా వాదాన్ని శక్తి స్వాతంత్ర్య వాదాన్నీ ఒప్పుకోవటం ఒప్పక పోవటంలోనే వస్తుంది పేచీ. ఇలాటి పేచీ పడటం కాళిదాసు కిష్టం లేదు. సబబు గానూ కనిపించ లేదాయనకు

అద్వైతుల మార్గంలోనే ఆయన శక్తిని పరమేశ్వరాశ్రయిణి అని - ప్రపంచమంతా మాయా రూపమైన తదాభాసే నని భావించ సాగాడు. వ్యపన యతు నవ స్తామసీం వృత్తి మీశః - మోహన్మయా సుతను - అని మాయా పర్యాయాలైన మోహ తమశ్శబ్దాలను అక్కడక్కడ ప్రయోగించటంలోనూ - పరిగత శక్తి రాత్మభూః అని శివశక్తుల నేకంచేసి వర్ణించటం లోనూ - వైదికాద్వైత వాసనలే కావ్యలలో గుబాళిస్తుంటాయి.

కాకపోయినా ప్రత్యభిజ్ఞ నెప్పుడొప్పుకొన్నారో శివాద్వైతు లప్పుడు మాయా వాదాన్ని కూడా ఒప్పుకోక తప్పదు. ప్రత్యభిజ్ఞ అంటే ఏమని చెప్పామర్థం. జీవుడు తన్ను ఈశ్వరుడే నని మరలా గుర్తించటం. మరలా గుర్తించట మెందుకు వచ్చింది. తన ఈశ్వర భావాన్ని మరచి పోవటం వల్లనే గదా. ఈ మరచి పోవటమే మాయ. మాయీయ మయిన మలమని తామూ చెప్పారు గదా. ఇక మాయా వాద మనగానే ఉలికి పడటం దేనికి. కాగా జీవుడెప్పు డీశ్వరు డయ్యాడో ఇక జీవుడు వేరుగా లేడు. జీవుడు లేకుంటే జగత్తూ లే దు. అవి రెండూ పరస్పర సాపేక్షం. మరి జగత్తే లేనప్పు డీ జగత్తు మిథ్య అన్నత మంటే చెవులు మూసుకోటం దేనికి. జగత్తు నామ రూపాత్మకంగా అనృతమై శక్తి రూపంగా శేషిస్తుంది. ఆ శేషించిన శక్తి ఎవరిది. ఎవరిదో ఒకరిది

కావాలి. స్వతంత్రగా ఉండటానికి లేదు. స్వతంత్ర కావటానికది చేతన కాదు. జడ. చేతనుడు శివమని వారు చెప్పే పరమాత్మే. కనుక ఆ శివ చైతన్యాన్ని ఆశ్రయించి ఉండాలది. అదే అర్ధనారీశ్వర తత్త్వం. ఈ అర్ధనారీశ్వర తత్త్వాన్ని ఎంతగా భావన చేశాడో కాళిదాసు చెప్పలేను. దాని ఆంతర్యాన్ని విప్పి చెప్పాలంటే ఆయన రచన లన్నింటనీ ఆ మార్గంలో తడవి చూడాలి. అది దీని తరువాతి అధ్యాయంలో ఎలాగూ చేయ బోతాను. కాబట్టి ఇంతకూ ప్రత్యభిజ్ఞ వరకూ నిలిస్తే చాలు. రెండద్వైతాలు లేవు. అంతా ఒకే ఒక అద్వైతం. అదే శివం. అదే అద్వైతం. శివాద్వైత మంటూ క్రొత్తగా పేరు పెట్టటం దేనికి. అద్వైతం శివం కాక పోతేగదా మరొక శివాద్వైతాన్ని మనం తెచ్చి పెట్టవలసింది. అశివం కానిదేదో అదీ శివమంటే. అశివ మీ సంసారమే మనకు. ఇదే మనకున్న పెద్ద సమస్య. దీనికి పరిష్కారం చేయగలిగితే అదే శివం. ఆ పరిష్కారం మామూలుగా బ్రతికే మానవుడా చేతగాక ఊరకున్నాడు. చేత నవునని చెప్పి ఆస్తికుడొక ఈశ్వరుణ్ణి కల్పించుకొన్నాడు. నాస్తికు డీశ్వరుడే లేడు పొమ్మని త్రోసి పుచ్చాడు. వీరి ముగ్గురిదీ అవివేకమే. సమస్యకు ముగ్గురిదీ పరిష్కారం కాదు. పరిష్కరించే ప్రయత్నమే లేని సామాన్యుడిదీ కాదు. ప్రయత్నిస్తున్న ఆస్తికుడిది నాస్తికుడిదీ కాదు. ఆస్తికు డీశ్వరుణ్ణి ఒప్పుకొని ఈ సమస్య వాడి మీద పారేశాడు. సృష్టిలో జరిగే అన్యాయా లన్నిటికీ ఎవరు కారణమంటే ఈశ్వరుడే అనవలసి వస్తుంది. ఇది ఆస్తికుడు చేసే పొరబాటు. ఇక నాస్తికుని పొరబా టేమిటంటే వాడీ ప్రపంచాన్ని తప్ప ఈశ్వరుణ్ణి ఒప్పుకోవటం లేదు. అలాంటప్పుడీ అన్యాయాలకూ అక్రమాలకూ ఎవడు బాధ్యుడంటే వాడి కసలు జవాబు లేదు. ఎవడూ కాదు దానిపాటి కదే అలా జరిగుతుందని చెప్పాలిక. అది సహేతుకంగా చెప్పలేక వేసే కప్పదాటు.

కాబట్టి ముగ్గురూ ముగ్గురే. లౌకికుడు - నాస్తికుడు - ఆస్తికుడు ముగ్గురూ చెప్పలేరు సమాధాన మీ సమస్యకు. అలా చెప్పగలిగిన వాడూ చేయగలిగిన వాడూ ఒక్క అద్వైతి మాత్రమే. అది ఎలాగని అడగ వచ్చు.

Yalamanchili Srinivasa Rao
www.advaitavedanta.in

అద్వైతి ఇదంతా ఒక స్వప్నంలాగా మిధ్యా భూతమని తీర్మానించాడు. స్వప్నంలో మనమెన్నో కష్టాలూ సుఖాలూ అనుభవిస్తుంటాము. ఎన్నో అన్యాయాలు అక్రమాలు జరుగుతున్నట్టు చూస్తుంటాము. అవన్నీ ఆ చూస్తున్నంత వరకే. మెళకువ వస్తే ఏ అన్యాయమూ లేదు. ఏ అక్రమమూ లేదు. సుఖమూ లేదు. దుఃఖమూ లేదు. మనకు భిన్నంగా ఏదీ లేదు. చూచిందంతా మనస్వరూపమే. అలాంటిదే ఇప్పుడీ కనిపించే ప్రపంచమంతా నంటారు అద్వైతులు. ఈ ప్రపంచమూ స్వప్నమే. దీన్ని సృష్టించాడని మనమనుకొనే ఈశ్వరుడూ ఒక స్వప్నమే. ఇవి రెండూ మన కల్పనే. మన మనో భావాలే. ఈ భావ మున్నంత వరకే ఇవి మనకు సత్యంగా భాసిస్తుంటాయి. జన్మ జన్మలూ మనలను వెంటాడు తుంటాయి. వేధిస్తుంటాయి. దానితో ఈ సృష్టి అంతా ఎంతో అన్యాయంగా అక్రమంగా తోస్తుంటుంది. ఈ స్వప్నం నుంచి కూడా ఎప్పుడు ప్రబోధం కలుగుతుందో అప్పుడిదికూడా ప్రతి దినమూ మనం చూచే స్వప్న దృశ్యం లాగే ఎక్కడి కక్కడ విరిసి పోతుంది. జగత్తనే భావమూ లేదు. ఈశ్వరుడనే భావమూ లేదు. అవి రెండూ మనకు విలక్షణంగా ఎక్కడా లేవు. మనస్వరూపమే ననే ప్రత్యభిజ్ఞ కలుగుతుంది. అది ఎప్పుడు కలిగిందో ఇక అన్యాయా లేమిటి. అక్రమా లేమిటి. అలాంటి ప్రశ్నే తల ఎత్తదు. ప్రశ్నే లేదు గనుక పరిష్కరించే ప్రయత్నమంత కన్నా లేదు. ప్రయత్నమంతా ఆ ఈశ్వర ప్రత్యభిజ్ఞ నార్జించటమే. ఇదీ అద్వైతి చేసే పరిష్కారం. ఇదే అసలైన పరిష్కారం కూడా.

ఇదుగో ఇలాంటి ప్రత్యభిజ్ఞా రూపమైన పరిష్కారాన్ని అంత ఎత్తుల కెదిగి అందుకో గలిగాడీ మహా కవి. అది ఒక్కటే జీవిత సమస్య లన్నిటికీ పరిష్కారమని తేల్చుకొన్నాడు. జీవిత సమస్యలే కాదు. అటు జీవిత సమస్యకూ ఇటు దానికి ప్రతిరూపమైన కావ్య జీవిత సమస్యకూ కూడా అదే పరిష్కారమనే రహస్యాన్ని గుర్తించాడు. ఈ అవగాహనతోనే ఈ సమన్వయ దృష్టితోనే సాగించాడిక తన సాహిత్య సౌధ నిర్మాణ మంతా. కవి దృష్టిని బట్టే

కావ్య సృష్టి. దృష్టి భావయిత్రి - సృష్టి కారయిత్రి. యథాస్మై రోచతే విశ్వం - తథేదం పరివర్తతే. కావ్యమనే జగత్తుకు కవే ప్రజాపతి. ఆ బ్రహ్మ ఈ భౌతిక జగత్తును తన సంకల్పంతో ఎలా కల్పించాడో - ఈ కవిబ్రహ్మ కూడా అలాగే కల్పిస్తాడీ కావ్య జగత్తును. ఇరువాగులా దృష్టే మూలకారణం. ఇది ఎంత మహోన్నతంగా ఉండాలో అంత మహోన్నతంగా అలవడింది కాళిదాసుకు. ప్రత్యభిజ్ఞా రూపమైన అద్వైత దృష్టి కంటే మహోన్నతమైన దృష్టి ఏముంది. అందుకే అతడు మహాకవి అయ్యాడు. ద్విత్రాః పంచషా వా అనే అలంకారికుల జాబితాలో చేర గలిగాడు. ఆలంకారికులు విధించిన నిబంధనలు మూడింటికీ ఆయన సంగమ క్షేత్రం. ఏమిటా మూడూ. మొదటనే మనవి చేశాను. ఒకటి ప్రతిభా. మరొకటి వ్యుత్పత్తి. ఇంకొకటి అభ్యాసం. ఇవి నూటికి నూరు పాళ్ళు ఒనగూడిన భాగ్యశాలి కాళిదాసు. నిసర్గ సిద్ధమైన ప్రతిభ ఉందాయనకు. ప్రతి ఒక్క సృష్టి రహస్యమూ భాసించే సామర్థ్యమే ప్రతిభ. పరిపూర్ణాద్వైత దృష్టి ఉన్న ఆ మహా కవి కది ఏమి కొరత. పోతే దానికి మెరుగు పెట్టే లోక శాస్త్ర కావ్యాది పరిజ్ఞాన రూపమైన వ్యుత్పత్తి కూడా ఉంది కావలసినంత. అదే ఇంతవరకూ మన మేకరువు పెడుతూ వచ్చింది. వైయక్తిక సామాజిక విజ్ఞానం మొదలు కొని అద్వైత విజ్ఞానం వరకూ పరచుకొని ఉన్న వ్యుత్పత్తి క్షేత్ర మది.

పోతే నిసర్గ సిద్ధమైన ఆ ప్రతిభకు దోహద కారి అయిన వ్యుత్పత్తిని రచనా రూపంగా బహిర్గతం చేసే అభ్యాస మెలాంటిదో చెప్పుకోవలసి ఉందాయనలో. కావ్యజ్ఞ శిక్షయా భ్యాసః అన్నాడు మమ్మటుడు. నీకెంతైనా ప్రతిభ ఉండవచ్చు. దానికి దీటయిన వ్యుత్పత్తి ఉండ వచ్చు. కాని తగినంత అభ్యాసం లేనంతవరకూ దానికి బలమూ లేదు. అది బహిర్గతమూ కాదు. అంతర్గుడ గుడాయతే - బహిర్వక్తుం నశక్యతే అన్నట్టే ఉంటుంది వ్యవహారం. అంతర్గతం బహిర్గతం కానంత వరకూ ప్రతిభా రాణించదు. వ్యుత్పత్తీ రాణించదు. అభ్యాసమే అన్నీ బయట పెట్టే సాధనం. అభ్యాసమనే నికషోపలం

మీద సానపెట్టే కొద్దీ ప్రకాశిస్తాయి ప్రతిభా వ్యుత్పత్తులు. పరిపాకం కూడా అందుకొంటాయి. ఒక సంగీతమే చూడండి. నాట్యమే చూడండి. ప్రతి రోజూ గంటల కొద్దీ సాధన చేస్తూ పోవలసిందే. సాధన చేయకుంటే ఎంత మహా విద్వాంసుడైనా దెబ్బతింటాడు. గాయకుడికి గొంతు పెగలదు. నర్తకుడికి కాళ్ళూ చేతులాడవు. ఏ విద్య అయినా ఇంతే. అభినవ గుప్తుడు చెప్పినట్టు నిరంతరాను శీలన మావశ్యకం. అప్పుడే మనోదర్పణం మసృణీ కృత మవుతుందన్నా డాయన. ఇది సహృదయుడి కెలాగో కవికీ అలాగే అపరిహార్యం. కాళిదాసిది ఎప్పుడో గ్రహించాడీ కళా రహస్యం. మహా కవులు భావుకులే గాక విమర్శకులు కూడా. అలాంటి విమర్శనా దృష్టి అక్కడక్కడా ఆయన విసరిన కొన్ని సూక్తులలో మన కవగత మవుతూనే ఉంటుంది. శిక్షా విశేష లఘు హస్తతయా నిమేషాత్ - తూణీచకార శర పూరిత వక్త్రరంధ్రాన్. దశరథుడు బాణ విద్యలో ఎంతో శిక్షణ పొందిన వాడట. ఆ అభ్యాస పాటవంతో హస్త లాఘవ మలవడిందాయనకు. ఎంత లాఘవ మంటే వెంట వెంటనే బాణాలు ప్రయోగించి పెద్దపులుల ముఖాల నన్నిటినీ బాణాలతో తూణీరాలుగా మార్చాడట. బాణాలు శబ్దార్థాలయితే తూణీరాలు కావ్య నాటకాలయితే అలాటి ఆ హస్త లాఘవం కల దశరథు డెవరో కాదు. కాళిదాసే అనిపిస్తుంది నాకు.

ఇంతెందుకు. శాకుంతలంలో సూత్రధారు డనే మాటల లోనే కనిపిస్తుందీ కళాసూత్రం మనకంటికి. ఎన్నో మార్లు ప్రదర్శనలనిచ్చి బాగా ఆరితేరిన వారు గదా ఆర్య పుత్రులు. ఎందుకింత ఆరాట పడతారని నటి అడిగితే సూత్రధారు డంటాడు. ఆ పరితోషాత్ విదుషాం - నసాధు మన్యే ప్రయోగ విజ్ఞానం - బలవదపి శిక్షితానాం - ఆత్మ న్యప్రత్యయం చేతః. ఎంత ఆరితేరినా ఎప్పటి కప్పుడది ఒక అగ్ని పరీక్షే. అభిజ్ఞులైన ప్రేక్షకులు మెచ్చే వరకూ అది ఒక శిక్షణ కాదు. అది ఒక పాటవమే కాదు అని సమాధాన మిస్తాడు. పైగా ఇది భూతార్థ మంటాడు. మాళవికాగ్ని మిత్రంలో గణదాసనే నాట్యాచార్యుడి నోటితో మరొక మాటగా చెప్పిస్తా డీ భావాన్నే కవి. వివాదే

దర్శయిష్యంతం - క్రియా సంక్రాంతి మాత్మనః. ఒక సందర్భ మేర్పడినప్పుడు మనకున్న విద్య ప్రదర్శించ లేకపోతే అది ఉండి కూడా ఉపయోగం లేనిదేనట. ఇలాటి విసురులెన్నో విసురుతా డక్కడక్కడా తన రచనలలో మహాకవి. వాటన్నిటి సారాంశమూ ఒక్కటే. ప్రతిభా వ్యుత్పత్తులు కవి పోగు చేసుకొన్న సరకూ సరంజామైతే దానికి వినియోగ మభ్యాస పాటవం.

అయితే ఇందులో ఒక సూక్ష్మ మున్నది. అభ్యాస మొకరి వల్ల ముందు శిక్షణ పొందాలి. ఆ తరువాత దాన్ని పునః పునః కృషిచేసి పాటుకు తెచ్చుకోవాలి. అలా శిక్షణ నందివ్వ గల పెద్దలకే తద్జ్ఞులని పేరు. తద్జ్ఞులంటే దాని సంగతి బాగా తెలిసిన వారు - ఆ విద్యను బాగా జీర్ణించుకొన్న వారని అర్థం. అలాటి పూర్వ పురుషుల దగ్గర శిక్షణ పొందినప్పుడే అది సరియైన మార్గం. దీనినే ఆగమమని సంప్రదాయమని పేర్కొంటారు. ప్రతి విద్యకూ ఉంటుందిలాంటి సంప్రదాయం. సంగీతాని కేమిటి - సాహిత్యానికేమిటి. అన్ని కళలకూ అలాటి సంప్రదాయ ముండితీరాలి. అప్పుడే అది దారి తప్పకుండా ఒడుదుడుకులు లేకుండా ముందుకు సాగిపోతుంది. లక్ష్యాన్ని సాధిస్తుంది. లేకుంటే అడ్డదిడ్డంగా పయనించి అగమ్యంగా పరిణమిస్తుంది. కనుకనే మమ్మటుడు కావ్యజ్ఞ శిక్షయా భ్యాసః అని వాక్రుచ్చింది. కావ్యజ్ఞుడంటే కావ్యమంటే ఏమిటో తెలిసిన వాడు. కావ్యార్థ తత్త్వజ్ఞుడని ధ్వని కారుడు దీన్నే ప్రపంచనం చేశాడు. కావ్యం కాదు. కావ్యార్థమూ కాదు. దానితత్త్వ మొకటి ఉంటుంది. దాన్ని భేదించి పట్టుకొన్న వాడెవడో వాడు కావ్యజ్ఞుడు. అలాంటి పెద్దలే మనకు మార్గం చూప గలరు. స్వయం తీర్ణః పరాం స్తారయతి అన్నారు. వాడుత్తీర్ణుడై ఆ విద్యలో మరొకడిని ఉత్తీర్ణుణ్ణి చేయాలి. అలాటి వారినే తీర్థంకరు లంటారు.

అలా ఉత్తీర్ణులయిన కవితా తీర్థంకరుల దగ్గరే బహు కాలం కృషి చేశాడు కాళిదాసు. సమకాలికులైన గురువు లెవరో మనకు తెలియదు గాని అతనికి పూర్వకాలికు లయిన సాహిత్యాచార్యులు మాత్ర మిద్దరు ముగ్గురే.

శ్రవ్య కావ్య శిక్షణలో ఇద్దరు. దృశ్య కావ్య శిక్షణలో ఒకరిద్దరు. మొదటి వారు వాల్మీకి వ్యాస భగవానులయితే - రెండవ వారు భాస సౌమిల్లకులు. వీరిని కంఠోక్తి గానే పేర్కొన్నా డాయన తన రచనలలో. ఇంతకన్నా ఎక్కువ మంది అసలాయనకు గురుస్థానంలో ఉండటానికి వీలు కూడా లేదు. ఎందుకంటే చారిత్రకంగా చూస్తే కాళిదాసే అసలు చాలా ప్రాచీనుడు. కావ్య కర్తలు గాని నాటక కర్తలు గాని ఆయన తరువాత వచ్చిన వారే చాలా మంది సంస్కృత సాహిత్యంలో. ఆయన సమకాలంలో నా అంత పెద్ద మేధావంతు లుండరు బహుశా. ఉంటే ఆయన లాగా ప్రసిద్ధికి వచ్చి ఉండే వారే. పోతే ఇక ఆయనకు పూర్వులయిన పెద్దలే కొద్దిమందో తక్క అంతకన్నా ఎక్కువ ఉండబోరు. వారే రామాయణ కర్త వాల్మీకి - భారత పురాణ కర్త వేద వ్యాసుడు. వీరిద్దరూ ఆరాధ్య దేవతలు కాళిదాసుకు. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా శుశ్రూష చేశాడు వీరిద్దరికీ యావజ్జీవం. అలాగే నాటక శిల్పంలో మహా శిల్పి అయిన భాస మహా కవిని ఆశ్రయించాడు. సౌమిల్ల కుడెవరో ఏమి వ్రాశాడో తెలియదు గాని భాసుడు మాత్రం ప్రతిభా భాసుడే. ఎన్నో నాటకాలు వ్రాశాడు. అన్ని నాటకాలు వ్రాసిన వాడు సంస్కృతంలో మరొకడు లేడు . అన్నీ ప్రసిద్ధాలే. ప్రతి మేమిటి - ప్రతిజ్ఞా యౌగంధ రాయణ మేమిటి- వాసవదత్తేమిటి - పాంచ రాత్రమేమిటి. దేనికదే ఒక రత్నాపణం.ఈ ఆపణాలలో చేయి పెట్టి ఎంత సరకు కావాలో అంత సంగ్రహించాడు కాళిదాసు. అలాగే వాల్మీకి వ్యాసులను కూడా ఏమరించి ఎంతో సరకు హస్తగతం చేసుకొన్నాడు. కావ్యమెలా వ్రాయాలో వాల్మీకి వద్ద శిక్షణ పొందితే నాటకమెలా తీర్చి దిద్దాలో భాసుని వద్ద పొందాడాయన.

అసలు వ్యాస వాల్మీకులంటే ఎంత గౌరవమో ఆయనకు. ఎంత భక్తి ప్రపత్తులో. కావ్య వస్తువు దగ్గరి నుంచి వారి గ్రంథాల నుంచే కొని తెచ్చుకొన్నాడాయన. ఒక మాళవికాగ్ని మిత్రం తప్ప మిగతా కావ్య నాటక కథలన్నీ వారు సరఫరా చేసినవే. విక్రమోర్వ శీయ కథ వ్యాస భారతం లోనిదే.

Vallamraju Srinivasa Rao www.advaitavedanta.in

శాకుంతలం సరే సరి. ఆది పర్వ కథా వస్తువే. పోతే రఘు వంశం. రామ చరిత మొక్కటీ రామాయణం లోనిదయితే మిగతా దిలీపుడిదగ్గరి నుంచి ఆయా రాజుల కథలు భారతంలోవి కొన్ని. కుమార సంభవ కథ భారతంలో ఉంది. రామాయణంలోనూ ఉంది. మరి మేఘ సందేశం స్వకపోల కల్పితంగా కనిపించినా దానికి కూడా ఆధారం రామాయణమే నంటా రభి యుక్తులు. మల్లి నాథుడే స్పష్టంగా చెప్పాడు రామాయణంలో రాముడు సీతకు హనుమమతుడి ద్వారా పంపిన సందేశాన్ని మనసులో పెట్టుకొని కవి ఈ భావ కావ్యం రచించాడని. రామగిరి చేరిన యక్షు డెవరో కాదు. ఋశ్య మూకంలో ఉన్న రాముడే. ఆకాశంలో పయనించే మేఘు డెవరో కాదు. హనుమంతుడే. మరి అలకాపురంలో దూరంగా ఏకాకిని అయి విరహ వేదన ననుభవిస్తున్న యక్ష కాంత అశోక వనంలో శింశుప క్రింద కాలక్షేపం చేస్తున్న సీతా దేవే. మల్లినాథుడి వరకూ దేనికి. అసలు కవే బయట పెట్టాడీ రహస్యాన్ని వ్యంగ్యంగా ఒకచోట. ఇత్యా ఖ్యాతే పవన తనయం మైథిలీ వో న్ముఖీ సా. ఓ మేఘమా నీవీ సందేశ వాక్యం వినిపిస్తే ఆవిడ నిన్ను జానకి హనుమంతుణ్ణి చూచినట్టుగా చూస్తుంది సుమా అని. ఇలాగా అతని కావ్యాల్లో నాటకాల్లో ఇతి వృత్త మంతా చాలా వరకూ రామాయణ భారతాల లోనిదే. కొంచెం కొరవ సరవ ఏదయినా ఉందంటే అది ఆనాడు దేశంలో ప్రచలితంగా ఉన్న కథ సరిత్సాగరాదులలోని దైనా అయి ఉంటుంది. మాళవికాగ్ని మిత్ర కథా వస్తు వందులోనిదే నంటారు విమర్శకులు. పురావృత్త కోవిదులైన పెద్దలెంతో మంది ఉండే వారాయన సమకాలికులు. అలాటి వారున్నారని కూడా ఆయన మేఘ సందేశంలో వాచా ఉదాహరించాడు. వారివల్ల కూడా కర్ణా కర్ణిగా విన్న విషయాలెన్నో ఉంటాయి కూడా. వాటినే కొన్నిటిని కథా వస్తువుగా చిత్రించి ఉంటాడు. సందేహం లేదు. కథా వస్తువు మాట దేవుడెరుగు. వ్యాస వాల్మీకుల మీద ఎంత గౌరవమంటే తాను రచించిన గ్రంథాలకే కొన్నింటికి వారి గ్రంథాలలో చూచి పేర్లు పెట్టా డాఖరుకు. కుమార సంభవం - రఘువంశమనే కావ్య సంజ్ఞలు వారు సప్లయి చేసినవే. రామాయణం బాలకాండలో వస్తాయీ పేర్లు.

ఒక పేర్లనే కాదు. ముందు పేర్కొన్నట్టు వాల్మీకి కవితా భాండా గారాని కంతటికీ సర్వాధికారి అయ్యాడు కాళిదాసు. ఆయా సన్ని వేశాలే కాదు. వర్ణనలే కాదు. భావాలే కాదు. పద బంధాలే కాదు. సమాసాలే కాదు. రచనా శిల్పమే కాదు. ఆఖరుకు రసోచిత వర్ణ విన్యాసమే కాదు. తుదుము మొదలు దేవతార్చన వరకూ ఆ మహనీయుని అడుగులో అడుగు వేస్తూ నడచిన వాడే కాళిదాసు. దానికి తార్కాణాలు కో కొల్లలు. కథా సన్ని వేశానికి శాకుంతలమే తీసుకొని చూడండి. ఒక మహర్షి పాలనలో పెరిగి ఆయన అనుమోదంతో దుష్యంతుణ్ణి చెట్ట పట్టింది శకుంతల. మధ్యలో ఆయనకు దూరమయి పోయి మరలా ఇంకొక మహర్షి అనుగ్రహంతో తన భర్తను కలుసుకో గలిగింది. కణ్వ మహర్షి పెంచితేనే గదా పెరిగిందావిడ. మరలా కశ్యపు డప్పగిస్తేనే గదా దుష్యంతుని పడయ గలిగింది. ఆలోచిస్తే ఇది సరిగా సీతా వృత్తాంతానికి సరి పడే సన్ని వేశం. విశ్వా మిత్రుడి ధర్మమా అని రాముడు మిథిలకు వచ్చి శివ ధనుర్భంగం చేస్తే రాముని పెండ్లాడ గలిగిందావిడ. విధివశాత్తూ భర్తకు దూరమై చివరకు వాల్మీకి మహర్షి తెచ్చి అప్పగిస్తే భర్తృ దర్శనానికి నోచుకొన్నది. అంతే కాదు. సీత వియోగం భరించ లేక భూమాతను తనలో కలుపు కొమ్మని అడిగినట్టే శకుంతల కూడా ప్రతి మాలుతుంది - భగవతి వసుంధరే దేహి మే వివరం అని. కుశలవుల ద్వారా ఆవిడ భర్తృ వృత్తాంతం తెలుసుకొన్నట్టే భరతుని ద్వారా శకుంతలా గ్రహిస్తుంది దుష్యంతుడు తన్ను సమీపించాడని.

కుమార సంభవంలో కూడా ఇలాటి సంవాదమే మనకు సాక్షాత్కరిస్తుంది. సీత పూర్వ జన్మలో వేదవతి. అలాగే పార్వతి సతీ దేవి. వేదవతి అగ్నిలో దగ్ధమయి తరువాత సీతగా జన్మించింది. సతి యోగాగ్నిలో భస్మమయి మరలా పార్వతిగా ఉదయించింది. ఆవిడ తాను కోరిన విష్ణువునే రాముని రూపంలో వరించింది. ఈవిడ తాను కోరిన ఈశ్వరుణ్ణే తాపసిగా కాక శృంగార పురుషునిగా చూచి పెండ్లాడింది. ఆవిడ దక్షుడి శివదూషణ వినలేక పోయినట్టే ఈవిడా బ్రహ్మ చారి చేసిన పతి దూషణ సహించలేక

పోయింది. ఇలా భావిస్తూ పోతే ఎన్నో ఉన్నాయి రామాయణ సన్నివేశాలతో కాళిదాసు కావ్యాలకు సాదృశ్యాలు.

సన్నివేశాలేమిటి. వర్ణనలు చూస్తే మతి పోతుంది మనకు. అష్టాదశ వర్ణనలూ చేశాడు వాల్మీకి. అదీ తెచ్చి పెట్టు కొన్నట్టు గాక సందర్భాను గుణంగానే సాగింది ప్రతి వర్ణనా. అలాగే కాళిదాసు కావ్యాల్లో కూడా సాగుతుంది. వాల్మీకి ఒక పర్వతాన్ని వర్ణించాడంటే అది సందర్భోచితం. హనుమంతుడు మహేంద్ర పర్వతం మీది నుంచి సముద్ర లంఘనం చేశాడు. మరలా వచ్చి ఆ పర్వతం మీదనే వాలాడు. చేసి తీరాలి పర్వత వర్ణన. అలాగే సముద్రం లంఘించాడంటే సముద్ర వర్ణన తప్పదు. లంకలో ప్రతి సందు గొంది మేడ వాడ గాలించాడంటే పట్టణ వర్ణనా చేయవలసిందే. అలాగే కుమార సంభవంలో హిమవత్పర్వతాన్ని వర్ణించాడంటే కవి - అది ఎంతైనా సమంజసం. రఘువంశంలో పుష్పకంలో తిరిగి వచ్చేటపుడు ఆయా పట్టణాలు నదులు సముద్రాలు వర్ణించాడంటే అదీ అలాంటిదే. పోతే ఇవన్నీ ఒక ఎత్తైతే ఋతువర్ణన ఒక ఎత్తు. వాల్మీకికి కిష్కింధలో సమయం దొరికింది ఆయా ఋతువులను వర్ణించటానికి. అంతవరకెక్కడా లేదు. అరణ్యలో మాత్రం హేమంత శిశిరాలను వర్ణించాడు. కిష్కింధలో వర్ష శరత్తులను వర్ణించాడు. పోతే సుందరలో వసంతాన్ని బ్రహ్మాండంగా వర్ణిస్తాడు అన్నీ సందర్భోచితమే. రాముని విరహ దశలో జరిగి పోయాయి చాలా వరకు. మరి ఆ వర్ణన లంటారా అవి అతి లోకం. ఎంత అతిలోక మంటే కాళిదాసు వాటికి మంత్రముగ్ధుడై మరలా పనిగట్టుకొని ఒక ఖండకావ్యమే వ్రాశాడు ఋతు సంహార మని. అది ఆయా దేశభాషలలో ఎన్నో ఋతుసంహారాల విహారానికి దారి చూపింది. అసలు రఘువంశంలో వసంత గ్రీష్మలకూ - కుమార సంభవంలో అకాల వసంతానికీ - తరువాత అమ్మవారి తపశ్చర్యలో గ్రీష్మ వర్ష శిశిర హేమంతాలకూ ఎంతో అవకాశం లభించింది కవి విశృంఖలంగా వర్ణన సాగించటానికి. ఇదంతా వాల్మీకి మహర్షి చలువే. అంతేకాదు. ఈ వర్ణనలలో కూడా చేతన వర్ణనలో

www.advaitavedanta.in

అచేతన వ్యవహారం - అచేతన వర్ణనలో చేతన వ్యవహారం వట్టుకు రావట మొక అందం. ఇలాటి అంద చందాలు కూడా వాల్మీకి నేర్పిన పాఠాలే కాళిదాసుకు.

ఇక పాత్రల మనోభావాలు బయట పెట్టటంలో ఎన్ని మెళకువ లున్నవో లోతుకు దిగి చూచి చెప్పే శక్తి కూడా మహర్షి ప్రసాదమే. ఆయన రచన - ఆయన సమాస గుంభన - పద ప్రయోగం - వాక్య ప్రయోగం ఒకటేమిటి. ప్రతి ఒక్కటీ బీరు పోకుండా అనుకరిస్తాడు కాళిదాసు. స్నిగ్ధ గంభీర నిర్ఘోష మంటే స్నిగ్ధ గంభీర నిర్ఘోష మనే అంటాడు. జరా జర్జరిత మంటే జరా జర్జరితమే నంటాడు. శీర్ణ కేసర మంటే శీర్ణ కేసర మంటాడు. సుఖ స్పర్శమంటే సుఖ స్పర్శ మంటాడు. పశ్యన్ యయౌ అంటే పశ్యన్ యయౌ అనే అంటాడు. ఎక్కడ ఏ పదం వాడాలో ఏ సమాస మెంత వరకు లాగాలో ఏ వాక్య మెక్కడికి తేవాలో - ఏ వృత్త మెంత నిసర్గ సుందరంగా నడపాలో ఎక్కడ అవరోహణారోహణాత్మకంగా సాగాలో ఎక్కడ ఉల్బణంగా ఎక్కడ సౌమ్యంగా పయనించాలో - అన్ని రచనా రహస్యాలూ గురువుగా రెలా పలికితే అలా పలికాడు శిష్యుడు. అన్నిటి కన్నా గొప్పది గురువు గారి అక్షర శిల్పం. అది వాల్మీకి ఎంత కూడ బెడితే అంత కొల్లగొట్టాడీ గడుసరి శిష్యుడు. ఒక స్త్రీ కనులెంత విశాలమో నని చూపటానికి విశాలే విమలే నేత్రే అని తరుచు ఏకారాలు ప్రయోగిస్తాడు మహర్షి. ఒక నక్షత్ర మెంత తళతళ మంటున్నదో చూపటానికి తారాభి రభిరామాభి రుదితాభిః అని వరుసగా భకారాలు వాడుతాడు. ఒక యుద్ధమెంత భయంకరంగా సాగిందో తెలపటానికి రరాస భూమి ర్నతతాప భానుమాన్ - వవౌ న వాయుః ప్రచచాల చాచలః - రరా తత వవ అని అక్షర మావృత్తం చేస్తాడు. అఖరుకు తోక నేల మీద కొడితే అస్ఫోట యామాస అని దెబ్బ వినిపిస్తాడు. ముద్దు పెడితే చుచుంబ అని ముద్దుగా వినిపిస్తాడు.

ఇలాటి ముద్దు ముచ్చటలన్నీ ఆయన అంతేవాసి అయిన కాళిదాసూ ఒలక బోస్తాడు మన ముందు కావలసి నన్ని. హిమాలయో నామ నగాధి రాజః అని గురులఘువులు మార్చి మార్చి ప్రయోగించాడన్నా - యం యం వ్యతీయాయ సన భూమి పాలః అని అక్షరాభ్యాసం చేశాడన్నా - గత్యుత్కంపా దలక పతితైః అని మాటను మండ లాగా పట్టి విడిచాడన్నా - ఆ రసాతల మూలాత్తని శబ్దాన్ని క్రింది నుంచి పైకి లాగుతున్నాడన్నా - సచామరే దేవ మసేవి షాతాం మనిఇటు అటు ఒయ్యారంగా కదిలిస్తున్నాడన్నా - ఆయా భావలను అక్షర విన్యాసంతోనే ఆయన మన కనుల ముందు సాక్షాత్కరింప జేయటానికే. ఇలాంటి వెన్ని ఉన్నాయో మెళకువలు లెక్కలేదు. చెప్పాను గా ముందే ధ్వనికారుడు సెలవిచ్చినట్టు వర్ణం దగ్గరి నుంచి ప్రబంధం వరకూ గురువు గారి పోకడ లన్నీ పుడికి పుచ్చుకొన్న వాడీమహా కవి. అసలు సంస్కృతం సంస్కృతంగా వాడాలంటే - వాడి మెప్పించాలంటే దాని సంప్రదాయ మేమిటో దాని సారళ్య మేమిటో నూటికి నూరు పాళ్ళు తెలిసి ఉండాలి. దీనినే భాషాధికార మంటారు. అది మహర్షుల పాలిటి సొమ్ము. వ్యాస వాల్మీకులను చదువుతున్నప్పుడే మనం సంస్కృతం చదువుతున్నా మనిపిస్తుంటుంది. మరెవ్వరి రచనలు చదివినా ఆ భావం మనసుకు రాదు. గురికి బారెడు మూరెడు ఎడంగా పోతుందది సంస్కృతానికి. వ్యాస వాల్మీకుల తరువాత మరలా అలాటి సాంప్రదాయిక మైన సంస్కృతాన్ని నిల బెట్టిన కీర్తి కాళిదాసు కొక్కడికే దక్కింది. అంతటి ప్రగాఢమైన దాయన వారికి చేసిన సేవ.

కనుకనే కవులంటే పండితులంటే వ్యాస వాల్మీకులు తప్ప మరెవరూ కారని పాఠక లోకానికి గొంతెత్తి చాటుతాడు. అదీ వ్యంగ్యంగా ఒక చోటా - వాచ్యంగా ఒకచోటా - రక రకాలుగా చాటాడు. మందః కవి యశః ప్రార్థీ. నేను చాలా మూఢుడను. తను వాగ్విభవః. నా వాగ్వైభవం కూడా చెప్పుకో దగి నంతటిది కాదు. అయినా పెద్దల కీర్తి ప్రతిష్ఠ లపహరించాలని ఆశ పడుతున్నాను. ఇది లోకంలో నవ్వుల పాలు కావటానికే. అయినా నాకొక

ధైర్యముంది. కృత వాగ్ద్వారే వంశేస్మిన్ పూర్వ సూరిభిః. ఆ మహాను భావులిద్దరూ వేసిన రాచబాట ఎలాగూ ఉందీ వాఙ్మయా రణ్యంలో. నేనందులో సూది బెజ్జంలో దారంలాగా అవలీలగా సాగి పోగల నని ఎంతో వినయంగా చెప్పుకొంటాడు. అసలు కవి శబ్ద వాచ్యుడొక్క వాల్మీకే గాని మరెవడూ లేడన్నట్టుగా మాటి మాటికి కవి కవి అని సంబోధిస్తాడా మహర్షిని. కవిః కుశేధ్మా హరణాయ యాతః - కవిః కారుణికో వవ్రే. రాముని కొలువులో కుశలవులు గానం చేసి దానికి సభాసదులు ముగ్ధులై తలలూపితే - ఊపక ఏమి చేస్తారు. వృత్తం రామస్య - ఇతి వృత్త మెవరిది. శ్రీరామునిది గదా. వాల్మీకేః కృతిః - అది కావ్యంగా రచించిన వాడెవరు. వాల్మీకి మహర్షి గదా అని సగర్వంగా చాటుతాడు. ఏమ౦త గొప్పవాడా ఆ కవి అని అడిగితే ఏమనుకొన్నారా కవి అంటే. నిషాద విద్ధాండజ దర్శనోత్థః - శ్లోకత్వ మాపద్యత యస్య శోకః - ఆయన శోకించినా అది శ్లోకమే. అలాంటి దాయన రచన అని నిర్లక్ష్యంగా జవాబిస్తాడు. ఎలాంటి గురుభక్తో చూడండా శిష్యుడికి. మనమంతా కాళిదాసంత మహాకవి లేడని పొగడుతుంటే - ఆయన నాదేముంది మా గురువు గారి ముందు నేనెంత వాడ నంటాడు మనతో.

అంతా గురువులదే అయితే ఇక కాళిదాసు దేముంది. ఆయన సరుకంటూ ఏమీ లేదా. ఏమీ లేనప్పుడాయన నింత గొప్పగా మనం చెప్పుకోవటం దేనికి. ఆయన రచనల నింతగా మనం నెత్తిన పెట్టుకోవటం దేనికని ప్రశ్న వస్తుంది. అక్కడే ఉంది ఒక మహాద్భుతం. కాళిదాసు వాల్మీకి ప్రభృతుల నెందరి నాశ్రయించినా వారి వల్ల ఎంత ఆస్తి గడించినా అది కేవలం పిత్రార్జితం లాంటిది. లోకంలో పిత్రార్జిత మనేది మనకెంతో కొంత సంక్రమించ వచ్చు. చేతగాని వాడంతటితోనే తృప్తి పడి కాలక్షేపం చేస్తాడు. ఇంకా చేతగాని వాడైతే అదికూడా పోగొట్టుకొని దివాలా తీస్తాడు. అదే తెలివైన వాడయితే దాని కినుమిక్కిలిగా సంపాదించి పేరు ప్రఖ్యాతులతో బ్రతుకుతాడు. పది వేలు తండ్రి ఇచ్చిపోతే దానిని మూలధనంగా పెట్టుకొని దానిమీద లక్షలు

కోట్లు గడించి కోటీశ్వరుడవుతా డొక్కొక్కడు. అప్పుడు వాడి పిత్రార్జిత మెంతో స్వార్జిత మెంతో నీవు చెప్పగలవా. పిత్రార్జితం పదిపాళ్ళయితే స్వార్జితం తొంబది పాళ్ళు పెరిగి పోయి దీనిలో అది ఏ మూలనో లీనమై పోతుంది. కనిపించనే కనిపించదు కంటికి. అంతో ఇంతో పూర్వుల ఆస్తి మనకు లభించ వచ్చు. అంత మాత్రాన అదే సర్వస్వం కాదు. ముడి సరుకు లాంటిదది. గనిలో నుంచి వచ్చిన రత్న మెంత విలువైన దైనా దానికి మెరుగు పెడితేనే ప్రకాశించేది. ఊరక సరకు దగ్గర ఉంచుకొని ఏమి ప్రయోజనం. సరకు ప్రకృతి జన్యమైనా ప్రయత్నం దానికి సంస్కారాన్ని ఆపాదిస్తుంది. అమాటకు వస్తే ఏకవికీ సొంత ఆస్తి అంటూ లేదు. అసలు సొంతదారు విశ్వకవి అయిన పరమాత్మ. ఆయన సొంతమీ సృష్టి అనే మహాకావ్యం. ఇక ఏ కవి కావ్యం రచించినా దీన్ని చూచి రచించ వలసిన వాడే. సామగ్రి ఇక్కడి నుంచి రావలసినదే. అలాంటప్పుడు ప్రాచేతసాదులు మహా కవులెలా అయ్యారు. ముడి సరుకును ముగ్ధ మనోహరంగా తీర్చి దిద్దటం వల్ల. దృష్టపూర్వా అపి హ్యర్థాః - పునర్నవా ఇవా భాంతి - అని ఆనందవర్ధనుడు చాటాడంటే ఈ భావంతోనే చాటాడు లోకానికి. కాబట్టి ఒక వాల్మీకి అయినా కాళిదాసైనా మహా కవులయ్యా రంటే సామగ్రి వల్లనని కాదు. ఆ సామగ్రి నెంత పరిగ్రహించాలో ఎలా మలుచుకోవాలో - ఎప్పుడెక్కడ ఎలా ప్రదర్శించాలో ఎంత తళుకు బెళుకులతో దాన్ని తీర్చి దిద్దాలో - సర్వాంగ సుందరంగా దానిని భావుకుల అంతరంగాని కెలా హత్తుకొనేలా చేయాలో - అలాటి ప్రతిభా సంపద వల్ల. ఇదుగో ఇలాటి ప్రతిభా సంపన్నుడు కాళిదాసు. కనుకనే ఒక వ్యాసుని అనుకరించినా ఒక వాల్మీకిని ఆశ్రయించినా ఆయన అంధ గోలాంగూల న్యాయంగా వెంట బడి పోయిన వాడు కాడు. వారి వల్ల ఎంత వరకో అంత వరకే. అది పది భాగాలయితే మిగతా తొంబది భాగాలు ఆయన సొంతం. బంగారం పాతదే. కాని రకరకాలుగా చేయించుకొన్న సొమ్ములన్నీ ఆయనవే. అవి వాల్మీకి దగ్గరా దొరకవు. వ్యాసుని దగ్గరా దొరకవు మనకు. మహా అయితే ఒక మహా మేధావి అయిన శిష్య రత్నాన్ని తయారు చేసిన సత్కీర్తి సంపాదించారా మహర్షులు.

ఇది కాళిదాసే భంగ్యతరంగా బయటపెడతా డక్కడక్కడా పాత్రల మీద నెపం పెట్టి. మాళవికాగ్నిమిత్రంలో గణ దాసనే నాట్యాచార్యుడు తన శిష్యురాలు మాళవిక నైపుణ్యాన్ని మెచ్చుకొంటూ అంటాడు. యద్యత్ ప్రయోగ విషయే భావిక ముపదిశ్యతే మయా తస్యై - తత్తద్విశేష కరణాత్ ప్రత్యుప దిశతీవ మే బాలా. ఏయే అభినయం నేను నేర్పితే దాన్ని ఇంకా విశేషంగా అభినయించి నాకే ఆవిడ మరలా పాఠం చెబుతున్న దంటాడు. అలాగే మరొక చోట పాత్ర విశేషే న్యస్తం గుణాంతరం వ్రజతి శిల్ప మాధాతుః - తగిన వ్యక్తికి నేర్పిన కళ ఎప్పటికీ వమ్ముగాదు. వమ్ము కాక పోవటమే గాక ఇతోధికంగా ప్రకాశిస్తుంది. వర్ష బిందువు ముత్యపు చిప్పలో పడి అది ముక్తా ఫలమై ప్రకాశించటం లేదా అంటాడు. ఇవి సరిగా కాళిదాసు రచనా విషయంలో మనం చెప్పుకోవలసిన మాటలు. మామూలు జలకణాలు శుక్తిలో పడి విలువైన ముత్యాలుగా మారినట్లు పురాణేతిహాసాల లోని కథ వస్తువే భావాలే కాళిదాసు భావనా శుక్తికలో చేరి అమూల్యమైన కావ్య మౌక్తికాలుగా భాసించాయి. వాల్మీకి వాల్మీకే. కాళిదాసు కాళిదాసే. ఆ మహర్షి కెంత అప్పుపడినా బ్రహ్మాండంగా గడించిన సంపదతో దానినెప్పుడో ఆయనకు తీర్చివేశాడు కాళిదాసు. ఆయన మార్గాన్ని ఎంత అనుసరించినా ఆ వాసన రానీయడు జాడ కనపడ నీయడు మనకు. పదం మొదలు ప్రబంధం వరకూ తనదైన ముద్ర ఒకటి వేసి కాళిదాసు కాళిదాసే అనిపించుకొంటాడు. నా యీ ధోరణి అచ్చమైన కావ్యధోరణి - ఇలాంటిది పురాణేతిహాసాలలో నీకెక్కడ కనపడుతుంది. వేదాభ్యాస జడః కథంను విషయ వ్యావృత్త కౌతూహలః - విజ్ఞానానికి తప్ప సౌందర్యాని కంత ప్రాధాన్య మివ్వరు వారు. అదీ పునః పునః బోధ చేసి మనకు బాధ కలిగిస్తారు. పైగా విషయ ప్రతిపాదనలో కౌతూహలాన్ని పెంచే దృష్టి లేదు వారికి, అలాటి పురాణ రచయిత లెంత మహర్షులయినా కథం నిర్మాతుం ప్రభవే న్మనోహర మిదం రూపం. ఇలాటి రసిక జన మనోహర మైన కావ్య సుందరిని ఎలా తీర్చి దిద్దగలరని ధ్వని గర్భితంగా కూడ తన అభిప్రాయాన్ని అవిష్కరిస్తాడు.

ఆమాటకు వస్తే పురాణ మిత్యేవ నసాధు సర్వం - నచాపి కావ్యం నవ మిత్యవద్యం అని చాటటంలో కూడా పురాణ మనే మాట ప్రాతదని కాక పురాణ వాఙ్మయానికి - కావ్యమనే మాట కావ్యవాఙ్మయానికి స్ఫోరకంగానే వాడినట్టు భాసిస్తుంది నాకు.

ఈ విధంగా కాళిదాసీయమైన ముద్ర శ్రవ్యకావ్యాల లోనే కాదు. దృశ్యకావ్యాలుగా రచించిన ఆయన శాకుంతలాది నాటకాలలోనూ కనిపిస్తుంది. కావ్య నిర్మాణంలో ఆయనకు వాల్మీకి గురువయితే నాటక శిల్పంలో భాసుడు మార్గదర్శకుడు. భాస నాటకాలనెంత జాగ్రత్తగానో పరిశీలించాడు కాళిదాసు. నాటకాంతంహి సాహిత్య మన్నారు. కావ్యం వ్రాయటం వేరు. నాటకం వ్రాయటం వేరు. నాటకం వ్రాసి మెప్పించట మసాధ్యం. దాని కితివృత్త మెలాంటిది తీసుకోవాలి - దానిలో ఎలాటి మార్పులు చేయాలి. ఎన్ని అంకాలుగా విభజించు కోవాలి - ఎక్కడ ఎంత పైకి చెప్పాలి b5Wy కుండా ఎంత పాఠకుడి ఊహకు వదిలేయాలి - ముందు ఏమి జరగ బోతుందో ననే కుతూహల మెలా పెంచుతూ పోవాలి - ముందు వెనుకలు కథలో ఎలా కలుపుకొంటూ పోవాలి - ఎప్పుడేది ఎలా పరామర్శించాలి - ఏది చెప్పినా దానికి కథలో ఎలాటి స్థానముండాలి - అన్నీ కలిసి చివరకొకే గమ్యం వైపు ఎలా పయనించాలి - ఇలాటి నాటక శిల్ప సూత్రాలన్నీ భాసుడనే సూత్రధారుడి వల్లనే గ్రహించాడు కాళిదాసు. ఇంతేకాదు. సంభాషణ లెక్కడ ఎంత మోతాదులో ఉండాలి - ఎంత సరళ సుందరంగా ఉండాలి - మాటకు మాట ఎంత పొందికతో సాగాలి - ఇది కూడా భాసుడు నేర్పిన కళే కాళిదాసుకు. కాగా వర్ణనలనేవి కథా గమనానికి భంగకరం కాకుండా ఎక్కడ ఎంతమాత్రం చేస్తూ పోవాలో ఇది కథ ఇది వర్ణనా అనిపించ కుండా ఎలా కలిసి ప్రవహించాలో కూడా ఆయన గారి శిక్షణే. తుదకు పద్యాలను కూడా ఎక్కడ ఎన్ని వ్రాయాలో వాటి సంఖ్య కూడా నిర్ణయించి ఆయనకు బోధించిన వాడు భాసుడే. మొత్తంమీద ఊరక చదువు కోటానికి గాదు నాటకమంటే -



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

రంగమంచం మీద ప్రదర్శించటానికందులో ప్రతి ఒక్క అంశమూ అనువుగా ఉండాలి సుమా అని హెచ్చరించిన వాడూ ఆయనను భాసుడే. ఆ గురువు చేసిన ప్రతిహిత బోధ తూచా తప్పకుండా పాటించిన వాడూ కాళిదాసే.

అయినా చిత్రమేమంటే ఇంతగా భాసుని అడుగుజాడలో నడుస్తున్నా ఆయన కనులు కప్పి ఎప్పుడు తప్పించుకు పోతాడో - ఎంత దూరం వెళ్ళిపోతాడో కాళిదాసు. అన్ని విద్యలు నేర్పిన ఆ గురువుకు కూడా అంతు పట్టదా పోకడ. కథ వస్తువే గాదు - పాత్ర చిత్రణమే గాదు. భావ ప్రకటనమే గాదు - వర్ణనలే గాదు - పూర్వాపరాను సంధానమే గాదు - పాత్రల సంభాషణాదులే గాదు - రచనా సారళ్యమే గాదు. అన్నిటిలో భాసుని అనుసరిస్తున్నట్టే ఆయన సూత్రాలు పాటిస్తున్నట్టే కనిపిస్తుంది. కాని లోతుకు దిగి చూస్తే భాసుడు భాసుడే. కాళిదాసు కాళిదాసే. సంబంధమే లేదు. ఇంతెందుకు. భాసుని స్వప్న వాసవ దత్తం చూచే రచించాడు శాకుంతలం కాళిదాసు. వాసవదత్తే శకుంతల అనుకోవచ్చు. వత్స రాజే దుష్యంతుడనుకోవచ్చు మనం. కాని ఎవరికి వారే యమునా తీరే. ఏ పాత్ర కాపాత్ర సరిక్రొత్తగా కనిపిస్తుంది. ఎక్కడ ఉందో మర్మం చెప్పలేము. ఒక పరుస వేది వంటిది కాళిదాసు ప్రతిభ. అది సోకితే చాలు. ఎంత సోకితే అంత బంగారమే. అంతకు ముందున్న తామ్రం కనిపించదు. లోహం కనిపించదు మన కంటికి. హైమీ భూత మివాయస మని ఆయనే వ్రుచ్చినట్టు అయస్సు కాదది హైమమే.

అంచేత ఇంతకూ సారాంశ మేమంటే కాళిదాసు కావ్యమార్గంలో వాల్మీకి ననుకరించినా - నాటక రంగంలో భాసుని అనుసరించినా - వారు వారే. ఇత డితడే. కేవలం వారి వద్ద కళా సూత్రాలను మాత్ర మభ్య సించాడాయన. వారి శిక్షణలో పెరిగి పెద్దవాడయ్యాడు. కాని నైసర్గిక మైన ప్రతిభా సంపద ఎప్పుడూ ఉన్న దాయనకు. దానికి వన్నె పెట్టిన వ్యుత్పత్తీ ఉన్నది. కాగా వాటి రెంటినీ ఇంకా పరిపుష్టం చేసి ప్రదర్శించటానికా ఇరువురి పాఠశాలలో కొంత కాలం జీతం లేకుండా పని చేశాడు. అంతమాత్రమే.

అదే అభ్యాసం. ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసాలే సాహిత్య సౌధ నిర్మాణానికి సామగ్రి అని చెప్పాము. అందులో ప్రతి భనేది కవి దృష్టి. దృష్టి మార్గం చూపుతుంది. దానిని బట్టి నడక సాగిస్తే అది అభ్యాసం. నడవటానికి తగిన జవసత్త్వాల లాంటిది వ్యుత్పత్తి అనేది. నడక సత్త్వం మీదనైతే సత్త్వం దృష్టి మీద ఆధార పడుతుంది. కాబట్టి మూడింటిలోనూ దృష్టి సర్వాతిశాయి. కవి దృష్టి ఎంత ఎత్తులకు పోతే వ్యుత్పత్యభ్యాసాలను వాటి కనుగుణంగా అంత మలుచుకొంటూ పోవచ్చు. దరి చూప వలసింది ప్రతిభే. యథాస్మై రోచతే విశ్వం - తథేదం పరివర్తతే. దాని ననుసరించే ఉంటుం దతని కావ్య ప్రపంచ సృష్టి అంతా. ఇలాంటి ప్రతిభ ఏదో కొంత కవులందరికీ ఉంటుంది. ఉండకపోతే వాడు కవే కాదు. కాని అది ఏది ఉండాలో ఎంత ఉండాలో ఉన్నవాడు కాళిదాస మహాకవి ఒక్కడే. అది ఏదో గాదు. అతని శివాద్వైత దృష్టి. దాని వల్ల ఏర్పడిం దతనికి శివ శక్తి సామరస్యం . ఆ దృష్టితో చూస్తే అతనికీ ప్రపంచమంతా శివ శక్తి రూపంగా గోచరించింది. అదే దృష్టి వాఙ్మయ ప్రపంచంలో వాగర్థ రూపంగా భాసించింది. వాగర్థాలే గదా వాఙ్మయమంటే . అందులో వాక్కతనికి శక్తి. అర్థం శివం. శివం సత్యమైతే శక్తి సుందరం . సత్యాన్నే మన మెప్పటికైనా జీవితంలో అర్థించ వలసింది. అది అన్నిటికన్నా గొప్పదైతే పరమార్థం. పరమార్థ మేమిటి జీవితానికి. శుద్ధ బుద్ధ ముక్తమైన ఆత్మ చైతన్యమే. అది ఎప్పుడూ ఉండేది కాబట్టి సత్యం. కాని నిరాకారమైన ఆ సత్యాన్ని అందుకోవాలంటే దాని కాలంబన మొకటి ఉండి తీరాలి. అది ఏదో గాదు. దాని విభూతే. దాని విభూతి దానిలాగా నిరాకారం కాదు. సాకారం. సాకారమే గాక చిత్ర విచిత్రం . కనుక ఇది సుందరం . నిరాకారంలో కనపడని సౌందర్యం సాకారంలో దర్శన మిస్తుంది. బంగారం విలువైనదే కావచ్చు. కాని ముద్దగా చూస్తే అందంలేదు. అదే ఒక కాసుల పేరో ఒక ఒడ్డాణమో అయి కనిపిస్తే సుందరంగా భాసిస్తుంది. ఎంత సుందరమైనా సత్యాన్ని మరలా విడువ రాదది. సత్యం లేని సౌందర్యానికి విలువ లేదు. అది ఇత్తడితో చేసిన ఒడ్డాణం. అలాగే సుందరం కాని సత్యానికి ఆకర్షణ లేదు. అది సొమ్ములు



Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

చేయని సువర్ణం. కాబట్టి సత్య సుందరాలు రెండూ కలిసి ఓత ప్రోతమై ఉండాలి.

ఇది గ్రహించిన మహానుభావుడు కాళిదాసు. ఆయన ఈ ఆధ్యాత్మిక సూత్రాన్ని సాహిత్యాని కద్భుతంగా అన్వయించాడు. అధ్యాత్మ రంగంలో ఏవి శివశక్తులో అవి సాహిత్య రంగంలో వాగర్థాలే. పార్వతీ పరమేశ్వరు లాయనకు వాగార్థాల లాగే కనిపించారు. వాగార్థా వివ సంపృక్తౌ . ఏవో కావవి. సత్య సౌందర్యాలే. సత్యం శివ స్వరూపమైన అర్థం. వాక్కు సౌందర్య రూపమైన శక్తి. పరా రూపమైన శక్తే గదా వైఖరీ రూపమైన ఈ చరాచర ప్రపంచం. ఇది ఆ పరమాత్మ విభూతే గదా. ఇదే సుందరి. అధిభూతాధ్యాత్మా ధి దైవ రూపంగా వ్యాపించిన త్రిపుర సుందరి. ఈ సుందరి ఆ అర్థాన్ని వచించే వాక్కు. ఈ వాక్కునే ఆలంబనం చేసుకొని ఆ పరమార్థాన్ని వెదకి పట్టుకోవాలి సాధకుడు. అప్పుడే జీవిత గమ్యమైన నిశ్రేయసాన్ని అందుకోగలం. అదే మనకు శివం. శివమైన గమ్యాన్ని చేరాలంటే అప్పటికీ సత్య సౌందర్యాల రెండింటి సామరస్యాన్ని భావన చేయాలి మనం. సౌందర్య రూపమైన వాక్కు ద్వారా సత్య రూపమైన అర్థాన్ని భావిస్తూ పోవాలి. అవి ఈ భౌతిక జగత్తు నెలా పాలిస్తున్నవో భావ జగత్తును కూడా అలాగే ఏలుతున్నాయి. స్వరూప విభూతులవి. స్వరూప విభూతులను విడిచి సృష్టే లేదు గనుక భౌతిక జగత్తు కవి మాతా పితరులు. జగ తః పితరౌ వందే అని కవి ఆక్రందన చేశాడంటే దాని అర్థమిదే. భౌతిక సృష్టికంతా జననీ జనకులు పార్వతీ పరమేశ్వరులే. పార్వతి అంటే వాక్కు. అది మరలా సౌందర్యానికి ప్రతీకే. అలాగే పరమేశ్వరుడంటే తద్ద్వారా అన్వేషించ వలసిన స్వరూప భూతమైన అర్థం. అది మరలా సత్యానికి ప్రతీక. వీరిరువురి సామరస్యాన్ని అనగా సత్య సౌందర్యాలను రెంటినీ కలిపి భావిస్తే మనకు లభించేది చివరకు శివమైన మోక్షమే. సత్యం సుందరం శివం. ఆధ్యాత్మిక జగత్తుకు సత్య సుందరాలు

పార్వతీ పరమేశ్వరులైతే వాఙ్మయ జగత్తుకవి వాగర్థాలు. దానికి వారు జననీ జనకులైతే దీనికి వాగార్థాలే జననీ జనకులు. అసలైన అర్థాన్ని అసలైన వాక్కుతో అన్వేషించి పట్టుకోవటమే వాగర్థ ప్రతిపత్తి. అది తప్పకుండా శివానికి దారి తీస్తుంది. అదే కావ్యార్థం కాళిదాసు దృష్టిలో.

పరమార్థమే కావ్యార్థమైతే దాని నందుకోటానికి విస్తరించిన వాగ్వభూతే ఆయన కావ్య నాటక నిర్మాణ మంతా. నా సుందరమైన ఈ వాగ్వభూతి ద్వారా ప్రతీయమాన మౌతున్న ఆ ఏకైక సత్యాన్ని అనుభవానికి తెచ్చుకొని అందులో ఈ సౌందర్యాన్ని ప్రవిలయం చేసుకొని అఖండమైన ఆత్మ స్వరూపంగా దాన్ని పునః పునః అనుసంధానం చేసుకొని ఆనందించమనే ఆయన సందేశం. ఆయన రచనల ద్వారా సహృదయులకు కలగవలసిన ప్రత్యభిజ్ఞ కూడా ఇదే. అది మొదట కవి భావించి సృష్టిస్తేనే సహృదయుడి దృష్టికి వస్తుంది. కవి దృష్టిలో లేనిది మన దృష్టికి రావట మసంభవం. అతిలోకమైన ఇలాటి ప్రత్యభిజ్ఞ కాళిదాసు కాయన అదృష్టం కొద్దీ బహుజన్మార్జిత సంస్కార ఫలంగా ఉదయించింది. అది అపూర్వ వస్తు నిర్మాణ క్షమమైన అతని ప్రతిభగా పరిణమించింది. ఇలాంటి ప్రతిభ ఇతర కవుల కుండాలంటే మరి ఎలా ఉండగలదు. వారిలాటి ప్రత్యభిజ్ఞా హృదయాన్ని హృదయంగమం చేసుకొన్న వారైతే గదా. అంతకు ముందున్న కవులూ ఎరుగరది. తరువాతి వారూ ఎరుగరు. సర్వాతి శాయిని అయిన దృష్టి అది. దానికీ సృష్టి అంతా త్రిపుర సుందరీ విలాస మైతే ఇది ద్యోతనం చేసే సృష్టి కర్త ఆ త్రిపురాంతకుడే. వారిరువురే ఆయన సాహిత్య ప్రపంచమంతా పరుచుకొన్న వాగర్థ సామరస్యం. శివశక్తి సామరస్యం. దాని ద్వారా ఆయన ఆసించిందీ - లోకుల కుపదేశించిందీ జీవ బ్రహ్మైక్య రూపమైన ప్రత్యభిజ్ఞే. దీన్ని తానందుకోటానికి మనకందివ్వటానికి - ఆయన తన ప్రతిభనంతా వినియోగించి మూడు నాటకాలూ మూడూ కావ్యాలూ రచించాడు. ఆ ప్రతిభకు సహచారులు గానే తన వ్యుత్పత్త్యభ్యాసాలు రెండూ ధారపోశాడు. వాక్కును

వాక్కుగా కాక అర్థంతో కలిపి పట్టుకొని ఆ అర్థ మర్థంగా కాక ఆత్మ రూపంగా భావించండి - అదే జీవిత ధ్యేయమని బోధించటమే ఆయన కావ్యరచనా పరమార్థం. తమర్థ మివ భారత్యా - సుతయా యోక్తు మర్హసి. వాక్కునర్థంతో కూర్చినట్టునీ తనయను ఈశ్వరుడితో కూర్చమని సప్తర్షులు హిమవంతునికి సలహా ఇచ్చారంటే అది కవి మనకిస్తున్న సలహాయే. తద్వారా అశోచ్యత్వం హిమవంతుడి కెలా లేదో - భావుకులైన రసజ్ఞులకూ అలాగే ఉండబోదు. ఈ దృశమైన త్రివేణీ సంగమమే కాళిదాస మహాకవి వాణీ స్వరూపం.

Brahmasri Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

# రచనా ప్రత్యభిజ్ఞ

ప్రత్యభిజ్ఞా రూపమైన శివశక్తి సామరస్యమే కాళిదాసు కేర్పడిన అపూర్వమైన దృష్టి అనీ - ఆ దృష్టి కనురూపంగానే ఆయన కావ్య నాటక సృష్టి అంతా జరిగిందనీ - ప్రథమోల్లాసంలో ప్రతిపాదించాము. పోతే ఇలాటి దృష్టి సృష్టి అంతకు ముందుగానీ ఆ తరువాత గానీ ఎవరికీ లేదని కూడా చెప్పుకొన్నాము. వాల్మీక్యాదులైన ఋషులవల్ల - ఋషికల్పుడైన భాసముని వల్ల - ఎంత శిక్షణ పొందినా అది తన ప్రత్యభిజ్ఞా దీక్షను గట్టి చేసుకోటానికే గాని తనకు లేనిదేదో క్రొత్తగా పొందటానికి కాదని మనమర్థం చేసుకోవాలి. తనదృష్టి కనుగుణంగానే తన రచన. వారి దృష్టి కనుగుణంగా కాదు. తన దృష్టి కనుగుణంగా చేస్తూ వచ్చిన రచనకు వారి రచనా పరిశీలనాభ్యాస మాదృష్టిని బలంగా ఆవిష్కరించటానికి దోహదం చేసింది. అంతమాత్రమే.

అంచేత వారి మార్గం వారిది. కాళిదాసు మార్గం కాళిదాసుది. ఎవరి దృష్టి వారిదైనప్పు డెవరి మార్గం కూడా వారిదే గదా. రచనలో కాళిదాసు తన నవీనమైన దృష్టిని బట్టి ఒక నవీనమైన మార్గాన్నే అనుసరించ వలసి వచ్చింది. అందుకే నేమో తన రచనను గూర్చి ఎప్పుడెక్కడ చెప్పవలసి వచ్చినా నవం నవ మనే పేర్కొంటూ వస్తాడు కాళిదాసు. ఈ మాట ప్రతి నాటక ప్రారంభం లోనూ ఆయన నోట రావలసిందే. కాళిదాస గ్రథిత వస్తునా నవేన త్రోటకేన అని పలికిస్తాడు సూత్రధారుడి నోట విక్రమోర్వశీయంలో. అభిజ్ఞాన శాకుంతల నామ ధేయేన నవేన నాటకేన అని చెప్పిస్తాడు శాకుంతలంలో. పోతే మాళవికాగ్ని మిత్రమనే నాటకంలో ఇంకా చిత్రంగా అనిపిస్తాడు. భాస సౌమిల్లకాదులైన ప్రసిద్ధ నాటక రచయిత లెందరో ఉండగా వర్తమాన కవి అయిన ఈ కాళిదాసు నాటకం ప్రయోగిస్తే ఏమి రక్తి కడుతుందని సందేహిస్తుంది నటి. దానికి సమాధాన మిస్తూ సూత్రధారు డిలా మందలిస్తా డావిడను. అయే

Vallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

వివేక విశ్రాంత మభిహితం. పురాణ మిత్యేవ న సాధు సర్వం- నచాపి కావ్యం నవ మిత్యవద్యం. ప్రాతదైన మాత్రాన బంగారం కాదు. క్రొత్తదని చెప్పి త్రోసి వేయ వలసింది కాదు. గుణ దోషాలు వివేచన చేసి ఏది మంచో అది పరిగ్రహిస్తారు పెద్దలు. అవివేకులైన వారొకరు చెప్పిందే వేదమని గొఱ్ఱె దాటుగా వెళ్ళి పోతారు.

ఇక్కడ నవమితి అనటంలో తన ఈ తొలి రచన కూడా విలక్షణ మయినదే నని చాటుతున్నాడు కవి. నవమంటే క్రొత్తదని కూడా కాదు మహాకవి భావం. మిగతా వారి రచన లన్నిటికన్నా విలక్షణ మైన రచన అని. కేవలం క్రొత్తదనే అభిప్రాయమే అయితే అప్పుడే క్రొత్తగా వ్రాసింది మాళవికాగ్ని మిత్రం. కాబట్టి దానిని నవమంటే అనవచ్చు. ఆ తర్వాత వెలువడిన విక్రమోర్వ శీయాన్ని - నిర్భర వయః పరిపాకంలో రచించిన శాకుంతలాన్ని కూడా నవమని పేర్కొనటంలో అర్థంలేదు. మరి వాటిని సైత మలా నిర్దేశించా డంటే అప్పటికి నవమనే మాట ఆయన అపూర్వం అనితర సాధారణ మనే దృష్టిలో ప్రయోగించాడని గ్రహించాలి మనం. ఇది తన నాటకాలలోనే వాడిన మాట అయినా నాటక మాత్ర పర్యవసితం కాదాయన దృష్టిలో. నాటకాలకే గాక శ్రవ్య కావ్యాలుగా రచించిన రఘువంశాది రచనలకు కూడా వర్తిస్తుంది. నచాపి కావ్యమని గదా నిర్దేశించాడాయన. కావ్య మన్నాడే గాని నాటక మనలేదు. కావ్యమంటే అది దృశ్య శ్రవ్య సాధారణ మయిన మాట. తన రెండు విధములైన రచనలూ విలక్షణ మైనవే సుమా అని భావుక లోకాన్ని హెచ్చరించటానికే నాటకంలో కావ్యమనే శబ్ద మాయన ప్రయోగించింది. విక్రమోర్వశీయంలో నైతే క్రియా మిమాం అని క్రియా శబ్దాన్నే ప్రయోగించాడు కాళిదాసు. క్రియా కృతి - ప్రబంధ మంటే పని తనమూ కూర్పూ నని అర్థం. ఏదైనా పనితనమే. ఏదైనా కూర్పే. శ్రవ్యమైనా కావచ్చునది. దృశ్యమైనా కావచ్చు. పనితనమై ఉండాలది - చక్కని కూర్పయి ఉండాలని కవి ఆశయం. కాబట్టి కాళిదాసు చూపిన నవీనత ఆయన రచన లన్నింటిలోనూ పన గలిసిన గుణం.

అయితే ఏమిటా నవీనత - ఇతరు లెవరిలోనూ కానరాని ఆ గుణ మెలాటిదని ప్రశ్న వస్తుంది. అది ఆ మహా కవి దృష్టిలోనూ ఉంది సృష్టిలోనూ ఉంది. దృష్టి ననుసరించే గదా సృష్టి. దృష్టిలో లేనిది సృష్టిలోకి రాదు. మరి కాళిదాసు దృష్టి ఏమిటో ఇంతకు ముందే మనవి చేశాను. శివ శక్తి సామరస్యాత్మక మయిన దృష్టి అది. జీవుడు శివస్వరూపుడే మొదట. శక్తి ఎప్పుడూ అతని కధీనమే. కాని అవిద్యా దోషం వల్ల తన స్వరూపాన్ని తాను మరచి పోయాడు. తన్నిమిత్తంగా తన శక్తికే తాను దూరమై దేవుడు శాపగ్రస్తుడైన జీవుడయ్యాడు. మరలా కొంత కాలానికి దైవికంగా తన సుకృతం ఫలించి దాన్ని చేర్చే ఏదో ఒక ఆలంబనం దొరుకుతుంది. తన్మూలంగా జ్ఞానోదయమై కోలుపోయిన తన శక్తిని తాను మరలా సాధించి పూర్వ సిద్ధమైన తన ఈశ్వరత్వాన్ని తా నందుకొంటాడు. ఇదీ సంగ్రహంగా చెబితే కాళిదాసు దృష్టిలో ఉన్న నవీనత. ఈ దృష్టి రచనగా మారటమే సృష్టి. మరి రచనగా మరాలంటే దానికనుగుణంగానే సాగాలి రచన. ఏ మాత్ర మిటూ అటూ బెసక రాదు. అడుగడుగునా ఆ దృష్టిని మనకు స్ఫురింప జేస్తూ పకడ్బందీగా సాగాలి. అప్పుడే అది రచన అనిపించు కొనేది. రచన అంటే కూర్పని గదా అర్థం. దృష్టి కనుగుణమైన సామగ్రిని కూర్చుకోట మన్నమాట.

సామగ్రి అనేది కథ వస్తువు కావచ్చు. పాత్రలు కావచ్చు. రసభావాలు కావచ్చు . అసలివి మూడే ఏ కావ్యానికైనా సామగ్రి. మరొకటి లేదు. కారణం జీవితానికి ప్రతిబింబమే కావ్యమంటే. జీవితంలో మనకు కనిపించే వివి మూడే. మన జీవితమే ఒక కథ. దీనిని గడుపుతున్న మనమే పాత్రలం. పోతే మన మనోభావాలే భావాలు. మన సుఖ దుఃఖాద్యనుభవమే రసానుభవం. ఇంతకన్నా ఏముంది జీవితం. అందుకే కావ్య జీవితంలో కూడా ఇంతకన్నా ఏదీ లేదని చెప్పటం. కాగా ఈ భౌతిక జీవితం మన దృష్టిని బట్టే ఎలా నడుస్తూ పోతుందో అలాగే కావ్య జీవితం కూడా కవి దృష్టిని బట్టే నడుస్తుంది. కవి దృష్టి ఏదో వర్ణించి చెప్పాము. పోతే దాని కనుగుణంగా సాగిన ఆయన కావ్య రచన మన

మిప్పుడు నిరూపించ వలసి ఉంది. కథ పాత్ర రస భావాలే గదా రచనా సామగ్రి అని పేర్కొన్నాము. ఈ సామగ్రి ఎలాంటిదయి ఉండాలని చెబుతున్నాడో విందాము కాళిదాసు. ప్రణయిషు వా దాక్షిణ్యాత్ అథవా సద్వస్తు పురుష బహుమానాత్ . ఇది విక్రమోర్వశీయారంభంలో ఆయన సెలవిచ్చిన రచనా సూత్రం. నీవే రచన చేసినా అందులో వస్తువు గాని పాత్రలు గాని సద్వస్తువు సత్పాత్రలయి ఉండాలట. సద్వస్తు వేది ఈ సృష్టిలో. శివ శక్తి తత్త్వాలు రెండే. అవి మరలా రెండు గావు ఒకటే. అదే శివ శక్తి సామరస్య మంటే. దీనిని గుర్తించటమే ప్రత్యభిజ్ఞ. అది మన అవిద్యా దోషం వల్ల కప్పబడింది. తామసీ వృత్తి అని కవి మాళవికాగ్ని మిత్రంలో వర్ణించిందదే. ఆ వృత్తి నివృత్తి అయితే గాని సన్మార్గాలోకానికి నోచుకో లేడీ మానవుడు. నివృత్తి కావాలంటే నేనా ఈశ్వరుడననే ప్రత్యభిజ్ఞా ఏర్పడాలి. ఈశ్వర వివర్తమే జీవుడు. శక్తి వివర్తమే జగత్తు. వివర్త రూపంగా ఇవి తత్త్వానికి దూరం చేసి బాధిస్తున్నాయి మనలను. మరలా నేనీశ్వరుడనే అనే ప్రత్యభిజ్ఞ ఎప్పు డుదయించిందో - ఆ బలంతో జీవు డీశ్వరు డయ్యాడు. కాగానే జగత్తు శక్తి రూపంగా అతణ్ణి ఆశ్రయిస్తుంది. ఇదే నిశ్శ్రేయసం మానవుడికి. ఇందులో శివశక్తి భిన్నంగా చూస్తే సమస్తమూ అసత్తే. తదభిన్నంగా చూస్తే తనతో సహా సకలమూ సత్తే.

ఈ సద్రూపంగా జగత్తునే కాదు. తత్ప్రతిరూపమైన కావ్య జగత్తును కూడా చూడమంటున్నాడు కాళిదాసు. జగత్తులో మనమూ మన జీవితమూ ఎలా శివశక్త్య భిన్నంగా సత్తో - అలాగే కావ్య జగత్తులో కూడా నేను సృష్టించిన కథ వస్తువు పాత్ర వర్గమూ కూడా ఆ అభేద భావనను చాటటానికే సృష్టించాను సుమా. కనుక శృణుత జనా అవధానాత్. నా ఈ రచనలను మీరు సావధానంగా దృష్టి పెట్టి చూడాలి. లేకుంటే కవి హృదయం మీ కంతు పట్టదు. ఇవేవో మిగతా కథల లాంటివే మిగతా కవులు సృష్టించిన పాత్రల లాంటివే నని బోల్తా పడతారు. నా పాత్ర లందరూ ప్రణయులు. ప్రణయిషు వా దాక్షిణ్యాత్. వారు ప్రణయులనే దాక్షిణ్యంతో నైనా పరిశీలించండి నా రచనలు మీరు అని

హెచ్చరిస్తాడు కూడా. ప్రణయమంటే ప్రార్థన కోరట మని అర్థం. కోర వలసిం దేమిటి మనం. మన స్వరూపాన్నే గదా. ఆ స్వరూపం విస్మృతమైన మన శివ శక్తి భావమే. దానికి కవి కల్పించిన ప్రతీకలే పాత్రలన్నీ. అన్నీ అంటే ఎన్నో గా కనిపిస్తున్నా ప్రధాన పాత్రలు రెండే . నాయికా నాయకులు. ఈ భావాన్ని మన బుద్ధులకు నయనం చేసే వారు. వారి కా మార్గంలో సహకరిస్తూ వచ్చిన వారే తతిమా వారందురూ ఆయన కావ్యాలలో. కాగా ఈ నాయకు లందరూ శివతత్త్వాన్ని గుర్తు చేసే ప్రతీకలైతే - నాయిక లందరూ శక్తి తత్త్వానికి సంకేతాలుగా భావించాడు కాళిదాసు. వారిద్దరి యోగ వియోగ పునర్యోగాలను చిత్రిస్తూ పోవటమే కాళిదాసు కథా వస్తువంతా. కథ అంటే అప్పటికి కాళిదాసుకు శివపార్వతుల కథే. నాయికా నాయకులంటే శివ పార్వతులే. రస భావ సంపత్తి అంటే ఆ శివ శక్తుల రెండింటి అవినాభావ సంబంధమే. శాశ్వతా నందాను భవమే. ఇష్కె మిజాజీ ఇష్కె హకీకీ అని సూఫీ మహా కవులు ప్రేమలో రెండంతస్తులు వర్ణిస్తారు. మొదటిది భౌతికం. రెండవది తాత్త్వికం. భౌతికంగా ఏదైనా వర్ణిస్తూ పోయామంటే అది తాత్త్వికానికి స్ఫోరకంగా చేస్తున్న వర్ణనే. ఇది గమక మైతే అది గమ్యం. కాగా దీనిని కేవలం సంకేతంగానే చూచి ఈ సంకేతం ద్వారా ఆ సత్యాన్ని అందుకొని ఆనందించ మంటారు వారు. ఇది కాళిదాసే వారి కందించిన భావమేమో నని కూడా నా కనుమానం. ఎందుకంటే ప్రేమకూ ప్రణయానికీ మారు పేరయిన శృంగారాన్ని ఆ రెండు భూమికలను సోకే లాగా పోషించి రసజ్ఞ లోకానికి ప్రదర్శించిన సవ్యసాచి ప్రాచీన కాలంలో కాళిదా సొక్కడే. ఆయనకే ఉన్న దలాంటి లోకోత్తర మైన భావం. ఆయన నాటకాలలోని నాయకు లెంత వయసు వచ్చినా పైలా పచ్చీసు శృంగార నాయకులుగా కనిపిస్తుంటారు. భౌతికమైన పచ్చి శృంగారమే ప్రదర్శిస్తుంటారు. అర్థం చేసుకోలేక పోతే ఏమిటా ఇంత అశ్లీల మిది చూపటానికేనా కాళిదాసింత నాటకం వ్రాసిందని పిస్తుంది. కాని ఈ భౌతిక వర్ణన వెనకాల లోతుకు దిగితే అంతా ఆధ్యాత్మిక వాతావరణమే నని ఏ భావుకుడికో గాని అంతు పట్టదు. అందుకే కావ్యజ్ఞత కాదు కావ్యార్థ తత్త్వజ్ఞత కావాలని ఆనంద వర్ధను డంతగా

వాపోయాడు. కావ్య సామగ్రి నంతా ఆ తత్త్వానికి ద్యోతకం గానే కూర్చుకొంటూ పోతాడు కవి.

అలా రచన చేసిన వాడే ప్రస్తుతం కాళిదాస మహా కవి కూడా. తనకు సిద్ధించిన ప్రత్యభిజ్ఞా దర్శనాన్ని బయట పెట్టటానికే ఆయన కావ్య రచనా నాటక రచనా కూడా. ప్రతి రచనలో నాయికా నాయకులు శివశక్తి ప్రతీకలే. వారి ప్రేమ కలాప మంతా శివ శక్తి సామరస్యమే. వారు మొదట కలుసుకొంటారు. తర్వాత ఏదో శాపవశాత్తూ విడిపోతారు. మరలా శాప విమోచనమై శాశ్వతంగా కలిసి పోతారు. విడిపోవటానికి అనుచితమైన తమ మోహం కారణమైతే - తిరిగి కలుసుకోటానికి సముచితమైన జ్ఞానోదయం కారణం. మోహం మనః కాలుష్యం వల్ల కలిగితే ఆ కాలుష్యం పశ్చాత్తాపం వల్ల క్షాళిత మౌతుంది. జ్ఞానోదయ మైతే గాని పశ్చాత్తాప మేర్పడదు. జ్ఞానమనేది గురూపదేశం లాంటి ఏదో ఒక అభిజ్ఞానం వల్లగాని ఉదయించదు. అది జ్ఞానానికి దారి తీస్తే జ్ఞానం వల్ల అనుతాప మేర్పడితే అది చిత్తకాలుష్యాన్ని కడిగి వేస్తే - ఆ చిత్త శుద్ధి వల్ల మరలా పునస్సమాగమ సిద్ధి లభిస్తుంది. కాళిదాసు రచించిన కావ్యాలు గాని నాటకాలు గాని ఏవి చూడండి. ఈ దృష్టి వదల కుండా చూస్తే చాలు. ప్రతి కావ్యం లోనూ నాటకం లోనూ ఈ ప్రక్రియ ప్రిదుల కుండా దర్శన మిస్తుంది భావుకుడి మనో నేత్రానికి.

ఇది ఆ మహా కవి తన శ్రవ్య కావ్యాలలో ఎలా ప్రపంచించాడో మొదట పరిశీలించి చూద్దాము. శ్రవ్య కావ్యా లాయన రచించినవి మనకు తెలిసి మూడే మూడు. కుమార సంభవం - రఘువంశం - మేఘదూతం. మూడూ వాల్మీకి రామాయణ స్ఫూర్తితోనే రచించాడని ఇంతకు పూర్వమే సూచించాను. అయితే అది స్ఫూర్తి మాత్రమే. ఎంత స్ఫూర్తి అయినా కాళిదాసు దృష్టి వేరు. ఆయన కావ్య సృష్టి వేరు. తన దృష్టి బలంగా తన సృష్టిలో ముద్రితం కావాలంటే అది రామాయణం లాగా భారతం లాగా ఒక ఇతిహాస ధోరణిలో నడవ రాదు. అచ్చమైన కావ్య ధోరణిలోనే సాగాలి. ఇతిహాసంలో వస్త్వైక్య మనేది ఉండదు.

Yallamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ప్రధాన కథ ఒకటున్నా దాని కానుషంగికమైన కథలు సవాలక్ష వస్తాయి. అవి వచ్చీ పోయి ప్రధానేతి వృత్తమంతగా విస్తరించి దాన్ని కప్పి వేస్తాయి కూడా. శాఖోప శాఖాత్మకంగా పరుచుకొన్న ఈ వస్తు నానాత్వం లో మనం కవి వివక్షితమైన కావ్యార్థ మేదో వెతుకుకో వలసి వస్తుంది. వెతకినా అంతగా మనసుకు స్ఫురించక పోవచ్చు. పట్టుక పోవచ్చు. రామాయణంలో - అంతకన్నా మహా భారతంలో - ఇది బాగా హెచ్చుగా కనిపిస్తుంది. ఎన్నో కథలు ఎన్నో సన్నివేశాలు చుట్టూ మఱ్ఱి ఊడల్లాగా దిగి మధ్యలో దాగిన కథ అనే మ్రాను మనకు కనపడ నీయవు. అంతే కాదు. కథా మధ్యంలో తరుచుగా ధర్మోపదేశాలు - నీతి బోధలు - తత్త్వ బోధలు విపరీతంగా చోటు చేసు కొంటాయి. వర్ణనలు కూడా ఎక్కువగా సాగుతాయి. ఇవన్నీ కథా ప్రవాహాని కానకట్టలలాగా అడ్డు తగులుతాయి . దానివల్ల పూర్వాపరాను సంధాన మేర్పడటం కష్టం భావుకుడికి. అంతే కాదు. ఆయా విషయాలు వర్ణించటంలో విషయ ప్రతిపాదనలో ఎంతో విస్తృతి పునరుక్తీ కూడా దొరలటం చూస్తామీ ఇతిహాసాల్లో పురాణాల్లో. పురాణాలితిహాసాల కంటే ఈ విషయంలో ఇంకా ముదురు పాకాన పడ్డాయి. భావుకుడి మనసు నవి కథనుంచి ఎన్నో మైళ్ల దూరం లాగుకొని పోయి ఏ అరణ్య మధ్యంలోనో వదిలేస్తాయి. అక్కడి నుంచి వాడు మళ్ళీ దారి వెదుక్కొంటూ రావాలి అసలు చోటికి.

ఇలాటి ఈతి బాధలన్నీ బాగా గమనించాడు కాళిదాసు పురాణేతి హాస వాఙ్మయంలో. అది తన ఆశయాన్ని పరిపూర్ణంగా ధ్వనింప జేయటానికి పనికి వచ్చే సాధనం కాదని భావించాడు. కనుకనే రామాయణాదుల వల్ల కవితా మార్గంలో అభ్యాసం కావించినా తన ఆశయాన్ని ఆవిష్కరించటానికి ప్రాచీనమైన బాణికి స్వస్తి చెప్పి నవీనమైన మరొక బాణిని స్వీకరించాడు. అదే కావ్య బాణి. కావ్యమన్నా ప్రబంధమన్నా ఒక్కటే. ప్రబంధమనే మాట చాలా చక్కని మాట. ప్రకృష్టమైన బంధమేదో అది ప్రబంధం. చక్కని కూర్పు. చక్కని చిక్కని కూడా. కథా వస్తువును చిక్కగా కూర్చాలి. అప్పుడే అది చక్కగా

Vallamraju Srinivasa Rao
www.advaitaveda.in

కూడా ఉంటుంది. చిక్కదన మెలా వస్తుంది కథలో. ఒకే ఒక నాయికా నాయకుల చుట్టూ తిరుగుతున్నప్పుడు. మిగతావి ఏవైనా వారి చుట్టే తిరుగుతూ వారికి దూరంగా పోనప్పుడు. దీనినే వస్త్వైక్య మంటారు. ఇలాటి వస్త్వైక్యం చూచుకొన్నాడు మొదట కాళిదాసు తన కావ్యాలలో. ఆ మాటకు వస్తే ఆయన రఘువంశంలో ఇతి హాస ఫక్కీని ప్రదర్శించాడు. కుమారసంభవంలో కావ్య ఫక్కీని చూపాడు. మేఘ దూతంలో గేయ ధోరణి ననుసరించాడు. ఇప్పుడు ఆంగ్ల సాహిత్యంలో వినిపించే ఎపిక్ - క్లాసిక్ - లిరిక్ అనే మూడు శాఖలకూ ఇవి జవాబు చెబుతాయి. చూడబోతే మూడు మార్గాలలో తనకు సమానమైన నైపుణ్య ముందని చూపటానికి చేశాడా ఈ మూడు రచనలు అనిపిస్తుంది. కాని చమత్కార మేమంటే ఆయన ఈ మూడింటిలోనూ కావ్య లక్షణమైన వస్త్వైక్య సూత్రాన్ని విడిచి పెట్టక పోవటం. మేఘ సందేశంలో యక్షుడు యక్ష కాంత - వీరిరువురి మధ్య రాయబారం నడప వలసిన మేఘ దూత - వీరి కథే. వీరి వర్ణనే. మరొక సన్నివేశమే లేదు. అలాగే కుమార సంభవంలో పార్వతీ పరమేశ్వరులు- వారి యోగ వియోగ వృత్తాంతమే. మధ్యలో తారకాదుల వృత్తాంతాలు వచ్చినా దాని కనుబంధాలే. కాబట్టి రెండూ వస్త్వైక్య మున్న కావ్యాలే నంటే సరిపోతుంది. కాని రఘువంశంలో వస్త్వైక్యమెలా చూపగలమని కొందరి సందేహం.

వాస్తవంలో అక్కడా ఉంది వస్త్వైక్యం . రఘువంశమని పేరు పెట్టటంలోనే ధ్వనిస్తుందది. వంశ చరిత్రే గాని అది వ్యక్తుల చరిత్ర కాదు. వంశ లక్షణాలకు వ్యక్తు లందరూ కేవలం ప్రతీకలు. వారందరిలో కవి ఒకే ఒక వంశవైభవాన్ని నిరూపించ దలచాడు. కనుకనే రఘూణా మన్వయం వక్ష్యే. రఘువంశజుల వంశాన్ని కావ్య రూపంగా వర్ణిస్తా నన్నాడు గాని తద్వంశీయులైన దిలీపాది రాజన్యుల నని అనలేదు. అల్లాగైతే దిలీప చరిత్ర అనో రఘు చరిత్ర అనో రామ చరిత్ర అనో నామ కరణం చేసేవాడు. అన్వయమనే మాట ఇక్కడ ఎంతో అన్వర్థమైన మాట. అన్వయమంటే ఆ వంశ లక్షణాలన్నీ ఆ రాజన్య

లందరిలో అన్వయించి ఉన్నాయని భావం. అందరిలోనూ ఆ లక్షణాలే ఉన్నాయి గనుక ఎందరి చరిత్రలు వర్ణించినా ఆ చరిత్రలన్నీ కలిసి ఒకే చరిత్రగా భాసిస్తాయి సహృదయుడికి. ఇదే అక్కడ వస్త్వైక్యం. నానాత్వంలో ఏకత్వం. ఆ ధ్యేయంతోనే కాళిదాసు మొదట సూర్యవంశజు లందరి గుణాలనూ కలిపి మూకుమ్మడిగా నాలుగైదు శ్లోకాలలో చాలా ఉదాత్తంగా వర్ణిస్తూ పోయాడు. సోహ మాజన్మ శుద్ధానం మొదలు కొని యోగేనాంతే తనుత్యజా మనే వరకూ సాగిన ఈ పరంపరలో మనం నిశితంగా పరిశీలిస్తే ఈ చెప్పిన ఉదాత్తమైన గుణా లొక్కొక్క రాజన్యు డొక్కొక్కటి పుడికి పుచ్చుకొని జన్మించాడా అనిపిస్తుంది. దిలీపుడా నాక రథ వర్త్ముడు- ఆ ఫలోదయ కర్ముడూ అయితే - రఘుమహారా జాసముద్ర క్షితీశుడు త్యాగాయ సంవృతార్థుడూ యథా కామార్చితార్థుడూ. పోతే అజుడు యౌవనే విషయైషీ - యథాకాల ప్రబోధి అనుకొంటే - దశరథుడు సత్యాయ మిత భాషి. మరి రాముడా జన్మ శుద్ధుడు - కుశుడు యశసే విజిగీషువు. ఇలా వంశ గౌరవాన్ని అందరికీ పంచి పెట్టాడు కాళిదాసు. మరి రఘుమహారాజు నైతే ఈ చెప్పిన సకల గుణాలకూ సంగమ క్షేత్రంగా తీర్చి దిద్దాడు. శైశవేభ్యస్త విద్యానామనే ప్రణాళిక కంతా తార్కాణంగా చిత్రించా డాయన జీవితం. మిగతా వారి కథలన్నీ ఇటూ అటూ ఆ రాజు కథా ప్రదీపం చిమ్మిన కిరణ కాంతులే. కనుకనే నేమో తన కావ్యానికి రవివంశ మని గాక రఘువంశమని నామకరణం బుద్ధి పూర్వకంగా చేసినట్లు కనిపిస్తుంది కాళిదాసు.

ఇంతకూ రఘువంశంతో సహా మూడూ కావ్యమార్గంలో సాగిన రచనలే. మూడింటిలోనూ ఉన్నది వస్త్వైక్యమే. వస్త్వైక్యం మీద దృష్టికిక విక్షేపమంటూ ఉండదు. అంటే అది కేంద్రాన్ని వదలి ఇటూ అటూ చెదరి పోదు. పోయినా అది ఎంతో దూరం పోరాదు. ఎంత దూరం పోతే అంత దూరం కేంద్రంతో ముడిపడే ఉండాలది. ఏ సన్నివేశం కల్పించినా ఏ పాత్రను ప్రవేశపెట్టినా - ఏ వర్ణన చేసినా ఎక్కడ ఏ బావాన్ని ఆవిష్కరించినా - అదంతా

వివక్షితమైన కథాంశంతో ఓత ప్రోతంగా అల్లుకొని పోవాలి. అలా పెనవేసు కొన్నప్పుడే కవి వివక్షితమేదో అది అద్దంలో లాగా సహృదయుడికి స్ఫుటంగా కనిపిస్తూ కావ్యాని కొక చిక్కదన మాపాదించి కావ్యం ప్రబంధమనే పేరు సార్థకం చేసుకొంటుంది. ఇది కాళిదాసు కావ్యాలలో కనపడ్డట్టుగా ప్రాచీనమైన పురాణేతి హాసాల్లోనే గాక ఆయన కర్వాచీనమైన మాఘ భారవి నైషధాది పరిశ్కృత కావ్యాల్లో కూడా మనకు కనుపట్టదు. అనౌచిత్యానికి చాపల్యానికి గురి అయిన భాగా లనేకం కనిపిస్తాయి మనకా కావ్యాల్లో. అలాటి లోపం కాళిదాసు కావ్యాల్లో మచ్చుకు కనిపించదు. ఒక గొప్ప శాస్త్రజ్ఞుడి దృష్టి లాంటిది కాళిదాసు దృష్టి. రచనా ప్రణాళిక ఒకటి జాగ్రత్తగా మొదట తయారు చేసుకొని ఆ ప్రణాళికను తూచా తప్పకుండా అనుసరిస్తూ రచన చేశాడా అనిపిస్తుంది. రేఖామాత్ర మపి క్షుణ్ణా - దామనో ర్వర్త్మనః పరం. దిలీపుని ప్రజలు మర్గాన్ని దాటిఎలా వెళ్ళలేదో మనకు తెలియదు గాని వారిని వర్ణించిన కవి మాత్రం రేఖ కాదు గదా అందులో బిందువు కూడా వెళ్ళలేదని మనం బాహాటంగా చాటవచ్చు. మూడు కావ్యాల్లోనూ ముచ్చటగా దర్శన మిస్తుందిది.

మొదట కుమార సంభవాన్నే తడవి చూతాము. ఎనిమిది సర్గల కావ్యమిది. ఎనిమిది గాక ఇంకా కొన్ని సర్గలు కలిపి పెద్దదిగా అచ్చువేసిన కుమార సంభవం ప్రతులు కొన్ని కనిపిస్తున్నాయిప్పుడు. అవి కుమార సంభవాలు కావు. కుకుమార సంభవాలని మరొక కువర్ణం ముందు చేర్చుకో వలసి ఉంటుంది. ఎవరో కాలాంతరంలో ఒక మహా పండితుడు కాళిదాసు కుమారసంభవం చదివి భక్తి పారవశ్యంలో పడి చేసిన హంగామా ఇది. కుమార సంభవమంటే కుమార స్వామి జననమని పొరబాటు పడి ఉంటాడా మహానుభావుడు. అందుకోసం శివపార్వతుల సమాగమ వృత్తాంతంతో నిలవక కుమారుడు జన్మించి తారకాసుర సంహారం చేయటం వరకూ ఏకరువు పెడుతూ పోయాడు కథను. కాళిదాసు కుమారుడి కథ నుద్దేశించి వ్రాయలేదీ కావ్యం. సంభవమనే మాటకు జన్మమని గాదు ఆయన ఉద్దేశించిన అర్థం.

సమాగమ మని. కుమారుని కోసం పార్వతీ పరమేశ్వరుల కలయిక ఏదున్నదో అది కుమార సంభవమంటే . వారిరువురూ కలిస్తే కుమారు డెలాగూ జన్మిస్తాడు. అది బ్రహ్మదేవుడి వాక్యాల్లో ముందుగానే సూచించాడు కవి. కనుకనే ధ్వనిగర్భితంగా వారిరువురి మైథున వర్ణన తోనే కావ్యానికి భరత వాక్యం పలికాడు మహాకవి. శివ శక్తుల అవినాభావ నిత్య సాంగత్యానికి గొప్ప సంకేత మది. అదే వివక్షితం మహా కవికి. ఇదే సరిగా మేఘ సందేశంలో కూడా చేసి చూపాడాయన. అక్కడా మేఘుణ్ణి తన విద్యుత్కళత్రంతో నిత్యమూ కలిసి ఉండమని యక్షుడి చేత ఆశీస్సు పలికిస్తూ కావ్యాన్ని ముగించాడు. మేఘుడు శివతత్త్వాని కనుకొంటే విద్యుల్లత శక్తి తత్త్వానికి ప్రతీక. వాటి నిత్య సాంగత్యం శివశక్తుల సాంగత్యమే. కనుకనే దానినే ముగింపుగా భావించాడు కవి.

ఇది గ్రహించలేక అందులో కూడా ఉత్తర మేఘమంటూ మేఘుడి రాయబారాన్ని ఇంకా సాగదీస్తూ ఎవరో కొన్ని శ్లోకాలు వ్రాసి జొనిపారు. మేఘ సందేశ మంటే మేఘుడు వాస్తవంగా వెళ్ళి యక్ష గృహిణికి సందేశ మందించా డనికాదు. అందివ్వమని యక్షుడతణ్ణి ప్రాధేయ పడటం మాత్రమే. కాకపోయినా అచేతన మయిన మేఘ మేమిటి. సందేశం మోసుకు పోవట మేమిటి. అంద జేయుట మేమిటి. ఎంత అసంభవం. అసంభవమని నీవూ నేనూ కాదు. కాళిదాసే చాటి చెబుతున్నాడు మనకు. ధూమ జ్యోతి స్సలిల మరుతాం సన్నిపాతః క్వ మేఘః - సందేశార్థాః క్వ పటు కరణైః ప్రాణిభిః ప్రాపణీయాః. అయితే మరి యక్షు డాయనతో ఎలా మాటాడాడు. అతడెలా ఆలకించాడు. ఇతడు మాటాడాడే గాని అత డాలకించలేదు. అదైనా ఎందుకు మాటాడాడు. కామార్తాహి ప్రకృతి కృపణాః. కామార్తు డతడు. అందుకే చేతనాచేతన వివేకం కోలుపోయి ఆ మేఘానికి తన సోది అంతా వినిపిస్తూ వచ్చాడని సంజాయిషీ ఇస్తాడు కవి. అలాంటప్పుడిక మేఘు డలకాపురికి వెళ్ళటమేమిటి - వినిపించట మేమిటి. అర్థంలేని మాట. ఇది కవి హృదయాన్ని బాగా అర్థం చేసుకోలేక చేసే అవివేక ప్రసంగం .

కాబట్టి ఇంతకూ కుమార సంభవం సర్గాష్టక సమాప్తమే. హిమవత్పర్వత వర్ణనతో ప్రారంభమయి అది శివపార్వతుల నిధువన వర్ణనతో సమాప్తమవుతున్నది. హిమవంతు డెవరో గాదు. పార్వతీ జనకుడు. ఆయనే పెండ్లి పీటల మీద కూర్చొని పార్వతిని పరమేశ్వరుడికి కన్నెధార పోసింది. ఆ ఈశ్వరు డెక్కడో కాదు. సతీవియోగ మయినప్పటి నుంచీ దిక్కుతోచక అక్కడే తపస్సు చేస్తున్నాడు. పార్వతి అక్కడే ఆయనకు పరిచర్య చేసింది. మన్మథుడు వచ్చి శివ తపోభంగం చేసి ఆయన ఆగ్రహానికి గురి అయిందీ అక్కడే. తరువాత పార్వతి తపస్సు చేసిందీ తపః ఫలంగా శివుడు ప్రత్యక్షమయిందీ - వారిరువురి వివాహమూ చివరకు వారి వినోద విహారమూ - ఆ పర్వతం మీదనే. కొనా మొదలు హిమవంతుడే . కనుకనే హిమవద్వర్ణనతో ఆరంభించాడు కావ్యాన్ని. అందులోనూ అది కేవల పర్వత వర్ణన గాదు. ఆయన నగాధిరాజత్వాన్నీ దేవతాత్మత్వాన్నీ రెండు లక్షణాలనూ దృష్టిలో పెట్టుకొని రెండింటికీ అనుగుణంగా సాగించాడు వర్ణన. దేవతాత్ముడు కాకుంటే పరాదేవత ఆయనకు జన్మించదు. పరమేశ్వరు డాయన కల్లుడు కాలేడు. సప్త మహర్షు లాయనతో సంప్రతించ లేరు. మరి నగాధి రాజు కాకుంటే పది మందిలో సభా గౌరవం పొందలేడు. ముక్కోటి దేవత లాహూతులయి వస్తే అంత వైభవోపేతంగా కుమార్తె వివాహం జరపలేడు. పోతే ఆద్యంతాలలో హిమవంతుడైతే పూర్వాపరౌ వారినిధీ విగాహ్య అన్నట్టు ఆ రెండంచులు తాకుతూ సాగుతుంది పార్వతీ పరమేశ్వరుల కథ ప్రవాహం. ప్రథమ సర్గలోనే వారిద్దరినీ మన కండ్ల ముందు ప్రత్యక్షం చేస్తాడు కవి. రెండవ సర్గలో వారి విషయమే బ్రహ్మ దగ్గర ప్రస్తావన వస్తుంది. మూడవ దంతా వారిద్దరినీ కలపటానికి మన్మథుడు చేసిన గోల. అది విఫలం కాగా నాలుగవ సర్గలో అతని భార్య రతి చేసిన ఆక్రందన. అందుకు గగన వాణి అభయ మిస్తే దాని కనుగుణంగా అయిదులో పార్వతి చేసిన తపశ్చర్య. పరమేశ్వరుడు వచ్చి చేసిన పరీక్ష. అన్యోన్యానురాగ బీజావాపం. షష్ఠలో దాన్ని సఫలం చేయటానికి

సప్తర్షుల రాయబారం. సప్తమంలో అది ఫలించి వారి కళ్యాణం మహావైభవంగా జరగటం. పోతే అష్టమంలో వారిరువురి శృంగార విలాసం.

ఇలా చూస్తూ పోతే కావ్యమంతా శివశక్తుల సామరస్య నిరూపణమే. మిగతా కావ్యాల్లో ఇది పరోక్షంగా చేస్తే ఇందులో సాక్షాత్తుగానే ప్రతిపాదించాడు కవి తన ప్రత్యభిజ్ఞా సిద్ధాంతాన్ని. సాక్షాత్తూ శివుడే అయినా సతీ వియోగం చేత జీవుడయ్యాడాయన. సతి అంటే శక్తే గదా. అది దూర మయింది తాత్కాలికంగా. దూరమైతే శక్తి హీనుడు పరమాత్మ. నఖలు కుశలః స్పందితు మపి. కదలలేడు మెదల లేడు. స్థాణుభూతుడు. కనుకనే నిశ్చల సమాధిలో నిలిచి పోయాడు. పోతే ఇక పరాశక్తి ఆయనకు దూరమైతే అదీ బ్రతక లేదు. జడమై అస్తిత్వాన్నే కోలుపోతుంది. మరలా అస్తి అనిపించుకోటాని కొక స్థావరాన్ని ఆశ్రయించింది. జన్మించగానే అస్తి భాతి అయింది. చేతనమైన తత్త్వాన్ని పట్టుకొంటే గాని భాతి పరిపూర్ణమైన భానం కాదు. గురూపదేశం లాగా నారదుని ఉపదేశం పనిచేసింది. తండ్రి ఈశ్వర పరిచర్యకే నియోగించా డావిడను. కాని ఆ శివశక్తులు రెండూ కలిసే దెలాగా. కలవాలంటే కామమనేది ఉదయించాలి వారికి. దానికి వారిరువురి తపశ్చర్యా పరిచర్యాదీక్ష అడ్డు తగులుతున్నాయి. అది తొలగాలంటే కాముడు కలగ జేసుకోవాలి. అందుకు దేవేంద్రుడు పురికొలపాలి. దానికి తారకుడి బాధలు ప్రేరకం కావాలి. దానికి నిస్తారకమైన మాట బ్రహ్మదేవుడి నోటనే రావాలి. కనుకనే దేవతల కాయన ముందుగానే హామీ ఇచ్చాడు గోప్తారం సుర సైన్యానాం - బందీమివ జయ శ్రియమ్మని. కుమార జన్మ నిది ముందుగానే సూచిస్తున్నది.

పోతే వారు చేసిన అంత ప్రయత్నమూ మధ్యలో విఫల మయింది. కాముడు ధూర్జటి కంటి మంటలో దగ్ధమయ్యాడు. ఆయన స్త్రీ సన్నికర్షం పనికి రాదని తిరోహితు డయ్యాడు. మరలా వియోగ మేర్పడింది శివశక్తులకు. ఎలా కలవటం. అందుకే రతి విలాప మంతగా వర్ణింతాడు కవి. రతి విలపిస్తే గాని ఆకాశ వాణి పలకదు. ఏమని పలికిందది. తదిదం పరిరక్ష శోభనే

- భవితవ్య ప్రియ సంగమం వపుః. మరలా నీ ప్రియునితో కలుసుకొంటావు. అంతదాకా నీ ఈ శరీరాన్ని కాపాడుకో. సూర్యుడెంత పీల్చినా నదీ జలం మరలా వర్షర్తువులో అది పుష్కలంగా ప్రవహించదా. ఏమి ఉపమానమో చూడండి ఇది. సూర్యుడే పీలుస్తాడు జలం. సూర్యుడే మరలా వర్షిస్తాడు. అలాగే ఈశ్వరుడే దహించాడు మదనుణ్ణి. మరలా ఆ ఈశ్వరుడే అనుగ్రహిస్తాడని సూచన. అనుగ్రహించా లంటే పార్వతిని చెట్టపట్టాలి గదా. అప్పటికి శివశక్తుల సంగమ మవశ్యం భావి అని తెలుస్తున్నది. దీని కుపోద్బలకం పార్వతి తపస్సు. అవాప్యతే వా కథ మన్యథా ద్వయం - తథా విధం ప్రేమ పతిశ్చ తాదృశః అని పంచమ సర్గాది లోనే సూచిస్తాడు తప్పకుండా శివ సాంగత్య మావిడకు తపస్సు ద్వారా లభిస్తుందని. అందుకే అంత దీర్ఘమైన ఆ వర్ణన. పోతే బ్రహ్మచారి రూపంలో వచ్చి ఆయన శివదూషణ చేయటం - ఆవిడకు ప్రత్యక్షం కావటం - మరలా విడిపోవటం. ఆ తరువాత సప్తర్షుల ధర్మమా అని పరిణీతులై ఇద్దరూ మరలా కలియటం. కామం వల్ల కలిసే కలయిక నిత్యం కాదు. తపస్సుచేత కామం నిష్కామ మైతేనే అది కలయిక. దానికిక ఎడబాటు అనేది లేదని సూచిస్తూ సమాప్తం చేస్తాడు కవి తన కావ్యాన్ని. ఇలా ఎప్పటి కప్పుడు పార్వతీ పరమేశ్వరుల యోగ ప్రతియోగాలను వర్ణించటం చూస్తే కవి తన ప్రత్యభిజ్ఞా సిద్ధాంతానికీ కావ్యా న్నంతటినీ ఉదాహరణ ప్రాయంగా భావించాడని చెప్పక చెబుతున్నది. అంతే కాదు. శివ శక్తుల నీ కావ్యంలో పరోక్షంగా కాక సాక్షాత్తుగానే నాయికా నాయకులుగా స్వీకరించి వారి వృత్తమే సాక్షాత్తుగా వర్ణించాడు కాళిదాసు. ఈ నమూనాతోనే చూచండి మీరు నా మిగతా కావ్యాలనని ధ్వనింప జేయటానికో ఏమో.

మిగతా కావ్యాలంటే ఏమిటవి. రఘువంశమూ మేఘ దూత మే గదా. మేఘ దూతంలో కూడా ఇదే బాణీ. అయితే చాలా నిగూఢంగా సాగిందా వ్యవహారం. అసలే చిన్న కావ్యమది. అందులో ఉన్నవి కూడా మూడే పాత్రలు. అందులో రెండు మాటాడనివి. ఒకటి మాటాడేది. యక్షుడొకడే చివర దాకా

మాటాడు తున్న పాత్ర. మేఘుడా అచేతనుడు కాబట్టి మాటాడ లేడు. యక్షాంగనా మాటాడ గలిగినా మాటాడ నివ్వడు కాళిదాసు. యక్షుడే ఆమె తరపున కూడా మాటాడ వలసింది. దీనిని బట్టి ఇదంతా యక్షుడి సొద మాత్రమే. అయినా దానిలో మిగతా వారిద్దరి మూర్తులు మనకు సజీవంగా దర్శన మిస్తూనే ఉంటాయి. ఈ యక్షు డెవరో కాదు. కవి దృష్టిలో శివ స్వరూపుడే. యక్ష కాంత శక్తి స్వరూపిణే. పేరు చెప్పకుండా కశ్చిద్యక్షః అనటంలోనే అనిర్వచనీయమైన భగవత్తత్త్వాన్ని స్ఫురింప జేస్తున్నాడు కవి. కేనోపనిషత్తు లో వస్తుంది మనకు యక్షమనే మాట. యజింప దగినది పూజింప దగినదని అర్థం. భగవచ్ఛక్తి పరంగానే వాడారా మాట అక్కడ. అయితే అది స్వాధికారాత్ ప్రమత్తః. తన స్వరూప స్థితిలో పరాకు చెందింది. ప్రమాదో వై మృత్యుః అన్నట్టు పరాకు చెందే సరికి శాపేనాస్తం గమిత మహిమా. అదే తన పాలిటికి శాపమై తనకున్న మహిమను కోలుపోయింది. అంతేగదా. అచ్యుతుడైన దేవుడే అవిద్యా ప్రభావం వల్ల చ్యుతుడై జీవుడయ్యాడు. మాయైషా తస్య దేవస్య యయాయం మోహితః స్వయం అని గదా అద్వైత సిద్ధాంతం. తన మాయా శక్తే తన కొంప ముంచింది. దానితో తన చైతన్య శక్తికి దూరమై ఈ సంసారమనే అరణ్యంలో వచ్చి పడ్డాడు జీవుడనే పేరుతో ఆ ఈశ్వరుడే. ఇదే యక్షుడు తనపట్టణానికీ తన పత్నికీ దూరమై ఎక్కడో రామగిర్యాశ్రమంలో కాపురం చేయటం. తన మహిమ కోల్పోయి దేబిరించటం.

అయితే కోలుపోయిన తన స్వరూప స్థితిని మరలా పొందాలని ఉంటుం దెవరికైనా. అంత వరకూ పరిపూర్ణత లేదు. ఇలాటి ప్రత్యభిజ్ఞకు దోహద కారి గురూప సదనమే. ఆ గురువు ఎంతో ఉన్నతుడై ఉండాలి. మన సుకృతం కొద్దీ తటస్థ పడాలి. మన ముత్తమాధి కారులమయితే మౌనోపదేశంతోనే ఉద్ధరించ గలడు మనలను. ప్రస్తుతం మేఘు డలాటి వాడే. అతణ్ణి చూడగానే దధ్యా ధ్యానంలో పడి పోయాడు యక్షుడు. తన దైన్యమంతా వెళ్ళ బోసు కొన్నాడు. ఏవేవో జ్ఞాపకాలు వచ్చాయి పూర్వ వృత్తాంతాలన్నీ. ఇది ఆచార్య

Vallamaraju Srinivasa Rao
www.advaitavedanta.in

సందర్శనం వల్ల కలిగే ఆత్మ ప్రబోధమే. మరేదీ గాదు. అదే ఒక అభిజ్ఞానం లాగా పని చేసి మానుషమైన మన బుద్ధిని అతి మానుషమైన సిద్ధిని చేరుస్తుంది. యక్షుడెక్కడో చిత్రకూటంలో ఉన్నవాడు ఒక్క సారిగా తనకు దూరంగా ఉన్న అలకా పట్టణం వరకూ మానసికంగా పరుగెడుతాడు. అక్కడికీ ఇక్కడికీ నడుమ ఉండే మార్గమంతా వర్ణిస్తూ పోతాడు. అక్కడి వ్యక్తులూ - అక్కడి వాతావరణానికీ తాను ప్రస్తుతమున్న దానికీ సంబంధమే లేదు. అది దివ్యమైతే ఇది మానుషం. అది అమర్త్యమైతే ఇది మర్త్యం. ఆనందోత్థం నయన సలిలం - ఇలాంటి వర్ణనల ద్వారా కవి రెండింటికీ ఉన్న వైలక్షణ్యాన్ని మన మనసులో బాగా హత్తుకొనే లాగా చిత్రిస్తాడు. ఇదంతా ఏమిటి. ఎందుకు. అమర్త్యమైన స్థితే మనకు సహజమైన స్థితి. మనం జీవులం కాము. సాక్షాత్తు శివస్వరూపులమే. అయినా ఏదో అవిద్యా దోషం వల్ల మన స్థితిని మనం కోలుపోయి మన శక్తికి మనం దూరమై చిత్ర కూటం లాంటి ఈ సంసారారణ్యంలో చిత్ర హింసలకు పాలయ్యాము. మరలా ఏ మేఘుడి లాంటి స్థిత ప్రజ్ఞుడైన మహనీయుడో అనుగ్రహిస్తే మన పూర్వ వైభవమంతా జ్ఞప్తికి వచ్చి ఆవృత్త చక్షుః అన్నట్టు మన దృష్టి వెనుకకు మళ్ళించి క్రమంగా జ్ఞానోదయమై ఈ దుర్వాసనలకు స్వస్తి చెప్పి అమర్త్యమైన మన స్వరూప స్థితినే మన ముందుకో గలమనే ప్రత్యభిజ్ఞా సూత్రాన్నే కవి భంగ్యంతరంగా ఈ చిన్న గేయ కావ్యంలో కూడా పొందుపరిచి మనకు అందజేశాడు. మాభూ ద్వ్యద్యుతా విప్ర యోగః. నీవిద్యుత్కాంతతో నీకిక ఎప్పటికీ వియోగం లేకుండు గాక అని యక్షుడి చేత చివర అనిపించటంలో కూడా జీవు డీశ్వర పదవి అందుకొని ఆ తరువాత ఎప్పటికీ తన చైతన్య శక్తి నెడబాయ కుండా నిత్య ముక్తుడై ఉండాలనే కవి ఆశీః. విశేషేణ ద్యోతతే ఇతి విద్యుత్. విశేషంగా ప్రకాశించేది తమసః పరమైన జ్ఞాన జ్యోతే. మరేదీ కాదు. అది క్షణికం కాక శాశ్వతంగా నిలిచి ఉండాలనే మన మాసించ వలసింది. సీతా రాములకు సంకేతాలుగా స్వీకరించినా నాయికా నాయకు లిందులో ప్రకృతి పురుషులకు సంకేతాలే. అవి శివ శక్తులే. రాము డాత్మా రాముడే. సీత ఆత్మ శక్తే. తులసీ దాసు రామ చరిత మానసం పీఠిక లోనే

బయట పెడతాడీ ఆధ్యాత్మిక భావ మత్యద్భుతంగా. ఉద్భవ స్థితి సంహార కారిణీ మని శక్తి రూపంగా సీతను - యన్మాయా వశవర్తి - వందేతం రామాఖ్య మీశం హరిం అని శివ రూపంగా రాముణ్ణి స్పష్టంగా లోకానికి చాటాడాయన. కాబట్టి యక్షదంపతులను సీతారాములకు సంకేతంగా తీసుకొన్నా కాళిదాసు ఉద్దేశించింది శివ శక్తి సామరస్యమే మరేదీ గాదు. దాని ప్రపంచనమే ఈ మేఘ సందేశం.

పోతే ఇక మూడవది రఘువంశ మహా కావ్యం. ఇది వాటి రెంటి కన్నా పెద్దది. పందొమ్మిది సర్గల కావ్యమిది. దిలీపుడు మొదలు కొని అగ్ని వర్ణుడి వరకూ అనేక రాజన్యుల తాలూకు అద్భుతమైన చరిత్ర. మొదటి మూడూ దిలీపుని వైతే - నాలుగైదారులు రఘు చక్రవర్తి వైతే - ఏడెనిమిదులు అజుని వైతే - తొమ్మిది దశరథుని దైతే - ఇక చూడండి పది నుంచి పది హేను దాకా ఆరు సర్గలు రాముని చరిత్రే ఇందులో. రామాయణమంతా మరొక మూసలో బోసి చూపాడు మనకు కాళిదాసు. ఆ తరువాత పదహారు కుశుని చరిత్ర. పదిహేడు నుంచి పందొమ్మిది దాకా పది మంది రాజుల చరిత్ర టూకీగా వర్ణించి అగ్ని వర్ణుడి శృంగార లాలసత్వంతో ఆఖరు చేశాడు కావ్యాన్ని కాళిదాసు. ఇంతమంది రాజులను వర్ణించినట్టు కనిపిస్తున్నా ఇంతమంది లేరు వాస్తవానికి. ఉన్నది ఒకే రాజు. ఒకే చరిత్ర. ఆ రాజెవరో గాదు. రఘు మహా రాజు. కనుకనే ఆ రాజు పేరే పెట్టాడు కావ్యానికి. కావ్యారంభంలో పేర్కొన్న అన్వయ లక్షణాలన్నీ పరిపూర్ణంగా అన్వయించిన పరిపూర్ణ జీవిత మామహా రాజుది. కనుకనే శైశవేభ్యస్త విద్యానాం అని విద్యాభ్యాసం మొదలు యోగేనాంతే తనుత్యజా మనే దాని కనుగుణంగా యోగ ధారణతో ఆ రాజు శరీర త్యాగం చేయటం దాకా బీరు పోకుండా వర్ణించి చూపాడాయన జీవితాన్ని. ఆయన జీవితంలోనే హస్తి పాదంలో సమస్త జంతువుల పాదాలూ అంతర్భవించి నట్టుగా అంతర్భవిస్తాయి తతిమా రాజుల జీవితాలన్నీ. పోతే ఒక రామ చరిత్ర మాత్రం ప్రత్యేకంగా చెప్పుకో వలసింది. అది భగవదవతార చరిత్ర. అందుకే దాని

విశిష్టత చూపటాని కంత విపులంగా వర్ణించాడు కవి. రఘువుది ఉత్తరమైతే అది అవతారం. ఈశ్వర జ్ఞానంతో తరించిన జీవుడు రఘువు. జీవుడి రూపంలో అవతరించిన ఈశ్వరుడు రాముడు. అల్పజ్ఞుడైన జీవుడీశ్వర ప్రత్యభిజ్ఞతో ఎలా తరించాలో బోధించటానికే రామావతారం. అది అందుకొని సంసారోత్తరణం చేసి పరమాత్మ సాయుజ్యాన్ని పడయుట మిలాగా అని చూపటానికే రఘూత్తరం. ఇలా ఈ రెండూ ఒకదానికొకటి గురుశిష్యుల లాగా పూరకమై మనకు తారకం కావలనే కవి ఈ ఇద్దరి చరిత్రలను ఇంత ప్రశంసా పాత్రంగా తీర్చి దిద్దటం.

అంతేకాదు. ఎంత గొప్పవంశంలో జన్మించినా - ఎంత విద్యా బుద్ధులు గడించినా దానిని నిలుపుకొన్నప్పుడే - దాని కనుగుణంగా ప్రవర్తించినప్పుడే జీవితానికి సాఫల్యం. అలా కాక ప్రాపంచిక మైన వ్యసనాలకు గురి అయితే పైకి పోవట మలా ఉంచి అధః పతనం తప్పదని ఒక గొప్ప హెచ్చరిక కూడా చేస్తున్నాడు కవి ఈ కావ్యం ద్వారా మనకు. దానికి నిదర్శనంగా చిత్రించినదే కావ్యాంతంలో అగ్ని వర్ణుడి జీవితం. అగ్ని వర్ణు డన్ని విద్యలలో ఆరి తేరిన వాడే. కాని అవి అతని కివ్వవలసిన చిత్త సంస్కార మివ్వలేదు. వ్యసనాలకు బానిసను చేశాయి. వల్లకీచ హృదయంగమ స్వనా- వల్గువాగపిచ వామ లోచనా అని వాటి వెంటితోనే జీవిత మంతా గడిపాడు. అది పాతాళానికి గాక పరమ పదాని కెలా దారి చూప గలదు. చివర కలాగే క్షయరోగంతోనే క్షయమై పోయిందా రాజు జీవితం. దిలీపుడి ధర్మ దీక్ష ఎలాంటిది. ఇతని కామ దీక్ష ఎలాటిది. ధర్మా విరుద్ధో భూతేషు కామోస్మి అన్నాడు భగవానుడు. ధర్మ విరుద్ధమైన కామం జీవితాని కెప్పటికైనా ముప్పే. అర్థ కామాలు ధర్మంలో ధర్మం మోక్షంలో పర్యవసానం చెందాలి. అదే సమగ్రమైన జీవితం. ఇక్కడ విజ్జోడు పడింది. ముప్పు తెచ్చింది. ఇలాంటి ముప్పు కొని తెచ్చుకో రాదని చెప్పటానికే కవి ఇలా కావ్యాన్ని ముగించింది. అందుకే ఆయా రాజుల చరిత్రల ద్వారా ఆత్మ జ్ఞానానికి తోడ్పడే దైవసంపద నంతా వర్ణించి రాను రాను దానికి భంజక

మైన అసుర సంపదను వర్ణిస్తూ వచ్చాడు. అందులోనూ ఒక్కొక్క రాజు జీవితంలో ఒక్కొక్క దైవ గుణాన్ని వర్ణించి అన్నీ కలుపుకొని చూస్తే సమగ్రమైన దైవ గుణ సంపత్తి ఎలాంటిదో మనకు నిరూపించాడు. జీవితంలో ఎన్నో సంఘటనలు జరిగి ఉండవచ్చు. అవన్నీ ఏకరువు పెట్టటం అనావశ్యకం. పౌరాణిక మార్గం గాని కావ్య మార్గం గాదది. కాంతా సమ్మితంగా ఉపదేశించాలి కావ్యం. ఏమిటి. ఏది పాఠకుడి చిత్త సంస్కారానికి కావాలో అది. అది కూడా రమణీయంగా అందివ్వాలి రసజ్ఞుడికి. అలాంటి కావ్య మర్యాదలో ఆరి తేరిన వాడు కాళిదాసు. అందుకే దాని కనుగుణంగా ఒక్కొక్క రాజు జీవితాన్ని ఒక్కొక్క గుణాని కాదర్శంగా దిద్ది తీర్చాడు. ఆ తీర్చిన జీవిత చిత్రం మనః ఫలకం మీద శాశ్వతంగా హత్తు కొలిపాడు.

దిలీపుని జీవితం ద్వారా ధర్మ దీక్ష - కార్య దీక్ష అంటే ఎలా ఉండాలో నిరూపించాడు కవి. సంతానార్థి అయి సేవించినా ఆ రాజు నందినీ ధేనువును కేవల మామేరకే చూడలేదు. ఛాయేవ తాం భూపతి రన్వ గచ్ఛత్. ఒక నీడలాగ దాన్ని అంటి పట్టుకొన్నాడు. తన భోగ భాగ్యలన్నీ మరచి అన్ని కష్టాలనూ ఓర్చి నిరాడంబరంగా నిష్కల్మషంగా శ్రద్ధా భక్తులతో దాన్ని ఆరాధించాడు. మధ్యలో ఒక సింహం బారిన బడి అది ఆక్రందన చేస్తే తన శరీరాన్ని ఆ సింహాని కాహుతి చేయటానికి సిద్ధమయ్యాడు. ఆ సింహ మెవరో కాదు. నేనే నిన్ను పరీక్షించటాని కిలా చేశానని చెప్పిన నందిని ధేనువే. నా పాలు పిండుకొని త్రాగు - నీకు కుమారుడు జన్మిస్తాడని లోభ పెడుతుంది. అయినా లోభ పడక దిలీపుడు తన గురువు గారి అనుమతి తీసుకొని గాని ఆ పని చేయలేదు. ఈ సన్నివేశం ద్వారా ఒక దేశమేలే రాజు కెలాటి గుణ గణా లుండాలో సూచిస్తున్నాడు కవి. పెద్దల యెడ వినయం - కార్యదీక్ష - నిరాడంబర జీవనం - భూతదయ - స్వార్థ త్యాగం- ఇలాటి వున్న వాడే పాలకుడు. అలాటి వాడు పాలించి నప్పుడే యథా రాజా తథా ప్రజా అని పాలితులైన ప్రజలు కూడా అలాటి గుణాలు తప్పక అలవరుచుకో గలరని ధ్వని. దిలీపునిలో

ధర్మ దీక్ష అయితే రఘువులో త్యాగ బుద్ధి ఎలా ఉండాలో నిరూపించాడు కవి. విశ్వజిద్యాగం చేసి సమస్తమూ దానం చేశాడు రఘువు. ఖజానా అంతా ఖాళీ అయిపోయింది. అప్పుడు వచ్చాడు వరతంతు శిష్యుడు కౌత్సుడనే వాడు. సమస్త విద్యా పారంగతుడు. సద్బ్రాహ్మణుడు. అడగలేక అడిగాడు పదునాలుగు వేల బంగారు నాణాలు కావాలి గురు దక్షిణ కని. నాలుగు రోజు లవకాశ మివ్వండి అలాగే తెచ్చి ఇస్తానని నిలిపా డాయనను. వసిష్ఠ మంత్రోప దేశంతో కోటీశ్వరుడైన కుబేరుడి మీదికే దండెత్తాలని చూస్తున్నాడు. ఇంతలోనే వచ్చి వినకారు చేశారు కోశ పాలకులు రాత్రి కోశ గృహంలో కనక వర్షం కురిసిందని. వెంటనే ఆ బ్రహ్మచారిని పిలిచి అంతా తీసుకు పొమ్మని చెప్పాడు. నాకెందుకండి ఇంత సొమ్మంటా డాయన. నీకోసం కురిసిందిది నీకే గాని అపరిగ్రహ శీలుడైన నాబోటి క్షత్రియుడి కెందు కంటాడీయన. ఇలాటిదీ రఘుమహారాజు త్యాగ శీలత. త్యాగాయ సంభృతార్థానా మనేది చాటి చెబుతుం దాయన జీవితం.

పోతే అజుని జీవితం నిర్మలమైన ప్రణయానికి సంకేతం. కర్కశమైన వీర్యమే కాదు - సరసమైన హృదయం కూడా ఉండాలి క్షత్రియుడికి. ధర్మ దీక్షే గాదు - త్యాగ దీక్షే గాదు - ధర్మావిరుద్ధమైన కామం కూడా సేవించ దగిన పురుషార్థమే నని నిరూపిస్తుం దాయన జీవితం. తండ్రి రఘు వాపాటికే అస్తమించాడు. తనయుడైన దశరథు డెనిమిదేండ్ల కుర్ర వాడు. రాజ్య పాలనా నిష్కంటకంగా సాగుతున్నది. ఎందులోనూ ఏలాటి కొరతా లేదు. ఇక ఏమి కావాలా రాజుకు. సకల కళా ప్రవీణుడూ సంస్కార వంతుడూ ఆయన. అప్సరస లాంటి భార్యతో కలిసి ఉద్యానంలో విహరిస్తున్నాడు. ఎక్కడి నుంచి వచ్చి పడిందో ఒక దివ్యమైన కుసుమ దామ మామె వక్షస్థలం మీద వచ్చి పడింది. పడట మేమిటి. ఆ సుకుమారి ప్రాణాలు విడవట మేమిటి. రెండూ ఏక కాలంలో జరిగి పోయాయి. ఇక ఆ విరహ వేదన తట్టుకోలేక ఆ రాజు చేసిన విలాప మింతా అంతా కాదు. రతీ విలాపమంత దీర్ఘంగా సాగిందది మరలా. దానికి వసిష్ఠోప దేశం కూడా పని చేయలేదు. చివరకు రాజ వైద్యులకు దుర్భేద్య

మయిన ఆ మనో వ్యధితో ఆయన గంగా సరయూ సంగమంలో దూకి ప్రాణ త్యాగం చేస్తాడు. అంత వ్యామోహంలో కూడా ధర్మం తప్పలేదాయన. ఆత్మ హత్య మహాపాతక మని తెలిసిన వాడు గనుకనే తీర్థంలో శరీర త్యాగం చేశాడు. తీర్థంలో చేస్తే ఆత్మ హత్య పాతకం కాదని ధర్మ శాస్త్రం. ఇంతకూ పరిశుద్ధమైన దాంపత్య జీవితం - ధర్మ బద్ధమైన కామోప సేవనం చూపటానికే ఈ రాజు జీవిత మిలా వర్ణించటంలో కవి ప్రయత్నం.

పోతే దశరథుడి పాత్ర సత్యవాక్పాలనకు నిదర్శనమైతే - ఆ తరువాత వచ్చిన రామ చరిత్ర మంతా సమస్త ధర్మ ప్రబోధానికీ ఆదర్శంగా భావించాడు కాళిదాసు. రామో విగ్రహవాన్ ధర్మః అనే వాల్మీకి సూక్తికి భాష్యం రచించాడా అనిపిస్తుందాయన రామ కథా వర్ణన చూస్తే. శిష్య ధర్మం దగ్గరి నుంచీ రాజ ధర్మం వరకూ ఎవరి పట్ల ఏధర్మ మెలా పాటించాలో రాముణ్ణి చూచి నేర్చుకోవాలి ఏ మానవుడైనా. అందుకే రామావతార మసలు. ఈ అవతార రహస్యాన్ని ఆరు సర్గలలో వ్యక్తం చేశాడు మహా కవి. రాముని తరువాత కుశుని నిష్కామ ధర్మ శీలతను అతి సుందరంగా వర్ణించి వంశంలో పూర్వ పురుషులైన రఘు దిలీపులను మరలా స్మరణకు తెస్తాడు. ఆచక్ష్వ మత్వా వశినాం రఘూణాం - మనః పరస్త్రీ విముఖ ప్రవృత్తి అని కుశు డయోధ్యాధి దేవతను హెచ్చరిస్తుంటే మనలను కూడా ఇలాగే బ్రతకండని హెచ్చరించి నట్టుంటుంది. ఇలాటి హెచ్చరిక నందుకొన్న వారందుకొంటే చివర కందుకోలేక క్రింద బడి పోయా డగ్ని వర్ణుడు. ఇంతకూ నిష్కామ మైన ధర్మ దీక్ష ఎలా అభ్యుదయ హేతువో - సకామమైతే అది ఎలా పతన హేతువో నిరూపించి ధర్మం కామానికి దారి తీయకుండా తదతీత మైన మోక్షానికే చేర్చేట్టు చూచుకోవటమే మన కర్తవ్యమని ఈ రఘువంశ మహా కావ్యం ద్వారా సూచన చేస్తున్నాడు కవి లోకానికి. ఆయా రాజుల చరిత్రలన్నీ అందుకు ఆలంబనంగా తీసుకొన్న సంకేతాలే. అర్థకామాలకన్నా ధర్మం - ధర్మం కన్నా మోక్షం ఉత్తరోత్తరా వాంఛనీయమని చెప్పటమే. దిలీపుడూ రఘువూ ధర్మ దీక్ష -

అజుడూ దశరథని కామాభిముఖ్యం వల్ల కొంత దెబ్బ తింటే - అది మరలా రాముడూ కుశుడి ద్వారా గత వైభవాన్ని అందుకొంటే - అది క్రమంగా దుర్బలులైన రాజుల నాశ్రయించి ఎలా పూర్తిగా పతన మవుతుందో చూపి అసుర సంపదను విడిచి దైవ సంపద నలవరుచు కొని బాగు పడండని మనకు చేస్తున్న ఉపదేశమే ఇదంతా.

ఇందులోనూ ప్రత్యభిజ్ఞా దర్శనమే తొంగి చూస్తున్నది పరోక్షంగా. రాజులు రాజులు కారు. వారీశ్వర స్వరూపులే. నావిష్ణుః పృథివీ పతిః అన్నారు. రాజు విష్ణ్వంశ సంభూతు డట. విష్ణువు స్థితి కర్త. బ్రహ్మ కేవలం సృష్టించాడీ ప్రపంచాన్ని. శివుడు లయం చేస్తాడు. కాని సృష్టికీ లయానికీ నడుమ ఈ జగత్స్థితిని పాలించ వలసిన వాడు విష్ణువే. మరి రాజనే వాడ విష్ణ్వంశ లేని వాడైతే ఎలా పాలించగలడీ ప్రజానీకాన్ని. నిజంగా విష్ణు స్వరూపుడే. అంతే కాదు. అతనిలో దిక్పాలకుల అంశలన్నీ ఇమిడి ఉన్నాయనే మాటకూడా వాస్తవమే. దశ దిశలూ తిరిగి దేశానికీ ప్రజలకూ ఎలాటి ఉపద్రవమూ రాకుండా చూడవలసిన వాడు గదా. ఇది కూడా గట్టిగా నమ్మిన వాడు కాళిదాసు. కనుకనే నరపతి కుల భూత్యై గర్భ మాధత్త రాజ్ఞీ - గురుభి రభి నివిష్టం లోక పాలాను భావైః అని వర్ణిస్తాడు సుదక్షిణా గర్భస్థుడైన రఘుమహా రాజును. బుద్ధంహి రాజ్యం పద మైంద్ర మాహుః మహీతల స్పర్శన మాత్రమే తేడాగాని లేకుంటే రాజ్యమనేది ఇంద్రపదమే. రాజనేవా డింద్రుడే నంటాడు. అసలానాక రథ వర్త్మలట రఘువంశ రాజులు. వారందరూ భూతలంలో ఉన్నారని పేరే గాని తరుచూ స్వర్గానికి వెళ్ళి ఇంద్రునికి తోడ్పడుతున్న వారే. ఇలా దేవేంద్రాది దేవతల తోనే గాక వసిష్ఠాది మహర్షులతో కూడా దీటయిన ప్రభావం వారిది. రాజ్యాశ్రమ మునులని వారిని వర్ణిస్తాడు కవి. కనుక ఈశ్వర ప్రతినిధులే ఆ రాజులు కాళిదాసు దృష్టిలో. ఈశ్వరుడు సురేశ్వరుడైతే రాజు నరేశ్వరుడు. ఈశ్వరత్వ మిద్దరికీ అవిశిష్టమే. కనుకనే నేమో కుమార సంభవంలో ఈశ్వరుడి వివాహాన్ని భూలోకంలో ఒక రాజ పుత్రుని వివాహాన్ని తలపించే లాగా వర్ణిస్తూ

పోయాడు. ఖడ్గే నిషక్త ప్రతిమం దదర్శ. ఆఖరుకు పెండ్లి ముస్తాబంతా చేసుకొని పరమ శివుడు తన ముఖ మెలా ఉందో అద్దంలో కాక ఖడ్గంలో చూచుకొన్నాడట. ఉత్తమ క్షత్రియ పుత్రుడే అలా చూచుకొనేది లోకంలో. బహుశా గుప్త రాజుల వ్యవహారం జ్ఞప్తికి వచ్చి ఉంటుంది మహా కవికి. తరువాత నంది భుజావలంబనతో వృషభాన్ని అధిరోహించి అకాశ మార్గంలో తరలి వచ్చి బ్రహ్మాదులు కైదండ ఇస్తే అవరోహణ చేసి ఆ గుల్బ కీర్ణ పణ మార్గ పుష్ప పంక్తి మీద దర్జాగా నడచి పోవటం మొదలుగా సకలమైన వ్యవహారమూ రాజోచిత మైన ఉపచారమే. అంతే కాదు. పురకాంతలు పెండ్లి కుమారుడైన ఈశ్వరుణ్ణి ముచ్చట పడి చూడటం కుమార సంభవంలో ఎలా వర్ణించాడో అలాగే వర్ణించాడు రఘువంశంలో అజుడనే పెండ్లి కొడుకును చూచి నపుడు కూడా. పునరుక్తి అని కూడా చూడ కుండా శ్లోకాలకు శ్లోకాలే అటూ ఇటూ ఒకే బాణిలో దొరలి పోవటం చూస్తే నరేశ్వరుడికీ పరమేశ్వరుడికీ అభేదాధ్యవసాయం కవి మనసులో ఉండి తీరాలి.

అచేతన మైన హిమలయానికే చేతనత్వమూ - అందులోనూ దేవతాత్మత్వమూ కల్పించి ఆయనకు బ్రహ్మ దేవుడు దేవతలతో పాటు యజ్ఞ భాగం కూడా కల్పించాడని వర్ణించిన మహా కవి సచేతనులైన సూర్యాన్వయజులైన రాజన్యులను ఈశ్వర స్వరూపులుగా భావించటంలో అభ్యంతర మేముంది. రాజులు శివస్వరూపులైతే వారి రాజ్య లక్ష్మి ఇక మహా కవి దృష్టిలో శక్తి స్వరూపిణే. మధ్యలో వచ్చిన గృహ లక్ష్మి మధ్యలోనే తొలగి పోవచ్చు. కాని అలా తొలగని లక్ష్మి వారికి రాజ్య లక్ష్మే. అది వారికి నిత్యానపాయిని. తన కాంత ఇందుమతి వియోగాన్ని భరించలేక పలవిస్తుంటే ఈ సూత్రాన్నే ఆయనకు గుర్తు చేస్తాడు వసిష్ఠ మహర్షి. వసుధేయ మవేక్ష్యతాం త్వయా - వసుమత్యా హి నృపాః కళత్రిణః అని. ఇందులో సూక్ష్మ మేమంటే రాజు జ్ఞాన శక్తి కయితే రాజ్య లక్ష్మి క్రియా శక్తికి చిహ్నం. జ్ఞాన క్రియా శక్తులే పార్వతీ పరమేశ్వరులు. మరొక మాటలో శివ శక్తులు. వాటి సామరస్య మెప్పటికీ

చెదర కుండా ఉండటమే లోక స్థితికి రక్ష అని కవి వివక్షితం. దైవ వశాత్తూ శక్తి తనకు దూరమైనా మరలా కలుసుకొనే దాకా పరితాపం తప్పదు. కలుసుకొంటేనే జీవితానికి పరిపూర్ణత. ఈ భావాన్ని కూడా పట్టుకు వచ్చా డక్కడక్కడా కాళిదాసు. అజుడి దగ్గరి నుంచీ రాముడి వరకూ ముడు తరాలు భార్యా వియోగంతో బాధ పడ్డారు ముగ్గురు రాజులు. దానితో తాత్కాలికంగా మతి పోగొట్టు కొన్నారు. పరితపించారు. పరితప్త చిత్తులైన వారి శక్తిని వారికప్పగించే దాకా కాళిదాసుకు నిద్ర పట్టలేదు. అజు డిందుమతిని కోలుపోయి ఆ బాధతోనే మరణించి కూడా మరలా స్వర్గంలో ఆవిడను కలుసుకొని సుఖించాడని వర్ణిస్తాడు. దశరథుడు కౌసల్యాదులకు దూరమై మరలా దివ్యాకృతితో దర్శనమిస్తాడు యుద్ధభూమిలో. పోతే రాముడి సంగతిక చెప్పనే అక్కర లేదు. యోగమూ వియోగమూ రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయాయన జీవితంలో. కడసారిగా భౌతికంగా సీత నెడబాసినా అభౌతికంగా వైకుంఠంలో ఆవిడను వక్షస్థలంలో భద్రంగా చేర్చుకోక తప్పింది కాదు.

ఇలా చూస్తూ పోతే అంతా శివశక్తి విలాసమే ఆయన కావ్య ప్రపంచం. అది నిరూపించటమే ఆయన ధ్యేయం. కుమార సంభవంలో సూటిగానైతే రఘువంశ మేఘ దూతలలో చాటుగా నిరూపించా డంత మాత్రమే. కథ సన్ని వేశాలూ నాయికా నాయకులూ వర్ణనలూ - ఈ కలాపమంతా ఆ భావావిష్కరణ సాధన కలాపమే. ఇదంతా వాగ్రూప మైతే ఈ వాక్ప్రపంచం ద్వారా సహృదయుడు భావించ వలసిన అర్థ మూ పరమార్థ రూపమైన శివ శక్తి సమన్వయమే. మరేదీ కాదు. అది భావుకుడి మనసుకు బాగా పట్టాలంటే కథ వస్తు వితిహాస పురాణాలలో లాగా విస్తారంగా ఉండరాదు. సంక్షిప్తంగా ఉంటూ గమ్యాభి ముఖంగా సాగుతూ పోవాలి. ఎక్కడ ఏ విషయం చెప్పినా ఏ పాత్రను సృష్టించినా ఎలాటి వర్ణన చేసినా అది ఆ వివక్షితార్థాని కనుగుణంగానే చేస్తూ పోవాలి. ఒక హిమాలయాన్ని వర్ణించాడంటే పదహారు శ్లోకాలలో సంగ్రహంగా వర్ణించాడు గాని సాగదీయలేదు. వెంటనే కథ అందుకొన్నాడు.

చేయాలనుకొంటే ఎంతైనా చేయవచ్చు వర్ణన. చేయగలడు గూడా. కాని చేయడు కాళిదాసు. అంతకన్నా చేస్తే కథ గమనాని కడ్డమని జాగ్రత్త పడతాడు. మరి ఇలాటి జాగ్రత్త మాఘ భారవ్యాదు లయిన తరువాతి కవులలో కానరాదు. కథ కెంత అవసరమో వారికి తెలియదు. రైవతక మనే పర్వతాన్ని ఒక సర్గ అంతా వర్ణించాడు మాఘ కవి. మధురంగానే ఉండవచ్చు. కాని పనికి రాదు. ఎక్కడ పనికి వస్తుందో కూడా తెలుసు మరలా కాళిదాసుకు. మొదట వర్ణించాడు హిమాలయాన్ని. మరలా వర్ణించాడు మధ్యలో. సప్తర్షుల కాయన స్వాగతం చెప్పినప్పుడు వస్తుందా వర్ణన. అక్కడ పరమేశ్వరు నంత వాడికి కన్య నివ్వవలసిన సందర్భం. కనుక ఆయన దేవతాత్మత్వ మెట్టిదో నగాధిపత్య మెట్టిదో వర్ణించ వలసి వచ్చింది. ధాతు తామ్రా ధరః శ్రీమాన్ - జంగమం ప్రేష్య భావే వః - స్థావరం చరణాంకితం. అత్యద్భుతమైన వర్ణన ఇది . సరిక్రొత్త రూపంలో మరలా నిలిచాడు మన ఎదుట హిమవంతుడు. అతడే మరలా వివాహ సమయంలో సకల దేవతా సభాజన యోగ్యుడైన ఒక సద్గృహస్థుడుగా దర్శన మిస్తాడు. మరి అమ్మవారైతే కన్యగా ఒకమారు శివదీక్ష పరురాలుగా ఒకమారు - తపోనిష్ఠలో ఉన్న యోగినిగా ఒకమారు - నవ వధువుగా సింగారించుకొని ఒకమారు- చివరకు ప్రియునితో కలిసి భౌమాంతరిక్ష దివ్య సీమలలో విహరిస్తూ ఒకమారు - అనేక భంగిమలలో సాక్షాత్కరిస్తుందా జగన్మాత. ఎక్కడ ఏది ఎంత వరకో అంత వరకు వర్ణించటమా మహా శిల్పికి వెన్నతో బెట్టిన విద్య. దీని వల్ల వస్త్వైక్య దేశైక్య కాలైక్యాలనే త్రిసూత్రి అప్రయత్నంగా సిద్ధించి కావ్యం బాగా చిక్కబడి చక్కగా ఆ మహా కవి ఆసించిన ఫలాన్ని మనకు నిరాఘాటంగా అందించ గలదు. అలాగే అందిస్తున్న దాయన ఈ కావ్య త్రయమూ. అందుకే నేమో వాగర్థావివ సంపృక్తౌ అని రఘువంశాదిలో స్తోత్రం చేయట మా మహా కవి. వాగర్థాలలో వాక్కాయన కావ్య రచన అయితే అర్థం దాని వల్ల ధ్వనించే శివ శక్త్యైక్య భావనే. ఈ వాక్కు ద్వారా ఆ పరమార్థాన్ని అందుకోవటమే ఆయన ఉద్దేశించిన వాగర్థ ప్రతిపత్తి. ఇదే ఆ మహా కవి తన కావ్య త్రయం ద్వారా సాధించిన నవ్యత.

కాళిదాసు కావ్యాలలో ప్రదర్శించిన నవ్యత ఏదో టూకీగా చెప్పుకొన్నాము. ఇక ఆయన తన నాటకాలలో ప్రదర్శించిన దేదో చూడవలసి ఉంది. కావ్యం నవ మన్నప్పు డాయన దృశ్య కావ్యాలను కూడ ఉద్దేశించే గదా నవత్వాన్ని భావించాడని పేర్కొన్నాము. అందులో శ్రవ్యమయింది. ఇప్పుడు దృశ్యమైన నాటక ప్రపంచంలో అడుగు పెడుతున్నాము. నాటకం కావ్యం కన్నా గొప్పదని విమర్శకుల అభిప్రాయం. కావ్యేషు నాటకం రమ్య మన్నారు. నాటకాంతం హి సాహిత్య మన్నారు. సాహిత్య జీవితం నాటక రచనతో సమాప్త మవుతుందట. ఇది అనాలోచితంగా చెప్పిన మాట కాదు. నిజంగా నాటకంతోనే గమ్యం చేరుతుంది సాహిత్య జీవిత యాత్ర. ఎందుకంటే నాటక మనేది మానవ జీవితానికి కేవలమూ ప్రతిరూపం. కావ్యాలతో సహా మిగతా శాఖలన్నీ కేవలం శ్రవ్యాలైతే ఇది ఒక్కటే దృశ్యం. అంటే కంటితో చూచేది. విన్న దాని కన్నా చూచి గ్రహించే దానికి మనసు మీద ఎంతో ప్రభావ ముంటుంది. తన్నిమిత్తంగా కలిగే తృప్తికూడా ఏన్నో రెట్లు హెచ్చుగానే ఉంటుంది. ఇలాటి ప్రత్యక్ష దర్శన మనే గుణం నాటకాని కెంతో విలువ తెచ్చింది.

పోతే రెండవది దాని శైలి. నాటకంలో శైలి సంవాదాత్మకం. తతిమా రచనలలో మాదిరి ఆఖ్యాన రూపం కాదు. పాత్రలు పరస్పరం సాగించే ఈ సంభాషణ ఎంతో సహజంగానూ సన్నిహితంగానూ కనిపిస్తుంది మన జీవితానికి. ఆఖ్యాన మిలా సన్నిహితంగా రాదు. అది పాత్రల తరపున కవి చెప్పే మాట గాబట్టి దూర దూరంగానే పోతుంది. మనసు కంతగా పట్టదు. పాత్రలనేవి కావ్యంలో కవి నిర్మించినవి. కవిని చాటు చేసుకొని పరోక్షంగా మెలగ వలసినవే గాని ముందుకు వచ్చి మన సమక్షంలో నిలబడవు. నాటక పాత్రలు కూడా కవి కల్పితమే. అయినా అవి మనకు కను మరుగయి పోవు. మీదు మిక్కిలి కండ్ల ముందు ప్రత్యక్షమయి తమ వ్యవహారం తామే అభినయించి చూపుతాయి. అందుకే సంవాదాత్మకంగా నడుస్తూ రసజ్ఞుల నంతగా ఆకట్టు కోవటం.

మరొక విశేష మేమంటే నాటక కర్త ఎంత పెద్ద కథ తీసుకొన్నా అందులో ఎంత వైవిధ్య మున్నా దాన్ని యథా సంభవంగా కుదించి వ్రాయగలడు. అందులో చెప్పవలసిన అంశాలు మాత్రమే చెబుతాడు. మిగతా ముప్పాతిక భాగం లుప్తం చేస్తాడు. లుప్తమైతే పూర్వాపర కథా సందర్భానికి భంగం వాటిల్లదా అని ప్రశ్న. అలాటి లోపం మరలా ప్రవేశక విష్కంభాదుల సాధనాలతో పూడ్చు కొంటాడు. పాత్రలు తమలో తాము చెప్పుకొనే మాటల ద్వారా జరిగిన అంశాలనూ జరగబోయే అంశాలనూ చూపకుండానే మనకు చూపినంతగా ఆవిష్కరిస్తాడు. ఈ సూచనలతో అంతా మనం చూచామనే అనుభూతి కలిగి తీరుతుంది. కథా వస్తువునిలా సంక్షిప్తం చేయటం వల్ల సహృదయుడికి విసుగు జనించదు సరిగదా ప్రదర్శిత మైన విషయం మనసులో బాగా హత్తుకొనే అవకాశముంది.

నాటకంలో ఇంకొక గుణం సమస్యలూ- వాటిని పరిష్కరించే విధానం. మామూలుగా కావ్యాలన్నిటిలో- అనగా అనగా ఒక రాజు- అని ఆరంభించి క్రమంగా సాగుతూ పోయి చివర కనుకొన్న చోట ఎక్కడో అంత మవుతుంది. ఇక్కడ నాటకంలో అలా కాదు. మధ్యలో ఎక్కడో మొదలవుతుంది ఇతివృత్తం. కొంచెం సాగీ సాగక ముందే ఒక సమస్య అంకురిస్తుంది. అది పరిష్కార మయ్యేలోపల మరొకటి ఉదయిస్తుంది. అదీ తీరితే ఇంకొకటి. ఇలా ఎక్కడి కక్కడ సమస్య లుత్పన్న మవుతూ- పరిష్కృత మవుతూ- చివర నిర్వహణ సంధిలోగాని అన్నిటికీ పరిష్కార మేర్పడదు. అంత వరకూ తరువాత ఏమిటి- తరువాత ఏమిటి- ఇది ఎలా పరిష్కార మవుతుందనే ఉత్కంఠ రసజ్ఞుల హృదయాల నుఱ్ఱూత లూగిస్తుంది. ఇలాటి సస్పెన్స్ లేదా గోపన మనేది మరి ఏ సాహితీ ప్రక్రియ లోనూ ఇంతగా కాన రాదు.

పోతే ఈ లక్షణాలన్నీ ఒక ఎత్తు. నాటకంలో కథా గమనంలోని బిగువు ఒక ఎత్తు. ప్రదర్శనీయం గదా నాటకమని పేర్కొన్నాము. ప్రదర్శన మన్నప్పు డది మందకొడిగా సాగరాదు. ఎప్పటికప్పుడు రంగమూ దృశ్యమూ మారుతూ

పోవాలి. కదలి ముందుకు సాగాలి. ఒక జీవ నది లాగా మధ్యలో ఎన్ని మలుపులు తిరిగినా తన గమ్యం చేరేదాకా ఎక్కడా నిలవకుండా సాగి పోవలసిందే. దీని మూలంగా నాటక రచనలో ఒక వేగమూ స్పందనా అనివార్యంగా చోటు చేసుకొన్నాయి. దానితో అది చాలా సజీవంగా సంరబ్ధంగా నడుస్తున్న అనుభూతి నిస్తుంది భావుకుడికి.

ఇలాటి విశిష్ట గుణా లెన్నో పొందుపడి ఉన్నాయి నాటక రచనలో. ఇలాటివే మన జీవిత నాటకం లోనూ కనిపిస్తున్నాయి. జగన్నాటక మనే గదా దీనికీ పేరు. ఈ నాటక మెలాటిదో సరిగా ఆ నాటకమూ ఇలాటిదే. ఇది భౌతికమైతే అది వైజ్ఞానికం. ఇంతే తేడా. నటన ప్రధాన మైనదే నాటకం. నటన మంటే అనుకరణం. అనుకరణం దేనికి. మానవ జీవితానికే. కనుకనే జీవిత మెంత సహజమో ఎంత సచేతనమో ఎంత విచిత్రమో- ఎంత సమస్యా బహుళమో ఎంత సత్యమో ఎంత అపరిహార్యమో ఎంత సర్వాంగ సుందరమో- అంత సర్వతోముఖమీ జీవిత సబ్రహ్మచారి నాటకం కూడా. అంచేత నాటకాంతం హి సాహిత్య మన్నారంటే అది అక్షరాలా సత్యం.

ఇంత అనర్ఘమైన ప్రక్రియ గనుకనే ప్రతిభాశాలి అయిన ప్రతి ఒక్క రచయితా తమ తమ భాషలలో చక్కని నాటక మొకటి వ్రాసి తన రచనా కౌశలాన్ని రసజ్ఞ లోకానికి చాటుతూ వచ్చాడు. గ్రీకులూ రోమనులూ ఫ్రెంచ్ వారూ ఆంగ్లేయులూ- ఒకరేమిటి. అన్ని జాతులవారూ నాటక రచనకు శ్రీకారం చుట్టినవారే. షేక్స్పియరు కావ్యాల కంటే నాటకాలకే ఎంతో పేరు వచ్చింది. పోతే మన భారతీయుల దృష్టి కూడా మొదటినుంచీ నాటక రంగం మీదనే మొగ్గు చూపుతూ వచ్చింది. రామాయణ కాలం నుంచే నాటకాలు ప్రచారంలో ఉన్నాయంటే ఇక చెప్పేదేముంది. వధూ నాటక సంఘైశ్చ- సంయుక్తాం సర్వతః పురీం. అయోధ్యలో ఎక్కడ బడితే అక్కడ నాటకసమాజా లుండే వంటాడు వాల్మీకి. అవీ వధూ నాటకాలట. స్త్రీ పాత్రలు ధరించటానికి పురుషు లక్కరలేదు. స్త్రీలే ఉన్నా రంటాడు. దీనిని బట్టి

నాటక కళ ఎప్పటినుంచి మన దేశంలో చెలామణి అవుతున్నదో అర్థం చేసుకోవచ్చు. భారతీయ భాష అయిన సంస్కృతంలో ఇన్ని అన్ని కావు. పరశ్శతంగా రచించారు కవులు నాటకాలను.

అయితే అన్నీ ఒక ఎత్తు. మహా కవి కాళిదాసు రచించిన నాటకాలొక ఎత్తు. ఆయన కావ్యాలూ రచించాడు. నాటకాలూ రచించాడు. ఇలా శ్రవ్య దృశ్య కావ్యాలు రెండింటినీ సవ్యసాచిలాగా నిర్వహించిన కవి మరొకడు మన సాహిత్యంలో లేడేమో కూడా. వ్రాస్తే నాటకాలైనా వ్రాశారు. లేకుంటే కావ్యాలైనా వ్రాశారు. రెండూ వ్రాసిన కీర్తి కాళిదాసు దొక్కడిదే. అంతే గాదు. మిగతా వాళ్ళు నాటకాలు వ్రాసినా అవి కావ్యాల లాగే కనిపిస్తాయి. నాటకాభాసలే గాని నిజానికవి నాటకాలు కావు. ఒక అనర్ఘ రాఘవమూ- మాలతీ మాధవమూ మహా వీర చరితమూ ఉత్తర రామ చరితమూ- ఇలాటి వేవి చూచినా మనకు తార్కాణ మవుతుంది. గొప్ప భావుకత్వమున్న కవులే వారందరూ. కాని వారు నాటక మనుకొంటూ కావ్యం వ్రాసి కూచున్నారు. మరి నాటకంగానే తీర్చి దిద్దిన వారూ కొందరు లేకపోలేదు. శూద్రకుని మృచ్ఛకటిక మైతేనేమి. విశాఖ దత్తుని ముద్రా రాక్షస మైతేనేమి. నాటక శిల్ప ముట్టిపడే రచనలు. సందేహం లేదు. కాని అవి తావన్మాత్ర పర్యవసాయులే. అంతకు మించిన కళాదృష్టి అనే విశిష్ట ప్రయోజన మందులో లేదు. పోతే భాస మహా కవి నాటకా లున్నాయి. కాళిదాసు కన్నా ముందు వ్రాసిన వవి. చాలా ఉదాత్తమైన నాటకాలనటంలో ఎలాటి విప్రతిపత్తీ లేదు. నాటకాని కుండవలసిన లక్షణాలన్నీ కనిపిస్తాయి. కాని లోతుకు దిగి చూస్తే వాటిలో కూడా ఒక వెలితి కనిపిస్తుంది. ఉండ వలసినంత సరసతా నిలకడా నిండుదనమూ కానరావు. ఎవరో తరుముకు వచ్చినట్టు పరుగెడు తుంటాయవి. భావతీవ్రత కున్న స్థానం స్తిమితతకు లేదు. ధర్మ పరత్వం మీద ఉన్న దృష్టి రచయితకు సరసత మీద లేదు. ఉదాత్తతతో పాటు ఉజ్జ్వలతకు స్వాగతం పలకలేదని తోస్తుంది మనకు.

కాగా వీటన్నిటికీ పూర్తి విలక్షణమైన బాణిలో నడిచింది కాళిదాసు నాటక శిల్పం. మరి అతడు కూడా ఎంతగానో మెచ్చిన భాస ముని నాటకాలలో కూడా కరువైన ఆ అద్భుత శిల్పం కాళిదాసులో ఏమిటా- అది ఎలాంటిదా- అని ప్రశ్న వస్తుంది. ఇది కాళిదాసు ఏదో ఆత్మ సంభావనతో చెప్పుకొన్న మాట కాదు. ఎంతో ఆత్మ విశ్వాసంతో లోకానికి చాటిన సత్యం. స్వాతి శయంతోనే చెప్పి ఉంటే అలాటి నాటకాలు రసజ్ఞ శేఖరులైన ఆనాటి సామాజికులు చూచేవారు కాదు. చూచినా మెచ్చేవారు కాదు. ఇది ఆ పరితోషా ద్విదుషాం అని వాపోయిన కవి మాటలలోనే మనకు స్పష్టంగా తార్కాణ మవుతున్నది. కాని ఇన్నాళ్ళ నుంచీ ఇన్నేళ్ళ నుంచీ ఆయన రచనలకు ప్రచారం వచ్చిందంటే- అలాటి ప్రచారం తత్సమ కాలికమైన వాటికీ తత్పూర్వ కాలికమైన వాటికీ రాలేదంటే- నిజంగా ఆయనగారు సెల విచ్చినట్లు నవనవోన్మేష భాసురాలే అవి. సందేహం లేదు. అయితే ఏమిటా అనితర కవి సాధ్యమైన నవీనత అని అడగవచ్చు.

మొదటి దాయన ఏది గానీ నాటకంగా వ్రాయగలడు. కావ్యంగానూ వ్రాయగలడు. అంటే కావ్యం వేరుగా నాటకం వేరుగా నని కాదు అర్థం. అది ఎలాగూ చేసి చూపాడాయన. రఘువంశాదులైన కావ్యాలూ వ్రాశాడు. శాకుంతలాదులైన నాటకాలూ వ్రాశాడు. అది కాదు నేను చెప్ప దలచిందిక్కడ. నాటకాన్నే ఒక కావ్యంగా దిద్ది చూప గల డాయన. అలాగని మరలా నాటకీయతకు భంగం రానీయడు. నూటికి నూరుపాళ్ళూ నాటక మనిపిస్తూనే అద్భుతమైన కావ్య శిల్పాన్ని కూడా అందులో చొప్పించి చూపగల నేర్పరి. ఏక కాలంలో శ్రవ్య దృశ్య లక్షణాలు రెండూ మేళవించి ఇది నాటకమా కావ్యమా అని పోల్చుకోలేని ఒక అనిర్వచనీయ స్థితిని కల్పిస్తాడు భావుకుడి చిత్తానికి. నాటక మనుకొంటే అది నాటకం. కావ్య మనుకొంటే కావ్యం. అర్ధనారీశ్వరుడి లాగా ఎటుతిప్పితే అటు రెండు భూమికలలో దర్శన మిస్తుంది రచన. రెండంచాలా పదునైన కత్తి లాంటిదిది. కాళిదాసు కొక్కడికే దైవదత్తమైన ఒక మహా శక్తి. మరి ఏ నాటక కర్తకూ కాన రాదు. వారు నాటకంలో

నాటకీయతను పోషిస్తే కావ్య గతమైన శిల్పం దెబ్బతిని నీరస మనిపిస్తుంది. కవితా గుణం పాటిస్తే నాటక శిల్పం కుంటు పడి మొదలు చెడ్డ బేర మవుతుంది. రెండూ ఒక దానితో ఒకటి పెన వేసుకొని ఏక ధారగా కొనసాగే హొయలు వారి నాటక రచనలోనే మృగ్యమైన మహాభాగ్యం. అలాటి భాగ్యశాలి కాళిదాసు ఒక్కడే. దీనికి తోడు సహృదయ సమ్మోహనమైన ఒకానొక భాష ప్రయోగిస్తాడు మహాకవి. అది మరీ అపురూపం. శబ్ద స్వీకారంలోగాని వాక్యవిన్యాసంలోగాని అతని పోకడే వేరు. ఆ పోహళింపే వేరు. ఎంత సుందరమో అంత సహజం. ఇతరుల భాష అయితే అతి ఆడంబరంగా నైనా సాగుతుంది. లేదా అతి నిరాడంబరంగా నైనా నడుస్తుంది. భవ భూతి మురారి ప్రభృతులది మొదటి తరగతి అయితే - భాస సౌమిల్లకాదులది రెండవ జాతి. వీటి రెండింటి సంగమ క్షేత్రం కాళిదాసు కలవడిన భాషా శైలి.

పోతే రెండవ నవీన గుణం కాళిదాసులో ఆయన లలిత కళా ప్రావీణ్యం. సందర్భోచితంగా ఆయన చేసే వర్ణనలో పాత్రలచేత ఆడించే మాటలలో బహుముఖమైన ఆ వైదుష్యం మనకు కొట్టు వచ్చినట్టు కనిపిస్తుంది. మిగతా వారివలె కాక ఆయన సంగీతాది లలిత కళ లన్నిటిలో ఆరితేరిన వాడు. ప్రియ శిష్యా లలితే కళావిధౌ- అని అజుడిమీద నెపం పెట్టి తన ప్రియురాలికే తన విద్య నేర్పుతూ వచ్చాడేమో నని కూడా నా అనుమానం. ఎంత అభిమానమో ఆకళల మీద- అంతగా వాటిని జీర్ణించుకొన్నాడు జీవితంలో. కనుకనే రచనలో ఎక్కడ చూచినా వాటి సంస్కారం తొంగి చూస్తుంటుంది. అది సంగీతమే గాదు. శిల్పమే గాదు. చిత్రమే గాదు. నాట్యమే గాదు. అన్ని కళలనూ కుమ్మరించేశాడు నాటకాలలో. వీటినిలా కుమ్మరంచా డంటే సందర్భ శుద్ధి ఏ మాత్రమూ చెడనీయడు మరలా. తిరగమాత లాగా వాటి ఘాటు నాటకమంతా గుబాళిస్తూ రసజ్ఞులనీ భౌతిక జగత్తునుంచి మోసుకుపోయి ఒకానొక కళా జగత్తులో దింపుతుంది. నాటకం చదువుతూ ఉన్నంత సేపే గాక చదివి ముగించిన తరువాత గూడా ఎంతో కాలం దాని పరగణాలలోనే

మన మనస్సు తిరుగుతూ ఉంటుంది. ఇలాటి లోకోత్తర కళానుభూతి మిగతా నాటకా లేవిగానీ ఈయలేవు మనకు. అసలాయా ప్రకృతి దృశ్యాలను వర్ణిస్తున్నప్పుడు కూడా మహా కవి మన హృదయాల కందించే రసానుభూతి ఏ నాటక రచయితా ప్రసాదించ లేడు.

పోతే మూడవ లక్షణ మేమంటే కాళిదాసు నాటక నిర్మాణ రహస్యాన్ని ఆకళించు కొన్నంత లోతుగా మరెవ్వరూ ఆకళించుకో లేదని తోస్తుంది. నాటకమంటే ఈ జగన్నాటకానికి ప్రతిబింబమే నని గదా మనవి చేశాను. జగత్తనే బింబమెలా ఉందో అలాగే ఉండాలా ప్రతిబింబం కూడా. జగత్తనేది త్రిగుణాత్మకం. అందులో రజోగుణం వల్ల జగత్సృష్టి జరిగితే సత్త్వ గుణం వల్ల దానికి స్థితి ఏర్పడింది. కాగా తమో గుణం వల్ల అది మరలా లయం చెందుతున్నది. ఇలా త్రిగుణాల మూలంగా సృష్టి స్థితి లయాలెలా ఏర్పడుతున్నవో- అలాగే దీనికి ప్రతిరూపమైన నాటక జగత్తులో కూడా ఏర్పడుతున్నాయి. అయితే ఇక్కడికి వచ్చేసరికి గుణాలనే పేరు మారి వాటికి రసాలనే పేరు వచ్చింది. రసాలు తొమ్మిదని వాడుక. కాని ప్రధానమైన రసాలు మూడే. మిగతా ఆరూ వాటి పరివార దేవతలు. ఆ మూడూ ఒకటి శృంగారం. రెండు వీరం. మూడు శాంతం. ఇందులో శృంగారం సృష్టికీ- వీరం స్థితికీ- శాంతం లయానికీ సంకేతాలు. మొదటిది వైయక్తికమైన జీవితానికి చెందినదైతే- రెండవది సమాజా భ్యుదయానికి తోడ్పడితే- మూడవది సార్వ జనీనమైన శ్రేయస్సుకే మార్గ దర్శకం. మూడూ కలిసి మొత్తానికి జీవిత సర్వస్వాన్నే మూట గట్టి చూపుతున్నాయి. ఈ మార్మికమైన భావాన్ని సునిశితంగా చూచి పట్టుకొన్నాడు మహా కవి. కనుకనే ఈ సూత్రాని కనుగుణంగా తన నాటకాలలో కథానాయకులను చిత్రిస్తూ వచ్చాడు. కాళిదాసు నాయకుడు కేవల శృంగారిగా కాముకుడుగా కనిపిస్తుంటాడు పైకి. కాని నిదానించి చూస్తే అతడు శృంగారి మాత్రమే కాడు. ఎంత శృంగారియో అంత వీరుడు. ఎంత వీరుడో అంత శాంతుడు. మూడు రసాలూ కరువున బోసి చేసిన విగ్రహం.

శృంగార వీరాదులను మరలా మనమిక్కడ సాంప్రదాయికంగా కాక సాంకేతికంగా అర్థం చేసుకో వలసి ఉంది. శృంగార మంటే తాత్పర్యం సరసమైన హృదయధర్మం. వీరమంటే దుష్ట శిక్షణ ఆర్త జన రక్షణాదులు. శాంతమంటే వినయమూ వివేకమూ జ్ఞానవైరాగ్యాదులూ. ఇలాటి ఉన్నతమైన ఆదర్శాలన్నీ ఒకే ఒక పాత్రలో పొందు పరిచి అలాంటి వ్యక్తినే కథా నాయకుడుగా చేయటమే కాళిదాసులోని విశిష్టత. ఇది మరే నాటకంలోనూ కానరాని రహస్యం. దీనితో ధీరోదాత్త ధీరలలిత ధీరశాంతాదిగా ఆలంకారికులు చేసిన విభాగానికి కూడా చక్కని వ్యాఖ్యానం చేయగలిగాడు మహా కవి. ధీరోదాత్త అంటే వీరం. ధీరలలిత శృంగారం. పోతే ధీరశాంత శాంతమే. ఈ మూడింటికీ నాయకుడు ప్రతీక అయితే- ధీరోద్ధత అనే నాలుగవ దానికి ప్రతీక ప్రతి నాయకుడని కాళిదాసు చేసిన భావన. లోకకంటకమైన అలాటి ఉద్ధతత్వాన్ని అణచిపుచ్చి లోక కల్యాణానికీ- తద్ద్వారా లోకోత్తరమైన నిశ్శ్రేయసానికీ నోచుకోవాలి ప్రజా జీవితం. అందు కోసమే కాళిదాసు తన నాయక పాత్రలో ఈ త్రిగుణాలనే త్రివేణీ సంగమాన్ని నెలకొల్పటం. నాయకుడి ఈ సృష్టి ననుసరించే మిగతా పాత్రల నన్నింటినీ సృష్టిస్తాడు కాళిదాసు. వాటికొక ప్రాతిస్వికమైన ప్రయోజన మంటూ లేదు. ఈ మహా దర్శాన్ని నాయకుడు సాధించటానికి తోడ్పడటమే వాటి ప్రయోజనం. ఇది కూడా మనం గుర్తుంచుకో వలసిన ఒక గొప్ప రహస్యం. నాయకుడిలో శృంగార ప్రవృత్తి కాలంబనంగా ఒక నాయిక ఒక విదూషకుడు. వీరాని కనుగుణంగా శత్రు రాజులూ లేక రక్షఃపిశాచాది దుష్ట శక్తులూ - వారిని నిర్మూలించే ఉద్యమంలో ఇంద్రాది దేవతలకు కూడా అతడు సహకరించటం. కాగా ఇక శాంతాని కాశ్రయంగా కణ్వ నారదాది మహర్షులూ వారితో సాంగత్యమూ. ఇలాంటిదే ఎక్కడ చూచినా ఆయన నాటకాలలో విభిన్నమైన పాత్ర సృష్టి. ఇవన్నీ ప్రధాన నాయకుడిలో అంతర్లీనంగా ఉన్న ఆ భావత్రయానికి ముడిపడి ఆ మార్గంలో పయనించటానికే. పాత్రల నింతకన్నా ఎక్కువ మోతాదులో సృష్టించ వచ్చు ఎక్కువ వైవిధ్యంతోనూ ప్రదర్శించ వచ్చు మిగతా నాటక

కర్తలు. కాని ఒకే ఒకకేంద్రం చుట్టూ తిరిగే రేఖలలాగా ఒకదాని కొకటి అంటి పట్టుకొని అన్నీ కలిసి చివరకొకే కేంద్ర బిందువులో చేరిపోయి కవి ఆశించిన ఆదర్శాన్ని సహృదయుడి మనసులో బలంగా హత్తుకునే లాగా చేయటంలో కాళిదాసు కున్న నేర్పు మరెవరి లోనూ కాన రాదు.

పోతే ఇక నాలుగవదీ అన్నిటికన్నా అపూర్వమైనదీ ఒకే ఒక మహా గుణముంది కాళిదాసు నాటక రచనలో. అది నాటక గమ్యం మీద ఆయనకున్న దృష్టి. ఈ దృష్టినే కావ్య ధ్వని అనీ కావ్యార్థమనీ రకరకాలుగా వ్యవహరిస్తారు ఆలంకారికులు. కావ్య తత్త్వమన్నా ఇదే. వారు శ్రవ్యానికి చెప్పినా నాటకానికి కూడా ఆవశ్యక మది. జీవితానికి సాక్షాత్తూ ప్రతిరూపం కాబట్టి నాటకానికే ఇంకా ఎక్కువ అవసరం. ఒక గమ్య మనేది లేకపోతే అగమ్య మవుతుంది కావ్య సృష్టి. సత్య శివ సుందరాలనే త్రిపుటిలో సత్యం కావ్య వస్తువైతే- సుందరం దాని రచన అయితే- శివం దాని గమ్యం లేదా లక్ష్యం. లక్ష్య మెప్పుడూ శివంగానే ఉండాలి. అశివం కారాదు. అది కావ్యాని కెలాగో నాటకానికీ అలాగే నని చెప్పాము. నాటకంలో ఈ శివంవైపు దృష్టి పోలేదు చాలా మంది రచయితలకు. కొద్ది మంది పెద్దలకు పోయినా అది ఎంత దూరం పోవాలో అంత దాకా పోయింది కాదు. మహా అయితే లోక నీతి- ధర్మ నిర్వహణా- ఇలాటి అవధుల వరకే సాగి అక్కడికే ఆగిపోయింది. భాస విశాఖదత్త భవభూతి శూద్రకాదుల బుద్ధులు కూడా తావన్మాత్ర పర్యవసితాలే.

కాగా కాళిదాస మహా కవి ఒక్కడే జీవితపు టెత్తూ లోతూ రెండూ కొలత వేసిన వాడు. ఆయన కిటు ఇహం మీదా ఉంది చూపు. అటు పరం మీదా ఉంది. పరిపూర్ణమైన మానవ జీవితాన్ని ప్రదర్శించా డాయన. ఎంత దర్శించాడో దాన్ని అలాగే ప్రదర్శించాడు. ఇందులో దర్శించటం మూలాన ఋషి అయితే ప్రదర్శించటం ద్వారా కవి అనిపించుకొన్నాడు. ఏ ఆదర్శం చూపదలచాడో అది కథావస్తువులో ఆద్యంతమూ పరచినట్టు బాగా పనగలిసి ఉంటుంది. పైగా అదే తన దృష్టి అని మన దృష్టిని దానిపై మళ్ళించటాని

కక్కడక్కడా వ్యంగ్య మర్యాదలో ఎన్నో సూచనలు చేస్తూ పోతాడు. ఇహ పరాలను రెంటినీ కలిపే ఆ ఏకైక సూత్రంలో మణులూ మాణిక్యాలలాగా ఆయా సన్నివేశాలూ పాత్రలూ వారి ప్రవృత్తులూ-మాటలూ చేష్టలూ - ఒకటేమిటి. కావ్య సామగ్రిలో ప్రతి ఒక్క అంశాన్నీ సడలకుండా గుది గుచ్చి ఒక చక్కని రత్నహారాన్ని తయారుచేసి సహృదయుల హృదయద్వారాన్ని అలంకరిస్తాడు. దానితో ఒక మహా పురుషుని జీవితం మాదిరే నాటక రచన కూడా ఒక మహోన్నతమైన విన్నాణంతో ప్రకాశిస్తుంది.

ఇదుగో ఇలాటి నానా విధ గుణగణోద్ఘాటకాలు కాళిదాస మహాకవి నాటకాలు. నవనవోద్భాసిత హాటకాలు కూడా. హేమ్న స్సంలక్ష్యతే హ్యగ్నౌ అని ఆయనే సెలవిచ్చినట్టు సహృదయులు తమ వివేచనాగ్నిలో ఎంత పుటం పెడితే అంతగా ప్రకాశిస్తాయి. అదే నవీనత అంటే. ఈ నవీనత ఏదోగాదు. ఆయన కలవడిన ప్రత్యభిజ్ఞాదృష్టే. అది మహాకవి శ్రవ్య కావ్యాలలో ఎలాగో దృశ్య కావ్యాలైన నాటకాలలో కూడా అలాగే రాశీ భూతమై కనిపిస్తుంది. ఇంకా ఎక్కువ మోతాదులోనే కనిపిస్తుంది. దుర్బలమైన పాఠకుని దృష్టికది నూటికి నూరిపాళ్ళూ అలా కనిపిస్తుందో లేదోనని ఆయనకే అనుమానం కాబోలు. తాను రచించిన మూడు నాటకాలకు వ్రాసిన మూడు నాందీ పద్యాలలోనూ భంగ్యంతరంగా దాన్ని బయట పెడుతూనే వచ్చాడు. మామూలుగా నాందీ పద్య మనేది ఏ నాటకంలో గానీ మూడు ప్రయోజనాలలో ఏదో ఒకటి సాధించటానికే ఉద్దిష్టం. ఆశీ ర్నమస్క్రియా వస్తు నిర్దేశః అని ఆలంకారికులే సూత్రీకరించారు. ఆసూత్రాని కనుగుణంగానే నడిచాయి నాటకాలన్నీ. కాని కాళిదాసు రచించిన నాటక త్రయ మలా నడచి నట్టు కనిపించదు. వస్తు నిర్దేశం లేదందులో. నమస్క్రియా కాన రాదు. పోతే ఆశీస్సనేది కనిపిస్తుంది. కాని ఆ ఆశీస్సు ద్వారా మన క్కావ్యార్థ సూచనం చేయ వలసి ఉంది కవి. భాస నాటకాదులలో కనిపిస్తుం దది. అలాటి కావ్యార్థ సూచన స్పర్శ కూడా లేదు కాళిదాసు నాందీ పద్యాలలో. కేవలాశీర్వాద రూపమే. అందులోనూ అతి

గంభీరమైన అద్వైత భావం- దానిలోనూ శివాద్వైతమే గోచరిస్తుంది మనకు. దీనికీ నాటక కథకూ ఏమి సంబంధమని అడిగితే సామాన్య పాఠకుడి మనసు కేదీ స్ఫురించదు. బాగా లోతుకు దిగి చూచిన భావనా శీలుడికే స్ఫురిస్తుందా క గొప్ప సమన్వయం.

అది ఏదోగాదు. ఇంతకు ముందు గానే నేను వ్రుచ్చిన ఇహ పరాల సమన్వయం. శక్త్యాభిన్నమే ప్రపంచం. మరి ఆ శక్తి శివ భిన్నమే. కారణస్యాత్మ భూతా శక్తి:- శక్తే రాత్మ భూతం కార్యమన్నారు భగవత్పాదులు. అన్నిటికీ మూల కారణ మాపరమాత్మ. ఆయన నాశ్రయించిన పరాశక్తి ఆయన స్వరూపమే. కాగా ఆ శక్తి నుంచి ఏర్పడ్డ ఈ భౌతిక ప్రపంచమంతా ఆ శక్తి స్వరూపమే. ప్రపంచం శక్తి స్వరూపమైతే శక్తి పరమాత్మ స్వరూపం. అప్పటికి శివ శక్తి జగత్తులని త్రిపుటిగా కనిపిస్తున్న ఈ ద్వైత కలాపమంతా అంతర్ముఖంగా భావన చేస్తే నిజానికి సంపుటీకృత మైన శివాద్వైత రూపమే. ఇది అంచెల వారిగా మన బుద్ధులకె క్కించటానికే ఈ మూడు నాందీ శ్లోకాలు ఉద్దేశించ బడ్డట్టు తోస్తుంది నాకు. ఇది ఇంతకు ముందే వ్యాఖ్యానించినా ఈ వెలుగులో క్రొత్తగా వ్యాఖ్యానించి చూడ వచ్చు. శాకుంతలం నుంచి మనమీ మార్గంలో విక్రమోర్వశీయం దాకా పయనించవలసి ఉంటుంది. యా సృష్టి:.... అష్టాభిరీశ:- అని శాకుంతల పద్యం. ఆ ఈశ్వరుడు మిమ్ములను కాపాడు గాక. ఎలాంటి ఈశ్వరు డాయన. ప్రత్యక్షంగా మనందరికీ కనిపించే పృథివ్యాదులైన ఎనిమిది శరీరాలూ లేదా ఉపాధులతో కూడిన వాడు. ఆయన కాకపోయినా ఆయన ఉపాధులు కనిపిస్తున్నాయి మనకు. ఇది మొదటి దశ. దృష్టాచ్చ అదృష్ట సిద్ధి: అన్నా రాచార్యులవారు. దృష్టమైన దాన్ని బట్టే అదృష్టమైన తత్త్వాన్ని అందుకోవాలి ఎప్పటికైనా. కనుకనే ఇది మొదటి భూమిక అని చెప్పటం.

పోతే ఇక రెండవది దానినందు కొనే విధాన మేమిటని. ఆ విధానాన్ని బయట పెడుతున్నది మాళవికాగ్ని మిత్రంలో నాందీ శ్లోకం. ఏకైశ్వర్యే

స్థితోపి.... తామసీం వృత్తిమీశః - నిశ్శ్రేయసమే సాధకు డందుకో వలసిన ఏకైక ఫలం. అది మనకిప్పు డదృష్టం. ఎలా దృష్ట మవుతుందది. దృష్టి నిరోధం తొలగితే. ఆ నిరోధకమైన దేమిటి. తామసీ వృత్తి అంటాడు మహా కవి. తమస్సంటే అవిద్య అజ్ఞానం. మన శివ స్వరూప మేమిటో మనం గుర్తించక పోవటం. అదే జ్ఞానాన్ని ఆవరించిన మహా శక్తి. అమ్మవారి తిరోధాన శక్తి ఇది. దీన్ని తొలగించుకొంటే గాని సన్మార్గాన్ని ఆలోకించ లేము. ఆలోకిస్తేగాని అపవర్గాన్ని అందుకోలేము. అయితే అది తొలగి ఇది కలగాలంటే ఈశ్వరాను గ్రహ ముండాలి. ఆ ఈశ్వరాను గ్రహ మూరక రాదు. సాధకుడి ప్రయత్నం కూడా ఉండాలి. అది ఏదో కాదు. శివేతరంగా కనిపించే అనాత్మ జగత్తు నంతటినీ శివాత్మకంగా దర్శించటమే. వస్తుతః ఈ జగత్తు శివాత్మకమే. శివేతరం కాదు. వికల్పించి చూస్తేనే శివేతరం. వికల్ప రహితంగా చూస్తే ఇదే శివాత్మకం. వికల్పమంటే ఇది అనుకూల మిది ప్రతి కూల మనే ద్వంద్వం. ఐశ్వర్య మనుకూలం. దారిద్ర్యం ప్రతికూలం. కాంతా సంయోగ మనుకూలం. తద్వియోగం ప్రతికూలం. రెండూ నా స్వరూప ఖండాలే నని భావించి నప్పుడేదీ అనుకూలం కాదు. ఏదీ ప్రతి కూలం కాదు. అంతా అనుకూలమే. స్వరూపమే నన్నప్పుడిక ప్రతి కూలమనే భావమేముంది. అయితే ఇది తాను నిరుపాధిక మనుకొన్న ప్పుడే సాధ్యంగాని సోపాధికమని భావిస్తే సాధ్యం కాదు. సర్వవ్యాపకమైన ఈశ్వర చైతన్యాన్ని శరీరమాత్ర పరిచ్ఛిన్నమని భావిస్తే ఎలా. అలా భావిస్తే దాని కభిమానమని పేరు. అభిమాన మున్నంత వరకూ అమూర్తమైన శివతత్త్వం అష్టమూర్తులుగా భిన్నమై భాసిస్తుంది. భాసించిన కొద్దీ అనుకూల ప్రతికూలాలనే వికల్ప దృష్టికది దారి తీస్తుంది. కాబట్టి ఈ ఉపాధి గతమైన అభిమానం పోవాలి సాధకుడికి. అప్పుడే వాడి మనసు నావరించిన తమః పుంజం విరిసిపోయి ఆ సన్మార్గ మేదో స్పష్టంగా గోచరిస్తుంది.

కాగా ఈ మార్గంలో నడచి పోయి చేరే ఆ గమ్యం కూడా ఎలా ఉంటుందో అంత వరకూ అదృష్టమై అప్పుడు దృష్టమయ్యే ఆ నిశ్శ్రేయస మెలాటిదో వర్ణిస్తుంది విక్రమోర్వశీయంలోని నాందీ పద్యం. వేదాంతేషు....నిశ్శ్రేయసాయాస్తు వః-ఎంత కన్నా ఇక శ్రేయస్సు లేదో అది నిశ్శ్రేయసం. ఎప్పుడో పోగొట్టుకొని నానా యాతనలు పడుతున్న మనం మన స్వరూపాన్ని మరలా రాబట్టుకొని బ్రహ్మానంద మనుభవించటం కన్నా శ్రేయస్సే ముంది జీవితానికి. ఇందులో పోగొట్టుకోవటం అవిద్యా తమస్సు వల్లనైతే రాబట్టుకోవటం విద్యా తేజస్సు వల్ల. విద్య అనే ఆ తేజస్సు ఉదయిస్తే అనేకాత్మకంగా భాసించే ఈ జగత్తంతా ఏకాత్మకంగా దర్శన మిస్తుంది. అది అప్పుడు అశివం కాక శివాత్మకం మన పాలిటికి. వేదాంతాలన్నీ లోకానికి చాటి చెప్పే ఏక పురుషు డదే నంటాడు మహా కవి. ఉత్తమః పురుష స్త్వన్యః అని భగవద్గీత బోధించే పురుషుడు. పూర్ణత్వాత్ పురుషః పరిపూర్ణమైన తత్త్వ మని అర్థం. భూనభోంతరా లన్నింటినీ వ్యాపించిన తత్త్వమది. ఈశ్వరుడనే పేరు దానికే చెల్లు. అనాత్మ జగత్తునంతా ఈశనం చేసేది ఆత్మ చైతన్యమే గదా. చైతన్య స్పర్శ లేక పోతే దేనికి గానీ బ్రతుకు లేదు. అస్తిత్వానికే నోచుకో లేదది. కనుకనే అంతా ఆత్మ స్వరూపమే నని ఘోషించటం. అంటే అప్పటికి శివ తత్త్వం కన్నా భిన్నమైన పదార్థమే లేదన్న మాట. అన్న మాటేమిటి. ఉన్న మాటే. ఉన్న మాట గనుకనే అది మనకు దూరంగా ఎక్కడో ఉన్నమాట అని భావించక మన స్వరూపంగా కన్న మాట అని చూడాలి ముముక్షువు. ప్రాణాద్యుపాధుల గోల నరి కట్టి అంతర్ముఖ దృష్టితో పట్టుకోవాలి దాన్ని. అధిష్ఠానంగా ఇక్కడే ఉన్నా శరీరాద్యారోపితాల క్రింద జేరి మరుగు పడి పోయిందది. సోహ మ్మనే ఈశ్వర ప్రత్యభిజ్ఞా బలంతో తిరగ తోడితే ఈ మరుగు తొలగి పోయి అది మరలా కోటి సూర్య ప్రభా భాసురంగా సాక్షాత్కరిస్తుంది. అప్పుడనేక మనే మాట లేదు. అంతా ఏకమే. శివమూ శివమే. శివేతరమూ శివమే. ప్రత్యక్షంగా కనిపించే ఈ అనాత్మ జగత్తూ -

పరోక్షమని భావించే ఆ ఆత్మ చైతన్యమూ - రెండూ ఆత్మ స్వరూపంగా ప్రత్యక్షమే సాధకుడికి. చైతన్యం శివ రూపంగానైతే - జగత్తు శక్తి రూపంగా.

ఇదుగో ఈ శివ శక్తి సామరస్య రూపమైన ప్రత్యభిజ్ఞా సూత్రాన్ని సజీవంగా చిత్రించటానికే మహా కవి మూడు కావ్యాలతో తృప్తి చెందక మూడు నాటకాలు కూడా రచించాడు. ఇంకా బలంగా చిత్రించాడ భావాన్ని వీటిలో. ఆ భావ చిత్రాన్ని మనకు సూచన చేయటానికే నాటకారంభంలో వర్ణించిన ఈ మూడు నాందీ శ్లోకాలూ. మనాక్కావ్యార్థ సూచన చేయాలని కదా ఆలంకారికు లాదేశించారు. ఆ సూచన మనాక్కేమి కర్మ మహా విపులంగానే చేసి చూపాడు కాళిదాసు. నా కావ్యార్థ మేదో కాదు. ఈ ప్రత్యభిజ్ఞా దర్శనమే సుమా. దీన్ని ఎంతో గుప్తంగానూ ప్రకటంగానూ నిరూపిస్తూ వచ్చాను నా నాటకాలలో. చాలా జాగ్రత్తగా తడవి చూడండి మీకే చేతికి తగులుతుంద నిక్షేపమని ఈ నాందీ వ్యాజంతో చాటుతున్నాడు. మహా కవి వీటి ద్వారా చేసిన కావ్యార్థ సూచన ఇది. ఇది మనకాయన మూడు నాటకాలలోనూ ఎంత కోరితే అంత పుష్కలంగా లభిస్తుంది. శ్రవ్యకావ్యాలు ఎన్ని రచించాడో దృశ్యాలు కూడా అన్నే రచించా డాయన. మాళవికాగ్నిమిత్రం- విక్రమోర్వశీయం- అభిజ్ఞాన శాకుంతలం. ఈ మూడు నాటకాలూ ఆయన ఈ ఆదర్శానికి మూడు అద్దాల మహళ్ళు. అన్నీ ఆయన ఆదర్శాన్ని బయటపెట్టే ఆదర్శాలే. అభిజ్ఞాన శాకుంతలంలో నైతే ప్రత్యభిజ్ఞానానికి ద్యోతకమైన అభిజ్ఞానమనే మాటే కంఠోక్తిగా బయటపెట్టాడు. నాటక మధ్యంలోకూడా అభిజ్ఞానమనే కాక ప్రత్యభిజ్ఞాన మని కూడా అప్రయత్నంగా నోటవచ్చింద మహా కవికి. యదినామ స రాజా ప్రత్యభిజ్ఞాన మంథరో భవేత్ - తత స్తస్యేద మాత్మనామ ధేయాంకితం అంగులీయకం దర్శయ - అని అనసూయ నోట పలికిస్తాడు. ప్రత్యభిజ్ఞానం లేక మందకొడిగా మారితే ఆరాజ-నీవతనికి ఉంగరం చూపు - జరిగిన ఉదంతం జ్ఞప్తికి వస్తుందంటుంద చెలికత్తె శకుంతలతో.



Yalamanchili Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

ఇలాటి ప్రత్యభిజ్ఞాన మాంధర్యమీ రాజుకే కాదు. మిగతా ఇద్దరు రాజులకు కూడా ఇదే జబ్బు. ముగ్గురూ నవ యువకు లేమీ గాదు. వయసు మళ్ళిన వారే. బాగా వయసు మళ్ళిన వారినే ఎన్నుకొన్నాడు మహాకవి తన కథా నాయకులుగా. మరి మతిమరుపు లేక ఎలా పోతుంది. బుద్ధి నవనవోన్మేషంగా ఎలా పని చేస్తుంది. అలా పని చేస్తూ వచ్చింది వారికి గాదు. వారి నాయికలకు. వారు ముప్పురూ మంచి జవ్వనంలో ఉన్న నాయికలు. మాళవికేమి- ఊర్వశి ఏమి-శకుంతలేమి. ముగ్గురూ తరుణులే. శృంగార నాయికలు ముగ్గురికీ ముగ్గురూ ప్రతీకలే. ఒకతి ముగ్ధ. ఒకతి మధ్య. ఒకతి ప్రౌఢ. శకుంతలలో ముగ్ధను చూచాడు కాళిదాసు. మాళవికలో మధ్యను చూచాడు. పోతే ఊర్వశిలో బాగా ప్రౌఢను దర్శించాడు. విత్తేశానాం నచ ఖలు వయో యౌవనా దన్య దస్తి అని మేఘసందేశంలో తానే వర్ణించినట్టుగా ఊర్వశి సాక్షాత్తూ అప్సరసే కాబట్టి నిత్య యౌవన. మిగతా ఇద్దరూ తరువాత పరిణత లైనా అప్పటికి యువతులే. అప్సరసల లాంటి వారే. శకుంతల అప్సరస్సంభవే గదా. మాళవిక అప్సరస్సంభవ కాకున్నా అగ్నిమిత్రుడి కంటికి- కాదు కాదు- కాళిదాసు కంటి కప్సరసే. ఊర్వశి నింగి నుంచి నేలకు దిగిన అప్సర అయితే-శకుంతల నేలమీది నుంచి నింగి కెగసిన అప్సరస. పోతే నేల మీదనే ఎక్కడి నుంచో ప్రచ్ఛన్నంగా పయనించి ఎక్కడో దర్శన మిచ్చిన అప్సరస మాళవిక. అందరూ అప్సరసలే కవి దృష్టి కందరూ నవ యౌవనలే. ఇందులోనూ- ఈ నాయికా నాయక సృష్టిలోనూ- శివ శక్తి తత్త్వ రహస్యమే కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది మన మనోనేత్రానికి. కాళిదాసు దృష్టిలో నాయకు లందరూ శివ ప్రతీకలూ- నాయిక లందరూ శక్తి ప్రతీకలేనని కదా సూచించాము. శివుడు పురాణ పురుషుడు. ఆయన వయస్సింత అని చెప్పలేము. అనాది నిధనుడైన వాడి వయసుకు కొలత ఏముంది. ఎంతైనా వృద్ధుడాయన. కనుకనే నాయకులంతా వృద్ధులయి కూచున్నారు నాటకాలలో. పోతే ఆ శివతత్త్వాన్ని ఆశ్రయించిన పరా శక్తి మాత్ర మలాంటిది కాదు. ఆవిడ ఆయన లాగా పురాతనే అయినా కామరూపిణి. నామ రూప క్రియాత్మకంగా ఎలాగంటే అలా పరిణమించ గలదు. ఎంత

పురాతనో అంత నిత్య యౌవన కూడా. నిత్యమూ మారుతున్నప్పుడు వార్ధక్య మెక్కడిది. నిత్య యౌవనే. అందుకే శారదా గౌరీ బాలా కుమారీ అనే నామాలు కూడా ఏర్పడ్డ యావిడకు. శివ శక్తులలో ఉన్న ఈ స్వభావ వైలక్షణ్యానికి ద్యోతకంగా నేమో మహాకవి తన నాయికా నాయకుల వయసులో ఈ తారతమ్య మిలా భావించి ఉంటాడు.

మొత్తం మీద ఎలా భావిస్తే నేమి. ప్రత్యభిజ్ఞా సూత్రాన్ని మాత్రం వదలలేదు. తన కావ్యాల కంటే నాటకాలలో ఇంకా గట్టిగా పట్టుకొన్నాడు. ఆ త్రాటి మీదనే నడుపుతూ వచ్చాడు కథ వస్తువునూ పాత్రలనూ వారి ప్రతి భావాలనూ చేష్టలనూ. అంతా శివ శక్తి విలాసమే. ఏ నాటకం చూచినా ఏ కథ చూచినా అదే మనకు దర్శన మిచ్చేది. మాళవికాగ్నిమిత్రంలో మాళవిక అగ్ని మిత్రుడు. విక్రమోర్వశీయంలో విక్రముడనే పేరుగల పురూరవుడూ ఊర్వశి. మరి శాకుంతలంలో - అభిజ్ఞానంలో దాగి ఉన్న దుష్యంతుడూ శకుంతల. ఈ శివ శక్తుల వృత్తాంతమే కొనా మొదలూ. పేర్లు కూడా వారి పేర్లే నాటకాలకు. అందులో ఒక చిత్ర మేమంటే ఆ రాజులకు ఒకరు కాదు చాలా మంది ఉన్నారు భార్యలు. అవరోధే మహత్యపి అని తానే వర్ణించాడు రఘువంశంలో. శాకుంతలంలో కూడా కురు ప్రియ సఖీ వృత్తిం సపత్నీ జనే అని కణ్వుడి చేతనే అని పించాడు. అలాంటప్పుడు మాళవిక అనీ ఊర్వశి అనీ శకుంతల అనీ ఈ ముగ్గురికే పట్టం కట్టుట మేమిటి మహా కవి. వారందరే మయ్యారు. అందరి మాటా అలా ఉంచి అందరికీ తల మానికమైన పట్టమహిషి ఒకతి ఉంది గదా. అది సూచిస్తూనే ఉంటాడు కూడా కాళిదాసు. మూడు నాటకాలలోనూ కథ నాయకు డెంత దొంగ చాటుగా ప్రేమ కలాపం సాగించినా చివరకు బయట పడితే ఆ పట్టపు రాణుల అనుమతి తోనే వీరిని పరి గ్రహించి నట్టు వర్ణిస్తూ వచ్చాడు. ఏమి టిందులో ఉన్న ఆంతర్యం. పట్టపురాణీ-పైగా వచ్చిన రాణి. ఇద్దరే రాణులసలు ఆ నాయకుల కిష్టమైన రాణులు. అందులో పట్టపురాణి కన్నా ఇష్టమైనది పైన వచ్చిన రాణి. వీరు రాణులు కారు కవి దృష్టిలో.

శక్తి స్వరూపిణులే. అమూర్తమైనది ఒక రూపమైతే మూర్తమైన దొక రూపం. అమూర్త మైనంత వరకూ అది తన్ను బాసి ఉండదు. తనతోనే కలిసి ఉంటుంది. అదే మూర్తమైతే తనకు దూరంగా తొలగుతుంది. మూర్తమైనది జడ శక్తి. అమూర్త మైనది చిచ్ఛక్తి. జడశక్తి వశంలో ఉన్నా సుఖం లేదు. దూరమైన చిచ్ఛక్తినే వశం చేసుకోవాలి. అప్పుడే శివశక్తి సామరస్యం. ఇందులో జడ శక్తికి ప్రతీక పట్టమహిషి. చిచ్ఛక్తికి ప్రతీక మధ్యలో వారి దృష్టి నాకర్షించిన నాయిక. మొదటిది భూదేవి. రెండవది శ్రీదేవి. జడ గనుక అది భూదేవి. చేతన కనుక ఇది శ్రీదేవి. భవించే స్వభావ మున్నది భూదేవి. శ్రయించే శీలమున్నది శ్రీదేవి. మూర్తీభవించటమే భవించటం. అమూర్తమై తన్ను ఆశ్రయిస్తే అది శ్రయించటం. ఈ శ్రయించే శ్రీదేవే కావాలి పరమాత్మకు. అప్పుడే అతడు స్థితి గతులకు నోచుకొంటాడు. మరి పరమాత్మకు ప్రతీకలే నని గదా పేర్కొన్నామూ నాయకులను. కనుకనే వారు తమ పట్ట మహిషులతో తృప్తి పడక పైన వచ్చిన ఈ మహిషుల వెంటబడటం. పట్టమహిషి భూదేవికి ప్రతీక. భూపర్యాయమైన నామకరణమే చేస్తాడు వారికి కాళిదాసు. ధారిణి అని వసుమతి అని వారిని పేర్కొనటమే ఇందుకు నిదర్శనం.

పోతే వీరితో నిత్యమూ కలిసి ఉన్నా సంయుక్తులు కారు వారు వియుక్తులే. అమూర్తమైన తమ శక్తి తమకు వశంవద కానంత వరకూ అది యోగ మెలా అవుతుంది. వియోగమే వాస్తవానికి. మూర్తం నిత్యానపాయిని కాదు. అమూర్తమే నిత్యానపాయిని. అది తనదే అయినా దాన్ని ఈ మూర్త ప్రపంచంలో పడి మరచిపోయి ఎంతో కాలం దానికి దూరమయి బ్రతుకు సాగించాడు. దైవికంగా అది మధ్యలో ఎక్కడో తనకు దర్శన మిచ్చింది. సహజమైన అనురాగంతో దాన్ని దక్కించు కోవాలని వెంటబడ్డాడు. కాని తన మూర్తమైన వాసన లింకా వదలక అది తళుక్కున మెరసి మాయ మయింది. అయినా దాన్ని పొందే వరకూ నిద్ర పట్టక పిచ్చిగా దాని కోసం పలవిస్తూ కూచుంటాడు. నిరంతర తదీయ చింతన తన మూర్త ప్రపంచ వాసనలను క్షాళితం చేయగా

అంతకంతకూ పశ్చాత్తాపంతో పరిశుద్ధుడయి - అంతకు ముందే పరి శుద్ధ అయి ఉన్న దాన్ని మరలా కలుసుకొని శాశ్వతంగా దానితో ఏకమై పోతాడు. ఇందులో అమూర్తమైన ఆ శక్తితత్త్వానికి ప్రతీకలుగా భావించి సృష్టించిన పాత్రలే మాళవికా ఊర్వశీ శకుంతలా పాత్రలు నాటకాలలో. కాగా ఆ శక్తి మూర్తీ భవించిన పాత్రలే నాయకుల పట్టమహిషులు. వారున్నా తృప్తి చెందక వీరి వెంట పడటమూ కోలుపోయిన తమ సహజ శక్తిని తాము మరలా పడయటానికి చేసే మహా ప్రయత్నమే. తత్ప్రయత్న ఫలితంగా శివ శక్తులు రెండూ సమరస భావంతో కలిసి ఉండటమే నాయకాభ్యుదయ రూపమైన భరత వాక్యం నాటకానికి.

ఇదీ కాళిదాసు భావన. ఈ భావనతోనే రచించాడు మూడు నాటకాల లోనూ మూడు కథ వస్తువులు. నాయికల ఆ వైలక్షణ్యాన్ని సూచించటానికే ఒకటి ఎప్పుడూ దృశ్యమాన అయి ఉంటే మరొకటి దృశ్యాదృశ్య రూపంగా చిత్రిస్తూ వచ్చాడు. ఆ చిత్రణ అంతా ప్రత్యభిజ్ఞా సూత్ర బద్ధమే. నాటకాలు మూడూ దాని కనుబద్ధమే. మొట్టమొదట రచించాడని పేరు వడసిన మాళవికాగ్నిమిత్రమే చూడండి. ఇది ఒక చారిత్రకమైన నాటకం. చారిత్రకమైనా అంతా చరిత్ర కాదు. కొంత కవి కల్పన కూడా ఉంది. కల్పన చేయకుంటే తన సూత్రానికి రూప కల్పన చేయలేడు. ఐదంకాల నాటకమిది. నాటకంలో ఐదంకా లుండటం సహజమే. ముఖ ప్రతి ముఖ గర్భ అవమర్శ నిర్వహణలని పంచ సంధులు గానే గదా విభక్త మవుతుంది కథావస్తువు. అందులో ఒక్కొక్క సంధిని నిరూపించటానికొక్కొక్క అంకం చొప్పున ఐదంకాలుగా నాటకాన్ని విభజించటమే సముచితం. అలాగే విభజించాడీ నాటకాన్ని కాళిదాసు. ప్రతి అంకంలోనూ నాయికా నాయకులు దర్శన మిస్తారు. తతిమా వారు వస్తూ పోతూ ఉంటారు. శివ శక్తుల విలాసమే జగన్నాటకమైతే వారి ప్రతినిధులైన నాయికా నాయకుల క్రీడా రంగమే శాబ్దికమైన ఈ నాటకం. శక్తి మాళవికా రూప ధారిణి అయి కనిపిస్తుంది. నాయకుడైన అగ్ని మిత్రునికి సన్నిహిత బాంధవ్య

మున్నదే ఆవిడ. మాధవ సేనుడి సహోదరి. ఇది చివరి దాకా తెలియదా మానవుడికి. ఎవతో పరాయిదని భ్రమపడ్డాడు. తన శక్తే అయినా తనకు అన్యదీయ అనుకోవటమే గదా జీవుడి భ్రమ. అందులోనూ ఆవిడ పట్ట మహిషి కధీన. ఆవిడ దానిని బయట పడకుండా కాపాడుతున్నది. ఆ కన్య చిత్రపటం దైవికంగా చూచి దానితోనే తృప్తి పడవలసి వచ్చిందా రాజు. అంతే కదా మరి. వ్యక్తమైన ఆకృతే అవ్యక్తమైన శక్తిని కానరాకుండా చేస్తున్నది. దాని ఛాయ మాత్రమే చూపుతుంది గాని సహజమైన దాని స్వరూపాన్ని చూపదు. చూపితే దీనికిక ప్రాధాన్యం లేదు. అలాగే జరిగింది. అయినా తావన్మాత్ర దర్శనంతో నిలవలేక పోయాడు నాయకుడు. అగ్నిమిత్రుడు కదా అతడు. స్వభావ మెక్కడికి పోతుంది. లోలోపల ఆవిడ అసలు రూపాన్ని చూడాలని తపిస్తున్నాడు. దానికి దారి చూపే గురువొకడు కావాలి. అతడే విదూషకుడు. వానికి పరోక్షంగా పరివ్రాజిక తోడయింది. ఈవిడ ఎవరో కాదు. మాధవసేన సచివుడు సుమతి తోబుట్టువు. అతని మరణానంతరం విరక్తితో పారివ్రాజ్యం స్వీకరించి రాజ కులం చేరింది. అంతకు ముందే దైవవశాత్తూ అక్కడే చేరింది కాందిశీక అయి మాళవిక. కాగా వీరిరువురూ నాట్యాచార్యులైన గణదాస హరదత్తులకు పోటీ పెట్టి తన్నిమిత్తంగా మాళవిక నాట్య మేర్పాటు చేస్తారు. రాజు నలుగురితో పాటు ఆవిడ నిజస్వరూపం చూచి ముగ్ధుడవుతాడు. అది చూచినప్పటి నుంచీ ఇక ఆవిడ పొందు కోసం పరితపన. ఇది గమనించి పట్టమహిషి ఆవిడ నితోధికంగా కాపాడటం. అయినా విదూషకుని పన్నాగంతో రాజావిడను కలవటం. ధారిణి అది తెలిసి ఉగ్రురాలు కావటం. చివర కావిడ ఎవరో కాదు స్వకీయయే అని తెలిసి రాజు కావిడే స్వయంగా సమర్పించటం- క్రమంగా జరిగిపోయిన సంఘటనలు.

ఇంతకూ కథ వస్తు వెక్కడి నుంచి ఎక్కడికి మలుపు తిప్పాడో చూడండి మహాకవి. ప్రధమాంకంలో నాయిక ఛాయాదర్శనం. ద్వితీయంలో స్వరూప దర్శనం. తృతీయంలో సంగమాభిలాష, చతుర్థంలో ప్రచ్ఛన్న సంగమం.

చివరకు పంచమాంకంలో బాహాటంగానే సంగమించి తనకు స్వాధీనం చేసుకోవటం. భావన చేస్తే జీవుడీ వ్యక్తమైన ప్రపంచంలో మరుగుపడిన తన శక్తి ఎక్కడ ఉందో తెలియక దానిని మొదట ఛాయా మాత్రంగా చూస్తాడు. అది ఆలంబనంగా స్వరూప దర్శనం కోసం తహ తహ లాడుతాడు. అందుకు శాస్త్రాచార్యాదులు తోడుపడగా వాస్తవంగానే దాన్ని దర్శిస్తాడు. అయినా ఈ వ్యక్తమైన ప్రపంచ వాసన లడ్డుపడి దూరం చేస్తే మరలా దాన్ని వశం చేసుకోవాలని పరితపిస్తూ చివర కాయా సన్నివేశాలు దైవికంగా తోడు పడితే- అది ఏదోగాదు తనదే తానేనని ప్రత్యభిజ్ఞ పొందుతాడు. అనభిజ్ఞ వల్లనే దూరమై అభిజ్ఞ వల్ల మరలా దగ్గర కావటమే గాని అసలది ఎప్పుడూ తన దగ్గరే ఉంది. అంతే గదా. మాళవిక తన దగ్గరే తన అంతఃపురంలోనే ఉన్నా తనకెంతో దూరంగా ఉన్నట్టే భావించాడు రాజు. తన బంధువైనా పరాయి దనుకొన్నాడు. చివరకు వారి వీరి వల్ల ప్రత్యభిజ్ఞ కలిగి తాను దూరమను కొన్న ఆ దేవి తనదేనని భావించి తృప్తి చెందాడు. ఎంత ప్రచ్ఛన్నమైనా ఆ శక్తి తాలూకు కళలు బయట పెడుతూనే ఉంటాయి దాన్ని. అలాగే మాళవిక ఎంత చాటు మాటున మెలగుతున్నా ఆవిడ సంగీత నాట్యాది కళలే ఆవిడ నా రాజుకు బయటపెడుతూ ఆయన దృష్టి నాకర్షిస్తూ వచ్చాయి. ఇదంతా ఇలా చూస్తూపోతే మాళవికాగ్ని మిత్రుల వ్యవహారంగా కనిపించదు. ఆ వ్యాజంతో సాగిన శివ శక్తుల పరస్పరాకర్ష వికర్ష పునస్సమాకర్షణాత్మక మైన వ్యవహారమే.

పోతే ఇక రెండవ దాయన రచించిన విక్రమోర్వశీయ నాటకం. నాటకం కాదిది. సాంకేతికంగా పేర్కొంటే త్రోటకం. దివ్య మానుష సంశ్రయ మయిన ఇతివృత్తమూ- ప్రతి అంకంలో విదూషక ప్రవేశమూ-ఈ రెండు లక్షణాలూ నాటకం కంటే దీన్ని వేరు చేసి చూపుతాయి. విక్రముడు కథా నాయకుడు. విక్రముడంటే పురూరవుడే. యయాతి కుమారుడు. సకల గుణ సంపన్నుడు. విశేషించి పరాక్రమవంతుడు. అందుకే విక్రముడని బిరుద మేర్పడింది. దాని కనుగుణమైన సన్నివేశమే జరిగింది మొట్టమొదటనే. దేవేంద్రుని

సేవించబోతూ తోడి అప్సరసలతో కథ నాయిక అయిన ఊర్వశి రాక్షసుల బారిన బడిపోతుంది. వారు మొరపెట్టగా విక్రము డావిడను విడిపిస్తాడు. ఇరువురికీ హృదయాలు అనురాగ రసంతో ఆర్ద్ర మవుతాయి. అయినా అతకక ముందే విడిపోవలసి వస్తుంది. దీనితో ప్రథమాంకానికి తెరపడి ద్వితీయాంకం మొదలవుతుంది. రాజుగారు పారవశ్యంలో పడి ఊర్వశి పేరుతో పట్టమహిషిని పిలుస్తాడు. ఆవిడ కనుమాన మేర్పడుతుంది. తరువాత రాజు విదూషకుడు చిత్రలేఖనం తదేక దర్శనం. ఇంతలో ఊర్వశీ చిత్రలేఖల అవతరణ. చాటుగా రాజు అభిలాష చూచి మురిసిపోవటం. బయటపడి ఒకరినొకరు పలకరించటం. ఇంతలో దేవేంద్రుని ఆదేశం మేర కావిడ స్వర్గానికి వెళ్ళ వలసి రావటం. రెండవ అంకానికి తెర. తరువాత మూడవ అంకంలో దేవి రాజు మీద అలిగి మరలా పశ్చాత్తాపంతో చంద్రవ్రతాప దేశంతో రాజును ప్రసన్నుణ్ణి చేసుకొనే ప్రయత్నం. ఈ లోపల ఊర్వశి రాక. వారి అనురాగం చూచి దేవి ఆవిడ నాయనకు కట్టపెట్టటం జరిగి పోతుంది. పోతే నాలుగవ అంకంలో ఊర్వశి స్వర్గంలో లక్ష్మీ నారాయణ పరిణయ మనే నాటకాన్ని ప్రదర్శిస్తూ నాటకంలో లక్ష్మీ పాత్ర తాను ధరించి నారాయణుణ్ణి పురుషోత్తమ అనబోయి పురూరవ అని సంబోధిస్తుంది. తన్నిమిత్తంగా గురుజన శాపానికి గురి అయి ఆ మనో వేదనతో స్త్రీ జన నిషిద్ధమైన కుమార వనం ప్రవేశించి లతాంగి లతగా మారిపోతుంది. ఇక చూడండి ఆ రాజు తన ప్రేయసి జాడ గానక పడిన వేదన ఇంతా అంతా గాదు. చతుర్థాంక మంతా ఆయన విరహ వృత్తాంత వర్ణనమే. చేతనాచేతన ప్రకృతి అంతా ఆయన స్పందనకు ప్రతి స్పందన అయిపోతుంది. కిష్కింధ కాండలో రాముడి విరహ విషయం హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి ఉంటుంది కాళిదాసుకు. రామాయణ ఛాయలే కనిపిస్తాయి అడుగడుగునా. ఆ భావాలే వేరొక మూసలో బోసి ఇక్కడికి పట్టుకు వచ్చాడు సందేహం లేదు. ఒక విధమైన గేయ కావ్యమీ అంకం. పిల్ల మేఘ సందేశం. తరువాత ఇక పంచమాంకంలో దేవేంద్రుడి అనుగ్రహం. తద్ద్వారా ఆయువనే కుమారుడితో సహా ఆవిడను పురూరవుడు శాశ్వతంగానే

పొందటం జరిగి పోతుంది. చిత్రమేమంటే నారదు డందుకు సంధాత. ఇదీ టూకీగా ఈ నాటక వృత్తాంతం. ఇందులో కవి పాటించిని ప్రత్యభిజ్ఞా సూత్రం మాళవికాగ్ని మిత్రం కన్నా ఇక కొంచెం ముదురు పాకంలో పడింది.

అక్కడ నాయిక మానవి అయితే ఇక్కడ దివ్య. నేలపైనే ఉండి నింగి లాగా అక్కడ అదృశ్య అయితే నింగినుంచి నేల కప్పుడప్పుడూ దిగి కనిపించే అదృశ్య ఈవిడ. ఆవిడ పట్ట మహిషి నిర్బంధంలో ఉండి మరుగు పడితే ఈవిడ దేవేంద్రాదుల నిర్బంధంలో మరుగు పడినది. పోతే అక్కడ నాగ రక్షితమైన ముద్రిక కారణంగా రాణీగారి బంధంలో నుంచి బయట పడి ఆవిడ రాజును కలుసుకొంటే - ఇక్కడ లతాంగిగా మారిన ఈ లతాంగి సంగమనీయ మనే మణి ప్రభావం మూలంగా తెరమరుగు బాసి రాజుకు దర్శన మిస్తుంది. మొత్తంమీద అక్కడా ఇక్కడా సామాన్య సూత్ర మొక్కటే. అది నాయికా నాయకుల యోగమూ వియోగమూ వియోగానంతర యోగమూ. వియోగం వారి తొందర పాటు వల్ల ఏర్పడిన దైవ దుర్యోగం వల్ల నైతే వియోగానంతర యోగం వారి తహ తహ పాటుకు తోడ్పడిన దైవ సద్యోగం వల్ల. అందుకు అక్కడా ఒక అభిజ్ఞానమే సాధనం. ఇక్కడా అలాంటి ఒక అభిజ్ఞానమే.

పోతే ఈ అభిజ్ఞానం నూటికి నూరు పాళ్ళూ పని చేసింది ఆయన జీవిత చరమాంకంలో రచించిన శాకుంతల నాటకంలో. వట్టి శాకుంతలం కాదది. అభిజ్ఞాన శాకుంతలం . ప్రత్యభిజ్ఞా సిద్ధాంతాన్ని పదహారు కళలతో ప్రతిబింబించే నాటకమని భావం. కనుకనే ఈ ఒక్క నాటకాన్ని ఆమూల చూడమూ పరిశీలిస్తే మిగతా ఆ మహా కవి రచన లన్నింటినీ పరిశీలించిన తృప్తి నిస్తుంది సహృదయుడికి. ఆయనకే ఇచ్చిందా తృప్తి. అలాంటి తృప్తి చెందిన వాడు గనుకనే మమాపి క్షపయతు నీలలోహితః - పునర్భవం పరిగత శక్తి రాత్మభూః. ఇక నాకా నీల లోహితుడు పునరావృత్తి అంటూ లేకుండా అనుగ్రహించు గాక అని మనసారా కోరుకొంటాడు. ఏ రచనలోనూ కోరని

కోరిక ఇది. ఇలాటి కోరిక ఒక కళాకారుడికి జీవితంలో ఎంతో సంతృప్తి కలిగితే గాని ఏర్పడదు. షేక్స్పియరు పోతన లాటి మహా కవులకు కూడా ఇలాటి ఆకాంక్ష కలగటమే చూస్తాము మనం వారి రచనలలో. కాగా కాళిదాస మహాకవికి కలిగిన ఈ ఆకాంక్షలో ఒక విశేషముంది. నీలలోహితః పరిగత శక్తిః ఆత్మ భూః- ఏవం విధ విశేషణ విశిష్టుడైన తన ఇష్ట దైవతమే తీర్చాలట తన కాంక్ష. నీల లోహితు డంటే ఈశ్వరుడు. నీల మేమిటి- లోహిత మేమిటి. నీలం తమస్సుకూ లోహితం రజస్సుకూ చిహ్నం. ఆవరణ విక్షేప శక్తులని అర్థం. అవి రెండూ అమ్మవారి రెండు ముఖాలు. అవి ఎవరి వశంలో ఉంటే పరాశక్తి వారి వశంలో ఉంటుంది. అప్పుడే అతడు పరిగత శక్తి అవుతాడు. శక్తి నాధారం చేసుకొని తానుండడు. తనపాటికి తానే ఉంటాడు. అదే ఆత్మభూః అంటే అర్థం. తన పాటికి తాను స్వతంత్రుడుగా ఉంటూ తన శక్తిని తాను వశీకరించుకొని ఏది కావలిస్తే అది చేయగలడు. తాను సర్వజ్ఞుడూ మృత్యుంజయుడూ అయినట్టే తన్ను ప్రత్యభిజ్ఞా సూత్రంతో పట్టుకొన్న సాధకుణ్ణి కూడా సర్వజ్ఞుణ్ణి మృత్యుంజయుణ్ణి కావించ గలడు. అలా పట్టుకొన్న కళారాధకుడూ సాధకుడే ప్రస్తుతం కాళిదాసు. కాళీ మహా కాలుల కిద్దరికీ దాసుడే ఈ సాధకుడు. ఇద్దరని కాక ఇద్దరినీ అవినాభూతమైన ఒకే ఒక అఖండ తత్త్వంగా దర్శించిన వాడు. జీవితాంతమూ భజించిన వాడు. వాగ్రూపంగా సాగిందా భజన. ఆ వక్కు ద్వారా తాను కోరిన అర్థాన్ని అంటే పరమార్థాన్ని శ్రవ్య రూపంగా శ్రవణం చేశాడు. దృశ్య రూపంగా దాన్నే దర్శనం చేశాడు. చివరకా శ్రవణ దర్శనాలు రెండూ ఏకమై భావ స్థిరమై ఎన్నో జన్మల నుంచీ అబోధ పూర్వంగా నిలిచి పోయిన శివశక్తి సామరస్య రహస్య జ్ఞానాన్ని స్వానుభవానికి తెచ్చి ఉంటుందా మహా ద్రష్టకు. దాని మధురోద్గారమే చిర స్మరణీయ మైన ఈ భరత వాక్యంలోని రమణీయ భావం.

ఇలాంటి మహోదాత్తమైన ఆశయంతో రచించిన ఆ నాటక మెంత మహోజ్జ్వలంగా సాగి ఉంటుందో ఇక మన మడుగడుగునా ఆగి చూస్తే గానీ

అవగాహనకు వచ్చే విషయం కాదు. మిగతా రెండింటి లాగా కాక ఇది ఏడంకాల నాటకం. ఎక్కడో భూలోకంలో ఉన్న కణ్వాశ్రమం దగ్గరి నుంచి మొదలయి ఎక్కడో ఉన్న ప్రజా పతి లోకంలోని మరీచాశ్రమం వరకూ సప్తలోకాలు కలుపుకొని విస్తరించిన కథా వస్తువు కాబట్టి దానికి సూచకంగా సప్తాంకాలుగా విభజించి ఉండవచ్చు మహాకవి. లేదా అసలు దీని మూలంగా ఆయన మనసులో దాగిఉన్న కోరిక నిశ్శ్రేయసమే కాబట్టి అది సప్తభూమికలను దాటి పోతేనే సిద్ధిస్తుంది కాబట్టి దానికి ద్యోతకం గానే చేసి ఉండవచ్చు ఈ విభాగం. ఇంద్రియాణి పరాణ్యాహుః - ఇంద్రియేభ్యః పరం మనః - మనసస్తు పరా బుద్ధిః - యో బుద్ధేః పరతస్తు సః అని గదా భగవానుడు సెలవిచ్చిన సప్త భూమికలు. ఈ భావానికి స్ఫోరకమే గదా పరీక్షిత్తు సప్త దివసాలు శుకముఖంగా శ్రవణం చేసి తరించాడనే భాగవతోదంతం కూడా. అయితే పంచ సంధుల మాటేమిటని ఆశంక రావచ్చు. అవి పంచాంకాలలోనే చూప నక్కర లేదు. పంచాంకాలనేది ప్రాయోవాదం. ఒక్కొక్క సంధి రెండేసి అంకాలలోకి చొచ్చుకొని పోయినా పోవచ్చు. తప్పేమి కాదు. సప్త ఏమిటి. దశాంకాల వరకూ విస్తరించిన నాటకాలు కూడా ఉన్నాయి గదా. వాటన్నిటికీ ఇలాగే సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది మనం. ప్రస్తుతం శాకుంతలంలో ఏడంకాలలోనూ కాళిదాసు సంధి పంచకాన్ని ఎలా పొందుపరిచాడో చూతాము. ప్రథమ ద్వితీయాంకాలు రెండింటిలో ముఖ సంధి విస్తరించి ఉంది. దుష్యంతుడు వేటకు రావటం - కణ్వుడు లేని సమయంలో ఆయన ఆశ్రమంలో ప్రవేశించటం - శకుంతలా వీక్షణం - అనసూయా ప్రియం వదల వల్ల ఆవిడ జన్మ వృత్తాంతం తెలుసుకోవటం - పరస్పరాను రాగోదయం. ఇంతలో మదగజ ప్రవేశం - తన్మూలంగా ఏర్పడిన విఘ్నాన్ని రాజు నివారించటం ప్రథమాంకంలో ఇతి వృత్తం. అది గమనించిన తాపసులు తమ అనుష్ఠానానికి నిత్యమూ విఘ్నకరులైన రక్షః పిశాచాదులను పారదోలటానికి రాజును కొంత కాల మక్కడే ఉండమని ప్రార్థించటం - రాజు రెండందాల అది తనకు అనుకూలమని భావించి అంగీకరించటం - శకుంతలా సౌందర్యాన్ని

విదూషకుడితో ముచ్చటిస్తూ ఆశ్రమ పీడ పరిహార వ్యాజంతో వేటకు స్వస్తి చెప్పటం - ఇది ద్వితీయాంక వృత్తాంతం. ఇవి రెండూ కలిసి ముఖ సంధి అయితే ఇక మూడవ అంకంలో నడచిన శకుంతలా దుష్యంతుల సమాగమాభిలాష - చెలికత్తెల సహాకారంతో ఇరువురూ కలుసుకోవటం - వారి ప్రణయ వృత్తాంతం - ఈ కలాపమంతా ప్రతిముఖ సంధి క్రిందికి వస్తుంది. బీజ రూపంగా అంకురించిన ప్రణయం బిందురూపంగా విస్తరించటమే గదా ప్రతిముఖం. అదే ఇక్కడ జరిగిన విషయం. పోతే గాంధర్వ వివాహానంతరం రాజు నగర ప్రవేశం చేస్తే కణ్వ మహర్షి ఆశ్రమ ప్రవేశం చేస్తాడు చతుర్థాంకంలో. శకుంతలా దుష్యంతుల ప్రేమ కలాప రహస్య మామహర్షి గ్రహించటం - ఆమోదించి అప్పటికే గర్భవతి అయిన ఆవిడను శిష్య సమేతంగా అత్త వారింటికి పంపటమూ ఈ అంకంలో సాగిన కథ. ఇది గర్భ సంధిలో పూర్వార్థమైతే ఉత్తరార్థం పంచమాంకంతో సమాప్త మవుతుంది. శకుంతలా దుష్యంతులు మరలా కలుసుకొన్నా శాప గ్రస్తులయి కలుసుకోవటం మూలాన అతడీవిడను గుర్తించక నిరాకరించటం - నిరాశ్రయ అయిన ఆవిడను ఒకానొక దివ్య తేజస్సు భువి నుంచి దివికి తీసుకొని పోవటం - జరుగుతుందిక్కడ. ఈ రెండు వృత్తాంతాలూ నాటక కథకు పరాకాష్ఠ కాబట్టి గర్భ సంధి క్రిందికి వస్తుందీ అంకద్వయం. పోతే ఇక షష్ఠాంకంలో అంగుళీయక దర్శనం. రాజు తన అపరాధం గుర్తించటం - పశ్చాత్తాపం - మాతలితో కూడి స్వర్గానికి ప్రయాణం - ఇది అవమర్శ సంధి. అవమర్శ మంటే మరలా ఒకమారు జరిగిపోయిన దాన్ని మనసుకు తెచ్చుకోవటమే గదా. అదే జరిగిందీ అంకంలో. ఇక చివరిదైన సప్తమాంకంలో కథలో దొరలిన సమస్యలన్నీ దేని పాటికది విడిపోయి మరలా నాయికా నాయకులు సుఖంగా కలుసుకొని కులదీపకుడైన కుమారునితో సహా ప్రజా పతిని దర్శించి ఆయన దీవన లందుకోవటంతో కథ సమాప్త మవుతున్నది కాబట్టి అది నిర్వహణ సంధి అవుతుంది. నిర్వహణ సంధిలో అన్నీ అద్భుతాలే జరగాలి. అలాగే జరిగాయి ఒక్కొక్కటీ ఈ అంకంలో.

అద్భుతమంటే అభూత పూర్వమని అర్థం. అసలీ కథ అంతా అభూతమే. మహా భారతం లోనే ఉంది గదా అభూత మేమిటి. ఉన్నా అది కేవల మస్థి పంజర ప్రాయమే. దానికి ప్రాణ ప్రతిష్ఠ చేసి సర్వాంగ సుందరంగా చిత్రించిన కౌశల మంతా కాళిదాసుది. ప్రఖ్యాత మైన ఇతి వృత్తాన్ని మిశ్రంగా మార్చాడు. అది కూడా దాటి పోయి ఉత్పాద్య కోటి నందుకొన్నాడేమో కూడా. చూడండి. దుర్వాస శ్శాప వృత్తాంతం మూలంలో లేదు. కేవలం కవి కల్పనే. గాంధర్వ వివాహ మున్నా అంగులీయక మిచ్చి పోవటం లేదు. అదీ కల్పనే. మరి భరతుడితో సహా శకుంతల మెట్టినింటకి వెళ్ళినట్టు మూలంలో ఉంటే ఇక్కడ భరతుడింకా జన్మించనే లేదు. గర్భవతి గానే వెళ్ళింది శకుంతల రాజాస్థానానికి. కాగా అనసూయ లేదు ప్రియంవద లేదు భారతంలో. కణ్వ శిష్యులున్నా రేమో గాని వారి పేర్లు శ్శార్ఙరవ శారద్వతులని ఎక్కడా లేదు. వీరికి తోడు గౌతమి అనే ధాత్రి అసలే లేదు. ఈ పాత్రలన్నీ కవి కల్పితాలే. పోతే దుష్యంతుడి చేత నిరాకృత అయిన శకుంతలను దేవలోకం నుంచి వచ్చిన ఒక దివ్య తేజస్సావిడను భువి నుంచి దివికి చేర్చటం మూలంలో అసలే లేదు. ఇదంతా కాళిదాసు ఇంద్రజాలం. ఇంత కన్నా మహేంద్ర జాలం దుష్యంతుడు కూడా ఇంద్రుడు పంపిన రథంలో అక్కడికే వెళ్ళి అప్పటికే అక్కడ జన్మించిన తన కుమారుడు భరతుణ్ణి - అతని ద్వారా అక్కడే తన కోసం నిత్యమూ పరితపిస్తున్న తన కాంతను - కలుసుకొని ప్రజాపతిని దర్శించి ఆయన ఆశీర్వాదం పొందటం . మొత్తం మీద కథలో సగం ముప్పాతిక కాళిదాస కవి సృష్టే.

కేవలం వినోదార్థం చేసింది కాదీ సృష్టి కూడా. బ్రహ్మాండమైన ప్రయోజన ముంది ప్రతి ఒక్క దానికీ. దుర్వాసుడి శాపమే లేకపోతే దుష్యంతుడికి జరిగిన వృత్తాంతం జ్ఞాపక ముండి తీరాలి. ఉంటే శకుంతలను కాదు పొమ్మని నిరాకరించ గూడదు. అది ఆత్మ వంచన - లోక వంచన కూడా అవుతుంది. అలాటి నయ వంచకుడు ఒక దేశానికి పాలకుడని

పించుకోవటం కన్నా పాపంలేదు. అది లోకాని కెలాటి అదర్శమూ కాదు. యధా రాజా తథా ప్రజా. రాజును బట్టే కదా ప్రజలు. రాజ ప్రవర్తనే నీచమయి నప్పుడు ప్రజలింకా నీచాతి నీచు లయినా తప్పులేదు. అంతే కాదు. అతని పుత్రుడే భరతుడు. అతడు షట్చక్రవర్తులలో ఒకడు. భరత వర్ష మనే పేరు మనదేశానికి జడ భరతుని వల్లనని భాగవతం చెప్పినా భారత ధోరణిని బట్టి చూస్తే ఈ భరతుడి వల్లనే ఏర్పడినా ఏర్పడి ఉండవచ్చు. అలాటి భారత దేశ ప్రభువును గన్న తండ్రే ఇలాటి దగుల్బాజి అయితే ఇక భారతీయు లయిన మనబోటి వారికది ఏమి మర్యాద. కనుకనే ఒక భారతీయ మహా కవిగా కాళిదాసు దీనిని భరించ లేక పోయాడు. అతణ్ణి కళంకితుడుగా గాక నిష్కళంకుడుగా మనముందు నిలప దలచాడు. అందుకే మధ్యలో ఈ శాప వృత్తాంతం కల్పించి అతడి ఉదాత్తతను కాపాడాడు. అంగుళీయక ప్రసంగం కూడా ఇలాంటిదే. నాటకాని కంతా జీవ గఱ్ఱ ఇది. అది కోల్పోవటం వల్లనే అభిజ్ఞానం లేకుండా పోయింది రాజుకు. మరలా అది ఆ జాలరి పుణ్యమా అని చేతికి రావటం వల్లనే శకుంతలా గతమైన ప్రత్యభిజ్ఞాన మేర్ప డిం దతనికి. నిష్కారణంగా తన్ను వదిలేశాడని శకుంతలా - నిష్కారణంగానే ఆవిడను నిరాకరించానని దుష్యంతుడూ - ఇరువురూ పశ్చాత్తాపంతో కుమిలి పోవటానికీ అంగుళీయకమే ఆధార మయింది. అది పోగొట్టు కొని ఆవిడ - రాబట్టుకొని ఈయన. మొత్తం మీద దుర్వాసుడి శాపమే దీని వెనకాల ఉన్న అసలు కారణమని ఇరువురికీ తెలియదు. చివరకు కశ్యప ప్రజాపతి తెలిపే దాకా తెలియదా రహస్యం. నాయికా నాయకుల వియోగానికీ యోగానికీ రెండింటికీ ఆస్పదమిది.

పోతే భరతుడు జన్మించక ముందే గర్భవతిగానే శకుంతల నగర ప్రవేశం చేయటంలో కూడా ఎంతో ఉంది ఆంతర్యం. కుఱ్ఱవాడు జన్మించాడంటే స్వారస్యం తప్పుతుంది. ఎందుకంటే ఆవిడకు చక్రవర్తి లక్షణోపేతు డైన పుత్త్రుడు జన్మిస్తాడని ఆశ్రమ వాసులైన వైఖానసుల దీవన. దాని కుపోద్బలకం గానే ఆశ్రమాధిపతి కణ్వ మహర్షి కూడా దీవిస్తాడు కుమార్తె నత్తవారింటికి

సాగనంపుతూ. అది దుష్యంతుడికీ విదితమే. మరి అలాటి రాజ లక్షణ లక్షితుడైన పుత్రుణ్ణి వెంట బెట్టుకొని శకుంతల ఆస్థానంలో ప్రవేశిస్తే ఇక సమస్య ఏముంది. శకుంతల నెలా కాదన గలడు దుష్యంతుడు. అంటే ఎలా చెల్లుతుంది. నాటకంలో సమస్య లేదు. పరిష్కారం లేదు. పంచమాంకంతోనే కథ పరిసమాప్త మయ్యేది. అందుకే తానూ వదిలేసి కణ్వ శిష్యులూ వదిలేసి అసహాయ అయిన శకుంతల నెలా ఆదుకోవాలో దిక్కు తోచక దుష్యంతు డాలో చిస్తుంటే రాజ పురోహితు డిలా సలహా ఇస్తాడు. ప్రసూతి సమయం దాకా ఈవిడ మా ఇంట్లో ఉంటుంది. ప్రసూతుడైన కుర్రవాడు చక్రవర్తి లక్షణాలు కలవాడైతే మీరు సందేహించక ఈవిడను పరిగ్రహించండి. అలా కాని పక్షంలో అప్పుడే ఈవిడను తండ్రి గారింటికి పంపవచ్చు మనమని చెబుతాడు. ఇంత ఉంది వ్యవహార మిందులో. అందుకనే భరతుని పుట్టుక ముందు జరపక కట్ట కడపటికి వాయిదా వేశాడు మహాకవి. అప్పుడిక తెలిసినా పరవా లేదు. మరి నాలుగవ ముఖ్యమైన మార్పు భువి నుంచి దివికి రంగ స్థలాన్ని మార్చటం. ఇది మరీ అద్భుతం. ఆశ్రమంలో కలుసుకొన్నారు నాయికా నాయకులు మొదట. ఆశ్రమంలోనే కలుసుకో వలసి వచ్చింది కడపట. ఆశ్రమంతో మొదలయి ఆశ్రమంతో ముగిసి పోయింది నాటక వృత్తం. ఒక ఆశ్రమం భూమి మీద నైతే మరొక ఆశ్రమం స్వర్గంలో. అంతే తేడా. ఇది కణ్వాశ్రమం. అది మరీచాశ్రమం. ఇద్దరూ కన్న తండ్రులు కాకున్నా తండ్రి లాంటి వారే శకుంతలకు. కన్న తండ్రి విశ్వామిత్రు డొక మహర్షే గదా. ఆయన విశ్వానికే మిత్రుడు. ఆయనకీ మహర్షులిద్దరూ మిత్రులు కాకపోతారా. కనుకనే తండ్రి వదిలేసిన బిడ్డనొక రాదుకొంటే - భర్త వదిలేసిన ఆ బిడ్డనే మరొక రాదుకొన్నారు. ఇద్దరూ ఆశ్రమాధిపతులు. కనుకనే ఆ పని చేయ గలిగారు. ఆశ్రమః శ్రమ నాశనః అన్నాడు వాల్మీకి. శ్రమను పోగొట్టేదే ఆశ్రమం. జీవితంలో ఏర్పడిన శ్రమను జీవులకు తొలగించేదని అర్థం . శకుంతల చూడండి. కణ్వాశ్రమంలో ఉన్నంత వరకూ శ్రమ ఎరుగదు. మరలా కశ్యపాశ్రమం చేరిన తరువాతా ఎరుగదు. మధ్యలోనే ఆవిడ పడ్డ శ్రమ అంతా.

ఒక విధంగా చూస్తే ఆశ్రమ వాసం కోలుపోవటం వల్లనే మానవుడు శ్రమ పాలవుతాడనీ మరలా ఆ శ్రమ నివారణ కావాలంటే ఆశ్రమ వాసమే చేయాలనే జీవిత రహస్యం మనకు స్ఫురిస్తున్నది. అదేదో కాదు మరలా. ప్రవృత్తే మానవుణ్ణి సంసార బంధానికి గురి చేస్తుందని - దానికి భిన్నంగా నివృత్తిని సేవిస్తేనే సాయుజ్యానికి నోచుకొంటాడని భంగ్యంతరంగా మనకు బోధించటమే. భూమే ర్దివ మివా రూఢ మని ఆయనే సెలవిచ్చినట్టు అప్పుడే మానవుడు మర్త్య జగత్తు నుంచి అమర్త్య సీమ నందుకో గలడని కూడా తాత్పర్యమే.

ఈ పూర్వాపర వృత్తాంతాలను రెండింటినీ ఎంతో నర్మ గర్భంగా ఒక్క శ్లోకంలో పొందుపరిచి మనకు సూచన చేశాడ అనిపిస్తుంది మహా కవి కాళిదాసు. ఏమిటా శ్లోకం. స్త్రీణా మశిక్షిత పటుత్వ మమానుషీషు - సందృశ్యతే కిముత యాః ప్రతిబోధ వత్యః- ప్రాగంతరిక్ష గమనాత్ స్వమపత్య జాతం - అన్యైర్ద్విజైః పరభృతాః ఖలు పోషయంతి. ఇది ఆ శ్లోకం. పంచమాంకంలో వస్తుందిది. శకుంతల రాజును నమ్మించటాని కేవేవో చెబుతుంటే - అవి తాపస వృద్ధ గౌతమి సమర్థిస్తుంటే - రాజు అపహసిస్తూ అన్న మాటలివి. స్త్రీలకు ఏ శిక్షణమూ అక్కర లేదు. జన్మ తోనే అబ్బుతాయట తెలివి తేటలు. ఇది మానవ స్త్రీలలోనే కాదు. పశుపక్ష్యాది స్త్రైణానికి కూడా సహజమే నట. చూడండి. కోకిలకు గ్రుడ్లు పెట్టటమే గాని వాటిని పొదిగి పిల్లలను చేయటం చేతగాదు. అందుకే అది చాటుగా వాటిని తీసుకు పోయి కాకుల గూళ్ళలో పెడుతుంది. అవి తమ గ్రుడ్లే నని భ్రమించి పొదిగి పిల్లలను చేస్తాయి. పిల్లలు పెరిగి పెద్దవై కూత రాగానే పొంచి ఉండి వెంటనే కోకిల వాటిని వెంట బెట్టుకొని ఎగిరి పోతుంది. ఇదీ వ్యవహారం. ఎంత తెలివో చూడండి ఆ కోకిలకు. కోకిల లాటి పక్షికే ఉంటే మనుష్యాంగన కుండదా నేర్పు. ఇదీ దీని తాత్పర్యం.

పైకి ఇదే అర్థమైనా లోతుకు దిగి విమర్శిస్తే ఇందులో శకుంతల పూర్వోత్తర జీవితాలు రెండూ సాక్షాత్కరిస్తాయి మనకు. కోకిలాంగన ఎవరో

కాదిక్కడ. మేనక. అది అప్సరస కాబట్టి పరభృత. పరుల పోషణలో ఉన్నదని అర్థం. కోకిలకు కూడా పరభృత అనే పేరు. అప్సరస కూడా పరకీయే గనుక అదీ పరభృతే. అన్యైర్ద్విజైః పోషయంతి - ద్విజ అంటే పక్షి అనీ అర్థమే. బ్రహ్మర్షి అనీ అర్థమే. మరొక పక్షిచేత పోషింప జేసుకొంటుంది కోకిల. అలాగే మరొక మహర్షి చేత చేసుకొంటుంది మేనక. అన్యైః అని బహువచనం వాడటంలో ఇద్దరు వస్తున్నారు. ఒకరు కణ్వ మహర్షి. మరొకరు కశ్యప మహర్షి. వీరిద్దరికే అప్పగించి వారి పోషణలోనే గదా ఉంచింది తన కూతురు శకుంతల నావిడ. అదీ ఎప్పుడని. ప్రాగంతరిక్ష గమనాత్ - ఈ మాట వ్యస్తంగా విరిచి చెబితే అంతరిక్ష గమనాత్ ప్రాక్ - అంతరిక్షంలో ఎగిరి పోవటానికి ముందని అర్థం. అంతే గదా మరి. శకుంతల స్వర్గానికి పోక ముందంతా కణ్వుని దగ్గరే పెరుగుతూ వచ్చింది. నడుమ నగర ప్రవేశం చేసినా అది యత్తించిత్కాలమే. కాగా ఈ మాటనే సమస్తంగా భావించి అర్థం చెప్పినా చెప్పవచ్చు. అప్పుడు ప్రాగంతరిక్ష మంటే అకాశంలో తూర్పు దిశ అని అర్థం. తూర్పు దిశగా ఉన్నదే దేవలోకం. ఆ లోకానికి గమనం చేసి అక్కడ మరలా తన బిడ్డను మహర్షి పోషణలో ఉంచింది మేనక. ఆ మహర్షే కశ్యప ప్రజాపతి. అక్కడే ఉంది తరువాత శకుంతల. ఇలా శకుంతలా వృత్తాంతం పూర్వాపరాలను రెంటినీ భాసింప జేస్తున్నదీ పద్యం దేహళీ దత్త దీప న్యాయంగా నాటక మధ్యంలో చేరి. అంతేకాదు. శకుంతలను మేనకే గాక శకుంతల తన కుమారుడు భరతుణ్ణి కూడా కశ్యపుడనే ద్విజోత్తముడి పోషణలోనే ఉంచిందని కూడా ధ్వనిస్తున్న దిందులో. ఇందులో మరొక చమత్కారం కూడా దొరలింది. అమానుషీషు అనే మాటలో మానవులు కాని పశుపక్ష్యాదులు కావచ్చు. మానవాతీతమైన దేవ జాతి కావచ్చు. అలాంటప్పుడు దేవతా స్త్రీలైన మేనకాదులని కూడా అర్థం చెప్పుకోవచ్చు మనం. అది ఎంతైనా సందర్భోచితం. ఈ ఒక్కటి చాలు మహా కవి రచనా శిల్పానికి గీటు రాయిగా చెప్పుకోటానికి.

రచన అంటే నాటక రచన ఇది. కావ్య రచన కూడా కాదు. కావ్య రచన లోనే నూటికి నూరు మార్కులైతే నాటక రచనలో దానికి రెండు రెట్లు మార్కులు వేయ వలసి వస్తుందా కళాకారుడికి మనం. ఆశ్రమ రంగంతో ప్రారంభించి మరలా ఆశ్రమ రంగంతోనే ముగించట మెంత నాటకీయత. మొదట నివృత్తులమే మనం. చివరకూ నివృత్తులమే కావలసి ఉంది. మధ్యలోనే ఈ సంసార ప్రవృత్తి అని మనకు సూచన చేయటమే గదా ఇది. అంతే కాదు. నివృత్తిలో ప్రవృత్తి తెచ్చి పెడితే - మరలా ఆ ప్రవృత్తి నివృత్తిలో పర్యవసించే దాకా ఫలసిద్ధి లేదని కూడా సూచనే. అంతే కాదు. ధర్మ విరుద్ధమైన కామ మెంత చెడ్డదో తదవిరుద్ధ మైన కామ మంత వాంఛనీయ మని చెప్పటానికి మొదటి దాని విజృంభణకు నడుమనే ఆన కట్ట వేసి పరాజయం పాలు చేశాడు కవి. రెండవ దానికి మొదట మొదట విజృంభణ లేక పోయినా కడపట దానికే విజయం చేకూర్చి పట్టాభిషేకం చేశాడు. అంతే కాదు. నిష్కాములూ నిరాడంబరులూ అయిన మహా పురుషుల జీవితానికీ సకాములూ సాడంబరులయి సకల ప్రాపంచిక వ్యాసంగాలతో సతమత మయ్యే సామాన్య మానవుల జీవితానికీ - ఉన్న పర్వత సర్షపోపమ మైన తారతమ్యాన్ని కండ్లకు కట్టినట్లుగా చూపి సాధన మార్గ మెంత చక్కగానో నిరూపించాడు మహా కవి. ఆశ్రమ వాతావరణం మొదటి దానికి ప్రతీక అయితే - పట్టణ వాతావరణం రెండవ దానికి ప్రతీకగా భావించి సృష్టించాడు నాటకంలో. రెండింటి కున్న ఈ విభేదాన్ని శారరవాది ఋషికుమారుల మాటలలో ఘాటుగా అక్కడక్కడ చాటుతూనే వచ్చాడు. పరాతి సంధానం - కైతవ జీవితం - మీబోటి నగర వాసులకే గాని శాంతమైన ఆశ్రమ వాతావరణంలో పెరిగిన మాబోటి వారికది ఏకోశాన లేదని శిష్యులే గాక శకుంతలా గౌతములు కూడా మందలిస్తారా రాజును. లంచగొండులయి బ్రతికే రాజ సేవకుల దగ్గరి నుంచి జ్ఞానవైరాగ్యాల పరసీమ నందుకొన్న కణ్వ కశ్యపాది మహర్షుల వరకూ భిన్న విభిన్నమైన పాత్రలను చిత్రించిన మహా కవి భావన ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రసరించిందో చెప్పనలవి గాదు. కణ్వ కశ్యపులెంత సంయములో వారి ఆలోచనలూ వారి

మాటలే చాటుతాయి. అసలు కణ్వుడీ నాటకంలో మొదటి మూడంకాలలో కనిపించడు. చివరి మూడంకాలలో కనిపించడు. ఒక్క చతుర్థాంకంలోనే దర్శన మిస్తాడు. తళుక్కున మెరసి తటుక్కున మాయమవుతాడు. కాని ఆయన కనిపించక పోయినా మొదటి నుంచీ చివర దాకా ఆయనను గూర్చి మనకు వినిపిస్తూనే ఉంటుంది. మరి కశ్యపు డైతే సప్తమాంకంలోనే కనిపించి సప్తమాంకంలోనే అదృశ్య మవుతాడు. ఇంత అంటీ ముట్టని జీవితాలు వారివి. అలాటి నిర్లిప్తమైన జీవితమే ఆదర్శ జీవితమని కవి మనకిచ్చే సలహా.

ఇంకొక గొప్పమాట. సిద్ధి వారికి సహజమైతే మనబోటి మానవులకది ప్రయత్న సాధ్యం. మనబోటి సామాన్యులకు ప్రతినిధి దుష్యంతుడు. గుణవంతుడే. కాని ఒక చాపల్యానికి గురి అయ్యాడు. ఆశ్రమంలో భిన్న సారంగ యూథమైన మదగజం కాదు చొరబడింది. మదోన్మత్తుడయి భిన్నమర్యాదుడైన దుష్యంతుడు. సుష్యంతుడు కాడు దుష్యంతుడు. దూరంగా చేతి కందకుండా ఎగిరిపోయే శకుంతాన్ని చేతికి చిక్కించుకోవాలని చూచాడు. చిక్కించుకొన్నాడు . చిక్కింది కదా పరవా లేదనుకొన్నాడు. కానీ అది కణ్వుడు గాదు. దైవమే మెచ్చలేదు. వచ్చింది దుర్వాసుడి రూపంగా. ఇచ్చింది ఘోరమైన శాపం. అనుగ్రహించినట్టే అనుగ్రహించిందొక లంగులీయకం. కాని అది కూడా దక్కకుండా మధ్యలోనే జారి పోయింది. కామ పరవశు లయిన ఇరువురినీ పరితాపానికి గురి చేసింది. ఒకరిని నేలమీద ఒకరిని నింగిమీద దూరంగా విసరి వేసింది. పశ్చాత్తాపంతో పరిశుద్ధులను చేసింది. తప్పు గ్రహించి సరి దిద్దు కొనేలా చూచింది. పరిశుద్ధు లయినా రని నమ్మకం కలిగిన తరువాత మరలా కలిపింది. చూడండి తమాషా ఇక్కడ. దుర్వాసుడు శాపం ఇచ్చింది వారికే అయినా శకుంతలకూ తెలియదు. దుష్యంతుడికీ తెలియదు. దానితో ప్రమేయమే లేని అనసూయా ప్రియం వదలకే తెలుసునది. అయినా వారు శకుంతలతో పోలేదు చేయలేదు. కాబట్టి ఆస్థానంలో అంత గొడవ జరుగుతున్నా ఈ రహస్యం బయట పడలేదు.

పోనీ విదూషకు డున్నాడు బయట పెట్టవచ్చు గదా అనుకొంటే వాడప్పు డక్కడ లేడు. ఆ తరువాత వచ్చినా పరిహాస విజల్పిత మన్నాడు గదా వయస్యుడు -- దాన్ని పరమార్థంగా ఎందుకు తీసుకోవాలని మౌనం వహించాడా చాదస్తుడు. మరి ఇది ఎలా గడ్డకు రావాలి. ఎవరు తేవాలి. ఒక్క అంగుళీయకమే. అదే అభిజ్ఞానం. అభిజ్ఞాన మైతేనే అది మోచకం. అనభిజ్ఞాన మైతే బంధకమే. దాన్ని నిష్కారణంగా దూరం చేసుకొని చివరకదే వారికి బంధకమై కూచుంది. అభిజ్ఞాన మైన తరువాతనే ఇరువురూ కలుసుకొని బంధ మోచకం కాగలిగింది. అది కూడా తెలియని దశలో ఉన్నారు వారిరువురూ. ఏమిటిది ఎందుకిలా జరిగిందని అడిగితే ప్రజాపతే వారికి జ్ఞానోదయం కలిగించాడు. మరి కణ్వుడికి తెలియదా ఈ రహస్యమని అడిగితే ఆయన కంతా తెలుసు - తెలుసు గనుకనే విధి బలీయమని చెప్పి ఇంత కాలం మౌనం వహించాడని తెలుపు తాడు. దుష్యంతుడు కూడా అది విని అందుకే నేమో మహర్షి అప్పుడు తన మీద ఆగ్రహించ లేదని సమాధానం చెప్పుకొంటాడు. ఇదంతా ఇలా జరుగుతుందని మొదటి నుంచీ ఆయా పాత్రల నోట పలికిస్తూనే వస్తాడు కవి. ఇష్ట ప్రవాస జనితాని సుదుస్సహాని - అనే కణ్వ శిష్యుడి మాటల్లో - భాగ్యాయత్త మతః పరం నఖలు తద్వాచ్యం వధూ బంధుభిః అనే కణ్వుని మాటల్లో ధ్వనిస్తూనే ఉందీ భవితవ్యత. ఋషీణాం పున రాద్యానాం వాచ మర్థోను ధావతి అని గదా అభియుక్తోక్తి. దాని కపవాద మేముంది. కణ్వుని కంతా తెలుసు. తెలిసే పెద్ద జరిగినా చివరకు మంచే జరుగుతుందని ఊరక చూస్తూ కూచున్నాడు. శాంతే కరిష్యసి పునః పద మాశ్రమే స్మిన్. భోగ భాగ్యాలన్నీ అను భవించిన తరువాత మరలా ఆశ్రమం లోనే అడుగు పెడతావు నీ భర్తతో సహా అని కుమార్తెను దీవించి పంపుతాడు. ఆయన నోటివాక్యం ఫలించి ఆవిడ మరలా కశ్యపాశ్రమంలో భర్తతో సహా ప్రజా పతి దర్శనం చేయ గలిగింది.

ఇంతకూ వాల్మీకి మహర్షి ఆవేశించాడని పిస్తుందీ నాటక రచనలో కాళిదాసును. రామాయణ కథనే వేరొక నేపథ్యంలో మనకు ప్రదర్శించాడు

మహా కవి. ఇతి హాసానికి నాటకీయమైన బురఖా తొడిగి చూపాడు లోకానికి. శకుంతల ఎవరో గాదు. సీతా దేవే. సీతను కన్న తలిదండ్రు లెవరో తెలియదు. దేవ యజన సంభవ ఆవిడ .ఎక్కడి నుంచి వచ్చిందో జనకుని ఇల్లు చేరింది. ఆ రాజర్షి కన్న బిడ్డ లాగే అభిమానించి పెంచాడు. అలాగే మేనకా విశ్వామిత్రు లిద్దరి చేతా పరిత్యక్త అయిన శకుంతలను కూడా కన్న కూతురి లాగే అభిమానించి పోషించాడు బ్రహ్మర్షి అయిన కణ్వుడు. జనకుడు రాజర్షి అయితే ఈయన బ్రహ్మర్షి. ఇద్దరూ నిర్లిప్తులే. ఆయన పోషణలో ఉన్న ఆ కన్యను ధనుర్భంగం చేసి రాముడు పరిగ్రహిస్తే ఈయన పరోక్షంలో ఈ కన్యను ధనుర్వ్యాపార భంగం చేసి దుష్యంతుడు స్వీకరించాడు. ఆయన కన్యను సమర్పించి ఆ తరువాత ఆవిడ ఏమి కష్టాల పాలయిందో ఆ ఊసే పట్టించుకోలేదు. ఈయనా శకుంతల నత్తవారింటికి పంపి ఇక ఆ ప్రసంగమే మనసుకు రానీయ లేదు. కాగా అటు జానకీ ఇటు శకుంతలా గర్భవతులుగా ఉండి భర్త చేత పరిత్యజింప బడిన వారే. ఇద్దరూ నిజానికి నిరపరాధినులే. పరిత్యజించిన భర్త లిద్దరూ లోకాపవాదానికి వెరచి చేసిన వారే ఆ పని. ఒకరిది శాప వ్యాజం. మరొకరిది కోప వ్యాజం. అలాటి దీన స్థితిలో వారి నాదుకొన్న దక్కడ తల్లే. ఇక్కడా తల్లే. భూదేవి సీత నాదుకొంటే మేనకే శకుంతలను దగ్గర చేర్చు కొన్నది. అంతే కాదు. చివర కక్కడ సీత తండ్రి లాంటి వాల్మీకి మహర్షి ఆశ్రమంలో చేరితే ఇక్కడ కశ్యప ప్రజాపతి ఆశ్రమంలో తల దాచుకొన్నది శకుంతల. వాల్మీకి వల్లనే కుశలవులు తన బిడ్డలని - వారిని గన్న తల్లి సీత అక్కడే ఉన్నదని - గుర్తించ గలిగాడు రాము డక్కడ. ఇక్కడ కూడా కశ్యప ప్రజాపతి వల్లనే తన కూమారుడు భరతుణ్ణి తద్వారా ధర్మ పత్ని శకుంతలనూ - కలుసుకో గలిగాడు దుష్యంతుడు. అంతేగాదు. సీతా రాములు భూలోకంలో విడిపోయి కడకు వైకుంఠంలో శాశ్వతంగా కలుసుకొన్నట్టే శకుంతలా దుష్యంతులు కూడా భూలోకంలో పరస్పరం దూరమై పోయి తుదకు స్వర్గంలోనే ఎడబాటు లేని సమాగమ సుఖాన్ని పొందగలిగారు. ఇలా లోతుకు దిగి భావన చేసే కొద్దీ బయట పడతాయి

రత్నాల లాంటి పోలికలు రామాయణానికీ శాకుంతలానికీ. భావస్థిరాణి జననాంతర సౌహృదాని అని కవి చెప్పిన సూక్తి కథ నాయకుడి విషయంలోనే కాదు. తన విషయంలో కూడా. రామాయణ రహస్యా లెన్నెన్ని ఆ మహా కవి హృదయాంతరాళాల్లో నిరంతరాను సంధాన మవుతూ వచ్చాయో. తచ్చేతసా స్మరతి నూన మబోధ పూర్వం. తనకు తెలియ కుండానే వచ్చి చోటు చేసుకొన్నాయి తన రచనలో. అదీ ఎంతో నాటకీయంగా.

నాటకీయ మైన ఈ శిల్పాని కంతటికీ వెనకాల చేరి ప్రచోదన చేస్తూ వచ్చిందింత కన్నా అతిలోకమైన ఆయన ప్రత్యభిజ్ఞా శిల్పం. అది ఆయన జీవిత సర్వస్వం. రచన అనే ప్రతి ఉచ్ఛ్వాసం లోనూ అదే పరచుకొని ఉంటుంది. అన్నిటికన్నా ఎక్కువ మోతాదులో దర్శన మిస్తుందీ శాకుంతలంలో. ఇది వట్టి శాకుంతలం కాదు. అభిజ్ఞాన పురస్కృతమైన శాకుంతలం. ఆ మాట ఎక్కడ మరచి పోతామో నని మనకు జ్ఞాపకం చేస్తున్నాడు కవి ఇదే నా కథ సర్వస్వ మని. ప్రత్యభిజ్ఞాన మంథరః అని మధ్యలో కూడా దుష్యంతుడి విషయంలో మనకు జ్ఞప్తి చేస్తాడు. ఈ దృష్టితో చూస్తే ఇంకా విశ్వరూపాన్ని ధరించి సాక్షాత్కరిస్తుందీ నాటకం మన మనో నేత్రానికి. శకుంతల జీవుడి చైతన్య శక్తికి ప్రతీక. నాయిక లందరూ అలాటి ప్రతీకలే నని పేర్కొన్నాము గదా. అందులో మాళవిక నేలమీదనే దృశ్యాదృశ్యంగా నడుస్తూ పోతే - ఊర్వశి నింగి నుంచి నేలకు దిగి వస్తే - ఈ శకుంతల నేలనుంచి నింగికి కపోతం లాగా ఎగిరి పోయిన దివ్య శక్తి. అది బ్రహ్మ వేత్తల దగ్గర సహజమైన రూపంలో మెలగు తుంటుందా శక్తి. ఆదే శకుంతల కణ్వాశ్రమంలో మెలగటం. దాన్ని రాజసంతో సకాముడై అందుకోవాలని చూచాడు రాజు. అందుకోవా లనుకొన్నది తన చేతన కనన్య అని తెలియ దతనికి. తన కన్య అని భావించాడు. అలా భావించే సరికి దానిని పొందాలనే కామానికి పాలయ్యాడు. అందుకే గురుజనం దగ్గర లేకున్నా వారి అనుమతి పడయ కుండానే తొందర పడి దాని నొప్పించి తన కధీనం చేసుకొన్నాడు.

అధీన మైనట్టే అయింది గాని అది అతనికి దక్కలేదు. కారణ మతడు దుష్యంతుడు. సుష్యంతుడు కాడు. అవిద్యా కామ దూషితాంతః కరణుడు దుష్యంతుడు గాక సుష్యంతుడెలా అవుతాడు. నావిరతో దుశ్చరితాత్ - ప్రజ్ఞానే నైన మాప్నుయాత్ అని కఠోపనిషత్తు వ్రక్కుచ్చినట్టు దుశ్చరితాదులకు దూరమైన పరిశుద్ధ జ్ఞానంతోనే పట్టుకోవాలి దాన్ని మానవుడు. అది ఇక్కడ జరగ లేదు. అందువల్లనే ఆ శక్తి తనదే అయినా ఒక శకుంతం లాగానే దూరంగా ఏ స్వర్గ సీమలకో ఎగిరి పోయింది. దాన్ని మరలా పొందే ఉపాయమే లేకుండా పోయింది. అయితే లేదా అంటే బొత్తిగా లేక పోదు. ఉంటుంది. ఈ సృష్టిలోనే దాగి ఉంది. ఎటు వచ్చీ దాన్ని చూచే దృష్టి ఉండాలి మనకు. అది కలిగే వరకూ మనకు కనపడేది దాని ఛాయా చిత్రమే గాని అది గాదు. ఛాయా చిత్రమీ ప్రపంచమే. ఇది శక్తి తాలూకు అచేతన మైన చిత్రమే గాని చేతన అయిన శక్తి కాదు. కనుకనే చేయి జారిపోయిన శకుంతల దూరమై ఆవిడ చిత్రపట దర్శనం తో తృప్తి పడుతూ వచ్చాడు దుష్యంతుడు. పోతే ఈ ప్రతి బింబానికి బింబ భూతమైన ఆ చిచ్ఛక్తిని దర్శించే దెప్పుడు సాధకుడు. తన రాజసత్వానికీ దానికి మూలమైన తన కామ గుణానికీ స్వస్తి చెప్పి సాత్త్వికుడని పించుకొన్నప్పుడు. పంచమాంకంలో జరిగిన సందర్భమదే. ఎంత అయాచితంగా తనకు శకుంతల దక్కినా మనసా కూడా కాంక్షించ లేదావిడను. కణ్వ శిష్యులెంత ప్రాథేయ పడ్డా పరిగ్రహించ టానికి పాలు పడలేదు. అంతకు ముందు గురుజనానుజ్ఞ లేకుండానే సొంతం చేసుకోవాలని తహ తహ లాడిన వాడు. అవినయం రక్ష అని హెచ్చరించినా అవినీతిగా నడచిన వాడు. పైగా వయం తత్త్వాన్వేషా న్మధు కర హతాః - త్వం ఖలు కృతీ. మేము తత్త్వ విచారంతో పోగొట్టుకొన్న అవకాశం నీవు సులభంగా కొట్టేశావని మధుకరా మంత్రణ వ్యాజంతో పరమార్థ దృష్టి కన్నా స్వార్థ దృష్టికే పట్టం కట్టిన వాడు. ఇప్పుడు కణ్వ శిష్యుల దగ్గరి నుంచి సర్వులూ అనుజ్ఞ ఇచ్చినా మధుకరం లాగా ఆవిడ యౌవన మధువు నాస్వాదించే అవకాశ మబ్బినా తత్త్వాన్వేషణ దృష్టితో కాదని

త్రోసి పుచ్చాడు. ఇదీ సాధకుని కుండవలసిన యోగ్యత. నిష్కామ శీలత. తత్త్వాన్వేషణ పరత.

ఇలాటి అర్హత ఎప్పు డబ్బిందో అప్పుడే దైవ మొక అభిజ్ఞానం చేతికి తెచ్చి ఇచ్చింది. దానితో ఆవరణ దోషం తొలగి పోయి మరలా తన చిచ్ఛక్తి తనకు గుర్తుకు వస్తుంది సాధకుడికి. అయితే అప్పుడది ఇక ఈ భౌతిక వాసనలతో దర్శించేది కాదు. అనుభవించేది కాదు. అభౌతికం గనుక దాని నభౌతికమైన భూమికలోనే పొందాలి. అనుభవించాలి. దుష్యంతు డప్పుడు సుష్యంతుడయి దానిని పొంద గలుగుతాడు. అదే దుష్యంతుడు శకుంతలను భువిలో గాక దివిలో కలుసుకోవటంలో అంతర్యం. విద్యావిద్యా స్వరూపిణి అని అమ్మవారి పేరు. విద్యా రూపిణి ఆవిడే. అవిద్యా రూపిణీ ఆవిడే. మొదటిది మోచకమైతే రెండవది బంధకం జీవుడికి. మొదటిదే మనకు వాంఛనీయం. అది బ్రహ్మ వేత్తల దగ్గరే ఉంటుంది. గురూప సదనం చేసి గురుముఖంగా దాన్ని పొందాలి జిజ్ఞాసు వైన శిష్యుడు. తొందర పడి తాను స్వతంత్రించి అహంయువై పొందేది కాదు. అలా పొందినా అది ఆభాస అవుతుందే గాని వస్తువు గాదు. ఇలాటి విద్యాభాసనే పొందాడు దుష్యంతుడు. విద్యను కాదు. కణ్వాది గురుజన సమక్షంలో వారి అనుమతితో కాదతడు శకుంతలను పొందింది. అహం భావి అయి స్వతంత్రించి. అలా పొందినదది విద్య ఎలా అవుతుంది. తదాభాసే. ఇలాటి ఆభాసనే వాస్తవమని భ్రమించి వెళ్ళి పోయాడు. దాన్ని మరచే పోయాడు. మరలా అది తటస్థ పడ్డా గుర్తించ లేక పోయాడు. ఆభాస ఆభాసే. గుర్తిస్తే ఎంత. గుర్తించ కుంటే ఎంత. నిలవ లేదది. జారి పోయింది. జారి పోయినా దాని చిహ్నా లెక్కడికో పోవు. ఈ సృష్టి అంతా దాని కభిజ్ఞానమే. దృష్టికి సృష్టే అభిజ్ఞానం. దీని ద్వారానే మరలా తత్త్వాన్వేషి దాని నందుకోవచ్చు. అంగుళీయక మీ సృష్టికి సంకేతమే. వర్తులాకార మైన ఉంగర మాద్యంత రహితం. సృష్టి కూడా ఆద్యంత రహితమైన ఒక చక్రమే. సంసార చక్రమనే గదా దీనికి పేరు. ఇదే ఒక గురువు లాగా మనకు మౌన భాషతో

ఉపదేశిస్తుంది ఆ పోగొట్టుకొన్న విజ్ఞాన ధనాన్ని. తజ్జన్యమైన ప్రత్యభిజ్ఞాన బలంతో అంతకంతకీ ఇంద్రియ మనో బుద్ధులనే భూమికలు దాటి నిరూపాధికమూ నిత్య సిద్ధమూ ఆత్మీయమూ అయిన ఆ దివ్య శక్తిని పొంద గలడు సాధకుడు. పొందితే అది ఇక అవిద్యా రూపిణి గాదు. విద్యా రూపిణిగా మారి అనుభవానికి వస్తుంది. ఇదే దుష్యంతు డంగుళీయక ప్రభావంతో మరలా శకుంతలా వృత్తాంతం జ్ఞప్తికి వచ్చి దివ్య రథారూఢుడై ఆయా లోకాలు గడచి పోయి స్వర్గంలో ఆవిడను మరలా పొందటంలోని తాత్పర్యం.

ఇంతెందుకు. నాటక ప్రస్తావనలో సూత్రధారుడు చేసిన ఋతువర్ణన లోనే ప్రత్యభిజ్ఞా సిద్ధాంత మంతా మూట గట్టి చేతి కిచ్చాడు మనకు కాళీదాసు. సుభగ సలిలావ గాహాః- పాటల సంసర్గ సురభి వన వాతాః - ప్రచ్ఛాయ సులభ నిద్రాః - దివసాః పరిణామ రమణీయాః - వేసవి కాలం నీళ్ళలో మునిగితే హాయిగా ఉందట. సురభిళమైన వన వాయువులు పీలుస్తుంటే తృప్తిగా ఉందట. ఎండ వేళ చెట్ల నీడలో పడుకొంటే సుఖంగా నిద్ర పడుతున్నదట. మరి పగలంతా తాపంతో బాధ పడ్డ సాయంత్ర మయి చల్లబడితే సుఖంగా ఉందట ప్రాణానికి. ఏమిటిది. గ్రీష్మర్తువర్ణనా. ఆ వ్యాజంతో చేసిన దుష్యంత వర్ణనా. తదుపదేశంతో చాటిన ప్రత్యభిజ్ఞా వర్ణనా. దుష్యంతు డాశ్రమంలో ప్రవేశించటమే సలిలావ గాహ మనే మాట కర్థం. ఆయన శకుంతలా యౌవన సౌరభాన్ని ఆఘ్రాణించటమే వన వాతాఘ్రాణనం. శకుంతలా విషయ మతడు మరచి పోవటమే వృక్ష చ్ఛాయలో పడి నిద్ర పోవటం. చివరకు మరలా ఆవిడను స్వర్గంలో కలుసుకొని ఆనందించటమే సాయంత్రం వేసవిలో చల్ల బడితే సుఖించటం. ఇందులో మొదట జీవుడు తానీశ్వరుడే నని తెలియక సంసార సాగరంలో వచ్చి పడటం - ఇదే హాయిగా ఉందని దీన్నే పూసుకోవటం - దానితో అసలు విషయం మరచి పోవటం - చివరకు మరలా ఏదో ఒక అభిజ్ఞాన బలంతో తన స్వరూపం జ్ఞప్తికి వచ్చి సాయుజ్య సుఖాన్ని అనుభవించట మనే శివాద్వయ సిద్ధాంత రహస్యం చూడండి ఎంత గోప్యంగా సూచిస్తున్నాడో మహా కవి.

ఈ ప్రకారంగా తరచే కొద్దీ నవ నీతమే. త్రవ్వుతూ పోయే కొద్దీ నవ రత్న జాతమే ఈ శాకుంతల నాటకం. ఒక్క శాకుంతలమనే కాదు. అన్ని నాటకాలూ ఇంతే. అన్ని కావ్యాలూ ఇంతే. ఆఖరుకు ఋతుసంహారాది ముక్తకాలూ ఇంతే. ఆ మాటకు వస్తే రచనలన్నీ రత్నాలే. ఆ రత్నాలన్నీ చిమ్మేవి చిత్ర విచిత్ర దీప్తులే. అన్ని దీప్తులలో కనిపించే ఒకే ఒక అఖండ దీప్తి శివశక్తి సామరస్య రూపమైన ప్రత్యభిజ్ఞాన దర్శనమే. అది ఆయన రచన లన్నిటికీ సాధారణమైనా శ్రవ్య కావ్యాలు మూడింటి లోకీ కుమార సంభవంలోనూ - దృశ్యమైన నాటకాలు మూడింటిలోకీ అభిజ్ఞాన శాకుంతలం లోనూ - పదహారు కళలతో ప్రత్యక్ష మవుతుంది. దుర్బలమైన పాఠకుని హృదయానికి తన ఆంతర్య మెక్కడ అంతు పట్టకుండా పోతుందో నని మహా కవి తన గుట్టు మనకు పట్టి ఇచ్చే మేకుల లాంటి మాటలు కూడా అక్కడక్కడ తన రచనా భిత్తికలో గ్రుచ్చుతూ పోతాడు. ముఖ్యంగా అభిజ్ఞాన మనే మాట వాచా స్మరించినందుకీ అభిజ్ఞాన శాకుంతలంలో అలాటి కీలకా లెక్కువగా కనిపిస్తాయి. స్రోతో వహాం పథి నికామ జలా మతీత్య జాతస్సఖే ప్రణయ వాన్ మృగతృష్ణికాయామ్ అంటాడు పశ్చాత్తప్తుడైన రాజు విదూషకునితో. సాక్షాత్తుగా వచ్చి పలకరించిన ప్రియురాలిని కాదని త్రోసి పుచ్చి దాని ప్రతి రూపాన్ని చూచి ఆనందించ వలసి వచ్చింది. ఇది ఎలాటి దంటే పుష్కలంగా నీరున్న పుష్కరిణిలో దిగి దాహం తీర్చుకోక ఎండ మావులలో దిగి తీర్చు కొన్నట్టున్న దట. ఈ మృగ తృష్ణిక వేదాంతుల మృగతృష్ణికే. వస్తువును గాక దాని ఆభాసను పట్టుకొని వ్రేలాడే మానవుల జీవిత మృగ తృష్ణిక. అంతేకాదు. స్రజమివ శిరస్యంధః క్షిప్తాం ధునోత్యహి శంకయా అని శకుంతలతో మొర బెడతా డాయన. ఇంతకు ముందు నీవు కనిపించినా ఏదో మైకంలో పడి నీవు నీవు కాదనుకొని త్రోసి పుచ్చాను. అది ఎలాంటిదంటే శిరస్సు మీద హఠాత్తుగా పడిన పూల మాలను కాల సర్పమని భయపడి త్రోసి పారవేయటం లాంటి దంటాడు. ఇది కూడా అద్వైతుల దృష్టాంతాల జాబితా లోనిదే. నీవు అసత్తని చూచే ఈ ప్రపంచం నిజంలో సద్రూపమే. నీవనాత్మగా భ్రమించేది వాస్తవంలో నీ ఆత్మ స్వరూపమే. ఇదీ ఇందులో తొంగి చూచే అధ్యాత్మ భావం.

ఇంతేకాదు. ఇంకొక గొప్ప ఆధ్యాత్మిక రహస్యం కూడా స్ఫురిస్తుం దాయన అన్న మరొక మాటలో మనకు. ఛాయా న మూర్ఛతి మలోప హత ప్రసాదే - శుద్ధే తు దర్పణ తలే సులభావ కాశా అంటాడు - శకుంతలకు సంజాయిషీ చెబుతూ. అద్దం మలిన మయినంత వరకూ అందులో మన బొమ్మ కనిపించదు. అదే బాగా శుద్ధమైతే అతి సులభంగా ప్రతిఫలిస్తుంది. దర్శన మిస్తుంది. ఇదుగో ఈ దర్పణ దృష్టాంతం కూడా వారి పట్టిక లోనిదే. ఇంతకూ మృగ తృష్ణిక - రజ్జు సర్పం - మలిన దర్పణం - వరుసగా చెప్పిన ఈ మూడు దృష్టాంతాలే చాలు ఆ నేపథ్యంలో తొంగి చూచే కాళిదాస మహాకవి శివాద్వయా పర పర్యాయ మైన ప్రత్యభిజ్ఞా దర్శన మర్మాన్ని మనకు పట్టీ ఇవ్వటానికి. సిద్ధాంత సాధనాను భవాలు మూడూ ఇందులో మనకు భంగ్యతరంగా చాటుతున్నాడు మహా కవి. శివేతర దృష్టితో చూస్తూన్నంత వరకూ ఈ సంసార మొక మృగ తృష్ణికే మన పాలిటికి. అదే శివాకార మయిన దృష్టితో చూస్తే అసద్రూప మైన సర్పంగా కాక సద్రూపమైన స్రజంగా దర్శన మిస్తుంది. దానికి సాధన మొక్కటే. మన మనస్సు. మనస్సై వేద మాప్తవ్యం. అద్దం లాంటిదది. అయితే అద్దమైనా మలీనమయితే లాభం లేదు. మస్పణీ భూతమై ప్రకాశించాలి. అప్పుడే సర్పం లాగా ఆభాస రూపంగా కాక స్రజం లాగా వస్తు రూపంగా కనిపిస్తుందీ ప్రపంచం. కనిపిస్తే మృగతృష్ణిక వెంట బడ్డట్టీ మిథ్యా రూపమైన అనాత్మ జగత్తు వెంట బడక ఆత్మానాత్మలను రెండింటినీ ఆత్మ రూపంగా దర్శించి ధన్యులం కాగలం. అప్పుడే మమాపి చ క్షపయతు నీల లోహితః - పునర్భవమని చాటిన పునరావృత్తి రహితమైన మోక్ష సుఖాన్ని కూడా చూర గొన గలం. ఇలాంటి నిక్షేపాన్ని మనకు ప్రసాదించటమే కాళిదాస రచనా శిల్పాని కంతటికీ ప్రయోజనం. ఆ ప్రయోజనాని కనుగుణంగా మలుచు కొంటూ వచ్చినదే ఆయన కావ్య నాటక రచనా ప్రపంచమంతా.

Yalamarti Srinivasarao
www.advaitavedanta.in

# సౌందర్య ప్రత్యభిజ్ఞ

మహా కవి తాత్త్వికమైన దృష్టి ఏదో పరిశీలించాము. అది ఏదో కాదు. శివ శక్తి సామరస్య రూపమైన ప్రత్యభిజ్ఞా దృష్టి. దాని కనుగుణంగా ఆయన తన కావ్య సృష్టి ఎలా చేశాడో అది కూడా నిరూపించాము. సృష్టికే రచన అని పేరు. శ్రవ్య కావ్య రచన అయినా కావచ్చు నది . దృశ్య కావ్య రచన అయినా కావచ్చు. అన్నింటిలోనూ అది ఆమూల చూడమూ పరచుకొని ఉన్నదా తత్త్వం. అందులోనూ కుమార సంభవం - అంతకన్నా శాకుంతలంలో అది పరాకాష్ఠనే చెందిందని కూడా చెప్పుకొన్నాము. పోతే ఇందులో ఒక గొప్ప రహస్యముంది మనం గ్రహించ వలసింది. తత్త్వం స్వరూప మయితే రచన దాని విభూతి. శివ శక్తు లివే. నిరాకారమూ నిశ్చలమూ అయిన శివతత్త్వాన్ని నామరూపాత్మకంగా మార్చి చూపుతున్న దాయన నాశ్రయించి ఉన్న ఆ పరాశక్తే గదా. వివిధ రూపాలుగా దాన్ని ప్రదర్శిస్తూ ఉన్నది కాబట్టి దాన్ని విభూతి అన్నారు. సూత్రం లాంటి స్వరూపానికి వ్యాఖ్యానం లాంటిదీ విభూతి.

చరాచర ప్రపంచమూ దాని విభూతే. నామరూపాత్మక మిది. చెప్పేది నామం. చెప్పబడేది రూపం. మొదటిది భావ ప్రపంచ మయితే రెండవది వస్తు ప్రపంచం. మనోవృత్తి వరకూ అది భావం. దానికి గోచరించే దంతా ఇక వస్తువే. చేతనాచేతన విభాగం దీనివల్లనే ఏర్పడింది. ఈ రెండింటి మధ్యా నడిచే వ్యవహార మంతా క్రియా రూపం. నామ రూప క్రియలనే ఈ మూడే వాస్తవానికి త్రిపురాలు. ఈ త్రిపురాలూ నిర్మించి వీటిలో స్వేచ్ఛగా విహరించే ఆ మహాశక్తే త్రిపుర సుందరి. సుందరి ఎలా అయిందది. మూలమైన తత్త్వంతో కలిసి ఉన్నంత వరకూ అది అవ్యక్త. అప్పుడందులో సౌందర్యమున్నా అది గుప్తంగా ఉండవలసిందే గాని ప్రకటమై భాసించదు.

అదే నామ రూప క్రియాత్మకంగా ఎప్పుడు పరిణమించిదో అప్పుడు వ్యక్తమయి భాసిస్తుంది. ఏది ఎప్పు డెక్కడ ఎలా ఉండాలో అలా ఉండి కనిపించటమే సౌందర్యం. ఏది ఎప్పుడన్నప్పు డది శక్తి తాలూకు వ్యక్తావస్థే గాని అవ్యక్తావస్థ కాదు. వ్యక్తావస్థే త్రిగుణాత్మక మైన ఈ చరాచర ప్రపంచం.

ఇది తత్త్వం లాగా అసంహతం కాదు. సంహతం. స్వార్థం కాదు. పరార్థం. సంహతమైన దెప్పుడూ అసంహతమైన తత్త్వాన్నే చూపుతుంటుంది. పరార్థమైన దెప్పుడూ స్వార్థాన్నే మనకు సూచిస్తుంటుంది. అ తత్త్వ గర్భంలో నుంచే గదా ఇది ఊడి పడింది. కనుక దాని స్వరూపాన్ని బయట పెట్టటమే దీని ఉద్యోగం. ఎన్ని వేషాలు ధరించినా- ఎన్ని పోకడలు పోయినా - దాన్ని విడిచి ఇది ఉండలేదు. కాబట్టి నామం గాని రూపం గాని క్రియ గాని - ఇందులో ఏ ఒక్క అంశం తడవి చూచినా అది మౌనంగా మనకా మూల తత్త్వాన్ని మనసుకు తెచ్చేదే. మన మంటున్నాము. మన సంటున్నాము. ఇవి కూడా ఆ తత్త్వానికి రూపాంతరాలే వాస్తవంలో. రూపాంతరాలని గుర్తిస్తే చాలు. మనం దాన్ని అందుకోగలం. అందుకొనే ఉన్నా మసలు. అందుకొన్నా మనే ప్రత్యభిజ్ఞ లేదు. అంత మాత్రమే. అంచేత పరధ్యానంగా తత్త్వానికి దూర దూరంగా మెలగుతున్న మన మనసులను బలంగా ఆకర్షించి మన స్వరూపమే అయిన ఆ తత్త్వం వైపు మరలా మన దృష్టిని మళ్ళించ వలసి ఉంది. ఈ ఆకర్షించటానికే వళ్ళించటానికే సౌందర్యమని మారు పేరు. సత్యం - సుందరం - శివ మన్నారు. సత్యం స్వరూపమైతే సుందరం దాని రచన. సుందరమైన ఈ ప్రపంచ రచన ద్వారా ఆ సత్యాన్ని మన మందుకొంటే అది త్రిపురాంతకమై అపవర్గ రూపమైన శివాన్ని మనకు ప్రసాదిస్తుంది. త్రిపుర సుందరి సౌందర్య మప్పటికి త్రిపురాంతకుణ్ణే దర్శించటానికి తోడ్పడుతుందన్న మాట.

ఇది శివ శక్తి ద్వయాత్మకమైన ఈ జగత్సృష్టి కెలాగో కావ్య జగత్సృష్టికి కూడా అలాగే అన్వయించుకో వలసి ఉంది. ఇక్కడా కవిదృష్టి శివ స్వరూప

మయితే తద్గతమైన ప్రతిభ శక్తి స్వరూపం. యధాస్మై రోచతే విశ్వం- తథేదం పరివర్తతే అని గదా పేర్కొన్నాము. కవి దృష్టి ననుసరించి ఆయన ప్రతిభా శక్తి కూడా నామ రూపాత్మక మయిన ఒక ప్రపంచాన్ని రచించి సహృదయుడికి ప్రదర్శిస్తుంది . అక్కడ జీవుడైతే ప్రేక్షకు డిక్కడ సహృదయుడు. కాని ఊరక నిర్జీవంగా ప్రదర్శిస్తే సుఖం లేదు మరలా. జీవుడి దృష్టి లాగే భావుకుడి దృష్టి కవి ఆసించిన కావ్యార్థం వైపు మళ్లదు. మళ్ళీ దాన్ని ఆకళించుకో లేదు. అలాంటి ఆకళింపు రావాలంటే బలంగా అతని భావనకు ప్రేరకమైన సౌందర్య మెంతగానో పొందుపడి ఉండాలి కావ్య రచనలో. సౌందర్యం భావనా ప్రేరక మయితే అది భావిత మయ్యే కొద్దీ కావ్యార్థ స్ఫోరకమై తన్మయీ భావ మనే మహాఫలం సిద్ధిస్తుంది. అదే గదా శివమని ముందు పేర్కొన్నాము. కనుక రచనలో సౌందర్య మనేది అవశ్యం భావి. సృష్టికీ - సాహిత్య సృష్టికీ కూడా. సత్య శివాలనే రెండు తీరాలకూ నిర్మించిన గొప్ప వంతెన ఇది. రెండు కొసలనూ సోకుతూ రెంటినీ కలిపి ముడివేసే సంధాన కరణి సౌందర్యం. ఇది ఈ భౌతిక సృష్టిలో సహజంగానే చోటు చేసుకొని ఉంది. సార్వత్రికంగా ఉంది. ఏదీ కాదని త్రోసి పుచ్చటానికి లేదు. అవునని మెచ్చటానికి లేదు. తృణం మొదలు ప్రతి ఒక్కటీ దేని స్థానంలో అది ఉండ వలసిందే. అలా ఉంటేనే అది అందం. చందం.

మరి ఇదే కవి చేసిన కావ్య సృష్టిలో నైతే ప్రయత్న సాధ్యం. కావ్య సృష్టి అంటేనే కృత్రిమం గనుక ప్రయత్నం కూడా కృత్రిమంగా సాగవలసిందే. తప్పదు. అయితే కృత్రిమంగా చేసినా కృత్రిమమని ఏ మాత్రమూ అనిపించ రాదు. సృష్టి ఎంత నిసర్గ సుందరమో అంత నిసర్గ సుందరంగానే దిద్ది చూపగల డొక మహాకవి. కాగా మహా కవులలో మహాకవి గదా కాళిదాసంటే. ఆయన ఈ కళా సృష్టి రహస్యాన్ని ఎంతగా గ్రహించాలో అంతగా గ్రహించిన వాడు. మహా కవే గాక మహా విమర్శకుడు కూడా నని గదా వర్ణించామాయనను. అన్యాపదేశంగా తన కావ్యాల్లో నాటకాల్లో ఈ నిర్మాణ రహస్యాన్ని అమోఘంగా

బయట పెట్టాడు చూడండి. కుమార సంభవంలో అమ్మవారి యౌవన సౌభాగ్యాన్ని వర్ణిస్తున్నా డాయన. వర్ణిస్తూ వర్ణిస్తూ ఇలా అంటాడు చివరకు. సర్వోపమా ద్రవ్య సముచ్చయేన - యథ ప్రదేశం వినివేశితేన - సా నిర్మితా విశ్వసృజా ప్రయత్నా - దేకస్థ సౌందర్య దిదృక్ష యేవ. సృష్టి కర్త అయిన బ్రహ్మ పార్వతి అనే కన్య విగ్రహాన్ని. సృష్టించ వలసి వచ్చింది. అలా సృష్టించేటపు డావిడ లోనే విశ్వ సౌందర్య మంతా పోగు చేసి ఒక్క చోట చూడాలను కొన్నాడట. అందుకోస మాయన సృష్టిలో ఉండే అలంకార సామగ్రి నంతా సమకూర్చు కొన్నాడు. అందులో ఏది ఎక్కడ వంచి పెట్టాలో అక్కడే దాన్ని ప్రయత్న పూర్వకంగా పంచి పెట్టాడని వర్ణిస్తాడు కవి. పార్వతి అంటే ఆవిడ పరాశక్తే గదా. అలాంటప్పుడీ నామ రూపాత్మకమైన రచనా ఇందులోని సౌందర్య మంతా ఇక ఆవిడది గాక మరెవరిది. అయితే అది ఏకస్థం. ఏకమైన తత్త్వమా పరమాత్మే. ఆయన లోనే శక్తి రూపంగా గుప్తమయి ఉందా సౌందర్యం. గుప్తమయి ఉన్న ఆ సౌందర్యాన్నే ప్రకటం చేసి చూడాలను కొన్నాడు. ఎవడు . ఎవ డున్నాడిక. ఆ పరమాత్మే. విశ్వస్రష్టాయన. ఏదయినా సృష్టించ గల శక్తి గలవాడు. కనుకనే ఏకస్థమైన ఆ అంతర్గత సౌందర్యాన్ని బహిర్గతంగా అనేకస్థం చేసి చూపాడు. అనేకస్థ మనే సరికి దేశ కాలాదులన్నీ వచ్చి పడతాయి. పడినా యథప్రదేశం వినివేశితేన. అందులో ఏది ఎక్కడ ఉంచాలో అక్కడే దాన్ని ఉంచి సృష్టించాడు. అనేకథ విప్రకీర్ణ మయిన ఈ విశ్వ సౌందర్యాని కంతటికీ ఏమిటి ప్రయోజనం. దీన్ని మరలా విశ్వకర్త రూపంగా ఏకస్థం చేసుకొని దర్శించటమే. అప్పుడే ద్రష్ట అయిన సాధకుడి కది నిర్వాణ దాయకం. ఇందులో ఏకస్థమైన సౌందర్యాన్నే తాను అనేకస్థం చేయటం నిర్మాణ ప్రయత్న మయితే - అనేకస్థమైన దీన్ని మరలా ఏకస్థంగా భావించి చూడటం నిర్వాణ ప్రయత్నం. మొదటి భూమిక లో ఆయన స్రష్ట అయిన పరమాత్మ. రెండవ భూమికలో ఆయనే ద్రష్ట అయిన జీవాత్మ. రెండిటికీ ప్రయత్న మనేది ఆవశ్యకం. సర్వజ్ఞుడు గనుక స్రష్టగా ఆయన కది ప్రయత్నం కాని ప్రయత్న మయితే అల్పజ్ఞుడు గనుక

ద్రష్టగా ఆయన కిది నిజంగా ప్రయత్నమే. ఇక్కడ పార్వతీ దేవి- ఏకస్థం - సౌందర్యం - నిర్మాణం- ఇదంతా శివశక్తుల జగత్కావ్య నిర్మాణ రహస్యాన్నే మనకు వ్యంగ్య రూపంగా స్ఫురింప జేస్తున్నది.

ఇంతే కాదు . ఇంతకన్నా గొప్పగా అసలు మహా కవి మనకు కావ్య నిర్మాణ రహస్యాన్నే భంగ్యంతరంగా ధ్వనింప జేస్తున్నా డీ శ్లోకం ద్వారా. విశ్వస్ర ష్టిక్కడ బ్రహ్మ కాదు. కవి బ్రహ్మే. ఆయన సృష్టించా లనుకొన్నా డొక. కన్యను. అది గిరికన్య కాదు. కావ్య కన్య. లోకంలో ఉండే సౌందర్యమంతా ఉట్టి పడేలా తీర్చి దిద్దాలను కొన్నాడు. అందుకోసం తన ప్రతిభ నంతా ఖర్చు పెట్టి ఎక్కడెక్కడి కవితా సామగ్రినీ పోగు చేస్తాడు మహా కవి. అలా పోగు చేసిన సన్నివేశాలైతే నేమి - పాత్రలయితే నేమి- రసభావ లయితేనేమి - ఏది ఎక్కడ వర్ణిస్తే అందంగా ఉంటుందో సముచితంగా ఉంటుందో బాగా సమీక్షించి నిర్మిస్తాడు కావ్యాన్ని. అయితే ఎందు కింత ప్రయత్నం - ఇంత సంరంభం కవికి. ఏకస్థమైన సౌందర్యాన్ని అనేకస్థం చేసి చూపి మరలా దాని నేకస్థంగా భావించటానికే . కవి ప్రతిభా శక్తిలో ఈ కావ్య సామగ్రీ కలాపమంతా ఏకస్థమయి ఉంటుంది. దానినే రచనా ముఖంగా ఆవిష్కరిస్తే అనేకస్థ మవుతుంది. అనేకస్థమయి కనిపించే ఈ సామగ్రి నంతా భావన చేస్తూ పోతే అది మరలా కవి వివక్షించిన కావ్యార్థం వైపు తీసుకొని పోయి ఏకస్థంగానే ఆ సౌందర్యాన్ని అనుభవానికి తెస్తుంది. ఇందులో ప్రతిభాగతమైన కావ్య సౌందర్యాన్ని బహుముఖంగా రచించి మనకు పంచి పెట్టటం కవి వంతయితే - బహుముఖంగా భాసించే ఆ సౌందర్య మంతటికీ గమ్యమా ఏకైకమైన కవి భావనే కాబట్టి దీని ద్వారా దాన్ని ఆకళించుకొని ఆనందించటం సహృదయుడి వంతు. కవిగా స్రష్ట- సహృదయుడుగా ద్రష్టా ఒక్కడే ఇక్కడ కూడా. స్రష్టగా నిర్మాణం చేస్తూ ద్రష్టగా నిర్వాణాన్ని పొందుతున్నాడు. దానికీ దీనికీ సంధాన సూత్రం సౌందర్యమే. కవి ప్రతిభా గతమైన సౌందర్యమే కావ్య రచనా రూపంగా బహిర్గతమై మరలా సహృదయుడి

భావనా బలంతో స్వరూపానుభవంలో అంతర్గతమై చరితార్థ మవుతున్నది. ఈ ఆరోహణా వరోహణ ప్రయత్నంలో పరిపూర్ణత నందుకొంటున్నది. ఇంతకూ జగత్కావ్యానికి పరమాత్మే కవి. తత్ప్రతిబింబమైన కావ్య జగత్తుకు కవే పరమాత్మ. అది మాయాశక్తి కల్పితం. ఇది ప్రతిభా శక్తి నిర్మితం. అదీ సౌందర్య మయమే. ఇదీ తన్మయమే. అది సృష్టి ద్వారా దృష్టినందుకోటానికే. ఇదీ కావ్య సృష్టి ద్వారా కవి దృష్టి నంధుకోటానికే.

ఎటువచ్చీ దానికీ దీనికీ ఒక్కడే తేడా. అది నిసర్గ రమణీయం. ఇది కృత్రిమ రమణీయం. కృత్రిమమంటే క్రొత్తగా భావించి తయారు చేయటం. క్రొత్తగా భావించ నక్కర లేదు. తయారు చేయ నక్కర లేదు. అంతా రమణీయమే ఈశ్వర సృష్టి. ఏదీ హేయం కాదు ఉపాదేయం కాదని చెప్పాము. రమ్యం జుగుప్సిత ముదార మథాపి నీచమనే తేడా లేదందులో. ఎక్కడ ఏది ఎలా ఉంటే సముచితమో అలాగే ఉంది ఈ జగత్తులో. కాని కాళిదాసు లాంటి కళాకారుడికది అంతగా నచ్చలేదు. తాను కోరిన అందమంతా తాను కోరిన చోట సాక్షాత్కరించాలని ఆయన ఆశ. అయితే అది సఫలం కాదని ఆయనకు తెలుసు. అందుకే వాపోతాడు కుమార సంభవంలోనే కర్ణికార మనే ఒక పుష్పాన్ని వర్ణిస్తూ. ప్రాయేణ సామగ్ర్యవిధౌ గుణానాం - పరాఙ్ముఖీ విశ్వ సృజః ప్రవృత్తిః. అన్ని గుణాలు ఒక్క చోట పెట్టి సృష్టించటమా విశ్వ కవికే ఇష్టం లేదట. ఒక గుణముంటే ఒక గుణం లేకుండా చేస్తాడు. చూడండి. కర్ణికార మనేది ఎన్నో రంగురంగుల పుష్పం. అన్ని రంగులున్నా అందులో వాసన అనేది ఏ కోశాన లేదు. అదీ ఉంటే ఎంత బాగుండును. మరి లేకుండా చేశాడా విధాత. విధాతకే వదిలేస్తే ఆయన ఇలాగే చేస్తుంటా డేది చేసినా. సర్వాంగ సుందరంగా ఏదీ తీర్చి దిద్దడు. అలా దిద్దటాని కాయనకు మనస్కరించదు. అందుకే అంటాడు విక్రమోర్వ శీయంలో ఈ భావాన్నే ఆవిష్కరిస్తూ ఒక చోట మహాకవి. ఊర్వశి అతిలోక సౌందర్యాన్ని వర్ణిస్తూ ఆవిడ నింత అతిలోక సౌందర్యవతిగా సృష్టించాడంటే

ఆ సృష్టి కర్త బ్రహ్మదేవుడయి ఉండడు. ఎందుకంటే ఆయన వేదాభ్యాస జడుడూ - విషయ వ్యావృత్త కౌతూహలుడూ- పురాణ పురుషుడూ. పాతకాలం మనిషి. అలాంటి వాడింత మనోజ్ఞమైన రూపాన్ని సృష్టించటమేమిటి. అయితే మరి ఎవరు సృష్టించారని. చంద్రుడయినా అయి ఉంటాడు. మన్మథుడయినా అయి ఉంటాడు. లేదా వసంతుడయినా అయి ఉంటాడు సృష్టి కర్త. చంద్రుడు గనుకనే ఈ కాంతి - మన్మథుడు గనుకనే ఈ హావ భావాలు - వసంతుడు గనుకనే ఈ సౌకుమార్య మేర్పడిందీవిడకు. ఈవిడంటే ఎవరీవిడ. ఊర్వశా. కాదు. పైకి ఊర్వశిని వర్ణిస్తున్నా కవి మనసులో ఉన్నది కావ్యోర్వశే. ఆవిడ సర్వాంగ సుందరంగా కన పడాలంటే లావణ్యమూ - సౌకుమార్యమూ - విలాసమూ - మూడు లక్షణాలూ అవశ్యంగా ఉండి తీరాలి. అలా ఉండాలంటే దానిని నిర్మించిన కవి ఎలాంటి వాడయి ఉండాలి. కేవల శాస్త్రజ్ఞుడూ - పురాణ కర్తా అయితే లాభం లేదు. నవ నవోన్మేషంగా భావించే కుతూహలానికి దూర మతడు. వాటితో పాటు వాటికి మెరుగు పెట్టే సకల కళా కుశలుడూ రసభావ కోవిదుడూ అయి ఉండాలి. ఇదీ కాళిదాసు ఆసించిన కావ్య రచనా సౌందర్యం. ఇలాంటి సౌందర్య మెప్పు డలవడుతుంది కావ్యానికి. ఎప్పటి కప్పుడు క్రొత్తగా భాసించి నప్పుడు. నిన్నటి సరుకు నేటికి పనికి రాదు. పాత పడి పోతుంది. అందుకే నేమో సృష్టి రాద్యేవ ధాతుః - బ్రహ్మ దేవుడి మొదటి సృష్టి అయి ఉంటుందా యక్షకాంత అని వర్ణిస్తాడు. ఆద్యా సృష్టిః అని రెండు మూడు చోట్ల వస్తుందీ మాట ఆయన స్త్రీవర్ణనలో. మొదటి సృష్టి అనటంలో ఏమిటాయన ఉద్దేశం. పాత పడకుండ ప్రత్యగ్రంగా భాసిస్తుందని. ఈ ప్రత్యగ్రతా ఈ ప్రత్యంగ సౌష్ఠవమూ - ఇవే కావ్య నాయికకు గాని నాయిక లాంటి కావ్యానికి గాని ఆసించేది ఆ మహా కవి. మాళవిక లాంటి కన్యక నైతే ఆయన కావ్య కన్యా నిర్విశేష గానే భావించినట్లు తోస్తుంది. ఛందో నర్తయితు ర్యథైవ మనసి శ్లిష్టం తథాస్యా వపుః ఆవిడ సర్వాయవ సౌందర్యం చూస్తే అది గురువు గారి మనసులో ఎలా ఉంటే బాగుండు ననిపిస్తుందో అలాగే పొందుపడి ఉందట.

నిజానికా గురువుగా రెవరో కాదు. తానే. ఆ మాళవిక శరీర మేదో గాదు. తన కావ్య శరీరమే, ఆ కన్య సౌందర్యం కావ్య కన్యా సౌందర్యమే. గురువుగా రాసించినట్లుం దనటం తాను భావించినట్లు తన కావ్యం సర్వాంగ సుందరంగా నిర్మించ బడటమే .

ఇంత సర్వాంగ సుందరమూ సమగ్రతా బంధురమూ అయి ఉండాలి కావ్య నిర్మాణ మనేది కాళిదాసు దృష్టిలో. అయితే ఇది సరియైన దృష్టి యేనా అని ప్రశ్న. ఎందుకంటే ఈశ్వర సృష్టిలో సుందరం కాని అంశం మంటూ ఏదీ లేదని ఇంతకు ముందే పేర్కొన్నాము. ఏది ఎక్కడ ఎలా ఉండాలో అలాగే ఉంది ఈ సృష్టిలో. ఏదీ హేయం కాదని గదా సిద్ధాంతం. పారమేశ్వరమైన విభూతి అన్నప్పుడంతా అనవద్యమే కావాలి గాని సావద్య మెలా అవుతుంది. అలాంటప్పుడు సామగ్ర్య విధౌ గుణానాం పరాఙ్ముఖీ విశ్వ సృజః ప్రవృత్తిః విశ్వ కర్త చేసిన ఈ సృష్టి సమగ్రం కాదని - సర్వాంగ సుందరం కాదని - కవి సృష్టే మహనీయ మని కాళిదాసు పేర్కొనట మేమి బాగు. నిజమే. పైకి చూస్తే ఏ మాత్రమూ యుక్తి సహంగా కనపడదీ మాట. కాని మాటను గాక మాటలోని ఆంతర్యాన్ని భావన చేయ గలిగితే పొరబాటు లేదు సరిగదా అదే సబబని నిర్ధారణ అవుతుంది. పారమేశ్వరమైన సృష్టి అంతా రమణీయమే మహనీయమే నని తెలియని వాడు కాడు కాళిదాసు. శివ శక్తి ద్వయాత్మకమైన ఈ జగత్తు నసుందరమని ఎలా అనగలడా శివాద్వయ దర్శన పార దర్శనుడు. ఇది సుందర మది కాదనే భేద దృష్టి ఉన్నవా డయితే అష్టధా భిన్నమైన పరమాత్మ విభూతి నలా కీర్తించ గలడా. పైగా ఏకస్త్వం బహురూప భాక్. నానా రూపాలుగా భిన్నమై కనిపిస్తున్నదా ఏకమైన తత్త్వమే. త్వయ్యేవ నిపతంత్యోఘా జాహ్నవీయా ఇవార్ణవే. ఎన్ని భిన్న మార్గాలయినా అన్నీ కలిసి చివరకందులో చేరిపోయేవే. ద్రవ స్సంఘాత కఠినః ద్రవంగా ఘనంగా స్థూలంగా సూక్ష్మంగా లఘువుగా గురువుగా వ్యక్తంగా అవ్యక్తంగా కనపడతున్న దెవరంటారు. అంతా ఆ పారమేశ్వరమైన శక్తే. ఇదంతా దాని విభూతే నని

ఇలా చిత్ర విచిత్రమైన సృష్టి నంతా ఏక రూపంగా దర్శించ గలడా. వర్ణించ గలడా.

అలా వర్ణించాడంటే అప్పటికీ సృష్టి అసమగ్రమనీ అరమణీయమనీ చెప్పటం కాదు కవి వివక్షితం. మరేమిటని. అంత సుందరమే అయినా సముచితమే అయినా అలా చూడలేక పోతున్నాడు మానవుడు. పరిమితమైన దృష్టితో చూచేసరి కందులో కొంత సుందరంగానూ కొంత వికృతంగానూ భాసిస్తున్నది. అది సృష్టి లోపం కాదు. మానవుడి దృష్టి లోపం. ఈ దృష్టిని బట్టి సృష్టి నలా భావిస్తుంటే సృష్టి సమంగా ఉన్నా విషమంగా కనిపిస్తున్నది. సుందరంగా ఉన్నా అసుందరంగా సమగ్రంగా ఉన్నా అసమగ్రంగా కనిపిస్తున్నది. అంచేత మీ దృష్టిని మార్చుకొని చూడటం నేర్చుకోండి - సృష్టి అంతా సుందరమే సమగ్రమే నని మనకు కావ్య సృష్టి ద్వారా భంగ్యంతరంగా సలహా ఇస్తున్నాడు మహా కవి.

సమర్థుడైన కవి ఒక కావ్యం రచించినప్పుడా కావ్యంలో ఎన్నో సన్ని వేశా లుంటాయి. రసభావా లుంటాయి. అందులో శృంగార ముంటుంది. కరుణ ముంటుంది. బీభత్స ముంటుంది. భయానక ముంటుంది. ఏది ఎక్కడ వర్ణిస్తే అక్కడ అదే సుందరం. శృంగారం సుందరమయి బీభత్స మసుందర మనరాదు. రస దృష్టితో చూచినప్పు డంతా సుందరమే. ఇది అభ్యాస మయితే రసజ్ఞుడైన పాఠకుడీ జగత్సృష్టి కూడా నానా రస భావ బంధుర మయి కనిపిస్తుంటే దేనినీ ద్వేషించడు. అంతా రమణీయంగానే దర్శించ గలడు. ఇదుగో ఇలాటి నిర్లిప్తమైన నిష్పాక్షికమైన సమ దర్శనం మన కలవాటు చేయటానికే భంగ్యంతరంగా కాళిదాసు భౌతిక సృష్టిలో లోపమున్నట్టు అక్కడ డక్కడా వర్ణించటం. అద్వైత భాషలో చెబితే ఇది అనువాదమే గాని విధానం గాదు. మన దృష్టిలోని వైషమ్యాన్ని అనువదించి దానికి కావ్య సృష్టి ద్వారా సర్వ సామ్యాన్ని విధించే మార్గమిది. ప్రభు సమ్మితమైన శాస్త్రమార్గం కాక సుకుమారమైన కావ్య మార్గం. ఇదీ ఇక్కడ

మన మర్ధం చేసుకోవలసిన కవి మాటల లోని మర్మం. ఈశ్వర సృష్టిలో సౌందర్యమున్నా అది చాలా వరకు గుప్తమై ఉంటుంది. అంచేత మానవుడి దృష్టికి కొంత సుందరం కొంత అసుందరంగా కనిపిస్తుంది. కవి అలా గుప్తమైన దాన్ని కూడా ప్రకటం చేసి సృష్టి అంతా సుందరమని మనకు జ్ఞాపకం చేయటానికే సర్వాంగ సుందరంగా తన కావ్య సృష్టి తీర్చి దిద్దుతాడు. ఈ ప్రతి బింబాన్ని బట్టి సహృదయుడు దీనికి బింబమైన జగత్సృష్టికూడా సర్వాంగ సుందరమే నని అర్థం చేసుకోవాలని కవి హృదయం.

పోతే రచనా గతమైన ఆ సౌందర్యాన్ని కవి ఏలా పొందు పరిచాడో - తద్ద్వారా పారమేశ్వరమైన ఈ జగ ద్రచనలోని సౌందర్యాన్ని భావకుడి దృష్టికెలా అందిస్తున్నాడో సోదాహరణంగా పరిశీలించ వలసి ఉంది. సిద్ధాంతానికి దృష్టాంతమే గదా పరిపూర్ణత నాపాదిస్తుంది. సిద్ధాంత మేమిటి. రచన ఎంత సుందరమైతే అంతగా అది దాని మూల తత్త్వాన్ని మనసుకు తెస్తుందని. ఇది ఈ ప్రపంచ సృష్టి కెలాగో కావ్య సృష్టికీ అలాగేనని పేర్కొన్నాము. సృష్టి ఎలా జరిగిందసలు. చేతనా చేతనాత్మకంగా. లతా వృక్షాదులు మొదలుకొని మానవుల వరకూ - ఆ మాటకు వస్తే దేవ దానవాదుల వరకూ - ఇదంతా చేతన సృష్టి. కాగా అరణ్య పర్వత నదీ సముద్ర పృథివ్యంతరిక్షాది భూత భౌతిక పదార్థజాత మంతా అచేతన సృష్టి. చేతనులంటే వారి చిత్తవృత్తులూ మాటలూ - చేష్టలూ- ఈ త్రివిధ వ్యాపారాలూ కలిసి వస్తాయి. వాటిలో ఒక్కొక్కటీ ఏంతో విశాలమైన క్షేత్రం. చిత్ర విచిత్రమైన ఈ చేతన ప్రకృతినీ- అంతకన్నా చిత్రాతి చిత్రమైన జడ ప్రకృతినీ- ప్రత్యణువూ వ్యాపించి పరచుకొని ఉన్నదా పరాశక్తి రచనా సౌందర్యం. పోతే దాని ననుసరించే చేయవలసిన కావ్య ప్రపంచ సృష్టిలో కూడా అలాగే విస్తరించి ఉండాలది. అందులోనూ చాలా భాగం గుప్తమైన ఆ సృష్టి సౌందర్యాన్ని ప్రతి సృష్టిలో బాగా ప్రకటం చేసి చూపవలసిన భాధ్యత కూడా ఒకటున్నది మహా కవి పైన. అదే ప్రయత్నాత్ అని కాళిదాసు చెప్పిన

మాటకర్థం. అసలు కంత అక్కర లేదు గాని దానిని చూచి తయారు చేసే నకలు కెక్కువ కావాలది. దీనికే ప్రతిభ అని మారుపేరు. ఇలాటి ప్రతిభా సంపత్తి నూటికి నూరుపాళ్ళూ ఉన్న సంపన్నుడు కాళిదాస మహా కవి. చేతనా చేతన పదార్థ జాతమీ సృష్టిలో ఎంత చిత్ర విచిత్రంగా మనోజ్ఞంగా కనిపిస్తుందో- అంత విలక్షణంగా హృదయంగమంగా కనిపించేలాగా నగిషీ చేసి చూపాడాయన తన కావ్య సృష్టిలో. అంతే కాదు. చైతన్య రూపుడైన ఒకే ఒక పరమాత్మ సృష్టి అయినప్పు డచేతన మైన భాగమిందులో కని పించరాదు. అంతా చైతన్య మయంగానే భాసించాలి. అందుకే నేమో అచేతనాలకు కూడా చైతన్యాన్ని ఆరోపించి వాటిని కూడా చేతనాలుగానే మనముందు నిలుపుతాడు మహాకవి. దానితో విశ్వమంతా ఒకే ఒక చైతన్య విభూతిగా సాక్షాత్కరిస్తుంది సహృదయుడి జ్ఞాన చక్షువుకు. ఆయన ఒక పర్వతాన్నే వర్ణించ నీయండి. పట్టణాన్నే వర్ణించ నీయండి. ఇదే వరస.

చూడండి. కుమార సంభవంలో హిమవత్పర్వతాన్ని వర్ణించాడు కవి. అది చేతనమా అచేతనమా అంటే రెండూ. రెండు రూపాలూ కనిపించాయా మహా కవికి. జంగమం ప్రేష్య భావే వః -స్థావరం చరణాంకిత మంటూ హిమవంతుడి చేతనే పలికిస్తాడు సప్త మహర్షుల దగ్గర. సింహ వ్యాఘ్రాదు లక్కడ సంచరించటమూ - గంగాది నదులు ప్రవహించటమూ-మేఘాలు సానువుల మీద వచ్చి వాలటమూ - దేవదారు కీచకాదులు దట్టంగా పెరిగి కమ్ముకొని ఉండటమూ- దాని అచేతన లక్షణాలైతే- అనేక రత్న రాసుల కధిపతి అయి అప్సరసలకు విభ్రమాలంకారాలు సవదరిస్తూ గంధర్వ గానానికి తానం సమకూరుస్తూ - మహర్షులకు తపో భంగం లేకుండా ఆశ్రయమిస్తూ చమరీ మృగాల చేత వింజామరలు వేయించుకొంటూ - శత్రుభయంతో వచ్చి శరణు వేడిన చీకట్ల లాంటి క్షుద్రులకు కూడా నిలువ నీడనిస్తూ - ఇలాటివి దాని చేతన లక్షణాలు. అందులోనూ పర్వత రాజని వర్ణించి నందుకు రాజలాంఛనాలు కూడా ఏ మాత్రమూ బీరు పోకుండా వర్ణించి

చూపుతాడు. అంతే కాదు. రాజ మాత్రుడు కూడా కాక దేవతాత్ముడని ఇంకా గొప్ప పదవి ఇస్తాడాయనకు. అలా కాకుంటే జగన్మాతకు జనకుడు కాలేడు. దేవర్షులతో వ్యవహరించలేడు. జగదీశ్వరుడికి శ్వశురు డనిపించుకోలేడు. ఇదంతా మనసులో ఉండే మొదటి నుంచీ చివర దాకా ఆయన చేతనాచేతన స్వరూపాన్ని సవ్యసాచి లాగా వర్ణిస్తూ వచ్చాడు కవి. వ్యపదేశాని కచేతన మైతే వ్యవహారానికి చేతనం.

ఒక పర్వత మేమిటి. ఆ పర్వతం మీద ప్రవహించే గంగాది నదీమ తల్లులు కూడా సచేతనలే కవి దృష్టికి. పార్వతి లాగా భాగీరధి కూడా ఆయన కూతురే. తయాస పూతశ్చ విభూషితశ్చ. ఇద్దరి చేతా తన జన్మ పవిత్రమైనదని భావించినవాడు. ఆవిడను ఈశ్వరుడికిచ్చి సంతసించినట్టే ఈవిడను సముద్రుడి కర్పించి తృప్తి చెందిన సద్గృహస్థుడు. మరి గౌరికి గంగ అక్కగా రైనందుకు చెల్లెలిని చెట్టబట్టిన జగద్గురువు కావిడ సేవ చేయటం కూడా ధర్మమే. అందుకేనేమో శివ పార్వతుల కళ్యాణం జరుగుతుంటే మూర్తేచ గంగా యమునే తదానీం సచామరే దేవ మసేవి షాతాం. తానూ తన ప్రియ సఖి యమునా చక్కగా ముస్తాబు చేసుకొని వచ్చి చామర గ్రాహిణులయి ఆయనను సేవించారట. శ్రీ రాముడు వన వాసం ముగించు కొని తిరిగి సీతా సమేతుడయి అయోధ్యకు వస్తున్నాడు. పుష్పకంనుంచి క్రిందికి చూస్తే పురోప కంఠంలో సరయూనది కన్నుల పండువు చేసింది. దాన్ని వర్ణిస్తూ సీతతో ఇలా అంటా డాయన. సేయం మదీయా జననీవ తేన మాన్యేన రాజ్ఞా సరయూ ర్వియుక్తా- దూరే వసంతం శిశిరానిలై ర్మాం తరంగ హస్తైరుపగూహతీవ. ఇదుగో చూచావా సీతా ఈ సరయూ నది. ఇది నది కాదు. మా తల్లి కౌసల్యా దేవే. ఆవిడ లాగే మా తండ్రి నెడబాసి బ్రతుకుతున్నది. నాకోస మిన్నాళ్ళూ కంట తడి పెట్టి ఇప్పుడు నేను రాగానే దూరంనుంచే చల్లని తరంగ హస్తాలతో నన్ను గాఢంగా కౌగిలిస్తున్నది. ఎంత

మనోహరమైన భావమిది. మాతృ వాత్సల్య మెంత గొప్పదో నదీ మతల్లిలో కూడా కనపడుతున్నదా రాముడికి. కాదు కాళిదాసుకు.

పోతే ఈ నదులన్నిటికీ ఏకైక వల్లభుడు సముద్రుడు. ఆయన ఎలా కనిపిస్తాడో తెలుసా కాళిదాసు దృష్టికి. ముఖార్పణేషు ప్రకృతి ప్రగల్భా: స్వయం తరంగాధర దాన దక్ష:- తన ప్రియురాండ్రైన నదులు స్వయంగా పెదవు లందిస్తుంటే తానూ వారికి తరంగాలనే పెదవులు సోకిస్తూ లోకంలో ఏ ప్రేయసీ ప్రియులలోనూ చూడని పరస్పరాధరామృత పాన వ్యవహారం క్రొత్తగా చూపుతున్నాడట. నదీ సముద్రాలే గాదు. పట్టణాలు కూడా పట్టమహిషుల లాగే గోచరిస్తా యాయనకు. అయోధ్యా పట్టణమైనా ఆయన పాలిటి కొక దేవతే. ఉన్నట్టుండి ఆవిడ కుశ మహారాజుకు కలలో కనిపిస్తుంది. అదీ ఎలాగా. తలుపులన్నీ మూసి గడియ పెట్టి ఉంటే కూడా లోపల ప్రవేశించింది. ఎలా ప్రవేశించిం దంటారు. ఛాయామివా దర్శతలం. మన నీడ అద్దంలోలాగా ప్రవేశించిందట. ఏమి అద్భుతమైన ఉపమానం. అలా ప్రవేశించి అతడులికి పడి చూస్తుంటే ఇక ఏకరువు పెడుతుంది తన గోడంతా. కుమారా! నీ తండ్రి మరణానంతరం నే ననాధ నయ్యాను. నా పూర్వ వైభవ మంతా అస్తమించి పోయింది. కలహంసలూ మయూరాలూ తిరిగిన చోట వ్యాఘ్ర వరాహాలు సంచరిస్తున్నాయి. భవనాలన్నీ వనాలయి పోయాయి. దీపకాంతులకు మారుగా ధూమక్రాంతులే కనిపిస్తా యెక్కడ చూచినా.మరలా నీబోటి మహనీయుడు వచ్చి పాలిస్తేనే గాని బాగు పడదు నా సాభాగ్యమని వాపోతుంది. ఇది పట్టణమా పట్టణాధిదేవతా. దేవతే కవి దృష్టికి. అది ఇప్పుడు గతి చెడి ముదుసలి అయినా ఒకప్పుడు తరుణవయస్క.

రాముడు తిరిగి అయోధ్యకు వచ్చినపు డెలా కనిపించిందో తెలుసా అది. ప్రాసాద కాలాగురు ధూమ రాజి: - తస్యా: పురో వాయు వశేన భిన్నా. నగర ప్రాసాద పంక్తుల నుంచి అగరు సాంబ్రాణి ధూమం గాలికి చెదరి

బయటికి వస్తుంటే తన నాధుడు రామ చంద్రుడు ప్రవాసం నుంచి తిరిగి వచ్చి స్వయంగా విప్పిన ఆ పట్టణ లక్ష్మి కేశ పాశం లాగా భాసిస్తున్నదట. మరి అంతకుముందు రాముడి కళ్యాణోత్సవానికి దశరధాదులు మిథిలకు తరలి వస్తుంటే వారి సైనికుల సమ్మర్దాని కోర్చుకొన్న ఆ నగరం ఒక కాంతుని సురత సమ్మర్దాన్ని భరించే కాంతలా ఉందంటాడు. అంతే కాదు. అజ మహారాజు ఇందుమతీ స్వయంవరానికి విదర్భకు వెళ్ళినపు డాయన దిగిన విడిది గృహ మెలా ఉందని వర్ణించాడో తెలుసా మహా కవి. పట్టణ మొక కాంత అయితే అందులోని ప్రాసాదమూ ఒక కాంతలాగే స్వాగత మిచ్చిందా యువరాజుకు. తస్యాధికార పురుషై: ప్రణతై: ప్రదిష్టాం- ప్రాగ్ద్వార వేది వినివేశిత పూర్ణకుంభాం- రమ్యాం. రాజ పురుషులు స్వయంగా వచ్చి తన కప్పగించారా విడిది పట్టు. ఎలా ఉందది. ముఖద్వారాని కిరుపైపులా రెండు పూర్ణకుంభాలు. ఈ కుంభాలేవో కావు. కుచ కుంభాలే. వాటితో రమ్యమైన దట అది. రమణీయ మనే గాక రమించ దగిన దని కూడా అర్థమే. అలాంటి సౌధాన్ని ఆయనకా పురుషు లప్పగించారంటే కన్య జననీ జనకులు తమ కన్యనొక వరునికి అప్పగించటమే నని స్ఫురిస్తుంది. అంతే కాదు ఇది తరువాత ఇందుమతి ఆయననే వరించబోతుందనే భావ్యర్థానికి కూడా మహా కవి చేస్తున్న సూచన. బాల్యా త్పరామివ దశాం మదనోధ్యువాస. బాల్యంకంటే పరమైనది యౌవనం. యౌవన దశను అధిష్ఠించినట్టు అధిష్ఠించాడట అజు డాభవనాన్ని. ఇందులోనూ తరువాత ఇందుమతీ యౌవనానుభవాని కాయనే వారసుడని చెప్పక చెప్పిన ట్టయింది. ఇలాగే ఒక చోట విక్రమోర్వశీయంలో ఊర్వశి తన చెలి చిత్రరేఖతో భూలోకానికి దిగి వస్తూ త్రివేణీ తీరంలో ఉన్న ప్రతిష్ఠాన పట్టణంలోని రాజ ప్రాసాదాన్ని వర్ణిస్తూ ఇలా అంటుంది. ఏత ద్భగవత్యా భాగీరధ్యా యమునా సంగ పావనేషు సలిలేషు పుణ్యే ష్వవలోక యత ఇవ ఆత్మానం. రాజ ప్రాసాదం తన శరీర సౌష్ఠవ మెలా ఉందో తెలుసు కుందామని గంగా జలాలలో తొంగి చూస్తున్నదట.

ఇలాంటి వర్ణనలన్నీ చూస్తుంటే ఇవి పట్టణాలా ప్రాసాదాలా నదులా సముద్రాలా పర్వతాలా అనే ప్రశ్న లేదు. అచేతన సృష్టిలో కూడా చిద్రూపిణి అయిన ఆ మహాశక్తి సౌందర్యాన్నే తిలకిస్తుంటాడు మహా కవి. పర్వత పట్టణాదులే గాదు. ఆకాశంలో ఎక్కడో సంచరించే మేఘాలూ- ఆ మేఘాలలో తళుక్కున మెరిసే మెరుపుతీగలూ కూడా సచేతనాలే ఆయనకు. ఎంత దూరం పోయిందంటే ఈ ఊహ- విక్రమోర్వశీయంలో ఆపాతత: చేసిన వర్ణన చాలక మేఘ సందేశ మనే ఒక ఖండ కావ్య రచనకే అది పురికొల్పింది. యక్షుడు మాటాడిన దంతా ఆ మేఘుడితోనే. అతని దృష్టికా మేఘుడొక ఆపద్బాంధవుడు. గొప్ప రసికుడు. ప్రాణమిత్రుడు మహాభక్తుడు. ఇంకా ఎన్నో ఎన్నో. పుష్కరావర్త వంశంలో పుట్టాడా మేఘుడు. దేవేంద్రుడికి నమ్మిన బంటు. సంతప్తుల పాలిటికి చల్లని ప్రభువు. ఏటేటా వచ్చి తన పర్వత మిత్రుణ్ణి కలుసుకొని తన ప్రగాఢ మైత్రికి చిహ్నంగా ఆనంద బాష్పాలు కురుస్తాడు. నాట్యం చేసి చేసి అలసి పోయిన వార కాంతల కుచ కోరకాల మీద చల్లని చినుకులు రాల్చి అనురాగ పేశలమైన వారి అపాంగ వీక్షణాలకు పాత్రుడైన రసికుడు. మరి సారస్వత జలాలను పానం చేసి బాహ్యానికి కృష్ణ వర్ణుడైనా ఆంతర్యంలో పరిశుద్ధుడైన వాడు. ఆదిమ దంపతులు కైలాస మారోహిస్తుంటే ముందుగా పోయి వారికితన శరీరాన్నే సోపాన పంక్తిలాగా అలవరించే పరమ భాగవతుడు. పోతే ఇక విద్యుత్కళత్రాన్ని ఎడబాయక చిరకాలం కాపురం చేయాలనుకొనే సద్గృహస్థుడు. ఇలాంటి వాడు మేఘుడంటే కవి దృష్టికి.

ఒక్క మేఘు డేమిటి-పర్వత పట్టణాదు లేమిటి. లతా వృక్ష పశు పక్ష్యాదులకు కూడా మానవోచితమైన వ్యవహారాన్నే అంటగడతాడా మహా కవి. అవి నదీ పర్వతాదుల లాగా అచేతనాలు కాకపోయినా మానవులు కావు కదా. అయినా వాటిని కూడా మానవులుగా భావించి వర్ణిస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఆహ్లాదం కొలుపుతుంది మన హృదయాలకు. అవాకిరన్ బాల

లతా: ప్రసూనై:- ఆచార లాజై రివ పౌర కన్యా:- దిలీపుడు వనంలో ప్రవేశించాడో లేదో లతలనే కన్యలు పౌర కన్యలలాగే ఆయన మీద పుష్పాలనే అక్షతలు చల్లుతాయి. శాకుంతలంలో శకుంతలకు ప్రాణసమానమైన బిడ్డ ఒకటున్నది. అది ఏదో కాదు. వనమాలిక అనే లత. దానికి వనజ్యోత్స్న అని పేరు పెట్టిందావిడ. దాన్ని పెండ్లి కూతురుగా ముస్తాబుచేసి సహకార పాదపమనే పెండ్లి కొడుకుతో ఎప్పుడు కలపాలని ఆవిడ ఆలోచన. లతా పాదప మిథునమట అది. ఇలాటి మిథునాలు కొన్ని అకాల వసంతోదయానికి తట్టుకోలేక పోయాయి కుమార సంభవంలో. ముఖ్యంగా తరులనే వరులు తట్టుకోలేక పుష్ప స్తబకాలనే స్తనాలతో ప్రవాళాలనే అధరాలతో వచ్చి కౌగిలించుకొన్న లతా వధువులను తమ శాఖా బాహువులతో గట్టిగా హృదయాలకు హత్తుకొన్నాయట. ఇక మధుకర దంపతులైతే రెండూ కలిసి ఒకే కుసుమ పాత్రలో మధు పానం చేస్తున్నాయట. ఆకితే పారవశ్యంతో కనులు మూత పడ్డ ఆడు జింకను మగ జింక కొమ్ములతో దాని శరీరాన్ని మెల్లగా గోకుతున్నదట. మరి ఏనుగు దంపతు లైతే మగ ఏనుగు పెంటి ఏనుగుకు పద్మరేణు పరిమళితమైన జలాన్ని పుక్కిటితో అందిస్తున్నదట. సగం కొరికిన మృణాళ నాళాన్ని చక్రవాకం చక్రవాకి నోటి కందిస్తున్నదట. ఏమి మనోహరమైన వర్ణనలివి. ప్రేమ రస బంధురమైన దాంపత్య జీవన సుఖాన్ని మానవుల నుంచి మోసుకొని పోయి స్థావర జంగమాల కన్నిటికీ పంచి పెడుతున్నాడు మహా కవి. అచేతన సృష్టి కూడా సచేతనమే ఆయనకు.

అంతేకాదు. అచేతనాలలో చేతన వ్యవహారాన్ని చూచినట్టే చేతనాలలో మరలా అచేతన భావాన్ని కూడా చూడగల డాయన. సర్వాతి సార యుక్తేన సర్వతేజోభి భావినా- స్థితస్సర్వోన్న తేనోర్వీం క్రాంత్వా మేరు రివాత్మనా. దిలీప మహారాజు మేరువులాగా భూమండల మాక్రమించి ఉన్నాడట. మేరువులాగే స్థైర్యమూ తేజస్సూ ఔన్నత్యమూ- అన్ని గుణాలూ ఉన్నాయట ఆయనకు. భీమకాంతై: నృప గుణై:.... యాదో రత్నై రివార్ణవ: సముద్రంలా

కూడా ఉన్నాడట ఆ చక్రవర్తి. సముద్రానికీ ఆయనకూ ఏమిటి పోలిక. సముద్రంలాగే ఆయనా అభిగమ్యుడూ అనభిగమ్యుడూ కూడా. రత్నాకరమని దగ్గర చేరటమూ. తిమి తిమింగిలా లుంటాయని పారిపోవటమూ. రెండు భావాలూ ఉదయిస్తాయి సముద్రాన్ని చూస్తే మనకు. అలాగే సాత్త్విక రాజస గుణాలు రెండూ ఉన్న ఆ దిలీపుణ్ణి చూస్తే రెండు భావాలూ ఏర్పడుతాయి. మరొకచోట రఘు మహారాజును వర్ణిస్తూ మహోక్షతాం వత్సతర: స్పృశన్నివ - ద్విపేంద్ర భావం కలభ: శ్రయన్నివ- అని అచేతనాలు కాకపోయినా ఒక వృషభంతోనూ గజేంద్రుని తోనూ పోల్చి వర్ణిస్తాడాయన ప్రౌఢ దశను. కుమారసంభవంలో అమ్మవారు శివ దూషణ వినలేక పరాఙ్ముఖి అయి వెడుతుంచే ఆవిడ చేయి పట్టుకొంటాడు కపట బ్రహ్మచారి. ఎవరా ఇది అని ఆవిడ తిరిగి చూచే సరికి పరమ శివుడు. అప్పుడావిడ సంభ్రమావస్థను వర్ణిస్తున్నాడు కవి. మార్గాచల వ్యతికరా కులితేవ సింధు:- శైలాధి రాజ తనయా నయయౌ నతస్థౌ. ఒక నది ఉరవడిగా ప్రవహిస్తుంటే మధ్యలో ఒక పర్వతం మార్గాని కడ్డుతగిలితే ఎలా ఉంటుంది. అది ముందుకు సాగి పోలేదు. వెనక్కు మళ్ళి పోలేదు. అలాగే పార్వతి కూడా పోవాలని పాదంపైకెత్తి కూడా పోలేక అలాగే నిలిచి పోయిందని వర్ణిస్తాడు. ఇలాంటి వర్ణనలు కోకొల్లలు. చూపుతూ పోతే ఎన్నైనా చూపవచ్చు.

పోతే ఒక్కమాట. ఇది చేతన మని ఆచేతనమని కాదు. అసలే పాత్రనైనా సన్నివేశమైనా భావాన్నైనా మహా కవి వర్ణిస్తుంటే ఒక చిత్రాన్ని చూచిన ట్లుంటుంది. సజీవంగా ఒక విగ్రహాన్ని మలచిన ట్లుంటుంది. ఏదో దూర దూర లోకాలకు మనలను తీసుకు పోయిన ట్లనిపిస్తుంది. ఆ వర్ణన ఎంతగా మన మనో యవనిక మీద ముద్రిత మవుతుందంటే ఇక మన జీవితాంతమూ ఎప్పుడు తలచుకొంటే అప్పుడు ప్రత్యక్ష మవుతుంది మనో నేత్రానికి. ఇది ఆయన చిత్ర కళా నైపుణ్యానికి నిదర్శనం కాబోలు. అసలాయనే చెప్పుకొంటా డక్కడక్కడా. చిత్రే నివేశ్య పరికల్పిత సత్త్వయోగా- చిత్రార్పితారంభ ఇవా

వతస్థే. కవిత్వమంటే చిత్రం చూచినట్లు చూడ గలిగిందేదో అదేనని ఆయన హృదయం. కుమార సంభవంలో పరమేశ్వరుడి తపస్సమాధిని వర్ణించిన ఘట్టం చదువుతుంటే నిజంగా ఒక మహోజ్జ్వలమైన చిత్రాన్ని చూస్తున్నామా అని తోస్తుంది భావుకుడికి. మన్మథుడు స్థాణ్వాశ్రమంలో ప్రవేశించాడో లేదో ఎదుట కనిపిస్తున్న దీశ్వరుడి విగ్రహం. ఎలా కనిపిస్తున్నదది. దేవదారు వృక్షం క్రింద ఒక వేదిక. దాని మీద శార్దూల చర్మం. దాని పైన ఆసీనుడయి ఉన్నాడాయన. ఎలా. రెండు పాదాలూ తొడలమీద వేసుకొని చేతులు రెండూ ఒడిలో వెల్లకిల పెట్టుకొని పొడవైన బాహువులు కదలకుండా నిలుపుకొని కూచున్నాడట. జడలన్నీ పాములచేత పెనవైచి కొప్పు పెట్టుకొన్నాడు. రెండు పేటలుగా రుద్రాక్షమాల చెవులకు చుట్టుకొన్నాడు. కృష్ణాజినం తన నల్లని మెడ చుట్టూ ముడి వేసుకొన్నాడు. స్తిమితోగ్రమైన కనుపాపల చూపులు నాసికాగ్రం మీదనే నిలిపి ఉంచాడు. మరి ఆయన అలా చూస్తుంటే కపాల రంధ్రం నుంచి యోగ ప్రభావంతో జ్యోతిః ప్రరోహాలు పైకి చిమ్ము తున్నాయి. లోపల ప్రాణాపానాది వాయువులను స్తంభింపజేసి నివాత ప్రదీపం లాగా- వృష్టి సంరంభం లేని మేఘ మండలం లాగా - తరంగ భంగం లేని మహా సముద్రం లాగా - భాసిస్తున్నా డట ఆ మహా యోగీశ్వరుడు. ఈ వర్ణన చూస్తే ఏ గొప్ప చిత్రకారుడో గీచిన ఒక చిత్ర పటం లాగా స్ఫురించటం లేదా మనకు. అసలు రవి వర్మలాంటి చిత్రకారు లందరూ కాళిదాసు చేసిన ఈ వర్ణన చూచే తరువాత సమాధి గతుడైన ఈశ్వరుని చిత్రాన్ని అలా గీస్తూ వచ్చారా అని తోస్తుంది.

అయ్యగారి బొమ్మ ఇలా గీచాడా మహా కవి. ఇక అమ్మగారి బొమ్మ గీచి చూపుతున్నాడు. అప్పుడే ఆశ్రమంలో ప్రవేశిస్తున్నదా మహా తల్లి. ఎలా ఉంది అప్పుడా దివ్య మంగళ విగ్రహం. అశోక నిర్భర్త్సిత పద్మరాగం-కెంపుల బదులు అశోక పుష్పాలు ధరించింది కొప్పులో. బంగారు వన్నె కొండగోగు పూవులు చెవులకు పెట్టుకొన్నది. సిందువార మాలలు ముత్యాల దండలుగా మెడలో వేసుకొన్నది. మొత్తంమీద వసంత పుష్పాలే నవాభరణాలుగా ధరించి

వన దేవతలా ప్రత్యక్షమయింది. ఆవర్జితా కించిదివ స్తనాభ్యాం. స్తన భరంచేత శరీర యష్టి కొంచెం వంగి వయ్యారంగా నడుస్తుంటే కుసుమ స్తబకాలతో వంగి నడచి వస్తున్న లత లాగా కనిపిస్తున్నదట. మాటి మాటికీ జారి పోతున్న మణిమేఖలను పైకి తోసుకొంటూ వస్తున్నది. అధర బింబాన్ని స్పృశించటానికి ముసురుకొనే భ్రమరాలను బెళుకు చూపులతో చూస్తూ తన లీలారవిందంతో నివారిస్తున్నదట. చెలికత్తెలైన జయా విజయా ఇరువురూ ఇరువైపులా ఉపచరిస్తూ వస్తున్నారు. అలాంటి ఆ త్రిపుర సుందరి దెస చూచే సరి కొక్కసారిగా పోయిన ప్రాణం లేచి వచ్చిందట మన్మథుడికి. మనస్సును మథించే ఇలాటి వర్ణన చూస్తే మనకూ అలాగే లేని ఉత్సాహం పొంగి వస్తుంది సందేహం లేదు. అసలా మన్మథుడింకా వచ్చాడో లేదో అంతకు ముందే ఆ చెహరాలు కనిపిస్తూ వచ్చాయి ఆశ్రమంలో. అకాల మనో వికారాలకు పాలయి గంతులు వేస్తున్న ప్రమథ గణాల గల్లంతు చూచి ఒక్క సారి గద్దించి చూస్తాడు ద్వారపాలకుడైన నందికేశ్వరుడు. అప్పుడెలా అయిపోయిందో తెలుసా ఆ కాననం. కాళిదాసు నడిగితే చెబుతాడు. నిష్కంప వృక్షం-నిభృత ద్విరేఫం-మూకాండజం-శాంత మృగ ప్రచారం. చెట్లు కదలటం లేదు. తేంట్లు మెదలటం లేదు. పక్షులు కూతలుమాని నోళ్ళు మూత పడ్డాయి. మృగాలు అటూ ఇటూ తిరగటం మానేసి ఎక్కడివక్కడ ఆగి పోయాయి. మొత్తం మీద వాలకం చూస్తే చిత్రపటం లోని బొమ్మలలాగా అగి పోయిందట ఆశ్రమమంతా. ఎలాంటి చిత్రమిది. కదలిక లేని చిత్రం.

ఇలాటి చిత్రమే మనకు మాళవికాగ్ని మిత్రంలో ఒకటి కనిపిస్తుంది. వామం సంధి స్తిమిత వలయం న్యస్య హస్తం నితంబే......కాంత మృజ్వాయ తార్థం. మాళవిక నాట్యం చేసి చేసి ఒకానొక భంగిమలో అలా నిలిచి పోతుంది. ఆ నిలిచిపోయిన రూపమెలా ఉందంటే- గాజుల గలగలలు లేని వామ హస్తం పిరుదుల మీద చేర్చి ఉంది. క్రిందికి వాలిన చెట్టుకొమ్మలాగా వదులుగా జారవిడిచింది కుడి చేయి. పాదాల తాకిడికి చెదరి పోయిన పూలతో కూడిన

నేల మీద చూపులు నిలిపి బొమ్మలాగా నిలబడి పోయిందట. బొమ్మలాగా నిలబడిం దావిడ గాదు. ఈ వర్ణన చూస్తే మన మనసులు కూడా అలాగే నిలబడి పోతాయి.

కదలిక లేని చిత్రాలను గీచినట్టే కదిలే చిత్రాలను కూడా గీచి చూపగలడు మహాకవి. దుష్యంతుని రథం వెంట తరుముకొని వస్తుంటే దిక్కుతోచక భయంతో పరుగులు వారే ఒక జింక పిల్లను వర్ణిస్తున్నాడు కవి. గ్రీవా భంగాభిరామం......స్తోక ముర్వ్యాం ప్రయాతి. రథం వెంబడించి వస్తుంటే మెడ త్రిప్పి దాని వైపే రెప్పవాల్పక చూస్తున్నదట. బాణ మెక్కడ పడుతుందో నని శరీరం వెనక భాగాన్ని ముందు భాగం లోనికి ముడుచు కొంటున్నదట. మరి ధర్భపోచలు నములుతూ పరుగు తీసిన అలసట మూలంగా తెరచుకొన్న నోటినుంచి అవి రాలి పడుతుంటే దారి అంతా వాటితో నిండిపోయిందట. ఇంతెందుకు. భయంతో అది నేల మీద పాతిక అయితే ముప్పాతిక భాగం ఆకాశంలోనే ఎగిరి పోతున్న దంటాడు. మృగానికున్న చపల స్వభావం- అందులోనూ భయ భ్రాంతమయి ఉన్నప్పటి చాంచల్యమంతా కన్నులకు కట్టినట్టు చేసిన వర్ణన మిది. కాగా రఘు వంశంలో ఇలాటి కదిలే చిత్రమొకటి ఉంది. స్వయంవరంలో ఇందుమతి అనే రాజ కన్య బారులు తీరి కూర్చున్న రాజ కుమారుల నడుమ నుంచి నడచి పోతున్నది. ఆవిడ ఎవడి దగ్గరికి వస్తే తన్నే వరిస్తుందని ఆశతో అతడి ముఖం వెలిగి పోతూ- తీరా తన్ను కాదని గడచిపోతే వెల వెల పోతున్నది. అది ఎలా ఉందంటే ఆ సన్నివేశం- రాత్రి పూట ఒక దివిటీ వెలిగించి ఒకడెక్కడికో తీసుకు పోతుంటాడు. రాజ వీధిలో ఆ దివిటీ అలా కదలి పోతూ దాని కాంతి ఏ ఇంటి మీద పడితే అది బ్రహ్మాండంగా వెలిగిపోతుంది. అది దాటి పోగానే మరలా చీకట్లు క్రమ్మి మరుగు పడి పోతుంది. అలా ఉందట ఆ రాకుమారుల పరిస్థితి. సంచారిణీ దీపశిఖేవ రాత్రౌ అనటంలో కదిలే బొమ్మనే మనముందు నిలుపుతున్నాడు కవి.

ఇక కదిలీ-కదలని చిత్రాలను కూడా ఎంతో చమత్కారంగా తీర్చి దిద్దగలడా కవి చిత్రకారుడు. ఇంతకు ముందే ఉదాహరించా మొక శ్లోకం. శైలాధిరాజ తనయా నయయౌ నతస్థౌ. కుహనా వటువు సాక్షాత్తు సదా శివుడే అయి చెయి పట్టుకొంటేశైలజ ఎలా అయిపోయింది. ముందుకు పోదామని పాద మెత్తింది. పోలేక పోతున్నది. ఆ దృశ్య మొక సారి మనసుకు తెచ్చుకొండి. అది కదిలే దృశ్యమా- కదలని దృశ్యమా. రెండూ కలిసిన ఒక అపూర్వ దృశ్యం. సరిగా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది దుష్యంతుడికి కూడా. శకుంతలను చూచినప్పటి నుంచీ నగరానికి వెళ్ళటానికి బుద్ధి పుట్టలే దతనికి. అలాగని ఎన్నో రోజు లక్కడ ఉండనూ లేడు. ద్వంద్వా వస్థలో పడ్డాడు. గచ్ఛతి పుర: శరీరం. శరీరం బలవంతంగా ముందుకు పోతున్నదే గాని ధావతి పశ్చా దసం స్తుతం చేత:- మనసు మాత్రం మొరాయిస్తూ వెనక్కు మళ్ళుతున్నది. అది ఎలా ఉందంటే చీనాంశుక మివ కేతో: ప్రతి వాతం నీయమానస్య. ఎదురుగాలికి తీసుకుపోయే పతాక లాగా ఉందట. పతాకాని కొక వస్త్రం పైన కడతారు. అది గాలి కెదురుగా తీసుకుపోతుంటే రెప రెప లాడుతూ వెనక్కు పోతుంది. పతాక కొయ్య మాత్రం కష్టం మీద ముందుకు సాగుతుంటుంది. ఎంత స్వభావ రమణీయ మైన దృశ్యమో చూడండి ఇది. ఇలాటి చిత్రా లెన్ని వందలో తీర్చి దిద్దాడా మహాకవి తన కావ్య మందిరాలలో.

ఈ చిత్రాలలో కూడా చిత్రమేమంటే కేవల వస్తుచిత్రా లుంటాయి. భావ చిత్రా లుంటాయి. ప్రకృతి చిత్రా లుంటాయి. రకరకా లుంటాయి. పూర్వాపరౌ వారి నిధీ విగాహ్య-స్థిత: పృధివ్యా ఇవ మాన దండ: ఇది వస్తు చిత్రం. హిమవత్పర్వతాన్ని వర్ణిస్తున్నాడు కవి. ఎలా ఉందది. మాన దండం అంటే కొల బద్ద లాగా ఉందట. దేనికి. భూమండలానికి. ఇటు అరేబియా సముద్రంనుంచి అటు బంగాళా ఖాతం వరకు నిడివిగా సాగి ఉందా పర్వత పంక్తి. అలా సాగి ఉంటే అది ఆ మధ్య ఉన్న భూభాగమెంత ఉందో కొలిచి చూపే కొలబద్దలాగా ఉందని వర్ణిస్తాడు కవి. ఇది ఒక వస్తువు రూపాన్ని

అందంగా నిరూపించటం కాబట్టి వస్తు వర్ణన. పోతే వస్తువును వర్ణించటం వరకే గాక దాన్ని మించి దానిలో అంతర్గతంగా ఉండే వివిధ భావ రేఖలను బహిర్గతం చేసి చూపటం ఇంకొక కళ. లక్షీ కృతస్య హరిణస్య హరి ప్రభావ:- ప్రేక్ష్య స్థితాం సహచరీం వ్యవధాయ దేహం. దశరథుని వేట వర్ణిస్తున్నాడు కవి. అతడొక మగ లేడిని బాణంతో కొట్టాలని చెవిదాకా నారి సారించాడట. వెంటనే ఆడు లేడి అది కనిపెట్టి తన పెనిమిటి కడ్డంగా వచ్చి నిలుచున్నదట. అది చూచి రసికుడైన ఆ రాజన్యుడు కరుణాళుడై తన శరాన్ని ఉపసంహరించాడట. తిర్యక్కులలో కూడా ప్రగాఢమైన అనురాగం- దానికి ముప్పు వాటిల్లితే ప్రాణ త్యాగానికైనా సిద్ధమైన వాటి నిస్స్వార్థ బుద్ధీ చిత్త శుద్ధీ- అది గమనించి మసలుకోవలసిన మానవుని ఉదార సంస్కారమూ- ఇలాటి మహోన్నత భావాలన్నీ ఒక్కుమ్మడిగా భావుకుడి హృదయాంతరాళంలో నుంచి పైకి పొంగే ఉత్తమం భావ చిత్ర మిది. ఇలాగే దర్భాంకురేణ చరణ: క్షత ఇత్యకాండే..... అసక్తమపి ద్రుమాణాం. దుష్యంతుని విడిచి పోలేక పోతూ నడుమ నడుమ అతణ్ణి చూడాలని ఏదో ఒక నెపంతో వెనుకకు మళ్ళే శకుంతల బొమ్మ గీచి చూపుతున్నాడు కవి. దారిలో దర్భ ముల్లు కాలిలో గ్రుచ్చుకొన్నదని ఆగి పోతుందట. దారి ప్రక్క చెట్టు కొమ్మకు తన చీర కొంగు తగల కున్నా తగులుకొన్నదని దాన్ని తీసుకొనే నెపంతో మొగం వెనక్కు త్రిప్పుతున్నదట. లజ్జా సంకోచాను రాగ సాధ్వ సాది భావ రేఖ లెలా తొంగి చూస్తున్నాయో చూడండి ఈ భావ చిత్రంలో.

పోతే ఇక ప్రకృతి చిత్రా లన్నారా. పానకంలో మిరియం లాగా అక్కడక్కడా పొడచూపే వాటి ఘాటు వర్ణనాతీతం. ప్రకృతి దృశ్యాల నొక మహా కవి వర్ణించాడంటే అది వాటి కోసం కాదు. కారాదు కూడా. కేవలం ఆయా కథా సన్నివేశాల వలన సహృదయుడికి కలిగే రసానుభూతికి దోహదం చేస్తూ దాని నినుమడింప జేయటానికే. దీనికే ఉద్దీపన విభావమని పేరు పెట్టారు ఆలంకారికులు. ఉద్దీపన మంటే అర్థమదే అసలు. ఈ కళా నిర్మాణ



Valluri Brahmaji Srinivasa Rao www.advaitavedanta.in

రహస్యాన్ని అర్థం చేసుకొని చక్కగా అమలు పరిచిన వాడే మహాకవి. కథకు దూరంగా సంబంధం లేకుండా చేయరాదే ప్రకృతి వర్ణనా. కథతో అవినాభూతమై ఏకమై పోవాలి. అప్పుడే కథ గమనానికది అడ్డుతగల కుండా పోయేది. అలాగే సాగాయి కాళిదాసు ప్రకృతి వర్ణనలన్నీ. ఎంతో అంతగానే సాగాయి. మేఘసందేశం కావ్యం కావ్యమంతా ప్రకృతి వివిధ దృశ్యాలు వర్ణించటమే. కొండలే గాదు. నదులే గాదు. పట్టణాలే గాదు. భవనాలే గాదు. ఉద్యాన వనాలే గాదు. ఋతువులేగాదు. దేశ కాలాలనే నేపథ్యం మీద పరచి చూపాడు ప్రతి ఒక్క చిత్రమూ కవి. అసలు కథ ఏముంది ఆ కావ్యంలో. ఒక యక్షుడు శాప గ్రస్తుడై చిత్రకూటం చేరటమూ- దూరంగా అలకాపురిలో ఉన్న తన ప్రేయసి వియోగం భరించలేక ఒక మేఘుణ్ణి పట్టుకొని సందేశం పంపాలని ప్రయత్నించటమూ. ఇంతకూ ఇతడు పంపింది లేదూ. అతడు పోయి అందించింది లేదూ. అంతా యక్షుడి స్వగతమే. ఆ స్వగతంలోనే నడుస్తూ పోతుందీ వ్యవహారమంతా. ప్రకృతిని వర్ణిస్తూనే ఉంటాడొక ప్రక్క. మరో ప్రక్క దానితోపాటు అతని గత జీవితమూ- వర్తమానమూ - దాని తరువాత రాబోయే వృత్తాంతమూ - కథ సన్నివేశాలుగా కలుపుకొంటూ వస్తాడు. హిత్వా తస్మిన్ భుజగ వలయం. దారిలో కైలాసం వస్తుంది. అక్కడ పార్వతి పరమేశ్వరుడి చేయి పట్టుకొని శిఖరం మీది కెక్కుతుంటుంది. నీవు ముందుగా పోయి సోపాన పంక్తిగా మారి వారికి సేవ చేయమంటాడు మేఘుణ్ణి. హిత్వా హాలాం. మరి కొంత దూరం పోతే సరస్వతీ నది వస్తుంది. దాని జలాన్ని ఆస్వాదించు. పైకి నీ శరీరం మలినమైనా లోపల నిర్మలమైన భావ మేర్పడు తుంది నీకు. ఇంతకు ముందు బలరాముడు తీర్థాటనం చేస్తూ అలా సేవించిన వాడే అంటాడు. ఇంకా దూరంపోతే ఉజ్జయిని వస్తుంది. అది నీ మార్గానికి కొంచెం దూరమైనా వెళ్ళి చూడు. చాలా బాగుంటుం దంటాడు. మరి ఇదంతా గడచి పోతే గాని అలకా పట్టణం రాదు. అదే నీకు గమ్య స్థానం. మా స్వస్థానం కూడా అదే. అక్కడే ఉంది మా గృహం. ఎలాంటిదో తెలుసా దాని సౌష్ఠవమని అదంతా ఏకరువు పెడతాడు. ఆ

నగరంలో నివసించే గుహ్యకుల రసిక జీవన మంతా తెగ వర్ణిస్తాడు. ఆ తరువాత తన కాంత ప్రవాస జీవితం ఎంతో హృదయ విదారకంగా వర్ణిస్తూ పోతాడు. ఇదంతా చదువుతుంటే పాఠకుడికి ఇది కథా-వర్ణనా-లేక రెండూనా-రెండూ రెండుగా కాదు. ఒకటి గానే భాసిస్తుంది.

దీనికి కొంచెం నమూనా లాంటిది వక్రమోర్వశీయంలో పురూరవుడి విరహ వేదనా ఘట్టం. అవి కొండలే గావు-నదులే గావు-అరణ్యాలేకావు-పక్షి మృగాలే గావు-వృక్షాలే గావు-మేఘాలే గావు. చరా చర ప్రకృతి అంతా కాంతా మయంగానే కనిపించిందా పురూరవుడి కంటికి. ప్రకృతే ఊర్వశి-ఊర్వశే ప్రకృతి. ఇలాటి ప్రణయోన్మాదంలో పడిపోయి ఆ మానవు డేమి మాటాడు తున్నాడో అతడికే తెలియదు. ప్రేమ ముదిరితే ఉన్మాద మవుతుందని ఆలంకారికు లుపదేశించిన మంత్రాన్ని కవే పట్టుకొన్నాడో-కవి చేసిన ఉపదేశ మాలంకారికులే వల్లించారో-మనకు తెలియదు గాని దాని విశ్వరూప మెలాంటిదో చూడాలంటే ముమ్మూర్తులా చూపుతుందా నాటకం. నాలుగే అంకాలీ నాటకానికి. నాటకం కాదసలు త్రోటకమని కూడా పేర్కొన్నాము. భూలోక నాయకుడికి దేవలోక నాయిక జత అయితే అది త్రోటకమే. ఆ కాంతే ఊర్వశి. అలాంటిది తోడయిందంటే అసలే రసికుడైన ఆ రాజు సంగతి ఇక చెప్పాలా. అందు లోనూ ఆవిడ అంతర్ధాన మైతే. నేలనుంచి నింగిదాకా ప్రాకుతూ పోయిం దాయన ప్రణయ వల్లరి. చేతనా చేతన విభాగానికే హద్దులు చెరిపేసింది.

ఇది సరిగా యక్షుడి విషయంలోనూ తొంగి చూస్తుంది. కామార్తాహి ప్రకృతి కృపణా శ్చే తనా చేతనేషు అని కవే మనకు సంజాయిషీ ఇస్తున్నాడు. కామార్తులండీ వారంతా. అలాంటి వారికీ ప్రకృతి అంతా కామమయమే. ఏమి చేస్తామంటాడు. అంతా రామమయ మన్నట్టు అంతా వారికి రామామయమే. అంతా అది గనుకనే వస్తువూ అదే అయింది. వర్ణనా అదే అయింది. ఎక్కడ ఏ అంశం వర్ణించినా ఎబ్బెట్టుగా తోచదు. విక్రమోర్వశీయంలో

విక్రముడుగానీ- మేఘదూతంలో యక్షుడుగానీ- తమ చుట్టూ ఉన్న ప్రకృతిలో ఏది చూచినా వారికందులో అద్దంలో ముఖంలాగా తమ ప్రణయ చ్ఛాయలే గోచరిస్తాయి. గోచరించే కొద్దీ కామం పెచ్చు రేగుతుంది. అలా రేగే కొద్దీ ఆదృష్టి కది పిచ్చిగా మారుతుంది. ఆ పిచ్చిని వర్ణించాలనే రస పిచ్చికూడా కవి కంతకంతకూ హెచ్చిపోతుంది. అది ఆయన కవితా శిల్పానికే ఒక అనల్పమైన శోభ నావహిస్తుంది. ఇదీ ఈ రెండు కావ్యాలలో మహా కవి అందుకొన్న కళా శిఖరం. ఈ రెండింటిలో వస్తువే వర్ణన వర్ణనే వస్తువు. ఏదనుకొంటే అది. చూడండి. మేఘదూతంలోని ఈ శ్లోకం వింటే మీకే అరమవుతుంది. శ్యామాస్వంగం.....సాదృశ్య మస్తి. ప్రియంగు లతలు మొదలుకొని నదీ తరంగాల వరకూ దేనిలో నైనా నీ అందచందాలకు పోలిక కనపడుతుందేమో తృప్తి పడదామంటే ఎందులోనూ కనపడ వేమి చేయాలని వాపోతాడు యక్షుడు. నిన్ను గాఢంగా కౌగిలించుకోవాలని ఆకాశంలోకి చేతులు చాస్తుంటే చుట్టూనిలిచి చూచే చెట్లు తుషారాశ్రువులు రాలుస్తాయంటాడు. ఇది వర్ణనంటారా. కథ అంటారా. రెండూ ఓత ప్రోతంగా అల్లుకు పోలేదూ. మేఘదూత మంతా ఇదే వరస. అలాగే విక్రమోర్వశీయంలో విక్రముడు చివరకొక పర్వత గుహలోకి పోయి నాకాంత నీలోకి వచ్చిందా చూచావా అని అడిగితే అదే జవాబిస్తుందట అతనికా పర్వతం. మనం ధ్వని చేస్తే ప్రతి ధ్వనించటమే గదా గుహాలక్షణం. ఇంతే గాక ఇందులో గాంభీర్య మేమంటే ఒక కాముకుడి స్పందన ఎలా ఉంటే- బాహ్య ప్రకృతి కూడా అలాగే ప్రతి స్పందన చూపుతుందనే కళా సూత్రాన్ని వ్యంగ్యంగా చాటుతున్నాడు కవి.

ఇంతకూ సారాంశ మేమిటి. వర్ణన అనేది ఏదో చేశామంటే చేశామని గాదు. అది తాను వివక్షించిన కథా వస్తువుకూ దాని గమనానికీ దాని ప్రయోజనానికీ ఎలా దోహదం చేస్తుందో-ఎలా అతికి నట్టుండాలో- అలా చేస్తేనే అది గొప్ప కళ. ఈ కళలో కాళిదాసుకు కాళిదాసే సాటి. అది వస్తువర్ణనే

కాదు. భావ వర్ణనే కాదు. ప్రకృతి వర్ణనే కాదు. సరి క్రొత్తగా ఉండాలి. సందర్భోచితంగా ఉండాలి. సముచితంగా ఉండాలి. ఆనంద వర్ధనుడు చెప్పినట్టు వర్ణించ గలిగిన శక్తి ఎంత ఉన్నా ఎంతో అంతే. చాపల్యం పనికి రాదు. అది కాళిదాసు కొకరు చెప్పబని లేదు. ఔచిత్య మాయనకు వెన్నతో బెట్టిన విద్య. ఎంత సౌందర్యా రాధకుడో అంత ఔచిత్య పరిపాలకుడు. అది ఇంత వరకూ జరిగిన ప్రస్తావన లోనే విశద మయింది మనకు. ఋతు సంహారంలో కథ వస్తువే లేదు. పేరుకు తగినట్టు షడృతువుల లోని అంద చందాలను వర్ణించే నెపంతో ఈ ప్రకృతి రామణీయకాన్ని కన్నులకు కట్టినట్టు ప్రదర్శించటమే రసజ్ఞుడైన కవి తాత్పర్యం. అదీ రామాయణ ప్రభావం బాగా మనసు మీద పని చేసి తదీయ ఋతు వర్ణనలతో పరవశించి చేసిన ప్రయత్నం. రామాయణంలో కథానుగుణంగా సాగిందా వర్ణన. అక్కడ అది ఔచిత్యం. పోతే ఇక్కడ కథ అనే ఊసు లేదు కాబట్టు విశృంఖలంగా సాగించాడు కవి. ఇది ఇక్కడి ఔచిత్యం. మరి అంతో ఇంతో కథ ఉంది మేఘ సందేశంలో. అదీ మీను మీసంలాగా లేశ మాత్రమే. కనుక అక్కడక్కడా యక్షుడనీ మేఘుడనీ అలకానగరమనీ యక్షకాంత అనీ మాటలు వదలకుండానే ఆ ఉదంతాని కుద్దీపకంగా పది పాళ్ళు విరహ వృత్తాంతమైతే - తొంబది పాళ్ళు విరహోద్దీపక మైన ప్రకృతి వర్ణన చేయ వలసి వచ్చింది మహా కవి. ఇదీ ఇందులోని ఔచిత్యం. కాగా విక్రమోర్వశీయ మలా కాదు. అది కథ వస్తువు చాలా ఉన్నది. అందులోనూ నాటకం. పిచ్చిగా వర్ణించరాదు కవి. ఔచిత్యం దెబ్బ తింటుంది. వస్త్వనుసారిగా సాగాలి వర్ణన. అలాగే సాగించాడు. నాయకుడికి అనుకోకుండా నాయికా వియోగ మేర్పడింది. ఇక ఆవిడ మరలా దర్శనమిచ్చే వరకూ కథ లేదు. ఆ అంతరాళంలో చేయవలసిం దేమిటిక. నాయకు డైతే ఆక్రందన. కవి నాయకుడైతే తదాగ్రంధన. అలాగే గ్రధనం చేశాడా నాయకుడి కామం ఫలించే వరకూ. కాబట్టి ఇదీ ఔచిత్యమే.

ఇంతకూ సౌందర్యమూ ఔచిత్యమూ. కవి అయిన వాడి కివి రెండూ రెండు మార్గ దర్శులు. వీటి చేయి పట్టుకొని మార్గంలో నడిస్తేనే గమ్యం చేరుతాడు. మనలను చేరుస్తాడు. లేకుంటే అంతా అగమ్యమే. ఇలాటి అగమ్యమైన ప్రయాణమే సాగించారు నూటికి తొంబది మంది కవులు వాఙ్మయంలో. అందుకే నేమో ద్విత్రా: పంచషా వా అని వాపోయాడు ఆనందవర్ధనుడు. అంత పెద్ద రామాయణం వ్రాశాడు వాల్మీకి. భారతం వ్రాశాడు బాదరాయణుడు. ఎక్కడా ఔచిత్య రేఖ దాటలేదు. కథకు నిరోధకమైన వర్ణనే లేదు. ఇంకా అవి ఇతిహాసాలు కాబట్టి- ప్రక్షిప్తా లనేక మున్నవి కాబట్టి కొంతకు కొంత అధికారముంది వారి కవధులు తప్పటానికి. కాళిదాసు లాంటి కావ్య కర్తల కంటారో. అలాంటి దేమాత్రమూ లేదు. కారణ మేమంటే ఇది ఇతిహాసైక దేశమైన కథా వస్తువు. అసలే స్వల్పమైనది. అందులోనూ ఒక ప్రయోజన మేదో ఆసించి దాని కభిముఖంగా తీసుకెళ్ళాలి మనలను మహాకవి. ఈ ప్రయాణంలో ఏ ప్రక్క దారి తొక్కినా అది వెంటనే ఒక విలంబమూ విసుగూ కలిగిస్తుంది పాఠకుడికి. అంత మాత్రమే కాదు. తానాసించిన కావ్యార్థం బాగా మనసులో హత్తుకోదు. సవ సవగా జారిపోతుంది. ముందు పేర్కొన్నట్టు చాలా మంది కవులీ సూత్రాన్ని విస్మరించిన వారే. మాఘభారవి ప్రభృతులంతా ఇలాటి విశృంఖల వర్తనులే. అది ఇంతకు ముందే నేను సూచించి ఉన్నాను.

పోతే దీని కపవాదమైన రచన ఒక్క కాళిదాస మహాకవిదే. కథ లేని రచనా చేశాడు. కొంత ఉన్న రచనా చేశాడు. ముమ్మరంగా ఉన్నదీ చేశాడు. అందులో కావ్యాలూ రచించాడు. నాటకాలూ నిర్మించాడు. ఇలాటి రచన చేస్తున్నపు డెక్కడ దేని కనుగుణంగా ఏ మాత్రం చేయాలో ఆ మాత్రమే వర్ణన. అంతకు తక్కువ గాని ఎక్కువ గాని చేసిన వాడు కాడు. పోనీ చేతగాని వాడందామా. ఎంతో చేత నయినట్టు కనిపించే మిగతా కవులకన్నా వంద రెట్లు చేత నయినవాడే. ఎంతో అందంగా అద్భుతంగా అవిస్మరణీయంగా

చేయ గలడే వర్ణన చేసినా. అది ఒక భావమే గాదు-వస్తువే గాదు-ప్రకృతి దృశ్యమే గాదు. ఇంకా ఇలా వర్ణిస్తూ పోతే ఎంత బాగుండును-ఇక్కడికే ముగించాడే అని అసంతృప్తి కలిగించేంత సంతృప్తి కరమైన వర్ణన లవి. అక్కడే ఉంది సంయమన మాయనలో. సంయమనంతో సౌందర్యం ద్విగుణీకృత మవుతుందని తెలిసిన కళా మర్మ కోవిదుఁ డాయన.

ఇది తెలిసి మనం చదువుతూ పోయామంటే కాళిదాసు చాలా వరకు మనకు తెలిసిపోతాడు. ఒక ఎవరెస్టు లాగా కవితా గగనంలో ఎంతో ఎత్తు కెదిగి కనిపిస్తాడు. చేతనైతే నన్నందుకో చూతామని హెచ్చరిస్తాడు. ఇది మనకు నిదర్శనం కావాలంటే ఆ రచన ఈ రచన అని కాదు. ఏ రచన చూచినా అందులో పారసందు కాన రాదు. ఇంతెందుకు. రఘువంశ మహా కావ్యమే తీసుకొని చూడండి. దిలీపుడు సంతానం లేక దానికి నిమిత్త మేదో తెలుసుకోవాలని వసిష్ఠాశ్రమానికి వెడుతున్నాడు. అప్పుడా ప్రయాణం వర్ణిస్తున్నాడు కవి. శ్రేణీ బంధా ద్వితన్వద్భిః ఆకాశంలో బారులు తీరి ఎగిరి పోతున్నాయి బెగ్గురు పక్షులు. అవి ఇటూ అటూ స్తంభాలు లేని తోరణాల లాగా కనిపిస్తుంటే మెడ పైకెత్తి చూస్తున్నారట రాజ దంపతులు. క్రొత్తగా తీసి తెచ్చిన వెన్న ముద్ద లక్కడక్కడా గొల్ల వృద్ధులు కానుకలిస్తే పరిగ్రహిస్తూ దారి కిరుప్రక్కలా ఉండే చెట్ల పేర్లు వారినడిగి తెలుసు కొంటున్నారట. ఎంత సహజ సుందరమైన వర్ణనలు. ఇంకా ఏదో చెబుతున్నాడనే లోపలే మనల నాశ్రమ వాటికలోకి చేరుస్తాడు కవి. అంతకు ముందు అనుకూలమైన మారుతమూ ఎదట కనిపించే తోరణ మాలికలూ నవనీతోప హారాలూ-ఇవన్నీ వర్ణించటంలో ఆ రాజ దంపతులకు కలగబోయే శుభాన్ని కూడా సూచిస్తున్నాడు కవి. మరి అక్కడ ఆశ్రమంలో ప్రవేశించగానే అది ఎలా దర్శన మిచ్చిందా ఆశ్రమం. ఆతపాత్యయ సంక్షిప్త నీవారాసు నిషాదిభిః-అదృష్టాగ్ని ప్రత్యుత్థానైః-సాయంకాలం ఎండ సెగ చల్లారితే-ఆరబోసిన ధాన్యమొక చోటికి తాపస కన్యలు పోగు చేస్తే-వాటిమీద

కూచుని జింకలు హాయిగా నెమరు వేస్తున్నాయట. అగ్నిహోత్రాల కోసమటు ఇటు తిరుగుతూ ఒకరి కొకరెదురైన మహర్షులతో క్రిక్కిరిసి ఉందట అది. అక్కడ ప్రయాణానికి- ఇక్కడ ఆశ్రమ జీవనానికీ అతికినట్టు ఎంత మధురంగా ఉన్నాయో చూడండీ భావాలు. అంతే కాదు. అనుకూల పవనాలూ తోరణ మాలలూ నవనీతోప హారాలూ- ఇవన్నీ వర్ణించటంలో దిలీప దంపతులకు కలగబోయే శుభంకూడా ధ్వనింపజేస్తున్నాడు కవి.

ఇలాగే దిలీపుడు నందినీ ధేనువును సేవించే ఘట్ట మింకా రమ్యంగా వర్ణిస్తాడు. ధేనువుతో పాటు వనంలో ప్రవేశించాడు రాజు. అప్పుడా వన శోభను వర్ణించట మింతా అంతా కాదు. అందులోనూ ఔచిత్యమే భావ్యర్థ సూచనమే. లతలు పుష్పాలు చల్లటం దగ్గరి నుంచీ అలాంటిదే. ప్రతిరోజూ ఉదయం సుదక్షిణ ఆ గోవు కొమ్ములకు పూలు చుట్టి గంధం పెట్టి ఆరాధిస్తుంది. ఆ కొమ్ముల జంట అర్థ సిద్ధికి ద్వార మట. మరలా సాయంత్రం రాజు దాని ననుసరించి ఆశ్రమానికి వస్తుంటే స పల్వలోత్తీర్ణ వరాహ యూథా - న్యావాస వృక్షోన్ముఖ బర్హిణాని. అని ఇలా ఆ సంధ్యా సమయ వర్ణన చేస్తుంటే అమోఘం. పడుకొన్న వరాహాలు పైకి లేవటమూ - నెమళ్ళు చెట్ల మీది కెగిరి పోవటమూ - జింకలు పచ్చిక బయళ్ళ మీద పడుకొని ఉండటమూ - ఇదంతా శుభ సూచకమే ఆ రాజుకు. ఇంకా రఘు మహారాజు దండ యాత్ర ఏమి - అజ మహారాజు స్వయంవర యాత్ర ఏమి - రామచంద్రుడు రావణ సంహారం చేసి తిరిగి అయోధ్యకు వచ్చే టపుడు చేసిన ఆయా వర్ణన లేమిటి - నీవా నేనా అనే లాగా నడిచాయి. కథా గమనానికే మాత్రమూ నిరోధులు కావు గదా అంత కంత కనురోధులై రసభావాల సంబర వీధి కెత్తి చూపిన వర్ణనలివి.

ఇంతే కాదు. మరో విషయం కూడా ఉంది మన మాయన వర్ణనల్లో గ్రహించ వలసింది. ఒకటి దీర్ఘంగా వర్ణించాడంటే అది వర్ణన కోసమే అయితే అంతగా వర్ణించ డాయన. దానికొక గొప్ప ప్రయోజన ముంటుంది. అదేమి

టంటే జీవితంలో ఒక కాలంలో మానవుడెంతో సుఖంగా ఉల్లాసంగా బ్రతుకు తుంటాడు. ఉన్నట్టుండి వాడి నసీబు తిరగ బడి అంతకు ముందెంత సుఖ పడ్డాడో అంత కంత కష్టాన్ని చవి చూడ వలసి వస్తుంది. ఎంత నవ్వితామో అంత ఏడవ వలసి వస్తుంది. అందుకే లోకంలో ఒక ఆభాణకం కూడా వింటాము మనం. నవ్వులు నువ్వులవుతాయి - అంత కంత అనుభవిస్తావు చూడమని. Anti-climax - Nemisis అని అనేకధా వర్ణిస్తారు అభిజ్ఞులు దీన్ని. ఇది ఎంతగా గమనించాడో ఈ లోకధర్మాన్ని కవి. మొదట ఎంతో గొప్పగా వర్ణిస్తాడొక సందర్భాన్ని. ఎందుకా ఇంత బ్రహ్మాండంగా చేశాడీ వర్ణన అని ఆలోచిస్తుంటే తరువాత అర్థ మవుతుంది పాఠకుడి కది ఇందుకా అని. ప్రమోదం చివరకు ప్రమాదంగా పరిణమిస్తుంది. అంత వైభవంగా జరిగింది ఇలా దారుణమైన ఫలిత మీయటానికా అని తేట పడుతుంది. ఈ దారుణం మనసుకు రావాలంటే దాని రసానుభూతి కలగాలంటే భావుకుడి కా ముందు అంతవైభవంగా వర్ణిస్తే గాని కలగదు. అప్పుడే రెండింటినీ పోల్చుకొని అయ్యో ఎంత ప్రమోదం చివర కెంత విషాదంగా మారిందని ఒక అనిర్వచనీయమైన ఈశ్వర శక్తిని మనసుకు తెచ్చుకొని భావుకు డొకానొక నిర్లిప్తమైన దశ నందుకోగలడు. ఇదుగో ఇందు కోసంగూడా చేస్తాడు మహాకవి కొన్ని కొన్ని దీర్ఘమైన వర్ణనలు.

చూడండి. రఘుమహారాజు దిగ్విజయ యాత్ర ఎంతో విపులంగా వర్ణించాడు రఘువంశంలో. అంతా అయిన తరువాత చివరకు విశ్వజిత్తనే యాగం చేసి తాను సంపాదించిన దంతా దాన ధర్మాలు చేసి నివ్వరి కాడ లాగా తుదకు ఏదీ మిగలక నిలిచి పోతా డా రాజు. అప్పుడెవరో పంపినట్టు వచ్చి అడుగుతా డొక బ్రహ్మచారి నాకు పదునాలుగు కోట్ల బంగారు నాణాలు కావాలి గురుదక్షిణ కోసమని. ఇలాగే అజ మహారాజు స్వయంవరోత్సవం కళ్యాణోత్సవం ఎంతో దేదీప్య మానంగా వర్ణించాడు కవి. అంత వైభవంగా సాగిన ఆ వివాహమూ చివరకెలా పరిణమించిందో తెలుసా. ఇందుమతీ దేవి

అకాలంగా కన్నుమూయటంతో. అప్పటికా ఆనందమంతా ఇలా అర్థాంతరంగా ముగియటానికేనా అని తోచదా మనకు. ఆ మహారాజుకు దుఃఖోపశమనం చేయటానికి కులపురోహితుడైన వసిష్ఠుడెంతో వేదాంతోపదేశం చస్తాడు. అదంతా విన్నట్టే కనిపిస్తాడా రాజు. కాని చివరకు మనో వ్యాధి ప్రబలమై గంగా సరయూ సంగమంలో దూకి ఎవరికీ తెలియకుండా దేహత్యాగం చేస్తాడు. ఇలాగే కుమార సంభవంలో దేవేంద్రుడు మన్మథుణ్ణి స్మరించటమూ - అతని ప్రగల్భాలూ - అకాలవసంతోదయమూ - ప్రేయసీ ప్రియుల కామోద్రేకమూ - ఎంతగా వర్ణించాలో అంతగా వర్ణించాడు కవి. ఎందుకీ వర్ణన అంతా. ఇంత హడావుడీ ఒక్కసారి ఆ పరమేశ్వరుడి కంటి మంటలో దగ్ధమై పోవటానికే. మదనుడి అంత ఉత్సాహమూ మదన పత్ని రతి దీర్ఘ విలాపంలో అస్తమించటానికే. అని మౌనంగా జవాబిస్తాడు మనకు కవి. అలాగే పార్వతి ఎంతో హావ భావాలతో పరిచర్య చేస్తుంది పరమేశ్వరుణ్ణి. తన తండ్రి కోరికా తన కోరికా ఫలిస్తుందనే ఆశపడుతుంది. ఎంతగా ఆశపడిందో చివరకంత నిరాశ ఎదురయిందావిడకు. అది మరలా ఆశగా చిగిర్చటానికెంతో శ్రమపడి తపస్సు చేయవలసి వచ్చింది. అంత గంభీరంగా మొదట కనిపించిన ఆ ఈశ్వరుడు కడపట ఒక బ్రహ్మచారి రూపంలో వచ్చి ఎంతో చపలంగా మాటాడుతాడామెతో. ఆమె మరలా గాంభీర్యం వహించి పెద్దలున్నారు వారినొప్పించమని కోరితే మరలా ఆయనే ఉండబట్టలేక ఎప్పుడెప్పుడా అని ఉబలాటపడతాడు.

ఏమిటీ డోలాయమాన వ్యవహారం. ఏమిటీ అటూ ఇటూ గాని వర్ణనలు. అటూ ఇటూ గాని దీలోక వృత్తమే. ఎప్పుడేది జరుగుతుందో చెప్పలేమీ లోకంలో. క్షణంలో సుఖం మరుక్షణంలో దుఃఖం. క్షణంలో ఉత్సాహం మరుక్షణంలో దైన్యం. ఇప్పుడొక కష్టం. దీనివెంటనే ఒక సుఖం. ఎప్పుడూ అనుకూలం లేదు. ఎప్పుడూ ప్రతికూలమూ లేదు. నీచైర్గచ్ఛత్యుపరి చ దశా చక్ర నేమి క్రమేణ అని తానే వాక్రుచ్చాడు లోకానికి. సృష్టిలో

ఉండే ఈ వైచిత్రినే తన రచన ద్వారా ప్రదర్శించి మనకు సహజంగా కలిగే ఆరాటాన్ని తగ్గించి దీని కంతటికీ మూలమైన ఒక దివ్య శక్తి లీల నుదాసీనంగా దర్శించే స్థితప్రజ్ఞతను భంగ్యంతరంగా మనకు ప్రసాదించటమే మహాకవి సంకల్పం.

ఇంకా ఒక విశేష మేమంటే దీనికి మెరుగు పెట్టినట్లు ఎప్పటి కప్పుడు నాటకంలో లాగా రంగమూ దృశ్యమూ మారుస్తూ పోవటం. కావ్యమే కాక నాటక రచనలో కూడా చేయి తిరిగిన వాడు గదా తాను. నాటకంలో ఒకే దృశ్యం అదే పనిగా చూపగూడదు. చూపితే సొగసు లేదు సరి గదా విసుగెత్తిస్తుంది. తెర పడుతూ లేస్తూ పోవాలి. దానితో పాటు సన్నివేశం కూడా మారుతూ పోవాలి. అసలు జీవితంలో కూడా ఇంతే గదా. ఏ భావమూ ఏ సంఘటనా ఎప్పటికీ అలాగే నిలిచి ఉండదు. క్షణ క్షణం మారవలసిందే. అలా మారితేనే అది జీవితం. సరిగా దీనికి ప్రతిబింబమే నాటకం. అలాంటిదే కావ్య జీవితం కూడా. ఇది నూటికి నూరుపాళ్ళూ గుర్తించిన వాడు కాళిదాసు. అందుకే నాటకంగానీ కావ్యంగానీ నడపటంలో రెంటినీ వచ్చిపోయి ఒకే సూత్రం మీద నడుపుతూ వచ్చాడు. ఏ సన్నివేశం వర్ణించినా ఏ వర్ణన చేసినా దాన్ని ఊరక సాగదీయడు. కథ నడుపుతూనే ఉంటాడు. వర్ణన చేస్తూనే పోతాడు. సన్నివేశాలు ఎక్కడి కక్కడ మారుతూనే పోతాయి. అందులోనూ ఆఖ్యానాత్మకంగానూ సాగుతుంది శైలి. వర్ణనాత్మకంగానూ సాగుతుంది. మధ్యే మధ్యే సంవాదాత్మకంగానూ నడుస్తుంది. అక్కడక్కడా విచారాత్మకంగానూ జరిగిపోతుంది. రఘువంశాది కావ్యాలేవి మనం పరిశీలించి చూచినా గ్రహించ వచ్చు నీ రహస్యం. దిలీపుడు నందినిని సేవించే సన్నివేశం నడుస్తుండగానే అరణ్య సీమనంతా వర్ణిస్తాడు కవి. మధ్యలో సింహానికీ అతనికీ జరిగిన సంవాద మెదురవుతుంది. అందులో ఎంతో ధార్మిక గోష్ఠీ కనబడుతుంది. అజుని వివాహం - ఆ తరువాత ఆయా రాజులతో యుద్ధం - పిమ్మట వన విహారం - హఠాత్తుగా ప్రియా వియోగం - అతని విలాపం -

ఆ తరువాత కుల గురువు చేసిన ఆధ్యాత్మిక బోధ - ఏమిటీ వరస. ఒక సీను వెనుక ఒక సీను కనిపిస్తూ కనుమరగు అవుతున్నట్టే భాసిస్తుంది. ఎక్కడికక్కడ నిలిచినట్టు కనిపిస్తూనే ఎక్కడా నిలవకుండా గమ్యాభిముఖంగా సాగిపోయే ఒక నదీ ప్రవాహం లాగా సాగుతూ పోతుంది మహాకవి రచనా ప్రవాహం.

మరొక అద్భుతమైన రచనా రహస్య మేమంటే ఈయనలో కథా వస్తువూ వర్ణనా రెండూ ఒక దానితో ఒకటి పూర్తిగా కలిసిపోయి కథే నడుస్తున్నదా వర్ణనే దాన్ని నడుపుతున్నదా - ఏదైనదీ అర్థంకాదు. వర్ణన అనుకొంటే వర్ణన. కథ అనుకొంటే కథ. రెండింటి ప్రయోజనమూ ఒకే ప్రయత్నంతో నిర్వహిస్తాడు. ఇది ఒక అనన్యాదృశమైన రచనా శిల్పం. ఉదాహరణకు రఘువంశం లోని ఈ ఘట్టం చూడండి. రఘుర్భృశం వక్షసి **తేన తాడితః - పపాత భూమౌ సహ సైనికాశ్రుభిః - నిమేషమాత్రా దవధూయ చ వ్యథాం - సహోత్థితః సైనిక హర్ష నిస్వనైః.** రఘు మహారాజుకూ దేవేంద్రుడికీ యజ్ఞాశ్వ నిమిత్తంగా దారుణమైన సంగ్రామం జరుగుతున్నది. దేవేంద్రు డాయన మీద కులిశం ప్రయోగించాడు. అది ఆయన వక్షస్థలం సోకింది. సోకగానే క్రింద పడిపోయాడు. ఒక్క నిమిష మలా సొమ్మసిల్లి వెంటనే మరలా పైకి లేచాడు. ఆ పడటమూ లేవటమూ ఎలా జరిగాయంటే తన సైనికుల దుఃఖాశ్రువులతో పాటు పడ్డాడట. వారి హర్ష ధ్వానాలతో పాటు పైకి లేచాడట. ఇక్కడ పడ్డాడనీ లేచాడనీ పడితే సైనికులు దుఃఖించారనీ లేస్తే మరలా వారు సంతోషించా రనేది కథా వస్తువు. ఆ వస్తువు జరిగితే జరిగినవి సైనికుల అశ్రుపాతమూ హర్షధ్వానమూ. కాని వాటితోపాటు ఇవీ జరిగాయని సహోక్తిగా వర్ణించటంలో వర్ణనా సౌందర్యమూ ఉంది. కథా గమనమూ కలిసి వస్తున్నది. ఇలాటి ఉభయ తారకమైన రచనకిది కొక మచ్చుతునక.

తునకలేమి వచ్చె. కమ్మెచ్చులోనుంచి లాగిన ఒక బంగారు తీగనే చూడవచ్చు మన మోపిక ఉంటే. ఆ రఘువంశంలోనే కనపడతా యొక

రెండు. ఒకటి రఘు చక్రవర్తి దండయాత్ర. మరొకటి శ్రీరాముని చరిత్ర. ఇందులో దండయాత్ర నాలుగవ సర్గలో వస్తుంది. ఈ సర్గతోనే ప్రారంభిస్తా రసలు రఘువంశ పాఠం విద్యార్థులకు. దీని కేమిటా హేతువని చాలా రోజు లాలోచించే వాణ్ణి నేను. లోతుకు దిగి పరామర్శిస్తే నాకై నాకే స్ఫురించింది కొంత కాలాని కందులో సబబు. వ్యాకరణా లంకార శాస్త్ర సామగ్రి అంతా చాలా వర కొక్క చోటనే పోగు చేసుకోగల పెద్ద రత్నా పణమది. అందుకే అలాటి జ్ఞానం శిష్యుల కందివ్వటాని కవకాశ ముంటుందని ఈ చతుర్థ సర్గతోనే ప్రారంభించేవారు మన ప్రాచీనులు. అప్పటి నుంచే స రాజ్యం గురుణా దత్తమనే శ్లోకమే రఘువంశ ప్రారంభ శ్లోకంగా చలామణిలోకి వచ్చింది. బహుశా రఘువంశమని కావ్యానికి పేరు పెట్టినందుకు రఘు మహారాజు ఉదంతంతోనే శ్రీకారం చుడదామని పించిందేమో వారికి. సరే అవన్నీ అలా ఉంచండి. అది కాదు నేనిప్పుడు చెప్పదలచిన విషయం. ఈ నాలుగవ సర్గలో వర్ణించిన రఘు చక్రవర్తి దిగ్విజయ వృత్తాంతం. అందులో వరుసగా దిగ్విజయ మెలా సాగిందో దానితో వర్ణనా అలాగే సాగింది. రెండూ జోడు గుఱ్ఱాలలాగా ఒకే రచనా శకటాన్ని లాగుతూ ముందుకు పోతాయి. ఇదీ మనం చూడ వలసిన విశేషం. ప్రససాదోదయా దంభః కుంభయోనే ర్మహౌజసః - రఘోః పరిభవా శంకి చుక్షుభే ద్విషతాం మనః. శరత్కాలం రాజులకు యాత్రా కాలం. అప్పుడు అగస్త్య నక్షత్ర ముదయించి నదులూ తటాకాలూ నిర్మల మవుతాయి. అవి నిర్మల మవుతుంటే శత్రురాజుల హృదయాలు భయంతో కలుషిత మవుతున్నాయట. సాక్షాత్తూ శరద్దేవతే సరితః కుర్వతీ గాధాః ....యాత్రాయై చోదయామాస. నదీ జలాలు దాటటాని కనువుగానూ - మార్గాల నాశ్యాన కర్దమంగానూ మార్చి యాత్ర చేయమని పురికొల్పు తున్నదట. ప్రదక్షిణార్చులనే చేతులు చాచి అగ్ని హోత్రుడు నీకే జయమని పలుకు తున్నాడట. తూర్పు దిశగా బలోపేతుడై పయనిస్తుంటే గాలికి కదిలే కేతువులే శత్రువులను చేతులు పైకెత్తి బెదిరిస్తున్నాయట. అక్కడక్కడ ఫలరహితులనూ ఉత్ఖాతులనూ

భగ్నరాజ్యలనూ చేసిన రాజులతో - భగ్న వృక్షాలతో వికీర్ణమైన వృక్షాలుగల గజ వల్లభుడిలాగా కనిపించాడట ఆ రాజ వల్లభుడు. ఇలా ఎన్నో మాటలు. మరి కళింగమేమిటి - మహేంద్రమేమిటి - మలయమేమిటి - పాండ్యమేమిటి - సహ్యమేమిటి - కేరళ పారశీక సింధు హూణ కాంభోజ కోసల హిమవత్కామ రూపాది ప్రాంతాలేమిటి - ఒక్కొక్క రాష్ట్రాన్ని ఒక్కొక్క అస్త్ర బలంతోనా లేక అస్త్రంలాంటి అలంకార బలంతోనా వశగతం చేసుకొన్నా డనిపిస్తుంది మహారాజు.

అన్నట్టు వర్ణనా కథ అంటే జ్ఞాపకం వస్తోంది మరో ఘట్టమీ రాజు జీవితంలోనే. ఇది భౌతికమైన యాత్ర అయితే ఆధ్యాత్మిక మయిన మరొక గొప్ప యాత్ర చేశాడ రాజు చివరకు. ఈ యాత్ర చేసి ఇహంలో ఎలా విజయం సాధించాడో ఆ యాత్ర సాగించి పరంలోనూ అలాగే చవి చూచాడు విజయం. అంతకు ముందే తన కుమారు డజుడికి పట్టం కట్టి బయలు దేరుతా డరణ్య వాసానికి. ఇక చూడండి. అడవిలో పెద్ద రాజు తపశ్చర్య - పట్టణంలో యువరాజు రాజ్య చర్య - రెండూ పట్టిన పట్టు విడవకుండా పట్టాలు పరిచినట్టు వర్ణిస్తూ పోతాడు మహాకవి. ప్రతి శ్లోకంలో ఇటు రాజ్య పాలనా - అటు యోగధారణా - నీవా నేనా అన్నట్టు పందెం వేసుకొని పరుగెడుతూ పోతాయి. కొడుకు సింహాసన మధిష్ఠిస్తే తండ్రి దర్భాసన మెక్కాడు. కొడుకు శత్రువుల నందరినీ శక్తి త్రయంతో వశ పరచుకొంటే తండ్రి ప్రణిధాన బలంతో ప్రాణ పంచకాన్ని వశం చేసుకొంటాడు. అతడు ఫలితం చవి చూచే వరకూ ప్రయత్నం సాగిస్తే ఇతడూ పరమాత్మ దర్శన మయ్యే వరకూ యోగానుష్ఠానం మానలేదు. ఇంతెందుకు. అతడు శత్రువుల విషయంలో నైతే ఇత డంతః శత్రువుల విషయంలో అప్రమత్తుడై ఉభయీం సిద్ధి ముభా వవాపతుః అంటాడు మహాకవి. ఇద్దరూ తమ తమ మార్గాలలో సిద్ధి పొందారట.

పోతే ఇవన్నీ ఒక ఎత్తు. రామ కథ ఒక్కటీ ఒక ఎత్తు. మొత్తం వాల్మీకి రామాయణ మంతా ఐదు సర్గలలోకి దించి కుదించి విశ్వామిత్ర సృష్టిలాగా ఒక అపురూపమైన అతిలోకమైన కవితా సృష్టి ప్రదర్శించాడంటే నమ్మండి. అలా సృష్టించటంలో అది వర్ణనో తెలియదు - కథో తెలియదు. వర్ణనే ఒక పెద్ద ఐరావతం లాగా కథ రథాన్ని అప్రతిహతమైన వేగంతో గమ్యం వైపు లాగుకొంటూ పరుగెడుతుంది. దాని కిరువైపులా నిలిచి చూచే దేవతల లాంటి సహృదయ ప్రేక్షకుల కది ఒక మరపురాని మనోహరమైన నేత్రోత్సవం. సందేహంలేదు. నిర్విష్ట విషయ స్నేహః - దశరథుడు వృద్ధు డయ్యాడు. ప్రభాత దీపంలాగా విషయానుభవ స్నేహం ఇంకిపోయి జీవిత దశాంతం చేరాడట. తం కర్ణ మూల మాగత్య - పలిత కేశాలనే వ్యాజంతో తన చెవి దగ్గరికి వచ్చి కైకేయి వింటుందనే భయంతో జర రహస్యంగా చెప్పిందట రాజుకు రాముణ్ణి రాజు చేయమని. అది పౌరలోకాని కంతా వ్యాపించిందట ఆ చల్లని వార్త. ఎలాగో తెలుసా. దిద్ది తీర్చిన కాలువలోని నీరు ఉద్యాన వనంలోని ఆయా చెట్ల పాదులలోకి ప్రవహించినట్లు. మరి అది భంగమై రాము డరణ్యంలో ఎలా ప్రవేశించాడు. అరణ్యంతో పాటు అక్కడి తాపసుల హృదయంలో కూడా. భరతుడీ వార్త విని పట్టాభిషేకానికే గాదు - తల్లికి కూడా ఎడ మొగం పెడ మొగం పెట్టుకొన్నాడట. సీత రాముణ్ణే అనుసరించి ఎలా వెళ్ళింది అడవికి. కైక వద్దని అడ్డగించినా వినకుండా రాజ్య లక్ష్మి ఆయననే అనుసరించి వెళ్ళి నట్లుందట. వాలిని వధించి సుగ్రీవుణ్ణే ధాతువు స్థానంలో ఆదేశాన్ని నిలిపినట్లు నిలిపాడట రాముడు. సీతను వెదకటానికి దశ దిశలకూ వెళ్ళిన వానరులు అటూ ఇటూ చెదరి పోయిన రాముడి ఆలోచనలా అనిపిస్తున్నారట. కుంభకర్ణుణ్ణే యుద్ధంలో వధిస్తే నీకీ ఆరు నెలల చిన్న నిద్ర ఏమిటి - శాశ్వతమైన పెద్ద నిద్రే పొమ్మని చెప్పినట్లుందట. జటాయువును అంతకు ముందు రామ లక్ష్మణులు దర్శిస్తే అది సీతను రావణుడు అపహరించాడని నోటితో చెప్పి తాను చేసిన మహోపకారం శరీరం మీది గాయాలతోనే చెప్పి కన్నుమూసిందట. ఇలా అడుగడుగునా

అలంకారాలతోనే కథా వస్తువును నడుపుతూ చివరకా అవతార పురుషుడు సాకేత వాసులందరికీ సరయూ నదినే వైకుంఠందాకా నిలిపిన ఒక నిశ్శ్రేణికగా చేసి వెళ్ళిపోయా డంటాడు. అంతే కాదు. పోయిన తరువాత కూడా తన కీర్తి లోకంలో కలకాలం నిలపటానికా అన్నట్లు ఉత్తరాని కొకరినీ దక్షిణాని కొకరినీ భారతానికి జయ స్తంభాలుగా హనుమద్విభీషణులను నిలిపి పోయాడట. ఈ విధంగా ఎంతని వర్ణించ మంటారు. ఆయన వర్ణనను గూర్చి చెబుతూ పోతే అది మరలా ఒక పెద్ద వర్ణన అవుతుంది.

ఏతావతా సారాంశ మేమంటే వర్ణనే కథ - కథే వర్ణన కాళిదాసుకు. రెండూ గంగా యమునల లాగా సంగమించి పోతాయి రచనలో. అలాంటపుడే అనౌచిత్య దోషం దొరలదు. దొరలక పోగా శుష్కంగా కాక సరసంగా సాగుతూ పోతుంది కథా వస్తువు. ఇది ఒక అద్భుతమైన రచనా రహస్యం. ఇంకా ఒకటుంది ఆయన వర్ణనలో చెప్పుకోవలసిన ఆంతర్యం. ఆయన తన రచనలో ఒకానొక భావం అక్కడక్కడా విసురుతూ పోతాడు. అది ఒక ఆగ్నేయాస్త్రం లాగా దూసుకుపోయి మొత్తమా కథా జగత్తు నంతటినీ జాజ్వల్యమానంగా వెలిగించి చూపుతుంది. కథా సారమంతా అద్దంలోలాగా మన కందులో సాక్షాత్కరిస్తుంది. అంతే కాదు. భావన చేసేకొద్దీ ఆ భావం మన జీవితాని కంతా సద్యః పరనిర్వృతి తోపాటు ఒక శాంతిని విశ్రాంతినీ ప్రసాదిస్తుంది. నెమరు వేసేకొద్దీ క్రొంగ్రొత్త రుచులూరుతూ పోతుంది. ఇలాంటి వాయన రచన లన్నింటిలోనూ అక్కడో ఇక్కడో ఎదురవుతూనే ఉంటాయి. రఘువంశంలో దిలీపుడా సింహంతో అనే మాట వినండి. కిమప్య హింస్యః తవచే న్మతోహం - యశశ్శరీరే భవమే దయాళుః - ఏకాంత విధ్వంసిషు మద్విధానాం - పిండేష్వనాస్థా ఖలు భౌతికేషు. నీకు నా శరీరాన్ని హింసించట మిష్టం లేక పోతే నా యశశ్శరీరంలో చూపు ఆ కరుణ. మా లాటి రాజన్యులకు భౌతికమైన ఈ పిండం మీద దృష్టి లేదు తెలుసా అని చాటుతాడు. ఎంత గొప్పమాట ఇది. అసలు సంతానం కోసమని సేవిస్తున్నాడా

ధేనువును. ఉన్నట్టుండి అది ఒక సింహం ధాటికి గురి అయింది. దాన్ని విడిపించటానికి తన శరీర మాహుతి చేస్తా నంటాడు. చేస్తే తానిక ఉండబోడు. తానే లేకుంటే ఇక సంతాన మేమిటి. ఆ వ్రత దీక్ష ఏమిటి. ఎందు కిదంతా నిష్ప్రయోజనం కదా. అయితే ఎప్పుడా ప్రయోజనం కోర వలసింది. ధేనువును కాపాడితే. ధేనువును కాపాడటమా ముఖ్యం తనకు సంతాన ఫలమా. మొదట రాజు కుండ వలసినది కర్తవ్య పాలన తరువాతనే ఏదైనా అనే ఈ భావ మెంత ఉదాత్తం. మహా బ్రతికితే ఎన్నాళ్ళో బ్రతకం. బ్రతకటం కాదు బిడ్డలను కనటం కాదు. రాజ్య భోగాలను భవించటమూ వంశాన్ని నిలబెట్టటమూ కాదు. ఉన్నా పోయినా ఎప్పటికీ నిలిచి ఉండే శరీరం కావా లంటున్నాడా రాజు. అది భౌతికమా కాదు. అభౌతికమైన కీర్తి శరీరమట. అది కావాలను కొన్న వాడి కిక రాజ్యం లేదు. వంశం లేదు. సంతాన మంతకన్నా లేదు. దానికి దెబ్బ తగల నంత వరకే ఇది. అందులోనే ఉంది రఘు వంశ ప్రతిష్ఠ అంతా. యశసే విజిగీషూణా మనే మాట కిదంతా కవి చేస్తున్న వ్యాఖ్యానం.

ఇలాంటిదే రఘువు జీవితంలో ఒకటి వస్తుంది. నతు సర్ప ఇవ త్వచం పునః- ప్రతిపేదే వ్యపవర్జితాం శ్రియం అంటా డాయనను గూర్చి కాళిదాసు. అజుడు మరీ దేబిరిస్తుంటే ఒకటి రెండు రోజులు వన గమన మాపు కొన్నాడట ఆ రాజు. అంత మాత్రమే. తాను వదిలేసిన రాజ్య భోగాలను మాత్రం మరలా తిరిగి చూడలేదట. ఇది ఎలాటిదంటే ఒక సర్పం తన కుబుసను వదిలేసి మరలా దాని వంక చూడనట్టే నట. అసలా రఘువు రాజ్యం చేస్తున్నపుడు కూడా ధనార్థులకోసం తన సర్వస్వాన్నీ సమర్పించే త్యాగశీలుడు. కౌత్సుడే ప్రశంసిస్తాడు. ఆరణ్య కోపాత్త బలి ప్రరోహః - స్తంబేన నీవార ఇవావ శిష్టః. వన వాసులంతా ఒలుచుకొని పోతే ధాన్య మందరికీ పంచి పెట్టి కాడ మాత్రమే మిగిలి కనిపించే నీవారం లాగా ఉన్నాడట ఆ నీరజాప్తుని వారసుడు. ఏమి ఉదాత్త భావం. అలాంటి వదాన్యు డొకమారు

ఇది మనది కాదని వదిలేసిన తరువాత మరలా దాన్ని ఆశించటమా. కలలో జరగదు. అసక్త స్సుఖ మన్వభూత్ అని కదా వర్ణించాడు ముందుగానే కవి. భోగా లనుభవించటం కాదు గొప్ప. అనుభవిస్తూ కూడా ఇది మనది కాదనే మనస్సన్యాసం. భోగంలో త్యాగమది. తేన త్యక్తేన భుంజీథాః. ఇది దిలీప జీవితా న్నంతటినీ వెలిగించే దీపమైతే ఈ భావం - రఘు జీవితాని కంతటికీ ప్రదీప మాభావం.

ఇక అజ మహారాజున్నాడు. గొప్ప రసార్ద్రహృదయుడు. పరుల సుఖ దుఃఖాలు తనవిగా భావించి స్పందించే స్వభావ మాయనది. ఎవరినీ కోరని ఇందుమతి ఆయన నందుకే వరించిందేమో. అదీ ఎలాగని. ఒక్కొక్క రాజునూ నడయాడే దీపశిఖ లాగా గడచి పోయిందట. ఎలా ఉందంటే ఆ దృశ్యం - రాత్రి వేళ ఒకడు దివిటీ పట్టు కెడుతుంటే అది ముందుకు పోయే కొద్దీ ముందున్న మేడ వెలిగిపోతుంది. వెనుకటి మేడ చీకటయి పోతుంది. అలాగే ఎదుట కూచున్న రాజు ముఖం ఆశతో కళ కళలాడుతుంటే అంతకు ముందు కూర్చున్నరాజు ముఖం నిరాశతో నల్లగా మారిందట. ఏమి అద్భుతమైన సహజ సుందరమైన వర్ణన. కాళిదాసు ఉపమ లన్నిటికీ రాజిది. దీని మూలంగానే దీపశిఖా కాళిదాసమని అభిజ్ఞ లోకంలో ఒక బిరుదు కూడా వచ్చిందాయనకు. కాగా ఈ వర్ణనలో ఒక గంభీరమైన భావంకూడా ఇమిడి ఉంది. దీపం ప్రసాదిస్తేనే వెలుగు. లేకుంటే వెలుగులేదు. అలాగే అజునికి కూడా ఆ ఇందుమతి ఇచ్చిన వెలుగే వెలుగు జీవితానికి. లేకుంటే అది అంధకార బంధురమే. అలాగే అయింది చివరకాయన జీవిత మామె హఠాత్తుగా కన్ను మూయటంతో. అప్పటికా మేడ కూడా దాటిపోయింది దీపశిఖ. అందుకే ఆ రాజలా వాపోయాడు. ఏమని. కరుణా విముఖేన మృత్యునా - హరతా త్వాం వద కిం న మే హృతం. కఠినాత్ముడైన ఆ విధి నిన్ను హరించాడంటే నా జీవితంలో ఏది హరించలేదు. సర్వస్వమూ కోలుపోయానని ఆక్రందిస్తాడు. ఈ వాక్యాలు చదువుతుంటే భవభూతి ఉత్తర

రామ చరితలో ఒలక బోసిన కరుణ రసమంతా ఈ ఒక్క పాత్రలోనే పోసిమన కందిస్తున్నాడు కాళిదాసు. తరువాత ఆయన మనవడైన రాముడి విషయంలో కూడా ఇంతే . సీతను పరిత్యజించిన తరువాత ఆ వార్త లక్ష్మణుడు వచ్చి వినిపిస్తే రాముడి దశను వర్ణిస్తూ ఇలా అంటాడు కవి. కౌలీన భీతేన గృహా న్నిరస్తా - న తేన వైదేహ సుతా మనస్తః. లోకాపవాదం పడలేక ఇంటి నుంచి అంటే బయటికి పంపాడుగాని తన మనసునుంచి కాదు కదా. ఎంత గంభీరమైన మాట ఇది. లోతుకు దిగి చూచే కొద్దీ భావ పరంపర శర పరంపర లాగా మన మనసును దూసుకొని పోయే భావాలెన్నో. సీతా రాముల అవినా భావ మెలాంటిదో కన్నులకు కట్టినట్టు చూపుతున్నది. తుదకా నిత్యానపాయిని అయిన మాయా శక్తి పరమాత్మను విడిచి ఎక్కడికి పోగలదనే దివ్య భావన కూడా ఒకటి తళుక్కున మెరుస్తుంది. ఇలాటి వెన్నెన్నో వర్ణన లాయా రాజుల జీవితాలలో. ఆఖరు కగ్ని వర్ణుడి కామలోలుపమైన జీవితాన్ని వర్ణిస్తూ ఒక్క మాట అంటాడు కవి. అంక మంక పరివర్తనోచితే తస్య నిన్యతు రశూన్యతా ముభే - వల్లకీచ హృదయంగమ స్వనా వల్గు వాగపిచ వామ లోచనా. అతడి ఒడి ఎప్పుడూ ఖాళీగా ఉండదట. అటు ఒక వీణో ఇటు ఒక మధుర వాణో - ఎవరో ఒకరుండి తీరవలసిందే నట. ఇంత కన్నా ఒక రసిక జీవనాన్ని గూర్చి చెప్ప వలసిన మాట మరొకటి ఉండబోదు. మొత్త మతని కామమయ జీవితాన్నంతా మూట గట్టి అందిస్తున్నది.

ఇలాగే కుమారసంభవంలో ఒక శ్లోక మున్నది. సాక్షాత్తూ పరమేశ్వరుడి నోట పలికిన శ్లోకమది. సప్త ర్షులను మధ్య వర్తులుగా పంపుతూ ఇలా అంటాడా స్వామి. విదితంవో యథా స్వార్థః - న మే కాశ్చిత్ - ప్రవృత్తయః - నను మూర్తిభి ర ష్టాభి - రిత్థం భూతోస్మి సూచితః. నాకు స్వార్థమంటూ ఏదీ లేదని మీకు తెలుసును గదా. అందుకు నిదర్శనం నా ఈ అష్టమూర్తులే నంటాడు. ఎంత గొప్ప అర్థ మిమిడి ఉంది ఈ వాక్యంలో. సతీ వియోగం మొదలుకొని తారకాసురుడి బాధలూ - దేవతల

ప్రార్థనా - కామదహనమూ - పార్వతి తపస్సూ - తరువాత వివాహ జీవితమూ - ఇదంతా తనకోసం కాదా పరమాత్మకు. లోక కళ్యాణం కోసమే తన కళ్యాణం. దేవతలతో బ్రహ్మ చెప్పిన రహస్యమంతా ఈశ్వరుడి ఈ మాటలలో ఎలా ధ్వనిస్తున్నదో చూడండి. అసలు ఈ సృష్టిలో ఎవరెక్కడ ఎవరికి మేలు చేసినా భూత భౌతిక పదార్థాల ద్వారానే గదా. అవన్నీ ఎవరి సొత్తు. ఆ పరమేశ్వరుని మూర్తులే గదా అవి. వాటిని నిత్యమూ మనకాయన ప్రసాదిస్తూనే ఉన్నాడు. తానందులో ఏదీ కోరకుండానే మన కందిస్తున్నాడు. అలాటి వాడికి భార్యా వియోగ మేమిటి. మరలా సంయోగ మేమిటి. అంతా మనకోస మాడే ఒక గొప్ప నాటకం. శివ శక్తుల జగన్నాటకం. ఈ మహోన్నత భావాన్ని ఎలా సూచిస్తున్నదో చూడండి ఈ శ్లోకం. ఇలాగే మేఘసందేశంలో యక్షుడి నోట ఒక సుభాషితం వెలువడుతుంది. కస్యాత్యంతం సుఖ ముపనతం దుఃఖ మేకాంతతో వా - నీచై ర్గచ్ఛ త్యుపరిచ దశా చక్ర నేమి క్రమేణ. ఎవడికీ ఈ లోకంలో పూర్తిగా సుఖం లేదు. పూర్తిగా దుఃఖం లేదు. చక్రంలో ఆకుల లాగా ఒకటి పైకి వస్తే వేరొకటి క్రిందికి పోతుంది. మరలా అది పైకి వస్తే ఇది అడుగుకు పోతుంది. ఈ వాక్యం చూడండి. ఆ కావ్య వస్తువుకంతా ప్రాణం లాంటిది. యక్షుడి దశ ఇప్పుడదేగదా. ఒకప్పుడు అలకానగరంలో ఎంతో భోగ భాగ్యాలతో తులతూగిన వాడిప్పుడు రామగిరిలో వచ్చి పడ్డాడు శాప గ్రస్తుడయి. మరలా వర్ష భోగ్యమైన ఆ శాపం ముగియగానే గత వైభవానికి నోచుకోక పోడు. చూడండి కథ అంతా కలిసి వచ్చిందా లేదా ఈ మాటలలో. అంతే కాదు. భౌతికంగా అబ్బని ఆనందం భావంలో తీర్చుకొంటూ తృప్తి పడతాడట మానవుడు. సంకల్పై స్త్రైర్విశతి విధినా వైరిణా రుద్ధ మార్గః - విధి అన్ని మార్గాలూ భౌతికంగా మూసివేసినా మానసికంగా తలుపులు తెరుచుకొని ఇష్టమైన దానికోసం పరుగులు పారుతుంటాడు ప్రాణి. అదే ఇప్పుడు దూరాన ఉండి యక్షుడు చేస్తున్న పని. లేకుంటే అచేతనమైన మేఘు డేమిటి. సందేశం తీసుకు పోవట మేమిటి. అదంతా ఆ కాముకుడి గొంతెమ్మ కోరిక. జీవులెంత అల్ప

సంతోషులో ఆలోచించే కొద్దీ ఈ సుభాషిత మెంతగా డెందానికి విందు చేస్తుందో చూడండి.

ఇక నాటకాలు చూతామా. అన్నీ అన్నే. రత్నాలూ వరహాల లాంటి సూక్తులు. శాకుంతలంలో లేని సూక్తులా. ఏది పట్టుకొన్నా అది ఒక రత్నమే. తేజో ద్వయస్య యుగప ద్వ్యసనో దయాభ్యాం - లోకో నియమ్యత ఇవాత్మ దశాంతరేషు. ఒక వైపు చంద్రు డస్త మిస్తుంటే మరొక వైపు సూర్యోదయ మవుతున్నదట. ఆకాశంలో ఏక కాలంలో జరుగుతున్న ఈ దృశ్యం చూస్తుంటే ఏమని పిస్తుంది. లోకుల కందరికీ చీవాట్లు పెట్టి చెబుతున్నదట దైవ ప్రకృతి - నీకీ వ్యసనం వచ్చి పడ్డదని బాధ పడకు మరొకడి కభ్యుదయ మది. మనకీ అభ్యుదయ మేర్పడిందని పొంగిపోకు అది ఇంకొకరి పాలిటి కుపద్రవం. కాబట్టి ఎప్పుడేది ప్రాప్తిస్తే అదే భగవత్ప్రసాద మనుకో. అలా అనుకొంటే ఆ భగవానుడే నీకు మరలా శ్రేయస్సు ప్రసాదిస్తాడు. ఇదీ భావం. ఈ భావమే పరుచుకొని ఉంది నాటక కథ యావత్తూ. చూడండి చంద్రు డస్త మించా డంటే చంద్ర వంశ్యుడైన దుష్యంతుడి ప్రజ్ఞ దుర్వాసుడి శాపంతో అస్తంగత మయిందని అర్థం. ఆ సమయంలోనే కశ్యపా శ్రమంలో సూర్యుడిలాంటి మరొక తేజస్సు ఉదయించింది. అదే అతని కుమారుడు భరతుడు. అంతే కాదు. కణ్వు డనే తేజస్సు తన కూతురికి జరిగిన కష్టాన్ని తలుచుకొని క్రుంగిపోతే ఆ సమయంలోనే తానే నేరమూ చేయలేదని భావిస్తున్న దుష్యంతుడి తేజస్సు ఉత్సాహంతోనే ఉంది కదా. అది మరలా గత వృత్తాంతం జ్ఞప్తికి రాగా కుంగిపోతే అతని కుమారుడనే తేజస్సు పైకి వస్తుంది. అసలు శకుంతలా తేజస్సును క్రుంగదీసి దుష్యంత తేజస్సు విలసిల్లితే - పోయిన అంగుళీయకం దొరకి దుష్యంత తేజస్సు క్రుంగి పోతే స్వర్గ సీమలో శకుంతలా తేజస్సు మాతృ దేవత లాలనలో మహర్షుల పాలనలో కాలం గడుపుతోంది. పోతే ఇదంతా దైవ లీల అని సహనం వహిస్తే ఆ దుష్యంతుడే గాదు ఆ శకుంతలే గాదు ఆ కణ్వుడే గాదు - అందరూ

కష్టాల ననుభవించినప్పు డనుభవించినా చివర కది మంచు పొర లాగా విరిసి పోయి మరలా సుఖాంతంగానే ముగిసింది వారి జీవితం. కాదు నాటక జీవితం.

ఒక్క శాకుంతల నాటకమే గాదు. విక్రమ మాళవికలు కూడా తక్కువవి కావు. ఎక్కడో ఒక కీలకం దొరుకుతుంది నాటక నిర్మాణ రహస్యాన్ని బయట పెట్టేది. నాటక కథకంతా వన్నె తెచ్చేది. గణదాసు డనే నాట్యా చార్యు డంటాడొక గొప్ప మాట. విద్యకు నికషోపలం విద్యావంతుల తోడి చర్చే. అప్పుడే సత్యమేమిటో బయట పడుతుంది. అలా కాక యస్యా గమః కేవల జీవికాయై. ఎవడు పుస్తకాలు మాత్రం చదివి కేవలం దాన్ని జీవనాధారంగా పెట్టుకొంటాడో తం జ్ఞాన పణ్యం వణిజం వదంతి. లోకులు వాణ్ణి ఏమంటారో తెలుసా. జ్ఞానమనే సరకు విక్రయించు కొని బ్రతికే ఒక సౌదాగరని ఆక్షేపిస్తారు. జ్ఞానమనేది వ్యాపారంకాదు. పార దర్శనం. గొప్ప సూక్తి ఇది. శాస్త్ర కళా రంగాలలో కృషి చేసేవా రందరికీ శిరోధార్య మైన సూత్రం. ఇలాంటిదే మరొక సూత్రం మాళవిక చివరిలో వస్తుంది. అంతవరకూ మాళవిక ఎవరో తెలియక ఒక్కసారిగా ఆవిడ గతంలో ఫలానా అని గ్రహించిన అగ్ని మిత్రు డిలా అంటాడు. ప్రేష్య భావేన నామేయం - దేవీ శబ్ద క్షమా సతీ - స్నానీయ వస్త్ర క్రియయా - పత్రోర్ణం వోప యుజ్యతే. అహో పరిభవోప హారిణో వినిపాతాః. పట్టపు రాణిగా బ్రతక వలసిన ఈ కన్య ఇంత కాలమూ పరిచారికగా చలామణి అవుతూ వచ్చిందా. విలువైన చీనాంబరాన్ని స్నానంచేసి తుడుచుకొనే బట్టగా ఉపయోగించావూ. అయ్యయ్యో ఏదైనా విలువ గుర్తించక పోతే ఇంతే గదా. అయినా మన తప్పు గాదు. ప్రకృతి లోనే ఎవరికైనా రోజులు చాలక పోతే మొగం చాటు చేసుకొని బ్రతుకు సాగించక తప్పదు. చూడండి. మాళవికాగ్ని మిత్ర కథ వస్తు వంతా ఆ ముందు చెప్పిన ఇప్పుడు చెప్పిన ఈ రెండు సూత్రాల మీదనే నడచిందంటే ఆశ్చర్యం లేదు.

Yalamarti Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

విక్రమోర్వశీయంలో కూడా ఒక మాట ఉంది. అది ఏదో కాదు. భరత వాక్యం. ఒకటి గాదు రెండు వాక్యాలవి. రెండూ రెండు రత్నాలే. వెల గట్టలేము. తిలకించండి. పరస్పర విరోధిన్యో రేక సంశ్రయ దుర్లభం - సంగతం శ్రీ సరస్వత్యో ర్భూయా దుద్భూతయే సతాం. లక్ష్మికీ సరస్వతికీ సరిపడదు. ఒక చోట ఇద్దరూ కలిసి ఉండటం చాలా అరుదు. అలా కాకుండా ఎప్పుడూ వారు కలిసి ఉండాలని మా కోరిక అంటాడు విక్రముడు. కాదు కాళిదాసు. శ్రీ సరస్వతు లెవరో కారిక్కడ. శ్రీ ఊర్వశి. సరస్వతి రాజ మహిషి. మహిషికి ఊర్వశిని రాజు చెట్ట పట్టట మిష్టం లేదు మొదట. తరువాత వారి ప్రణయాతిరేకం చూచి అంగీకరించింది. అప్పు డిద్దరూ ఒకే చోట ఒద్దికగా ఉంటారు. ఈ కథ వస్తువును కూడా చూడండి - ఈమాట ఎలా సూచిస్తున్నదో. ఇదంతా ఆయన గుప్త రాజులను గూర్చి అన్నాడో తన బోటి విద్యా వంతులను గూర్చి అన్నాడో - లేక జన బాహుళ్యాన్నే గూర్చి అన్నాడో చెప్పలేము. ఏదైనా కావచ్చు. దేశమేలే రాజుకు ఐశ్వర్య ముంటే లాభంలేదు. విద్యా వివేక సంపత్తి కూడా ఉండాలి. పండిత లోకానికి విద్య ఉంటే సుఖం లేదు. సుఖ జీవనం కూడా ఉండాలి. వీరిద్దరికీ అవి ఉంటే వారి ఏలు బడిలో వర్తించే లోకానికంతా ఉన్నట్టే. ఈ మాట నాటకంలోని అగ్నిమిత్రుణ్ణే - గణదాసు లాంటి ఆచార్యులనూ - మాళవిక లాటి శిష్య వర్గాన్నీ ఎలా స్పృశిస్తున్నదో చూడండి. ఇంతే కాదు. రెండవ శ్లోక మింకా అన్వర్థమైనది. సర్వ స్తరతు దుర్గాణి - సర్వో భద్రాణి పశ్యతు - సర్వః కామా నవాప్నోతు - సర్వ స్సర్వత్ర నందతు. ప్రతి ఒక్కరూ కష్టాలు గడచి బయట పడాలి. ప్రతి వారూ సుఖ పడాలి. ప్రతి ఒక్కరి కోరికలూ ఫలించాలి. ఇంతెందుకు. ప్రతి ఒక్కరూ జీవితంలో కళ కళలాడుతూ బ్రతకాలి. ఏమిటీ దీవన. ఎంత గొప్ప దీవన ఇది. సర్వ మానవ సౌభ్రాత్రం - వసుధైక కుటుంబం - సర్వ లోక కళ్యాణ మని కేకలు పెట్టే ఆధునికులకు కొన్ని వందల సంవత్సరాలకు ముందే పెట్టిన మహాకవి పెను కేక ఇది. అటు నాటక వస్తువుకూ ఇటు మన జీవితానికీ ఎలా అతుకుతున్నదో చూడండి ఈ భావం. విక్రమోర్వశులు

కథలో తమకు కలిగిన అవరోధాలన్నీ గడచి బయట పడ్డారా లేదా. అంతే కాదు. వారి కోరికలు కూడా ఫలించాయి. ఇదే కామా నవాప్నోతు అనే మాట కర్థం. మొత్తాని కందరూ చివరకు నందంతు - ఆనందోత్సాహాలతోనే ముగిసింది కథ. లోకాన్ని నెపంగా పెట్టుకొని చెప్పినా లోకానికే గాక కథ లోకానికి కూడా ఆలోకాన్ని ప్రసాదిస్తున్నది చూడండి ఈ సుభాషితం.

ఏవం విధ నానా విశేషణ విశిష్ట మైనది కాళిదాస మహాకవి వర్ణనా సౌందర్యం. అది భావమే గాదు - వస్తువే గాదు - బాహ్య ప్రకృతే గాదు ఏది వర్ణించినా మనోహరమే. బహుళార్థ సాధకమే. వీటన్నిటినీ మించి సర్వులూ సర్వకాలమూ స్మరిస్తూ ఆనందించ వలసిన పరమాద్భుతమైన భావాలెన్నో లభిస్తాయి మనకాయన కవితా రత్నాకరంలో. త్రవ్వి తలకెత్తుకో వలసిన రత్నాలు. అవి ఇక ఏ కవి లోనూ ఏ రచనలోనూ దొరకని అమూల్య రత్నాలు. వాటిలో కొంత సర్దైనా బయట పెట్టకపోతే ఆయన కపచారం చేసిన వాడ నవుతానని భయం. చూడండి. కుశ మహారాజు నిద్రిస్తుంటే అర్ధరాత్రి పడక గదిలోకి ఒక అజ్ఞాత స్త్రీ ప్రవేశిస్తుంది. ఎవరో కాదావిడ. అయోధ్యా పుర దేవత. ఎలాంటి దావిడ ప్రవేశం. ఛాయా మివ దర్శతలం ప్రవిష్టా మంటాడు మహాకవి. తలుపులు తీయకుండా లోనికి రావట మద్దంలోనికి నీడ వచ్చిన ట్టున్నదట. ఏమి భావన. రాముడు సీత ఆభరణాలు ఋశ్యమూకం మీద చూచి బాధ పడ్డ వృత్తాంతం మరలా సీతకు చెబుతూ అంటాడు. నీ కాలి అందె పాపమా సమయంలో నీవు దూర మయ్యావని కాబోలు నాలాగే ఏమీ పలకలేక మౌనం వహించిం దంటాడు. అంతే కదా మరి. కాళ్ళకు పెట్టుకొని నడుస్తుంటే ధ్వనిస్తుంది అందె. లేకుంటే ధ్వని చేయదు కదా. అది వియోగ దుఃఖంతో నిశ్శబ్ద మయిందనట మెంత సొగసు. చీనాంశుక మివ కేతోః - ప్రతి వాతం నీయమానస్య అని వర్ణిస్తాడు దుష్యంతుడి అవస్థ. శరీరం ముందుకు పోతున్నా మనసు వెనుకకు లాగుతున్నదట. ఎలా ఉన్నదది. జెండా కఱ్ఱను ముందుకు పట్టుకెడుతుంటే దానికి కట్టిన వస్త్రం గాలికి

రెప రెప లాడుతూ వెనక్కు పోతున్నట్లు న్నదట. పుష్పకం మేఘపంక్తులు దూసుకొని పోతుంటే సీత దాని కిటికీ గుండా చేయి బయటికి జార విడిస్తే మేఘమనే గాజుల సెట్టి మెరపుతీగలనే బంగారు గాజు లావిడ చేతికి తొడుగుతున్నదట. అజుని నిద్ర లేపుతూ వంది మాగధు లిలా వర్ణిస్తారు ప్రభాత కాలాన్ని. భవతి విరళ భక్తిర్మ్లాన పుష్పోప హారః - స్వకిరణ పరివేషో ద్భేద శూన్యాః ప్రదీపాః - తెల్లవారుతూ ఉంటే రాత్రి ద్వారానికి కట్టిన పుష్ప మాలలు అందులోని పూలు వాడిపోగా సందు లేర్పడ్డాయట. దీప కాంతి కిరణాల చుట్టూ కనపడే పరివేషం హద్దులు చెరిగి పోయి కనపడకుండా పోయిందట. ఒక రాజుకు యౌవనం వస్తే అది ఎలా ఉందో తెలుసా. మధు వనితానాం నేత్ర నిర్వేశ నీయం. కోడె వయస్సు పూబోడులు చూపులతోనే ఆస్వాదించ వలసిన మధువట అది. సర్వాంగీణ మాకల్ప జాతం. శరీర మన్ని భాగాలలో ధరించిన ఆభరణ జాతమట. ఏమి సున్నితమైన భావాలివి. ఆలింగ్యంతే గుణ వతి మయా తే తుషారాద్రి వాతాః - పూర్వం స్పృష్టం యదికిల భవే దంగ మేభిస్తవేతి . యక్షు డంటాడు మేఘమిత్రుడితో. మీ వదినగారితో ఇలా వినకారు చేయి నా బాధ. అప్పుడప్పుడు మదనానల తాపానికి తట్టుకోలేక శరీరం చల్లబడాలని చల్లని హిమాలయ మారుతాల నాలింగనం చేసు కొంటుంటాను. ఎందుకో తెలుసా. అవి నీ ఒంటికి సోకి వస్తాయి కాబట్టి వాటిని వాటేసుకొంటే నిన్ను వేసుకొన్నట్టే ఉంటుందని ఆశ. సముద్రుడికి నదులన్నీ ప్రియురాండ్రు. అవి దానిలో ప్రవేశిస్తుంటే వాటి తరంగాలూ దాని తరంగాలూ ఎదురవుతుంటే ఒకరి కొకరు పెదవులు కలుపుకొని అధరామృతాన్ని ఆస్వాదించి నట్టుందట. తరంగ హస్తాలతో నదీ మతల్లులు మనల నాహ్వానిస్తుంటాయట. శకుంతల ఆశ్రమం విడిచి వెడుతున్నది అనుమతి ఇస్తారా అని అడిగితే కణ్వ మహర్షి - పక్షుల కిల కిలా రావాలతో ఇచ్చామని చెబుతున్నాయట వన పాదపాలు. అజుడు భార్యా వియోగంతో దికాలు పడి కూచుంటే వసిష్ఠ మహర్షి శిష్యుడు వచ్చి గురువుగారి సందేశం వినిపించి తిరిగి వెడుతుంటే అంటాడు కాళిదాసు. తదలబ్ధ పదం హృది

శోక ఘనే - ప్రతియాత మివాంతిక మస్య గురోః - లోపల ప్రవేశించాలని చూచి ఆయన హృదయం దుఃఖంచేత దట్టంగా నిండి ఉంటే స్థలం లేదని తెలుసుకొని ఆ సందేశం మరలా వచ్చిన దారినే వెళ్ళిపోతున్న దని పిస్తున్నదట. మరి మానవుడి ఆలోచన లెలాంటివంటే అతటాః ప్రవాః - ఇటూ అటూ ఒడ్డులేని ప్రవాహాలట. ఇంకా సున్నితమైన హృదయాన్ని కదిలించే ఎప్పటికీ మరపురాని ఎన్నో భావాలు దొరలు తుంటాయి రచనలో. చిరస్య దృష్టేవ మృతోత్థితేవ. అమ్మాయి పెండ్లి కూతు రవుతున్నదంటే ఎంత మంది పిల్లలున్నా ఆవిడను చూచి ఎన్నో ఏండ్లూ పూండ్లూ అయినట్లు - చచ్చి మరలా లేచి వచ్చినట్లు - ఎంతో ఆప్యాయంగా చూచుకొన్నారట పార్వతీ దేవిని ఆ పర్వత దంపతులు. నిజమే ఒక మారు సతీ దేవిగా చచ్చి బ్రతికింది - పరా పశ్యంతీ రూపంగా కనబడక ఎంతో కాలాని కిలా వైఖరీ రూపంగా గోచరిస్తున్నదే గదా ఆ జగన్మాత. అయినా తల్లికావిడ కన్నబిడ్డే. దూరమై పోతున్నదే అని బాధ. చేతికి కళ్యాణ సూత్రం కడుతూ కళ్ళలో నీళ్ళు తిరిగి కనపడక ప్రక్కన కడుతుంటే దాది దానిని పాటుకు తోస్తున్నదట. లక్ష్మణుడు రావణుడు ప్రయోగించిన శక్తి హృదయానికి సోకి నేలకొరిగితే - అది సోకక పోయినా శోకంతో నేల కొరిగాడట రాముడు. ఇలా చెప్పుకొంటూ పోతే తెల్లవారుతుంది మనకు. సముద్రంలో నాలు గుద్దరణుల జల మందించాను తమకు. అందులో దిగి ఈత కొట్టటమిక మీ వంతే.

ఇంత వరకూ మన ముగ్గడించింది మహాకవి భావ సౌందర్యం. ఐతే భావ మొక్కటే కాదు. భాష కూడా ఉంది మనం గమనించ వలసింది. భావం భాషా - ఇవి రెండూ జోడు గుఱ్ఱాలు. రెండూ తోడైతేనే రథం ముందుకు సాగేది. ఇందులో భావం నిరాకారం. అభ్యంతరం. పోతే భాష సాకారం. బాహ్యంగా గోచరించేది. అమూర్తమైన భావాన్ని మూర్తం చేసి అంతరాంతరాల్లో మెదిలే భావాన్ని ఇదుగో ఇదీ పట్టుకోమని సహృదయుడి

కందించేది భాష. అది వర్ణమే కాదు. పదమే కాదు. వాక్య నిర్మాణమే కాదు. కడకు ఛందో బంధమే కాదు. అన్నింటిలో సిద్ధ హస్తుడు కాళిదాసు. అర్థ శిల్పంలో ఎంతవాడో శబ్ద శిల్పంలో అంతకన్నా అతీతుడు. ఆ మాటకు స్తే అర్థమే కవికి వివక్షితమైనా దాన్ని సహృదయుడి అనుభవానికి తేవాలంటే శబ్దమే అతని కాధారం. చిత్రకారుడికి రంగులూ కుంచే కాగితం లాగా - గాయకుడికి జంత్ర గాత్రాల లాగా - కవికి శబ్ద సామగ్రి అనివార్యం. కావ్య రసం కవి హృదయమనే జలాశయం నుంచి రసజ్ఞుడి హృదయ మనే పాదు వరకూ ప్రవహించా లంటే శబ్దమే ప్రణాళిక. ఒక పెద్ద గొట్టం. అది ఎంత బలంగా శుభ్రంగా ఉంటే రస స్ఫూర్తి అంతగా కలుగుతుంది. ఇది గమనించిన వాడే - ఈ కవి సహృదయుల కుండే సంధాన కరణిని గుర్తెరిగిన వాడే - మహాకవి శబ్ద వాచ్యుడు. గుర్తించటమే గాక దాన్ని నూటికి నూరు పాళ్ళూ నిర్వహించిన వాడు కాళిదాసు.

పైన పేర్కొన్నట్టు వర్ణం దగ్గరి నుంచీ ఛందస్సు వరకూ సాగిం దాయన శబ్ద శిల్పం. విశ్వ రూపాన్ని ధరించి కనిపిస్తుం దాయన రచనల్లో. భావాను గుణంగా ఆయన అక్షరాలను పోహళిస్తాడు. అది అమోఘం. సుదక్షిణా దిలీపుల అనురాగం కుశ్లు వాడి జన్మతో విభక్తమయి కూడా అంతకంతకు పెరిగి పోతూనే ఉందట. ఎలాగంటారు. పరస్పరస్యోపరి పర్యచీయత. ఇక్కడ పరి పరి అనే అక్షరాల కూర్పులో ఒక దాన్ని ఒకటి అంటి పట్టుకొన్నట్టు ఆరోహణ మార్గంలో పెరిగి పోతున్నట్టు మనకనుభవానికి వస్తున్నది. పార్వతి తన ఆశ్రమంలో ప్రవేశించిన కపట బ్రహ్మచారి కర్ఘ్యం తీసుకొని ఎదురుగా వస్తున్నది. ఎలాగో తెలుసా. తమాతి థేయీ బహుమాన పూర్వయా - సపర్యయా ప్రత్యుదియాయ పార్వతీ. ఇక్కడ ఈ పాదం మనం చదువుతుంటే యాయా అనే వర్ణం మూడు నాలుగు మార్లు ఆవృత్తి అవుతూ ఆవిడ ముందుకు సాగిపోతున్న దృశ్యం కళ్ళకు కడుతుంది. అస లావిడ తపశ్చర్య వర్ణించే టపుడు కూడా ఇలాటి దృశ్యమే ఒకటి మనకు దృగ్గోచర

మవుతుంది. స్థితాః క్షణం పక్ష్మసు తాడితా ధరాః పయోధరో త్సేధ నిపాత చూర్ణితాః - వళీషు తస్యాః స్ఖలితాః ప్రపేదిరే చిరేణ నాభిం ప్రథమోద బిందవః - వర్షర్తువులో చేస్తున్న తపస్సిది. తొలుకారు చినుకులు ఆవిడ ఒంటి మీద పడుతున్నాయి. మొదట అవి కను రెప్పలమీద తరువాత పెదవుల పైన - పిమ్మట వక్షోజాల మీద అక్కడి నుంచి క్రిందికి జారి నాభిలో ప్రవేశించాయుట. చూడండి. ఈ పద్యం మీరు చదువుతుంటే ధరాః- పయోధరో- త్సేధ నిపాత- అని అక్కడక్కడా ధకారాల ఉచ్చారణలో క్రమ క్రమంగా ఆ జల కణాలు పడుతున్న దృశ్యం కనపడుతుంది. వినపడుతుంది. ఆ తరువాత ప్రపేదిరే చిరే - అన్నప్పుడు హ్రస్వ పూర్వక మైన రే అని రెండు ఏకారాలు చాలా సేపటికి నాభిలో ప్రవేశించాయనే విలంబ భావాన్ని మన కందిస్తాయి. పోతే ఇందులో పద సార్థక్య మెలాగూ ఉండనే ఉంది. క్షణం - తాడిత - నిపాత - చిరేణ. రెప్పలు తేలిక కాబట్టి ఎక్కువ కాలం నిలవవవి. అందుకే క్షణ. పెదవి సుకుమారం కాబట్టి తాడిత. ఉత్సేధం నుంచి పడటం కాబట్టి చూర్ణిత - ఆ పాటికవి చాలా వరకు క్షీణించాయి కాబట్టి నాభిని చేరటానికి చిర. ఎంత గొప్పగా ఉందో ఆ జగన్మాత తపో వర్ణన.

పరమేశ్వరుడు పెండ్లికి తరలి వస్తున్నాడు. ఎలాగనుకొన్నారు. నంది కైదండ ఇస్తుంటే - ఆయనగారి మీది గౌరవంతో తన బృహచ్ఛరీరాన్ని కుంచించుకొని కూచున్న వృషభ వాహనం మీద కూచుని. ఆ కుంచించుకోట మెలా ఉంది. తద్భక్తి సంక్షిప్త బృహత్ప్రమాణం అంటాడు. ఇక్కడ తద్భ - క్షిప్త - బృహత్ - దగ్గర దగ్గరగా అక్షరాలు. అందులో హ్రస్వాలు. అవీ సంయుక్తాలు. దీని ద్వారా చూపుతున్నాడ కుంచించటాన్ని మహా కవి. అక్షరాల కుదింపు అవయవాల కుదింపును బయట పెడుతున్నది. పిమ్మట దాని మీద కూచోటమే తరవాయి. అది గగన మార్గాని కెగిరి మహా వేగంతో పయనిస్తున్నది. ఎలాగని. ఖే ఖేల గామీ త మువాహ మువాహః ఖే ఖే అనే

రెండూ ఛే ఛే అని వాహనాన్ని అదిలించే ధ్వనులైతే - తమువహా వహా అనేవి ఓం ఓం అని బోయీలు పల్లకీని మోసే ధ్వనులుగా వినపడటం లేదా మన చెవులకు. అంతే కాదు. సశబ్ద చామీకర కింకిణీకః - అప్పుడు దాని మెడలో కట్టిన గజ్జెల పట్టెడలో మువ్వల సవ్వడి కూడా కిణ కిణ మని వినపడి తీరాలి మీకు. పోతే అక్కడ పెండ్లి పీటల మీద ఆసీనుడైన ఆ మహాదేవుడికి వీచోపులు వీస్తున్నారు. ఎవరని. గంగా యమునలు. వారు సాకారలయి వచ్చారు వేడుక చూడటానికి. ఆ వింజామర లిటూ అటూ కదులుతుంటే సచామరే దేవ మసేవిషాతా మంటాడు కవి. సచా - మరే - మసే - విషా - చూడండి. ఈ నాలుగూ ఆ కదలిక నెలా చూపుతున్నవో. అసేవిషాతా మనేది ఒక క్రియ. సేవృ అనే ధాతువుకు ఒకానొక భూత కాలంలో వచ్చే ప్రథమ పురుష ద్వివచనాంత రూపం. ఆ క్రియా రూపాన్ని చూడండీ ఎలా తన అవసరాని కుపయోగించు కొన్నాడో కవి. అదే కళాకారుని కుండ వలసిన నేర్పు. మామూలుగా చూస్తే ఆయా క్రియలు గాని వాటి రూపాలు గాని ధాతు రత్నాకరం లాంటి గ్రంధాలలో చదువుతుంటే తద్దినం మంత్రాల లాగా చెవిన పడుతుంటాయి. అవే ఒక మహా కవి సమయోచితంగా తీసుకొని ప్రయోగిస్తే వాటి కొక వన్నె వస్తుంది. ముడి సరకు తీసుకొని దానికి మెరుగులు దిద్దటంలోనే ఉన్నది కౌశలమంతా. చూడండి ఇలాంటిదే మరొకటి. హిమవంతుణ్ణి ప్రశంసిస్తున్నారు సప్త మహర్షులు. గా మధాస్యత్ కథం నాగో - మృణాళ మృదుభిః ఫణైః - ఆ రసాతల మూలా త్త్వం - అవాలంబిష్యథా నచేత్. ఒక సన్నని బలంలేని పాము వల్ల ఏమవుతుంది ఈ భూ భారాన్ని మోయటం - పాతాళం నుంచీ నీ బోటి వాడు బలంగా పట్టి పైకెత్తక పోతే - ఇదీ దీని భావం. ఈ భావాన్ని మన హృదయానికి పట్టించటానికి చూడండి కవి ఎంత విద్య ప్రదర్శించాడో. అధాస్యత్ - అవాలంబిష్యథా అనే క్రియా పదాలు చూడండి. ధాస్యత్క అనటంలో ఒక బరువు ఏత్తే ప్రయత్నం. అయితే బలహీనుడి చేత కాదనటానికి నాగో మృణాళ మృదు అనే తేలిక మాటలు. పోతే శ్లోకంలో పూర్వార్ధం హ్రస్వ దీర్ఘాత్మకంగా నడపి ఉత్తరార్ధం

దీర్ఘాక్షర బహుళంగా నడుపుతాడు. ఆ రసాతల మూలాత్తని. ఎందుకని. పాతాళం వరకూ చేతులు పోనిచ్చి గదా పైకి లేపవలసింది. అందుకని. అందుకే అవాలంభిష్యథా నచేత్తని సాగదీస్తాడ క్రియా పదాన్ని.

అసలు కావ్యారంభంలోనే చూపుతాడొక వర్ణ చిత్రాన్ని కవి మన కళ్ళకు. అది ఏదోగాదు హిమాలయం. ఎలా ఉంది దాని చెహరా. అస్త్యుత్తరస్యాం అనటంలో గట్టిగా ఒక చోట నిలదొక్కుకొని ఉందని- దిశి దేవతాత్మా అనటంలో ఒక దేవతలాగే ఆకాశాని కెదిగి పోతున్నదని స్ఫురిస్తుంది. హిమా లయో నగాధిరా అని పొట్టిగా పొడవుగా అక్షరాలు సాగటంలో లోయలతో శిఖరాలతో ఎగుడు దిగుడుగా గోచరిస్తున్నది. ఏమి దర్జా ఆ పర్వత రాజు దర్జా. అస్త్యుత్తర అని పర్వత రాజు గట్టిగా నేలను పట్టుకొంటే యాస్యత్యద్య అని శకుంతల వెడుతుంటే కణ్వ మహర్షికి గొంతే పట్టుకుపోయింది ఇలాంటి అక్షర విన్యాసంతో. కూతురి నత్తవారింటికి పంపటమంటే ఆయనకూ గుండె బరువే. గుండె పట్టుకు పోయింది గొంతు బొంగురు పోయిందా మహర్షికి. అది ఎలా జరిగిందని అడిగితే సూచిస్తున్నది యాస్యత్యద్య అనే అక్షర విన్యాసం. మూడు యా వత్తులు వరుసగా వచ్చి ఒత్తిడి చేస్తే ఒత్తు పడదా ఆ ముసలాయన గుండె. అందుకే సంస్పృష్ట ముత్కంఠయా. అలాగే కంఠః స్తంభిత బాష్ప వృత్తి కలుషః కంఠ స్తంభ అని. రెండు బిందువులు దాడి చేస్తే బాష్ప బిందువుల చేత రుద్ధం కాదా ఆ కంఠం. ఇలా ఎన్నని చెప్పమంటారు మహాకవి వర్ణ విన్యాస వైభవాలు. గత్యుత్కంపా దలక పతితై ర్యత్ర మందార పుష్పైః- అభిసారికలు నడుస్తుంటే ఆ కదలికకు కొప్పులో చెరివిన విరులు రాలి పడుతున్నాయట. గత్యుత్కంప అనటంలో అడుగుతీసి అడుగు పెట్టట మైతే - అలక పతితైః అన్నప్పుడు రాలి పడటమే నాయె. వేశ్యాస్త్వత్తో నఖ పద సుఖాన్ ప్రాప్య వర్షాగ్ర బిందూన్. నఖక్షతాలతో ఇబ్బంది పాలవుతున్న వేశ్యల చను మిట్టల మీద వాన చినుకులు పడుతున్న శబ్దం వినిపిచటం లేదా నఖపద సుఖ అనే అక్షరాల పోహళింపులో రసజ్ఞులకు.

ఈ అక్షర విన్యాసమే రచన అన్నా కావ్యంలో. దాన్నే రీతి అని కూడా వ్యవహరిస్తా రాలంకారికులు. రీతి ర్నామ గుణాశ్లిష్ట పద సంఘటనా మతా. మరి పద మెలా ఏర్పడుతుంది. వర్ణాలతోనే కదా. అప్పటికి ఒకానొక భంగిమలో పొందుపడి భావచిత్రాన్ని మన మనోనేత్రానికి చూపటమే రచనా సౌందర్యం కూడా. ఏ శ్లోకం చూచినా దీనికి జవాబు చెప్పేలాగే ఉంటుంది కాళిదాసు రచన. స్థానాదస్మాత్ సరస నిచులా దుత్పతో దఙ్ముఖః ఖం అన్నాడంటే మేఘం పైకెగురుతున్నట్టే. భంగీ భక్త్యా విరచిత వపుః అన్నాడంటే మేఘుడు మెట్లుగా తన శరీరాన్ని మలచినట్టే. మణి తటా రోహణా యాగ్రయాయీ అంటే పై శిఖర మెక్కటానికి ముందుకు సాగి పోతున్నట్టే. సద్యః కృత్త ద్విరద రదన చ్ఛేద గౌరస్య అంటే చీలిపోతున్న ఏనుగుల దంతాలు తెల్లని కాంతులు వెదజల్లినట్టే. పహా ప్రియాం స్వా మను వర్తమానః అంటే ప్రియురాలితో పాటు మధుకరం మధుపానం చేస్తున్నట్టే. కిం పురుష శ్చుచుంబ అంటే కింపురుషుడు ప్రియురాలిని ముద్దాడుతున్నట్టే. పుంస్కోకిలో యన్మధురం చుకూజ అంటే గొంతు పైకెత్తి కోకిల ముద్దుగా కూస్తున్నట్టే తోచటంలేదా మనకు. అంతే కాదు. ఈ శ్లోక రచన చూడండి. నిష్కంప వృక్షం నిభృత ద్విరేఫం- మూకాండజం శాంత మృగ ప్రచారం- ఇలా విరిచి విరిచి రచన సాగుతుంటే ఎక్కడి దక్కడ ఆగిపోయిన దృశ్యమే కనిపిస్తుందా వనంలో. అలాగే దుష్యంతుడి రథం మీది మీదికి వస్తుంటే బెదురు చూపులు చూస్తూ దూర దూరంగా పరుగెత్తే మృగాన్ని వర్ణిస్తుంటే కవి- దానితోపాటు మనలను కూడా పరుగు తీయిస్తున్నాడా అనిపిస్తుంది. గ్రీవా భంగాభి రామం. అదిగో మెడ మళ్ళించింది మృగం. ముహు రనుపతతి స్యందనే అదిగో వచ్చి పడుతున్నది రథం. బద్ధ దృష్టిః చూపునిలిపింది దాని మీద. పశ్చార్ధేన ప్రవిష్ట శ్శరపతన భియా అదిగో బాణం పడిందేనని భయంతో వెనుకటి భాగం శరీరంలో ముందుకు చొచ్చుకు పోతోంది. దర్భై రర్ధావ లీఢైః శ్రమ వివృత ముఖ భ్రంశిభిః అదుగో బాగా అలసి పోవటం మూలాన

www.advaitavedanta.in

నోటినుంచి గడ్డి పోచలు జారి క్రింద పడుతున్నాయి. ఏమి అద్భుతమైన వర్ణన లివి. వర్ణనలా వర్ణ చిత్రాలా.

అందులోనూ మరొక చిత్రమేమంటే అల్లసానివారు సెలవిచ్చినట్లు భాషలోని వర్ణాలకు రంగు లుంటాయి. వాసన లుంటాయి. రుచు లుంటాయి. స్పర్శ ఉంటుంది. లోకోత్తరమైన మహా కవి దృష్టికే అవి సాక్షాత్కరిస్తాయి. మరెవరికీ అంతుపట్టదు. తతిమా శిల్పాలన్నీ ఎలాగో ఈ శిల్పాన్ని కూడా అలాగే అధ్యయనం చేశాడు వాల్మీకి వద్ద కాళిదాసు. రరాస భూమి ర్నతతాప భానుమాన్ అని మహర్షి వర్ణిస్తున్నాడంటే ఒరపిడి సోకటంలేదా వేడి సోకటంలేదా మన హృదయాలకు. ఆస్ఫోట యామాస చుచుంబ పుచ్ఛ మంటే శబ్దం వినిపించటంలేదా. తారాభి రభిరామాభి రుదితాభిః అంటుంటే తళ తళ మని మెరసే నక్షత్రాల తళుకు కనిపించటంలేదా. అంతేగాక శక్య మంజలిభిః పాతుం వాతాః కేతకి గంధినః అని విసర్గ పూర్వక పకార కకారా లుచ్చరిస్తుంటే ఆ సుగంధ మారుతాలు పానం చేసే రుచి తెలియటం లేదా. ఇలాటి రచనా మంత్ర రహస్యా లెన్నో ఆ గురువుగారి శుశ్రూష చేసి గ్రహించిన వాడయె. అందుకే ఆ బాణీ వదలకుండానే తన వాణీ విలాసాన్ని కూడా చూడమని మనకు చూపుతుంటాడు. అది మరీ మనోహరం మహోజ్జ్వలం. సుప్త సర్ప ఇవ దండ ఘట్టనా ద్రోషితో స్మి తవ విక్రమ శ్రవాత్తంటాడు రాముడితో పరశురాముడు. పాము బుస కొట్టి పైకి లేస్తున్నట్టే ఉంది రచన. ఆ సవ్వడి వినిపిస్తూనే ఉంది. పశ్చాదద్రి గ్రహణ గురుభిః అనటంలో కొండ పట్టుకొని ప్రాకే స్పర్శ తెలుస్తూనే ఉంటుంది. మధ్యే యథా శ్యామ ముఖస్య తస్య-శ్యామాయ మానాని వనాని పశ్యన్. ఇలా శ్యవర్ణం తరుచుగా వాడితే అది నల్లని రంగును మనసుకు చూపుతుందని తెలుసు మహాకవికి. అందుకే నల్లని చూచుకాలను నల్లని చీకటిని వర్ణించేటపు డలాటి వర్ణమే పట్టుకొంటాడు. మరి ఎఱ్ఱని రంగుకో ఉండనే ఉంది రవర్ణం. రేఫ ఎప్పుడూ

రక్త వర్ణాన్ని స్ఫురింప జేస్తుంది. అందుకే ద్రోషితోస్మి-విక్రమశ్రవాత్ అని రేఫలు మూడు ప్రయోగించి పరశు రాముని ఎర్రటి బారిన కను గవ రంగు చూపుతున్నాడు. మరి అభిభూయ విభూతి మార్తవీం-మధుగంధాతి శయేన వీరుధాం అని పారిజాత పుష్ప సౌరభాన్ని వర్ణిస్తుంటే దాని గుబాళింపు సోకటంలేదా మన నాసికకు. భిభూ విభూ ధుగంధా అంటున్నప్పుడు పైకి చిమ్ముతూ వెదజల్లుతూ ఆ పరమళం వీరుధా మన్నప్పుడు నాసికా పుటంలో ప్రవేశించినట్టే అనుభూతి కలిగి తీరుతుంది. ఇలా రంగులూ వాసనలూ రుచులూ కూడా ఎన్నో చూపి తన వర్ణ రచనా శిల్పంతో మనకు విందు చేస్తాడు కాళిదాసు.

పోతే ఇక వర్ణం తరువాత పద ప్రయోగ వైచిత్రి చెప్పనే అక్కర లేదు. బుద్ధం హి రాజ్యం పద మైంద్ర మాహుః అన్నట్టు ఇంద్ర పదానికి తీసిపోని పద ప్రయోగ మా మహాకవిది. ఏ పద మెక్కడ ప్రయోగించాలో ఎలాటి పదమైతే అతుకుతుందో-ముందు వెనుక పదాలకది మిత్రుడో కాదో- ఆచి తూచి ప్రయోగిస్తాడు. అంతే కాదు. ఆ పదానికున్న అర్థాలన్నీ అక్కడ పొందు పడేలా చూస్తాడు. ప్రజాయై గృహ మేధినాం. ప్రజకోసం పెండ్లాడే వారట రఘువంశ రాజులు. ప్రజ అంటే సంతానమూ కావచ్చు పాలితులైన ప్రజలూ కావచ్చు. రాజు పెండ్లాడి ఒక యువరాజు జన్మిస్తే అది అతని వంశానికే కాదు. ప్రజా జీవనానికి కూడా అవసరమే. ఎంత బాగుందీ మాట. పైగా గృహమేధినా మట. గృహమేధినాం కావచ్చు. గృహం ఏధినాం కావచ్చు నిది. మొదటి దైతే గృహమనే మాటకు భార్య అని అర్థం. రెండవ దైతే ఇల్లూ వాకిలీ అని అర్థం. ఒక భార్యను చేసుకొంటే ఇల్లు నిలబడుతుంది. ఏ ఇల్లు. తన ఇల్లు లోకుల ఇల్లు. ఇది ఎంత బాగుందో పద ప్రయోగం. ఇదుగో ఈ శ్లోకంలో చూడండి ఇంకొక ప్రయోగం. తస్యాధికార పురుషైః ప్రణతైః ప్రదిష్టాం- ప్రాగ్ద్వార వేది వినివేశిత పూర్ణ కుంభాం-రవ్యాం రఘు ప్రతినిధి స్సనవోప కార్యాం-బాల్యాత్పరా మివ దశాం మదనో ధ్యువాస. అజ మహారాజు

స్వయంవరానికి వెళ్ళాడు. ముందు రోజు ఆయనకు విడిది గృహ మొకటి ఇచ్చారక్కడ. అందులో ప్రవేశించా డాయన. ఆ సందర్భం లోనిదీ శ్లోకం. విడిది గృహ మిందుమతి లాగే ఉందాయన పాలిటికి. ఏదీ ఎక్కడ చెప్పారీ మాట. ఒకరు చెప్పాలా. కవి నోట అప్రయత్నంగా వచ్చిన ఈ మాటలు చాలవా మనమర్థం చేసుకోటానికి. అధికార పురుషైః ప్రదిష్టాం. కన్య మీద అధికార మున్న పురుషు లెవరు. తల్లి దండ్రులు. బంధు మిత్రాదులు. వారే ఇదుగోనని చేతులలో పెట్టారు. మరావిడ ఎలా ఉందా కన్య. ప్రాగ్ద్వార వేది వినివేశిత పూర్ణకుంభాం. ప్రాగ్ద్వార మేమిటి శరీరంలో వక్షస్థలం కాక. అందులో అమర్చిన పూర్ణ కుంభా లేమిటి వక్షోజద్వయమే. అందులోనూ నవోపకార్య. ఉపకార్యమంటే పట కుటీరమని అర్థం. మరి అంతరార్థమో. ఉపకరింప బడవలసింది. అంటే దగ్గరగా చేర్చుకొని ఆదరించ వలసిందని కూడా అర్థమే. ఇంతకూ ఎలా ఆదరించాలి. రమ్యాం. రమణీయమైన దనేకాదు. రమించదగిన దని కూడా. ఇది మన మూహించనే అక్కరలేదు. ఆయనే చెబుతున్నాడు. అజుడు ప్రవేశించిన ఆ పటమందిర మేదోగాదు. బాల్యాత్పరామివ దశాం. యౌవన దశేనట. మరి ఆ అజుడో. సాక్షాత్తూ మదనుడే నట. ఇంత అభిప్రాయం మనసులో ఉంటే మరి దానికి తగిన పద ప్రయోగం చేయ వద్దా కవి. అందుకే చేసి చూపాడు.

మామూలుగా పదజాల మెక్కువ ఖర్చు పెట్టడు కాళిదాసు. శబ్దమంటే అది ఒక నిధిలాంటి దాయన దృష్టిలో. చాలా విలువైన పదార్థం దానికీ దీనికీ దుబారా చేయరాదు. అవసరాన్ని బట్టి ఎంతో అంతగానే వాడుకోవాలి. అప్పుడే దాని కందం చందం. అలాకాక డబ్బుంది గదా అని ఖర్చు పెట్టినట్టే భాష మన వశంలో ఉంది కదా అని ఎక్కడెక్కడి పదాలనూ ప్రయోగిస్తూ పోతే అది కవి చాపల్యాన్నీ ఆర్భాటాన్నీ బయటపెట్టి రోత పుట్టిస్తుందే గాని అందులో రుచి పుట్టించదు. అవసరాన్ని గమనించి అప్పుడప్పుడొక్కొక్కటిగా బయట పెడుతుంటే ఇంకా ఎంత ఉందోననీ ఆహా ఇది

ఎంత బాగా ప్రయోగించాడనీ - ఆహ్లాదం కొలుపుతుంది. ఇంతెందుకు. ఒక మాఘుణ్ణి భారవినీ భవభూతినీ భట్టహర్షుణ్ణీ చదివి తరువాత చదవండి కాళిదాసును. మీకే తెలిసి పోతుంది తేడా. వారందరూ సందర్భమున్నా లేకున్నా గురికి బారెడు మూరెడు ఎడంగా పద ప్రయోగం చేస్తుంటారు. మహాడంబరంగా ప్రయోగిస్తూ పోతారు. ఎక్కడెక్కడి నిఘంటువులూ వ్యాకరణాలూ చాలవు వారి ప్రయోగ దాహానికి. శబ్ద జాలమంతా ఒక్కసారిగా ఆపోశనం పట్టాలని వారి ఆశ. ఇలాటి అత్యాశ లేనివాడొక్క కాళిదాసే. ఇలాటి తృప్తినీ నిగ్రహాన్నీ ఆయనకూ కల్పించిన మహానుభావుడు ఆది కవి వాల్మీకి. యావదర్థ పద ప్రయోగం- యాదృగర్థ పద ప్రయోగ మనేవి రెండూ ఆయన ఈ శిష్యుడి చెవిలో చేసిన ద్వయమంత్రోప దేశం. మిగతా కవుల పాటి శబ్దజ్ఞానం లేని వాడు కాడు కాళిదాసు. ఆ మాటకు వస్తే ఎంత మధించాలో అంతగా మధించిన వాడు భాషా సాగరాన్ని. ఐతే అందులో జన్మించిన ప్రతి వస్తువునూ అత్యాశ పడి గ్రహించే వాడు కాడు. అచ్చమైన అమృత రసాన్నే పరిగ్రహిస్తాడు. అలాగని అంత సుకుమారి కాడు మరలా. అవసరమైతే హాలాహలాన్ని భక్షించమన్నా వెనుదీసే పిరికి తనం లేదాయనకు. అవసరాన్ని బట్టే ఏదైనా. ముందు దాహరించిన శ్లోకంలో మాటలు చూచారుగా. అవసరం కొద్దీ ఎంత ప్రౌఢమైన శబ్దాన్నైనా ప్రయోగించ గలడు. హర్మ్యాగ్ర సంరూఢ తృణాంకురేషు- తేజో విషహ్యాం రిపుమంది రేషు. హర్మ్యాల్లో తృణాంకురాలు మొలచిన శత్రు మందిరాల్లో నట. హర్మ్యాలు మందిరాలు ఒకటి కావా? హర్మ్యాలూ మందిరాలూ అంటా డేమిటి? ఆ మాత్రం తెలియని వాడా కవి? అలా అనుకొంటే మనమే తెలియని వాళ్ళం. అయినా ఏమని అర్థం చెప్పుకొంటారో చూతామని ఈ శబ్దప్రయోగం. మల్లినాధుణ్ణి సలహా అడిగి చూతా మేమి చెబుతాడో. అయనా మనలను చీవాట్లు పెట్టి చెబుతున్నా డర్థం. మందిరం నగరే గృహే. మందిరమంటే గృహమనీ అర్థమే నగరమనీ అర్థమే. ఇదేనేమో అరబ్బీలో మదీనా అని పేరు వచ్చింది పట్టణానికి. అప్పటికి పట్టణంలో సౌధాలని అర్థం చెప్పుకోవలసి ఉంది.

ఇలాగే ఒక చక్కని శ్లోకముంది రామ కథలో. రాముడు తాటకను బాణంతో కొట్టాడు. అది హృదయంలో నుంచి దూసుకు పోయింది. ఆ వేదనకు తట్టుకోలేక ఆ నిశాచరి జీవితేశుణ్ణే పోయి చేరిందట. రామ మన్మథ శరేణ తాడితా- దుస్సహేన హృదయే నిశాచరీ- గంధవ ద్రుధిర చందనోక్షితా- జీవితేశ వసతిం జగామ సా. రాముడనే మన్మథుడు వేశాడట ఆ బాణం. మన్మథ బాణం వేస్తే హృదయంలోనే కదా గ్రుచ్చుకొంటుంది. మామూలు బాణమూ అక్కడే కామ బాణమూ అక్కడే. హృదయమనే మాట రెంటికీ జవాబు చెబుతుంది. హృదయం మన ఉరసోః అని విశ్వం. ఉరస్సూ మనస్సూ రెండూ హృదయమే. పోతే గంధవ ద్రుధిర చందన మట. దుర్వాసన వచ్చే రక్తమే చందన మయిందట ఆ నిశాచరికి. అంటే రాక్షసికి కాదు. మంచి పరిమళం కొలిపే కుంకుమా చందనం పూసుకొన్నదట. రాక్షసా. కాదు. నిశాచరి. అంటే అభిసారిక. అదీ నిశాచరే గదా. మరి ఆ రుధిర మేమిటి. రుధిర మంటే రక్తమే కాదు. కుంకుమ కూడా నట. రుధిరం కుంకుమా సృజోః అని విశ్వకోశం. కాబట్టి ఆమాత్రం కోశ జ్ఞానం లేని వాడు కాడు మహా కవి. అన్ని కోశాలూ చూచిన వాడే. అన్ని వ్యాకరణాలూ ఆకళించిన వాడే. విద్యానాం పారదృశ్వనః. అని కదా వర్ణించాడు మహారాజులను. అలాంటి వారి సత్కారాలు పొందిన తాను పారదృశ్వ కాకుంటాడా. అయినా ఏమంటే దుర్వ్యయం చేయడు శబ్దాన్ని. కొల్లగా ఉంది ధనమని వెదజల్లడు. అలాగని లోభికాడు. అర్థ స్ఫూర్తిని బట్టి ఎంత దూరమైనా లోతుకు పోగలడు శబ్ద సాగరంలో. అక్కడి నుంచి వలసినన్ని రత్నాలు పట్టుకు రాగలడు. చూడండీ శ్లోకం. కుబేర గుప్తాం దిశ ముష్ణ రశ్మౌ గంతుం ప్రవృత్తే సమయం విలంఘ్య- దిగ్దక్షిణా గంధ వహం ముఖేన వ్యళీక నిశ్వాస మివోత్స సర్జ. అకాల వసంతోదయాన్ని వర్ణిస్తున్నాడు కుమార సంభవలో. దక్షిణ దిశను వదిలేసి ఉన్నట్టుండి ఉత్తర దిశవైపు వెడుతున్నాడు సూర్యుడు. చేసేది లేక దక్షిణ దిశ మారుతమనే నెపంతో వేడి నిట్టూర్పు విడుస్తూ కూచున్నదట. దిశలనేవి ఒక అపదేశం. దానిలో గుప్తం చేసి ఒక

కాముక వ్యవహారాన్ని సూచిస్తున్నాడు కవి. ఇందులో రెంటికీ పనికి రావాలని ప్రతి మాటా రెండు భావాలకు ద్యోతకంగా ప్రయోగించాడు. అదీ అద్భుతం. పైకేమీ కనపడదు. అయినా మాటలు చెబుతుంటాయి మనకా రహస్యం. ఉత్తర దిశ ఒక కాంత. అది కుబేర గుప్త. కుబేరుడంటే దుర్బల శరీరుడు. వాడు కాపాడు తున్నాడు దాన్ని ఎవరైనా తీసుకు పోతారేమో నని. అయినా లాభం లేదు. గంతుం ప్రవృత్తే. దాన్ని పొందాలనే తహ తహ లాడు తున్నాడు. ఎవడా పురుషుడు. ఉష్ణ రశ్మౌ. ఉష్ణ రశ్మి అట. మదనానలం చేత బాగా వేడెక్కిన వాడు. చాలా చురుకైన స్వభావ మున్నవాడు. లెక్క చేయడా బలహీనుణ్ణని అర్థం. అందుకే సమయం విలంఘ్య. మర్యాద కూడా దాటి పోతున్నాడు. సమయమనే మాట చూడండి ఎలా వాడుతున్నాడో. కాలమనీ అర్థమే మర్యాద అనీ అర్థమే. అసలు గంతుం అనే మామూలు క్రియా పదమే చూడండి. రెండర్థాలు స్ఫురిస్తాయి. గమనమంటే సంభోగమని కూడా అర్థమే భాషలో. ఇలాంటి అర్థాంతరమే మనసులో లేకుంటే ఉత్తర మనకుండా కుబేరగుప్తా మని- అయనమన కుండా సమయమనీ బొట్టుపెట్టి ఆ మాటలే ప్రయోగించటం దేనికి. అంతే గాదు. దిగ్దక్షిణా అనటంలో దక్షిణ దిశ అనే గాక దాక్షిణ్యంగల స్త్రీ అని గూడా ధ్వనిస్తున్నది. ఉత్తర దగ్గర రాదు గాని దక్షిణ దగ్గర సహజంగానే రెండర్థాలూ స్ఫురిస్తాయి. అలా స్ఫురించే చోట డొంక తిరుగుడుగా చెప్పడు కవి. వదిలేస్తాడు. శబ్ద ప్రయోగంలో ఇంతటి ఔచిత్య మెరిగిన ఓకోవిదు డాయన.

అసలింకో మాట. వాడిన శబ్దమే మరలా వాడట మిష్టం లేదాయనకు. సమర్థుడైన రచయిత కెవడికీ ఇష్ట ముండ దలా ప్రయోగించటం. అది పాఠకుడికి విసుగు పుట్టిస్తుంది. అయితే ఒక వస్తువు పదే పదే ప్రస్తావించ వలసి వస్తుంది కావ్యంలో. అలాంటప్పు డాశబ్దాని కెన్ని పర్యాయాలున్నవో అన్నీ తడవి చూచి సమయోచితంగా ప్రయోగించాలని చూస్తాడు కవి.

అందులో కూడా సిద్ధ హస్తుడే కాళిదాసు. దిలీపుడు నందినీ ధేనువును సేవించిన ఘట్టంలో ఆ గోవును ఏడెనిమిది చోట్ల చెప్ప వలసి వచ్చింది. వస్తేఒక చోట ధేనువని ఒక చోట గోవని ఒక చోట గృష్టి అని మరొక చోట పయస్విని అని ఇంకొక చోట సౌరభేయి కుండోధ్ని ఘటోధ్ని అని మాటి మాటికీ మారుస్తూ పోతాడు. సీతా దేవి మీద లోకు లపవాదం వేస్తే అది మహాకవి కలంలో అపవాద పరివాద కళంక వాచ్య అవర్ణ కౌలీన నిర్వాద- ఇన్ని రూపాలలో అవతరిస్తుంది. చెప్ప వచ్చిందేమంటే అలా పర్యాయాలు వాడటంలో కొన్ని కొన్ని రూపాలు ఎక్కడో కోశ గ్రంథాల నుంచి అపురూపంగా పట్టుకు వచ్చినవి కూడా అయి ఉంటాయి. దీన్ని బట్టి కవి నిఘంటు జ్ఞానం కూడా మనకు తేట పడుతుంది. పదాలూ పర్యాయ పదాలూ- వీటి మాట అలా ఉంచి అసలు పద బంధాలని ఒక జాతి ఉంది రచనలో. అవి మహా కవుల రచనలో గాని మనకు దర్శన మీయవు. పదాల నెవరూ సృష్టించరు. అన్నీ భాషలో సిద్ధమైనవే. కాని వాటినే రక రకాలుగా మేళవించి ప్రయోగిస్తే సరికొత్త పదాలుగా భాసిస్తాయి. రత్న శలాకల లాగా ఏవో క్రొత్త క్రొత్త మెరుగులు చిమ్ముతాయి. ఈ విద్యలో ఆరి తేరిన ముక్కాకలు తీరిన కళాకారుడు కాళిదాసు. పానకంలో మిరియం లాగా లడ్డులో పచ్చ కర్పూరంలాగా హల్వాలో జీడి పప్పులాగా- అప్పుడప్పుడూ రసజ్ఞుల జిహ్వకు సోకుతూ అనిర్వచనీయమైన ఒక అనుభూతిని అసలు అర్థంకన్నా ముందుగా శబ్దమే ప్రసాదిస్తుంటుంది. దీని కెన్నైనా చూపవచ్చు ఉదాహరణలు. మణులూ మాణిక్యాల లాగా విలువైన పద బంధాలు కొన్ని వందలున్నాయి కాళిదాసులో. అందులో కొన్ని నా చేతికి వచ్చినవి మీ చేతి కందిస్తాను ఆనందించండి. విరహ గురుణా- పుణ్యోదకేషు - చంద్రికా ధౌత - శ్రోత్ర పేయం - మయూఖ ప్రరోహ - పరిమళో ద్గారి - సూచి భేద్య - ముక్త మార్గ - మిత కథే - భక్తి నమ్ర - అర్చిస్తుంగాః ప్రదీపాః - రుదితోచ్ఛూన నేత్ర - దృష్టి రాలుప్యతే - సాంతర్హాసం - పయోధర విస్తారయిత్రు - ఉన్మద యిత్రు యౌవనం - స్పర్శ క్షమా - పరిణత చంద్రికా

- సులభ విపదః - సన్యస్తా భరణా - వారిగర్భ - శిశిర మధితా - ప్రభా తరళా - ఆత్మాపహార - నేత్ర నిర్వాణ - గర్భ మంథరా - హస్త ప్రాప్య - అపరిచ్ఛేదాకుల - స్వభావోత్తాన హృదయ - తేజోలిప్త - ఆతపచ్ఛేద - హృత హృదయ - స్మృతిశైథిల్య - సాంద్ర కుతూహల - రణశి రసి- కృతాభిమర్శ - ఆర్యం మనః - విగళిత శుచః - ధూతోద్యాన - స్తిమిత నయన - ఆమోద మైత్రి - ఆశ్లిష్ట సాను - అలస గమనా - శిథిల సౌహార్ద - స్పర్శ లోభా - శుద్ధ శీలా - స్వాధీనోపాయ - ఇలాంటివి కుప్పతెప్పలూ కోకొల్లలు. చదువుతుంటే ప్రాత పడ్డవని గాక ఏవో క్రొత్త మాటలు వింటున్నా మన్న అనుభూతి నిస్తాయివి.

ఇలాటి పద బంధాలే గాక ఎన్నో లోకోక్తులు సామెతలు కూడా ప్రయోగిస్తాడు యథావకాశంగా. క్రియా పదాలు కూడా మామూలుగా గాక క్రొత్త పంథాలో వాడి చూపుతాడు. మందాయతే చిరాయతే వత్సలయతి పిశునయతి దీర్ఘీకరోతి పాత్రీ కరోతి శబ్దాపయతి గృహీభవతి - పరిహీయతే గమనవేళా - వ్యధినా లంఘితః - ఖిలీ భూతః మందీ కృతః మోఘీచకార- ఇలాటివెన్నో చమత్కారాలు. సామెత లన్నందుకు గుర్తు వస్తున్నది. పద శిల్ప మైన తరువాత మనం కాళిదాస కవి వాక్య శిల్పం కూడా దర్శించ వలసి ఉంది. వాక్య రచనా పాటవమూ సౌష్ఠవమూ కావ్యాలలో చెప్పుకోవటం కష్టం. కారణ మేమంటే అవి పద్య కావ్యాలు. పద్యాలలో కూడా వాక్య రచన చూడ వచ్చు గాని అంత బాగా బయట పడదది. ఆయన గారి వాక్య రచనా విభూతి చూడాలంటే నాటకాలలోనే చూడాలది. నాటకంలో పద్యా లక్కడక్కడా వచ్చినా ప్రధానంగా గద్యంలోనే సాగుతుంది రచన అంతా. అదీ కొంత సంవాదాత్మకంగా కొంత వర్ణనాత్మకంగా కొంత స్వగత రూపంగా. అక్కడ చూపాడు కాళిదాసు విజృంభించి తన భాషాధికారాన్ని సౌందర్యాన్ని. అసలు వాల్మీకి తరువాత సంస్కృతమంటే ఏమిటో తెలిసిన వాడు కాళిదాసే. ఆయన కాలానికి సంస్కృతం బాగా ప్రచారంలో ఉంది. విద్వద్గోష్ఠులు రాజాస్థానాల్లోనే

గాక ప్రజా బాహుళ్యంలో కూడా విశృంఖలంగా తిరిగి పట్టుకొని ఉంటాడు భాషా హృదయాన్ని మహా కవి. ఒక భాష తన మాతృ భాషగా గలవాడు గొప్ప విద్వాంసుడై అందులోనూ మహా కవి అయి రచిస్తుంటే ఎలా ఉంటుందో ఉండాలని మన మూహిస్తామో అలాగే అంత సహజంగా సుందరంగా సరళంగా అనన్య సాధ్యంగా ఉంటుం దాయన వాక్య శిల్పం. అలాంటప్పు డిక ఆ భాషలోని సామెతలూ నుడికారాలూ అంద చందాలూ సహజంగానే చోటు చేసుకొని తీరుతాయి. వాక్య రచనలో తరువాత దండి సుబంధు బాణాదు లెంతగానో అంద చందాలు చూపటానికి యత్నించారు చూపారు గాని అవి కాళిదాసు చూపినంత సహజంగా చూపట్టవు. ఎంత సహజమో అంత కృత్రిమం కూడా వారి రచన. అంతా సహజం కాళిదాసుది. అంతే గాక కాళిదాసులో ఒక ఇంద్రజాల మున్నది. అది వారిలో లేదు. అదేమంటే కవితా శిల్ప కాంతులు కూడా చిమ్ముతుంటాయి వాక్యాలు. అవి పానకంలో గుడ మాధుర్యంలాగా ఎంతో హాయినిస్తాయి. బాణాదులు కూడా దాన్ని కొంత సాధించక పోలేదు. కాని వారి కది కాళిదాసు పెట్టిన భిక్షే. స్వల్పంగా వ్రాసినా కాళిదాసు వచనం వారిచేత అనల్పమైన వచన రచన చేయించిందని చెప్పవచ్చు.

ప్రస్తుతం మహా కవి వాక్య నిర్మాణ రాసిక్య మెలాంటిదో కొంత తడవి చూద్దాము. మాళవికలో విదూషకుడికీ రాజుకూ జరిగిన సంభాషణ. భో వయస్య - న కేవలం రూపే శిల్పేపి అద్వితీయా మాళవికా. వయస్య కిం బహునా చింతయితవ్యోస్మి . నాగురించి ఆలోచించు మరి. విదూ - భవతాప్యహం నా గురించి నీవుకూడా. దృఢం విపణి కందురివ మే హృదయాభ్యంతరం దహ్యతే - వీధి హోటల్లో పెనంలాగా నా కడుపు ఆకలి తో మండిపోతున్నది. రాజా - ఏవమేవ భవా సుహృదర్థే త్వరతాం. ఇలాగే నీ మిత్రుడి విషయంలో త్వర పడాలి సుమా. విదూ- గృహీత క్షణోస్మి. గ్రహించా నీ కుతూహలం. కింతు మేఘావలీ నిరుద్ధ జోత్స్నేవ పరాధీన దర్శనా తత్ర భవతీ మాళవికా. కాని మబ్బు చాటున వెన్నెలలాగా పరాధీన అయి ఉన్నదా

మాళవిక. భవనపి సూనా పరిసర చర ఇవ గృధ్రః నీవో కసాయి దుకాణం చుట్టూ తిరిగే గ్రద్దలాగా ఆమిష లోలుపో భీరుకశ్చ. నోట్లో వేసుకోవాలని చూస్తావే గాని పిరికివాడివి. తస్మా దనాతురో భూత్వా కార్య సిద్ధిం ప్రార్థయ మానో మే రోచసే. అంచేత ఊరక ఆరాట పడక కార్యం ఫలించేదాకా ఓపిక పట్టివుంటే నాకు నచ్చుతావు. శాకుంతలంలో అనసూయాదుల మరొక సంభాషణ వినండి. హలా శకుంతలే అత్రైవ తావన్ముహూర్తం తిష్ఠ. ఓసీ శకుంతలా ఇక్కడ కొంచెం సేపు నిలుచో. యావత్త్వయోప గతయా లతా సనాథ ఇవ కేసర వృక్షః ప్రతిభాతి. నీవు దగ్గర చేరితే లతతో కూడినట్టు కనిపిస్తుంది ఈ పొగడ చెట్టు. శకుం - అతః ఖలు ప్రియంవదాసి త్వం. ఇందుకే గదే నీవు ప్రియంవద వయింది. దుష్యం - ప్రియమపి తథ్య మాహ ప్రియంవదా. ప్రియమైనా నిజమే చెప్పింది ప్రియంవద. అన - ఏ నాం నవమాలికాం విస్మృత వర్త్యసి. ఈ నవ మాలికను మరచిపోయావే శకుంతలా. శకుం - తదా ఆత్మానమపి విస్మరిష్యామి. అలాగైతే నన్ను నేనే మరచాననుకో. ప్రియం - అనసూయే జానాసి కిం శకుంతలా వన జ్యోత్స్నా మతి మాత్రం పశ్యతీతి. అనసూయా శకుంతల ఆ వన జ్యోత్స్నను ఎందుకలా తదేక దృష్టితో చూస్తున్నదో తెలుసా. అన - న ఖలు విభావయామి కథయ. తెలీదు చెప్పు ఎందుకో. ప్రియం - అపి నా మైవ మహా మపి ఆత్మనోను రూపం వరం లభేయ. దీని మాదిరే నేనూ నాకు తగిన భర్తను పొందితే బాగుండునని. శకుం - ఏష నూనం తవాత్మ గతో మనోరథః. ఏయ్ ఇది నీ మనసులో ఉన్న కోరికే సుమా. దుష్యంతుడు నిరాకరిస్తే శకుంతల అనే మాట వినండి. అనార్య ఆత్మనో హృదయాను మానేన పశ్యసి. క ఇదానీం అన్యో ధర్మ కంచుక ప్రవేశినః తృణఛన్న కూపోపమస్య తవాను కృతిం ప్రతి పత్స్యతే. తావదత్ర స్వచ్ఛంద చారిణీ కృతాస్మి యాహ మస్య పురువంశ ప్రత్యయేన ముఖ మధోః హృదయ స్థిత విషస్య హస్తాభ్యాశ ముపగతా. దుష్యంతుడు తృణచ్ఛన్న కూపం లాంటి వాడు. ధర్మమనే కవచం కప్పుకొన్న వాడట. ముఖంలో తేనె

హృదయంలో విషం దాచుకొన్నవాడట. అలాంటి వాడని తెలియక అన్యాయంగా అతడి చేతికి చిక్కానంటుంది.

తరువాత ఒక చేపలు పట్టే బెస్తవాడి కుంగరం దొరుకుతుంది. రాజభటులు వాణ్ణి పట్టుకొంటారు. వారి మధ్య జరిగిన సంవాదం వినండి. కథయ కుత్ర సమాసాదిత మంగులీయకం. ప్రసీదంతు భావమిశ్రాః అహం నే దృశ కర్మ కారీ. కిం శోభనో బ్రాహ్మణ ఇతి కలయిత్వా రాజ్ఞా ప్రతి గ్రహో దత్తః శృణుతేదానీం. అహం శక్రావతారా భ్యంతర వాపీ ధీవరః - పాటచ్చర కిమస్మాభిః జాతిః పృష్టా శాలః- సూచక కథయతు సర్వ మనుక్రమేణ మైనమంతరే ప్రతిబంధయ. యదావుత్త ఆజ్ఞాపయతి. కథయ. అహం జాలోద్గాలా దిభిః కుటుంబ భరణం కరోమి. విశుద్ధ ఇదానీ మాజీవః. పశ్చాదహం తస్య విక్రయాయ దర్శయన్ గృహీతో భావ మిశ్రైః. మారయత వా ముంచత వా. అయమస్యా గమ వృత్తాంతః. భావుక చిరాయతే ఖల్వావుత్తః. నన్వవసరోప సర్పణీయా రాజానః. ఏష నః స్వామీ పత్ర హస్తో రాజ శాసనం ప్రతీక్ష్య ఇతో ముఖో దృశ్యతే. గృధ్ర బలిర్భవిష్యసి. శునో ముఖంవా ద్రక్ష్యసి. సూచక ముచ్యతా మేష జాలోపజీవీ. ఏష యమ సదనం ప్రవిశ్య ప్రతి నివృత్తః. అథ కీదృశో మ ఆజీవః. ఏష భర్త్రా అంగులీయక మూల్య సంమితః ప్రసాదోపి దాపితః. ఏష నామాను గ్రహో యచ్ఛూలా దవతార్య హస్తిస్కంధే ప్రతిష్ఠాపితః. ఇతోర్ధం యుష్మాకం సుమనో మూల్యం భవతు. ధీవర మహత్తరః ప్రయ వయస్యక ఇదానీం మే సంవృత్తః కాదంబరీ సఖిత్వ మస్మాకం ప్రథమతోభిమతం విద్యతే. తచ్ఛౌండిక మాపణమేవ గచ్ఛామః. ఈ సంభాషణలో ఎంత సంస్కృత నుడికారమో జాతీయమో లోకోక్తులో నానుడులో లెక్క పెట్టలేము వెల కట్టలేము. మేము వివరించి చెప్పటం కన్నా మీరు నాటక వ్యాఖ్యానం చదివి గ్రహించటమే మంచిది.

విదూషకుడి ఈ స్వగతం వినండి. భో దృష్టం ఏతస్య మృగయా శీలస్య రాజ్ఞో వయస్య భావేన నిర్విణ్ణోస్మి. అయం మృగోయం వరాహోయం

శార్దూల ఇతి మధ్యాహ్నేపి గ్రీష్మ విరళ పాదప చ్ఛాయాసు వన రాజీషు ఆహిండ్యతే అటవీ తోటవీం. పత్ర సంకర కషాయాణి కటూని గిరి నదీ జలాని పీయంతే. అనియత వేలం శూల్య మాంస భూయిష్ఠ ఆహారో భుజ్యతే. తురగానుధావన కండిత సంధే రాత్రావపి నికామం శయితవ్యం నాస్తి. తతో మహత్యేవ ప్రత్యూషే దాస్యాః పుత్రైః శకుని లుబ్ధైః వనగ్రహణ కోలాహలేన ప్రతిబోధితోస్మి. ఇయతే దానీ మపి పీడా న నిష్క్రామతి. తతో గండస్యోపరి పిటకః సంవృత్తః. హ్యః కిల అస్మాసు అవహీనేషు తాపస కన్యకా శకుంతలా మమ అధన్యతయా దర్శితా. సాంప్రతం నగర గమనస్య మనః కథమపి న కరోతి. అథాపి తస్య తామేవ చింతయతః అక్ష్ణోః ప్రభాత మాసీత్. కా గతిః. ఏష ఇత ఏవ ఆగచ్ఛతి ప్రియ వయస్యః. భవతు అంగ భంగ వికల ఇవ భూత్వా స్థాస్యామి. యద్యేవ మపి నామ విశ్రామం లభేయ. ఇదీ పైదాని లాంటిదే. సంస్కృత వాక్య సౌష్ఠవమంతా మూట గట్టిన మాటలు.

ఇలాగే రాజుగారి స్వగతం కూడా ఒకటి చిత్తగించండి షష్ఠాంకంలో. పత్ర మనువాచ్య – కథం – సముద్ర వ్యవహారీ సార్థవాహో ధనమిత్రో నామ నౌ వ్యసనే విపన్నః. అనపత్యశ్చ కిల తపస్వీ. రాజ గామీ తస్యార్థ సంచయ ఇత్యేత దమాత్యేన లిఖితం. కష్టం ఖల్వన పత్యతా. బహుధనత్వాత్ బహు పత్నీకేన తత్ర భవతా భవితవ్యం. విచార్యతాం యదికాచి దాపన్న సత్వా తస్య భార్యాసు స్యాత్. నను గర్భః పిత్ర్యం రిక్థ మర్హతి. గచ్ఛ ఏవ మమాత్యం బ్రూహి. చూచారా ఈ వాక్య రచనా కౌశలం. ఇలా ఆయా సందర్భాల కనుగుణమైన పద జాలంతో లోకోక్తులతో చక్కని నుడికారంతో సహజ సుందరంగా ఎంత దూరమైనా వ్రాస్తూ పోగలడు. చదువుతూ పోతే ఏమాత్రం విసుగనిపించదు సరి గదా ఇంకా వాక్య మెలాంటిది వస్తుందో ఎలా మలుపు తిరుగుతుందో ఏ చక్కని ప్రయోగం కనిపిస్తుందో చూతామనే కుతూహలం రేకెత్తుతూ పోతుంది. అనువాద మన్నిటికీ మేము చేయకున్నా విమర్శకులు నాటకానువాదాన్ని చదివి స్వయంగా తెలుసుకొని సంతోషించ గలరు.

పోతే ఇక ఆఖరి సారిగా మనం చవి చూడవలసిన దాయన గారి ఛందస్సౌందర్యం. ఇది అన్నిటికన్నా అతిలోకమైనది. సంగీతానికి రాగాల లాంటివి కవిత్వానికి ఛందస్సులు. ఏ రాగంలో ఏ పాట కట్టినా కట్ట వచ్చు. కాని ఏ భావాని కేది సరి పడుతుందో ఆ భావ స్ఫూర్తి నది చక్కగా మన కందిస్తుందో లేదో తెలిసి కూర్చిన వాడే గొప్ప వాగ్గేయ కారుడు. త్యాగరాజాదులు వాగ్గేయ కారులని పేరు పడశారంటే ఇలాంటి గాన కళా హృదయాన్ని పట్టు కొన్నందు మూలాన్నే. అలా కాకుంటే సరిపోయినా లేకున్నా ఏదో ఒక బాణీలో ఒక పాట కట్టి దానికీ దీనికీ పొంతన లేక సారస్యానికి బదులు వైరస్యానికే దారితీసేది. అలాగే కవితా రంగంలో కూడా రాగాల లాగానే ఎన్నో ఉన్నాయి ఛందస్సులు. కొన్ని వందలున్నాయి. అనుష్టుప్పు మొదలు కొని స్రగ్ధరా వృత్తం దాకా ఉన్నాయి. దేనిలో అల్లినా అల్లవచ్చు నొక శ్లోకం. అన్నిటికీ నాలుగేసి చరణా లుంటాయి. ప్రతి చరణానికీ నియతంగా కొన్ని గణాలుంటాయి. యతి స్థానమూ ఉంటుంది. ఈలాటి హంగుల కేమీ లోపం లేదు. అవి తెలియని కవీ లేడు. ఏ వృత్తంలో ఏ భావం చెప్పినా ఆ వృత్తం దాన్ని కాదనదు. కాని ఏ భావాని కే ఛందస్సు వాడితే అందంగా సముచితంగా ఉంటుందో గుర్తించటమే కష్టం. దానికెంతో భావనా అభిరుచీ అనుభవమూ ఉండాలి కవికి. ఇతిహాస కవికన్నా కావ్య కవి కది బాగా అలవడి ఉండాలి. భారత రామాయణాలు మహర్షులు రచించారంటే చాలా వరకు వస్తు ప్రధానంగా నడచింది వారి రచన. అది కథ ధర్మ బోధ - రెండు విధాలా సాగింది. రెండింటికీ పనికి వచ్చే ఛందస్సేదో అదే స్వీకరించారు వారు. అదే అనుష్టుప్ఛందస్సు. శుక్లాం బరధరం అనే శ్లోకం లాంటిదది. కథ కథనానికి ధర్మ ప్రబోధానికీ చక్కగా సరిపడు తుందీ ఛందస్సు. చిన్న వృత్త మిది. ఎక్కువ తక్కువలు లేకుండా చెప్పవలసిన దాన్ని సూటిగా క్లుప్తంగా చెప్ప వచ్చు నిందులో. పైగా ఒకే ఛందస్సులో నడుస్తూ పోతే కథ వస్తువులో ఒక గాంభీర్యం కూడా చోటు చేసుకొంటుంది. మార్పు లేకుంటే విసుగు పుట్టదా అని అడగ వచ్చు. అది కూడా గమనించారు వారు. అందుకోసం ఒక్కొక్క

సర్గాంతంలో వృత్తం మారుస్తూ కూడా పోతారు. సర్గ మధ్యంలో కూడా అక్కడక్కడా ఛందోభేదం కనపడుతుంది. భారతంలో నైతే మొదట మొదట గద్య రచన కూడా కనిపిస్తుంది. తరువాతి కావ్య గద్య కేమాత్రమూ తీసిపోదు సరి గదా వాటికన్నా ధాటిగా సహజ సుందరంగా సాగుతుంది. పోతే ఇక వాల్మీకి ప్రతి కాండ ప్రతి సర్గ చివర అనేక వృత్త భేదాలు ప్రదర్శించాడు. కొన్ని సర్గలు సర్గలు సరికొత్త ఛందస్సులలో నడిపాడు. సమయోచితంగా రసభావోచితంగా ఛందస్సు మారుస్తూ పోవాలనే సందేశం ఆయనే అసలు కాళిదాసు కంద జేసింది.

మరి కాళిదాసన్నారో ఆయన ఇతిహాస కవి కాడు. కావ్య కవి. ఐతిహాసిక కవులకే ఇంత అభిరుచి ఉంటే ఆయన సంగతి చెప్పన క్కర లేదు. గురువు గారు కొంచెం త్రాగమంటే శిష్యుడు పాత్ర నంతా ఖాళీ చేసి కూచున్నాడు. ఒకటి గాదు రెండు గాదు. ఎన్నో ఛందస్సులు వాడాడు తన కావ్యాల్లో. అనుష్టుప్పు ఉపజాతి వంశస్థం ఇంద్ర వజ్ర ఉపేంద్ర వజ్ర వసంత తిలక ప్రహర్షిణీ పుష్పితాగ్ర వియోగిని రథోద్ధత మందాక్రాంత స్రగ్విణి శిఖరిణి శార్దూల స్రగ్ధర ఇత్యాదిగా రంగు రంగుల వృత్తాలలో పొదిగి చూపాడు తన భావ రత్నాలను. ఐతే తాను పట్టు కొన్నది కావ్య మార్గం కాబట్టి దాని కనుగుణమైన ఒక బాణీ కల్పించుకొన్నాడు. అదేనుంటే ఒక్కొక్క సర్గ ఒక్కొక్క ఛందస్సులో నడపటం. ప్రతి సర్గాంతంలో ఛందస్సు మార్చి ఒకటి రెండు శ్లోకాలు రచించటం. ఈ మాత్రమే కాదు. ఇది మిగతా కావ్య కర్తలు కూడా పాటించిందే. అయితే వారందరికీ ఆద్యుడు కాబట్టి ఆయనకీ కితాబు మనమిచ్చినా పరవా లేదనుకోండి. దాన్ని మించిన నైపుణ్య మెక్కడ ఉందంటే ఈ మహా కవిలో - సరిగా త్యాగరాజ స్వామి కున్న నైపుణ్యమే అది. త్యాగయ్య ఏ రాగంలో ఏ భావ మావిష్కరిస్తాడో దాని కారాగం తప్ప మరొకటి పనికి రాదనిపిస్తుంది. అలాగే కాళిదాసు ఇన్ని వందల ఛందస్సులలో

ఏ ఘట్టాని కేది సరి పడుతుందో అతుకుతుందో దుర్భిణీ వేసి తీసుకొంటాడు.

ఇన్ని ఛందస్సులున్నా అందులో కథా భాగాన్ని నడపటానికి మామూలుగా ఇతిహాసాలలో లాగా అనుష్టుప్పునే తీసుకొంటా డాయన. రఘు వంశంలో చూడండి దానితోనే కథ ఆరంభ మవుతుంది. అది మరీ బోరు కొడుతుం దనిపిస్తే ఉపజాతి వృత్తమో వంశస్థ వృత్తమో పట్టుకొంటాడు. ద్వితీయ సర్గలో ఒకటి తృతీయ సర్గలో ఒకటీ కనపడుతుంది. కథ కొంచెం ఊపందుకొన్నా వర్ణనాత్మకంగా సాగినా అనుష్టుప్పు వదిలేసి వీటిని పరిగ్రహిస్తాడు. కుమార సంభవంలో చూడండి హిమద్వర్ణనతో మొదలైంది కథ. అంచేత ఉపజాతి తోనే మొదలయింది సర్గ. మరి మేఘసందేశంలో చద్ది కన్నా ఊరగాయ ఎక్కువని కథ పదివంతులైతే వర్ణన తొంభై వంతులు. అంచేత మొత్తం కావ్యమంతా మందాక్రాంతతో నడచింది. మందాక్రాంత కరుణ రసానికి పనికి వస్తుంది శృంగారానికీ పనికి వస్తుంది. యక్షుడి విప్రలంభ శృంగారానికి తగినట్టే ఎన్నుకొన్నాడీ ఛందస్సు కాళిదాసు. ఈ వృత్తం ప్రతి పాదమూ మూడు విరుపులతో నడుస్తుంది. మందం మందం - నుదతి పవన - శ్చానుకూలో యథా త్వాం. మంద్ర మధ్య తార స్వరాల కనురూపమైన రచన. పోతే మేల్కొలుపు గీత లెక్కడైనా ఆలపించ వలసి వస్తే అందు కోసం సర్గ మధ్యలో నైనా ఛందస్సు మారుస్తాడు కవి. అది ఏదో కాదు . వసంత తిలక. సుప్రభాతానికి దీనిలాగా సూటయ్యేది వేరొకటి లేదు. బహుశా ఉషః కాలోచితమైన మలయ మారుత రాగంలో సాగాలని ఆయన ఉద్దేశం కూడా అయి ఉంటుంది. రఘు వంశంలో అజుణ్ణి మేల్కొలిపే ఘట్టమీ వృత్తంలోనే నడుస్తుంది. కాళిదాసు చుట్టిన వరవడేనేమో అప్పటినుంచీ ఇప్పటిదాకా సుప్రభాత స్తోత్రాలన్నీ ఈ వసంత తిలకలోనే రచిస్తున్నారు రచయితలంతా.

పోతే ప్రేయసీ ప్రియుల సురత క్రీడను వర్ణించటానికి రథోద్ధతా వృత్తాన్ని అందుకొంటాడు కాళిదాసు. అది ఎంతో ఉత్సాహంగా సాగే వృత్తం.

ఆ సందర్భంలో కావలసిం దదే కదా. ఎవరో కాదు సాక్షా జ్జగజ్జననీ జనకులే పురాణ దంపతులే కోరుకొన్నారా వృత్తాన్ని. కాగా ఇక వియోగ దుఃఖాన్ని ఎక్కడ వర్ణించాలన్నా ఉండనే ఉంది వియోగిని అనే వృత్తం. దాని పేరే వియోగిని. దాని నడక చూస్తే వియోగాన్ని చెప్పటానికే పుట్టిందా అని తోస్తుంది. రతి విలాపమూ అందులోనే వర్ణించాడు కవి - అజ విలాపమూ అందులోనే సాగించాడు. గృహిణీ సచివ స్సఖా మిథః - ప్రియ శిష్యా లలితే కళా విధౌ - కరుణా విముఖేన మృత్యునా - హరతా త్వాం వద కిం న మే హృతం. నోరు తెరచి బావురు మన్నట్టే ఉంది. అజ విలాపంలోనే వసిష్ఠ ముని సందేశం వినిపిస్తుంది. అది కూడా ఈ వృత్తంలోనే నడుస్తుంది. బహుశా అజుని విరహాగ్నిలో పడి అది కూడా వియోగినీ వర్ణం ధరించిందేమో. నిజంలో కూడా అంతే. ఎందుకంటే ఆ వేదాంతం ఆ రాజు మనసు మీద ఏమీ పని చేయలేదనే ఆ సర్గ ముగించాడు కవి. పోతే రెండు స్రగ్ధరా వృత్తాలు కనిపిస్తాయి. ఒకటి శాకుంతలంలో మరొకటి మాళవికలో. రెండూ నాందీ శ్లోకాలే. పారమేశ్వరమైన విభూతిని వర్ణించేవే. గంభీరోదాత్తంగా సాగే ఛందస్సు స్రగ్ధర అంటే. మరి వస్తువు కూడా ఉదాత్త గంభీరమే కదా. కనుకనే దాని కను గుణమైన పరి గణన.

కాగా చివరగా చెప్పుకో వలసిందొక అద్భుతమైన సన్నివేశ ముంది. అది రఘు వంశంలో దశరథుడి వేట వర్ణన. నవమ సర్గలో వస్తుందది. దాన్ని ద్రుత విలంబిత వృత్తంతో నడుపుతాడు కవి. ద్రుత విలంబిత గతులు రెండూ ఓత ప్రోతమై చిత్రంగా సాగే ఛందస్సిది. వేట అలాగే గదా సాగుతుంది. పోతే సర్గ అంతా దానితోనే సాగదు. సర్గ మధ్యంలో నానా విధ చ్ఛందస్సులు చోటు చేసు కొన్నాయి. అవన్నీ అయిన తరువాత మరలా ఒకటి రెండు ద్రుత విలంబితాలు మాత్రమే దర్శన మిస్తాయి. మిగతా ముగింపు శ్లోకాలన్నీ మరలా భిన్న వృత్తాలలోనే సాగిపోతాయి. ఏమిటీ నానా గోత్ర వ్యవహారం. ఇందులోనే కనిపిస్తుంది కాళిదాసు వృత్తౌచిత్య పాలనా చాతుర్యం.

మృగాల వేటగదా అది. మృగాలంటే అనేక ముంటాయి అడవిలో. అనేక స్వభావా లుంటాయి వాటికి. వాటి స్వభావాన్ని బట్టి వాటినేక విధాలుగా వేటాడాలి రాజుగారు. అలాగే ఆడుతూ వచ్చాడు. ఆ వేటాడే వైవిధ్యాన్ని కళ్ళకు కట్టినట్టు చూపాలంటే ఛందో బంధంలో కూడా వైచిత్ర్యాన్ని చూపాలి కదా. అందుకే యాభైనాలుగు శ్లోకాల వరకూ ద్రుత విలంబితంలో ఊగుతూ జోగుతూ నడచిన రచన హరిణ మృగా లెదురయ్యే సరికి వసంత తిలకగా మారింది. వరాహాలనూ ఖడ్గ మృగాలనూ కూడా కలుపుకొంది. వ్యాఘ్రాల దగ్గర అది భీకర రూపంలో గ్రీష్మ తిలకగా సాగింది. ఏదో తాడో పేడో తేల్చు కొందామని శాలినీ వృత్తంతో చేతులు కలిపింది. వచ్చిందా తరువాత ఒక మదగజ యూథం. మదేభం గదా మంద గంభీరంగా నడవాలి మరి వృత్తం. తాన్ హత్వా గజ కుల బద్ధ తీవ్ర వైరాన్ అంటూ నడవ సాగింది. దాన్నీ దెబ్బ తీసి వెడుతుండగా చమరీ మృగా లెదురయ్యాయి. చెంగు చెంగున గంతు లేస్తున్నాయవి. ఎలా పట్టుకోవాలి. అందుకే గుఱ్ఱాన్ని కూడా గంతు లేయించింది వృత్తం. చమరాన్ పరితః ప్రవర్తితాశ్వః. బాణం లాగే టపుడు మాత్రం సాగదీసింది మళ్ళీ. క్వచిదా కర్ణ వికృష్ట భల్ల వర్షీ. మరి నెమళ్ళు కంట బడ్డాయి. బెదరి ఆకాశంలోకి ఎగిరి పురులు విచ్చి కనిపించాయి. పురివిప్పిన పద్యమే మాలిని గుర్తుకు వచ్చింది మహా కవికి. అపి తురగ సమీపా దుత్పతంతం మయూరం. వెంటనే శ్రమ అని పించింది. చెమట పట్టింది దశరథుడికి. అందుకే రథోద్ధత. ఆ వెంటనే సలలిత కుసుమ అంటూ పుష్పితాగ్ర. ఆ వెనుకనే జరుగబోతున్న దొక ఉపద్రవం. అందుకే వియోగిని తారసిల్లింది. బాణం స్వాగతం చెప్పింది ముని బాలుడికి తరువాత స్వాగత వృత్తంలో. బాణం ప్రాణం తీసింది. అందుకే మరలా వియోగిని. హా తాతేతి ఆక్రందించాడు మత్త మయూరంలో. జరిగినదానికి వగచి జంకుతూ కొంకుతూ నెమ్మదిగా బయలు దేరాడు దశరథుడు. అంత నెమ్మదిగానే అతని వెంట నడచింది వసంత తిలక. కాళిదాసుని ఇలాటి కళా సౌరభా లన్నిటినీ గమనించే బహుశా తిక్కన సోమయాజి స్త్రీ పర్వంలో స్త్రీల

దీనాలాప వైచిత్రిని చూపటానికి ఇలాగే ఛందో వైచిత్రిని పాటించాడ అని పిస్తుంది. మొత్తానికి ఒక ఛ్ఛందస్సే మిటి వాక్య నిర్మాణ మేమిటి పద విన్యాస మేమిటి . ఇది అది అనే ప్రశ్న లేదు. తృణం మొదలు దేవతార్చన వరకు ఏదీ ఊరక పోనివ్వడు కాళిదాసు. అటు భావంలో గాని ఇటు భాషలో గాని ఏ ఒక్క కోణాన్ని చూచినా సౌందర్య ధుర్యమైన దృక్కోణంతోనే చూచాడు. ఏది వర్ణించినా ఆ దృష్టితోనే వర్ణించాడు. అంతా రామ మయం అన్నట్టు కావ్య ప్రపంచమంతా సౌందర్యమయమే ఆ మహా కవికి.

Yallamraju Srinivasa Rao
Brahmasri
www.advaitavedanta.in

# సామరస్య ప్రత్యభిజ్ఞ

మన మింత వరకూ మహా కవి తాత్త్విక చింతనా - దాని కనురోధిగా సాగిన కావ్య రచనా - అందులో అడుగడుగునా ఆయన ప్రదర్శించిన సౌందర్య శిల్పమూ - యథా శక్తిగా తడవి చూచాము. దీనిని బట్టి ఈ పాటికే మన మర్థం చేసుకొని ఉండ వచ్చు ఆ కళాకారుడి స్వరూప మేమిటో - ఆయన ఈ మానవ లోకాని కందజేసే సందేశ మేమిటో. ఒక్క మాటలో ముక్తసరిగా చెబితే సామరస్యమే ఆయన తన జీవితంలో అందుకొన్నదీ మనబోటి సహృదయుల కందించిందీ. మరేదీ కాదు. అదే ఆయన జీవితం. అదే ఆ మహనీయుడి కావ్య జీవితం కూడా. సామరస్య మనగానే నాకు దేవీ నామావళి స్మరణకు వస్తున్నది. అమ్మవారికి సామరస్య పరాయణా అని ఒక నామ ముంది. దాని కర్థం వ్రాస్తూ భాస్కరాచార్యులు అభియుక్తులైన పెద్దల సుభాషిత మొకటి ఉదాహరించారు. పరస్పర తపస్సంప - త్ఫలాయిత పరస్పరౌ - ప్రపంచ మాతా పితరౌ - ప్రాంచౌ జాయాపతీ స్తుమః - అంతే కాదు. సాక్షాత్తూ కాళిదాసోక్తి అని చెబుతూ ఒక శ్లోకం కూడా ఆయన పేర్కొన్నారు. భోక్తృ భోగ్య కరణోర్మి సంక్షయే - సామరస్య రస దోహినీ శివా. ఇది కాళిదాసు నోటనే పలికిన మాట అట.. ఇదే నిజమైన నాడు సామరస్య మనే భావం మహాకవి కాళిదాసు మనసులోనే ఉందన్నమాట. కాకపోయినా ఆయన నామధేయ మేమిటి. కాళిదాసు. కాళి అంటే ఎవరు. సాక్షాత్పరా దేవతే గదా. ఆవిడకు దాసుడంటే ఆయనకు కూడా దాసుడే. ఆయనా ఆవిడా అని తేడా ఏముంది. శివ శక్తులు రెండూ ఒకే ఒక తత్త్వమా మహాత్ముడికి. అది మనం క్రొత్తగా ఊహించ నక్కర కూడా లేదు. రఘువంశం ప్రార్థనా శ్లోకంలోనే తెలిసిపోతున్నది. వాగర్థాలలాగా ఒకరిలో ఒకరు కలిసిపోయిన ఏకైక స్వరూప మది. కనుకనే పితరౌ అని ఏక శేషంగానే సూచించాడ తత్త్వాన్ని. మరి మాళవికా నాందిలో కాంతా సంమిశ్ర దేహః అని వాచా

కీర్తించాడు. శాకుంతలాంతంలో నైతే పరిగత శక్తి రాత్మభూః అని శివ శక్తుల నేకాత్మకంగానే ఏకరువు పెట్టాడు.

ఈ ఏకాత్మ భావమే సామరస్య మంటే. సమో న్యూనాధికో రసో యయో స్తయో శ్శివ శక్త్యో ర్భావ స్సామరస్య మని నిర్వచించారు భాసురానందులు. తన తరువాత ఎన్నో శతాబ్దాలకు వచ్చిన భాస్కరాచార్యులే గ్రహించిన ఈ సామరస్య రహస్యం సాక్షాద్దేవీ భక్తుడూ శివ దీక్షా పరాయణుడూ తదీయ కథా సంకీర్తన ధన్యమ్మన్య జీవనుడూ అయిన కాళిదాసు గ్రహించటంలో ఆశ్చర్య మేముంది. గ్రహించాడు. ఎంతగా గ్రహించాలో అంతగా గ్రహించాడు. తస్మా చ్ఛబ్దార్థ చింతాసు న సావస్థా నయ శ్శివః అని శివాద్వైతులు వక్కుచ్చినట్లు లోకంలోనే గాదు. సారస్వత లోకంలో కూడా శబ్దార్థా లనేవి రెండూ శివ శక్తి రూపాలుగానే దర్శన మిచ్చాయా మహాత్ముడికి. ఒకటి హెచ్చు ఒకటి తగ్గు అనే తేడా లేకుండా రెండూ సమరసంగానే సాక్షాత్కరించాయి. ఆదిమ దంపతులలో చూచిన ఆ సమరస భావమే శబ్దార్థ రూపాలలో ఎప్పుడు ప్రత్యక్ష మయిందో అప్పుడా శబ్దార్థాలనే సామగ్రితో నిర్మించిన కావ్య జగత్తంతా సామరస్య పరాయణమే అయి కూచుంది. ఏ కథ తీసుకొన్నా అందులో ఏ సన్నివేశం కల్పించినా - ఏ వర్ణన చేసినా - ఏ పాత్రను చిత్రించినా - అందులో ఏ భావాన్ని ఆవిష్కరించినా - సమ దృష్టే తప్ప విషమమైన దృష్టే లేదా మహా కవికి. అంటే అర్థం ఎటూ మొగ్గ చూపడు. దేనితోనూ తాదాత్మ్యం చెందడు. ఒకటి నెత్తిన పెట్టుకొన డొకటి త్రోసి పారేయడు. పైనుంచి క్రింది వరకీ జడ చేతనాత్మకమైన సృష్టి నంతా సమభావంతో సానుభూతితో చూచాడా మహాకవి. ఆ దృష్టి కక్షరాలా సరిపడే లాగే సృష్టించాడు తన కావ్య ప్రపంచాన్ని. యథాస్మై రోచతే విశ్వ మని గదా ఆలంకారికుల సూక్తి. అది కాళిదాసు ప్రవృత్తిని బట్టే బయట పెట్టారేమో వారు. నాట్యం భిన్నరుచే ర్జనస్య బహుధా ప్యేకం సమారాధనం. భిన్న రుచులు గల లోకులందరినీ ఏకోన్ముఖులను చేసి అలరించేది నాట్యమే నని గదా

సెలవిచ్చా డాయన. నాట్యమనే గాదు. ఆ మాటకు వస్తే నాట్యమనే నెపంతో తన కవితా నాట్యమే ప్రస్తుతిస్తున్నాడు. అది సకల ప్రాణీ మనో రంజకమని కవి హృదయం.

కుమార సంభవంలో పార్వతీ పరమేశ్వరుల మహా మైథున మపరిమితంగా వర్ణించాడు కవి. దానితోనే ముగించాడు కూడా. అది చదివిన పండిత మ్మన్యు లనేకు లేమిటిది ఎంత అశ్లీలం - సాక్షాత్తూ జగత్తుకు తల్లి దండ్రులైన వారి దా ఇలా వర్ణించ వలసింది. వారి రహస్య వ్యవహారాన్ని ఇలా బట్టబయలు చేయ వచ్చునా - అని తెలిసీ తెలియక ఆక్షేపించారు. ద్విషంతి మందా శ్చరితం మహాత్మనా మని దానికి మహాకవే సమాధాన మిచ్చాడు. నిజంగా మంధ బుద్ధుల కంతు పట్టని రహస్య మిది. శివ శక్తుల సామరస్యమే ఆ మహా మైథునం. అది కవితా జగత్తులో శబ్దార్థాల సామరస్యం. తమర్థ మివ భారత్యా - సుతయా యోక్తు మర్హసి అని సప్త ర్షులు హిమవంతుడితో అన్న మాట. పార్వతిని పరమేశ్వరుడి కిచ్చి పెండ్లి చేయటం శబ్దాన్ని దాని అర్థంతో కూర్చట మట. ఈ కూర్పే ఈ కలయికే మైథునం. అది విడిపోకుండా ఎప్పటికీ అవినాభావంగా ఉండాలని ఆసించటమే మహామైథునం. అందుకే ఆ అవినాభావంతోనే ముగించాడా కావ్యాన్ని. అదే మేఘదూతంలో కూడా. మాభూదేవం కథమపి చ తే విద్యుతా విప్రయోగః అని ఆశీర్వదించాడు మేఘుణ్ణి ఆ యక్షుడు. ఇలాటి పురాణ దంపతుల అవినాభావ రూపమైన సామరస్యాన్నే శబ్దార్థ మయమైన కవితా వస్తువుగా దర్శించి దానినే కథ పాత్ర వర్ణనా ద్యనేక ముఖాలతో విసుగు లేకుండా వర్ణిస్తూ వచ్చాడా మహాకవి. తదుపదేశంతో భావుకులను కూడా తన్మార్గంలోనే పయనించి శివాత్మ భావాన్నే భజించమని హెచ్చరిక చేస్తున్నాడు. అలాగే కదా చేశాడు చివరకు శాకుంతలంలో మమాపిచ క్షపయతు నీలలోహితః - పునర్భవం పరిగత శక్తి రాత్మభూః అని. పువర్భవ మంటే ఏమని అర్థం. మరలా జన్మ లేకుండుగాక అని గదా కవి ఆశించినది. అది ఫలించాలంటే నీలలోహితుడే అనుగ్రహించాలి.



Vallamraju Srinivasa Rao Brahmasri www.advaitavedanta.in

నీలమమ్మ వారు లోహిత మయ్యగారు. రెండూ కలిసి నీలలోహితం. ఇందులో నీలాన్ని లోహితంలో లోహితాన్ని శుద్ధమైన ఆత్మ చైతన్యంలో ప్రవిలయం చేసుకొన్న భావుకుడి కిక భవమేముంది. భవమే లేని వాడికి పునర్భవమేముంది.

ఇదీ ఇలాంటిదీ మహాకవి దర్శించిన సామరస్యం. ఏతా దృశ మైన దర్శనానికే నోచుకోలేదు నూటికి తొంబది మంది కవి శబ్ద వాచ్యులు. పోతే దర్శనమే గాక దాని నంతటినీ తన రచనలలో నింపి వర్ణించి చూపాడంటే ఎంత ప్రతిభా భాసురుడో చూడండి కళిదాసు. ఇంతకు ముందే సూచన చేసి ఉన్నానొక విషయం. కాళిదాసు సృష్టించిన నాయికా నాయకు లెవరో కాదు శివ శక్తులేనని. శివ శక్తుల నమూనాలో చిత్రించిన చిత్రాలే ఆయన పాత్రలు. వీరి పరస్పర ప్రేమ కలాపమంతా వారి ప్రేమ కలాపమే. కనుకనే వారిలో చూచిన సామరస్యమే వీరిలోనూ చూడ గలిగాడా కవి. ఈ సమరస దృష్టితో చూచిన వాడు గనుకనే స్త్రీ పురుష పాత్రలను చిత్రించే టప్పు డెవరినీ తక్కువగా చూపడు. ఎక్కువగా చూపడు. ఇరువురూ సమ స్వభావులే ఆయనకు. ఆయనే అంటాడీ మాట కూడా. సప్త మహర్షు లరుంధతితో సహా కైలాసానికి వస్తే వారి నందరినీ సమానంగానే ఆదరించాడట పరమ శివుడు. ఎందుకంటే స్త్రీ పుమా నిత్యనా స్థైషా - వృత్తంహి మహితం సతాం. ఇది స్త్రీ వీడు పురుషుడని తేడా చూడరు వారి శీలము వృత్తమే గమనిస్తారు మహాత్ములని సంజాయిషీ ఇస్తాడు మనకు కాళిదాసు.

ఇది పార్వతీ పరమేశ్వరులనీ మహర్షి దంపతులనే కాదు. కావ్యంలో ఏ నాయికా నాయకులైనా వారికి ప్రతిబింబాలే ప్రతీకలే కవి దృష్టికి. సుదక్షిణా దిలీపుల పరస్పరాను రాగాన్ని వర్ణిస్తూ ఇలా అంటాడొక అద్భుతమైన మాట. రథాంగ నామ్నో రివ భావ బంధనం - బభూవ యత్ప్రేమ పరస్పరాశ్రయం - విభక్త మప్యేక సుతేన తత్తయోః పరస్పర స్యోపరి పర్యచీయత. చక్రవాకాలని రెండు పక్షు లున్నాయి. అవి ఎప్పుడూ జంట పాయకుండా

తిరుగుతుంటాయి. అలాగే సుదక్షిణా దిలీపులు కూడా. వారికి రఘువనే కుమారుడు జన్మిస్తాడు. జన్మిస్తే ఆ కుఱ్ఱవాణ్ణి ఇద్దరూ ముద్దు చేస్తారు. అలా చేసినా వారి ప్రేమ ఆ బాలుడి మూలంగా విభక్తమై కూడా అవిభక్తంగానే పెరుగుతూ పోయిందట. విభక్తమైనా అవిభక్త మేమిటి. నిరాకారమైన తత్త్వం విభక్తమై నట్లు భాసిస్తుందే గాని వాస్తవంలో అది అవిభక్తమే. జగత్తూ జీవుడూ ఏర్పడ్డా ఇవి కేవల మాభాసలే కాబట్టి మూల తత్త్వాన్ని ఎప్పుడూ విభక్తం చేయలేవని ఒకానొక అద్వైత భావం కూడా స్ఫురిస్తున్నదీ పద్యంలో. మొత్తంమీద కాళిదాసు దృష్టికి స్త్రీ పురుషులనే తేడా లేదు. ఇద్దరూ కలిసి తత్త్వం. ఈ రహస్యాన్నే దేవతలు బ్రహ్మ దేవుణ్ణి స్తుతించిన సందర్భంలో సూచించాడు కవి. స్త్రీ పుంసా వాత్మ భాగౌ తే. రెండూ ఒకే ఒక చైతన్య ఖండాలు. ఖండాలుగా రెండూ అఖండంగా ఒకటి. అలాంటప్పుడు భేద దృష్టి కిక చోటేముంది.

కనుకనే తన కావ్యాలలో గాని నాటకాలలో గాని స్త్రీ పాత్ర నంత గొప్పగా చిత్రించి చూపాడు కాళిదాసు. పురుషాధిక్య మెక్కడా లేదాయన రచనలలో. పురుషు డెంతో స్త్రీ అంతే. ఒకరి కొకరు దాసులు కారు. అయితే ఇద్దరూ దాసులే కాకుంటే ఇద్దరూ ఈశులే. సంధ్యా దేవి నుపాసించి వచ్చిన శివుణ్ణే చూచి పార్వతి అలిగితే - నేను సంధ్య నర్చించటం కాదు సంధ్య కూడా నన్ను భజించిందంటా డాయన. అనన్య నారీ కమనీయ మంక మని అసలా గౌరీ దేవే ఆయన ఒళ్ళో కూచుంది. శివ కామేశ్వ రాంకస్థ గదా. అక్కడ కాక ఎక్కడ కూచుంటుంది. అంతే గాదు. పత్యు శ్శిరశ్చంద్ర కళా మనేన స్పృశ అని చెలికత్తెలు వివాహానికి ముందే ఆవిడ కుపదేశిస్తారు. పతి శిరశ్చంద్రుణ్ణి పాదంతో అమ్మ స్పృశిస్తుందంటే ఎవ రెవరికి దాసులు. ఆయన దాసుడైతే ఇక దుష్యంతుడి దేముంది. పురూరవుడి దేముంది. కిం వీజయామి నళినీ దళ తాళ వృంతైః - సంవాహయామి చరణా వుత పద్మ తామ్రౌ. తాళవృంతాలతో వీచినా వీస్తాడు కాళ్ళు పట్టమన్నా పడతాడు. పట్టాడు

చేశాడని గాదు కవి వివక్షితం. స్త్రీ పురుషుల కిరువురికీ ఎలాటి సమరస భావ మున్నదో ఉండాలో చాటి చెప్పటమే. మహేశ్వరుడి విషయంలో చెప్పినా ఇంతే. మహర్షుల విషయంలో నైనా ఇంతే. మహారాజుల విషయమైనా ఇంతే. శివ పార్వతుల విషయంలో చూచాము గదా. స్త్రీకా పరమ శివుడే ఎంత గౌరవ మిచ్చాడో. పార్వతిని చెట్టబట్టాలని ఆయన తహ తహ పడుతుంటే చూచి సప్త మహర్షులు మనసులో అనుకొన్నారట - మనం పెండ్లి చేసుకొన్నామని ఏ మాత్రమూ సిగ్గు పడ నక్కర లేదని. వారికే సిగ్గు లేనప్పుడిక దుష్యంతుడి లాంటి మహా రాజుల కెందుకది. అందుకే వారా పాటికే అంత అవరోధ జన మున్నా ఆ శకుంతల కోస మొకరూ - ఆ ఊర్వశి కోస మొకరూ అలా ఆరాట పడ సాగారు. అంత ఆరాటంలోనూ పట్ట మహిషిని కాదనలేక పోయారు. ఆవిడ కెక్కడ కోపం వస్తుందోనని ఆందోళన పడ్డారు. ఆవిడను బ్రతిమాలి ఆవిడ అనుమతి తోనే పరిగ్రహించారా ద్వితీయలను. సామాన్య ప్రతిపత్తి పూర్వక మని కణ్వ మహర్షి అన్న మాట ఎంతో సార్థకమైన మాట. స్త్రీ లందరికీ సమాన ప్రతిపత్తే. అందరి సామనస్యమే కావాలి రాజుకు. ఆ రాజు సామనస్యం వారందరికీ కావాలి. వైమనస్య మైతే అది వైరస్యానికి మూలం. అది సామరస్యాని కపశ్రుతి. అలాటి అపశ్రుతి వినలేడు కాళిదాసు. సామరస్యం నూటికి నూరుపాళ్ళూ పుడికి పుచ్చుకొన్న ఆ ప్రణయ మూర్తుల ఆదర్శ దాంపత్య జీవితాన్ని లోకానికి ప్రదర్శించటమే ఆయన పెట్టుకొన్న ధ్యేయం.

అది ఆదిమ దంపతులలో ఎలా దర్శించాడో తదీయ లీలా సంభూతమైన ఈ చరాచర సృష్టిలోనూ అలాగే దర్శించాడు. అదీ ఆ మహా కవిలో ఉన్న విశేషం. దేవతలలో చూచాడా దాంపత్య విభూతిని. మహర్షులలో చూచాడు. మహా రాజులలో చూచాడు. తుదకు పశుపక్ష్యాదుల లోనూ చూడ గలిగాడు. అకాలంగా వసంత మావిర్భవిస్తే స్థాణ్వాశ్రమంలో ఎక్కడ చూచినా ఆయన కదే దర్శన మిచ్చింది. మధు ద్విరేఫః కుసుమైక పాత్రే - పపౌ

ప్రియాం స్వా మను వర్త మానః - తుమ్మెద పెండ్లి కొడుకు తన ప్రియురాలితో కూడి ఒకే కుసుమ పాత్రలో మధువును గ్రోలాడట. అర్ధోప భుక్తేన బిసేన జాయాం - సంభావయా మాస రథాంగ నామా. చక్రవాక పక్షి తాను సగం కొరికిన తామర తూడు తన జక్కవ పెంటి నోటి కందించిందట. దదౌ రసా త్పంకజ రేణు గంధి - గజాయ గండూష జలం కరేణుః - పంకజ రేణు వాసితమైన సరోవర జలం పుక్కిట బట్టి పెంటి ఏనుగు తన ప్రియుని నోటి కిస్తున్నదట. మరి శృంగేణ చ స్పర్శ నిమీలితాక్షీం - మృగీ మకండూయత కృష్ణ సారః - స్పర్శ చేతనే అరగన్ను పెట్టిన ఆడు జింకను కృష్ణ సారం కొమ్ములతో నిమురుతున్నదట. ఏమిటీ వర్ణన. దేవ మానవ లోకం దాటి పశు పక్షి లోకానికి కూడా ఎలా ప్రవహిస్తున్నదో చూడండి ఉదాత్త దాంపత్య శృంగార రసం. వారి అన్యోన్య ప్రణయ సామరస్యం. అంతే కాదు. జంగమ స్థాయి కూడా గడచి లతా వృక్షాదులను కూడా వ్యాపించిందది. పర్యాప్త పుష్ప స్తబక స్తనాభ్యః - స్ఫురత్ప్రవాళోష్ఠ మనోహరాభ్యః - లతా వధూభ్యః తరవో ప్యవాపుః - వినమ్ర శాఖా భుజ బంధనాని. లతలనే అంగనలు పుష్ప స్తబకాలనే స్తనాలతో ఎఱ్ఱని చిగుళ్ళనే పెదవులతో ఎంతో మనోహరంగా భాసిస్తుంటే తట్టుకోలేక తరువరేణ్యులంతా ఆ కాననంలో వారిని తమ శాఖా బాహువులతో బంధించారట. అసలు స్థావరా లేమిటి. నదీ సముద్రాలూ దంపతులే, భూమ్యాకాశాలూ దంపతులే. విద్యున్మేఘాలూ దంపతులే కాళిదాసు కళ్ళకు. అజుని ఇందుమతి పెండ్లాడటం జలనిధి మనురూపా జహ్ను కన్యా వతీర్ణా. సముద్రుని శరీరంలో ప్రవేశించిన జాహ్నవిలాగా ఉందట. శశిన ముపగతేయం కౌముదీ మేఘ ముక్తా. మేఘం నుంచి విడి వడిన చంద్రిక చంద్రుణ్ణి చేరినట్లున్నదట. మొత్తాని కిది స్థావర మిది జంగమ మిది చేతన మిది జడ మనే ప్రశ్న లేదు. మహాకవి దృష్టి కంతా శివ శక్తి సామరస్య విలాసమే. అదే సృష్టి అంతా పరుచుకొని కనిపించిం దాయన దృష్టికి. ఇతి సమ గుణ యోగ ప్రీతయ స్తత్ర పౌరాః - వధూ వరులిద్దరూ సమ గుణ యోగంతో

భాసిల్లుతుంటే చూచి నలుగురూ వారి దాంపత్యాన్ని ప్రశంసించా రంటాడు కవి. సామరస్యానికి మారు పేరే ఈ సమగుణ యోగం.

మహాకవి రచనలో ఉన్న ఈ ఆంతర్యాన్ని గుర్తించలేక లోకంలో తెలిసిన వారూ తెలియని వారూ నూటికి తొంబది మంది కాళిదాసంటే శృంగార లోలుడూ - శిశ్నోదర పరాయణుడూ - కామ పురుషార్థం తప్ప ఆయన జీవితంలో మరే భావమూ కనపడదు- అదే తన కావ్యాల్లో నాటకాల్లో విచ్చలవిడిగా వర్ణిస్తూ పోయాడని పరి పరి విధాల విమర్శిస్తూ పోతున్నారు. శృంగారం కామమంటే కాళిదాస మహాకవి దృష్టిలో ఉన్న అభిప్రాయ మేమిటో వీరి కంతు పట్టటం లేదు. కామ మంటే సురత వ్యాపార మను కొంటున్నారు కాబోలు. అది కేవలం బాహ్యమైనది. శారీరకమైనది. అది కాదు కవి వివక్షితం. దానికి ప్రచోదకమైన ఇచ్ఛ. సృష్టి నంతా ఆక్రమించిన అమ్మ వారి ఇచ్ఛా శక్తి. జ్ఞానమే ఇచ్ఛగామారి సర్వతో ముఖంగా ప్రసరిస్తుంది. అది క్రియా రూపంగా మారి చేతనా చేతనాలనే తేడా లేకుండా సమస్త పదార్థాలనూ దగ్గరకు తెస్తుంది. కలిపి గట్టిగా ముడి వేస్తుంది. అవినాభావంగా ఏకం చేసి చూపుతుంది. తదపదేశంతో సృష్టి అంతా ఏకాత్మకమే సుమా పరస్పర భిన్నంగా కాక దీని నేక రూపంగా దర్శించి తరించమని భావుక లోకానికొక బ్రహ్మాండమైన సందేశాన్ని అందిస్తుంది. దీనిని బట్టి శృంగారమన్నా కామమన్నా అది నీవూ నేనూ అనుకొన్నట్లు భౌతికం కాదు. అభౌతికం. భౌమం కాదు. దివ్యం. మర్త్యం కాదు అమర్త్యం. అలా కాకుంటే శివ శక్తులు కామేశ్వరీ కామేశ్వరు లెలా అయ్యారు. అమ్మవారు కామ కళ ఎలా అయింది. కామ మిచ్ఛే. ఇచ్ఛా మాత్రం ప్రభోః సృష్టిః - అది భేద ప్రపంచాన్ని సృష్టిస్తుంది. మరలా ఈ భేదాన్ని లయం చేసి చూపుతుంది. ఈ అభేద భావనే కామం. భేదాన్ని చూస్తున్నంత వరకూ విశ్రాంతి లేదు. శాంతి లేదు. భేదాన్ని అభేదంగా మార్చు కొన్నప్పుడే శాంతి. ఈ అభేద ప్రాప్తి కోసం పడే తహ తహే అసలైన కామం శృంగారం. కాళిదాసు తన కావ్యాలను శృంగార రసంలో ముంచెత్తాడన్నా

దని కాలంబనమైన నాయికా నాయకులను కాముకులుగా చిత్రించాడన్నా ఈ మహోన్నతమైన ఆశయాన్ని మనసులో ఉంచుకొనే. దృష్టిని బట్టి గదా సృష్టి. బ్రహ్మ సృష్టి అయినా ఇంతే. కవిబ్రహ్మ సృష్టి అయినా ఇంతే.

అంచేత ఇప్పుడర్థ మవుతుంది మనకు కాళిదాసు దుష్యంతాది పాత్రలలో అంతగా కామాన్ని ఎందుకు వర్ణించాడో. కామమనేది శారీరకం కాదక్కడ కాళిదాసు ఉద్దేశించింది. రథాంగ నామ్నో రివ భావ బంధనం - బభూవ యత్ప్రేమ ఫరస్పరాశ్రయ మనిగదా దంపతుల ప్రణయాన్ని వర్ణించా డాయన. ప్రేమ భావ బంధన మన్నాడు కాని శారీర మనలేదు. చూచారా. అయితే శరీర సంపర్కం కోసమే ఏకరు తున్నట్టు కనిపిస్తారే ఆ నాయకులని అడగవచ్చు. అది ఇంతకు ముందు వ్రాకుచ్చినట్టు భౌతికం కాదు. అభౌతికం. అభౌతికమైన భావమేది గానీ మన ఇంద్రియాలకు గోచరించదు. అగోచరమైన ఆ భావాన్ని స్పష్టంగా అనుభవానికి తెచ్చుకోవాలంటే మూర్తమైన శరీరాది సామగ్రే ఆలంబనం. ఇది ఆంతరమైన ఆ భావానికి భాహిరమైన ప్రతీక. అందుకే సూఫీ కవులెప్పుడూ ఇష్క్ నిజాజీ - ఇష్క్ హకీకీ అని ప్రేమను రెండు జాతులుగా భావన చేస్తూ వచ్చారు. ఇష్క్ అంటే ప్రేమ. అది మిజాజీ అంటే లౌకికమూ కావచ్చు. హకీకి అంటే పారమార్థికమూ కావచ్చు. పారమార్థకమే వారు లోకానికి చెప్పదలచింది. దానికి కేవల మొక ప్రణాళికగా Medium మాత్రమే లౌకికమైన శృంగారాన్ని వర్ణిస్తూ పోతారు. లైలా మజ్నూన్ - షీరీనో ఫరహోద్ - యూసఫో జులైఖా - ఇలాంటి కావ్యాలు వ్రాశారంటే ఈ దృష్టితోనే వ్రాశారు. లౌకికమైన కామ మలౌకికమైన కామానికి ఒక ఛాయ మాత్రమే. దీన్ని వర్ణిస్తున్నాడంటే కవి- దీని మీద కాదు తాత్పర్యం. దీని ద్వారా దీనిలో అంతర్లీన మయి ఉన్న ఆ అలౌకిక కామమే భావుకుడికి స్ఫురింప జేయాలని వారి ఆశయం. దంపతులంటే జీవేశ్వరులే వారి దృష్టిలో. నర నారాయణుల కలయికే నాయికా నాయకుల కలయిక. ఇది వారికి పేర్లు పెట్టటంలోనే మనకు ధ్వనిస్తుంది. ఇంతెందుకు లైలా మజ్నూన్‌లో లైలా

నాయిక. మజ్నూన్ నాయకుడు. ఎక్కడ ఉంది లైలా. లైలా అంటే అసలు రాత్రి అని అర్థం. మజ్నూన్ అంటే పిచ్చివాడు ఉన్మత్తుడని శబ్దార్థం. రాత్రేమిటి. పరమాత్మ తత్త్వం, అది మనకు రాత్రి లాగా దృష్టి గోచరం కాదు కాబట్టి రాత్రి అన్నారు. మరి అలా కాక పోయేకొద్దీ దాన్ని దర్శించాలనీ స్పర్శించాలనీ అనుభవించాలనీ జీవు డారాట పడటం సహజమే కాబట్టి సాధకులైన జీవులందరూ మజ్నూనులే. పిచ్చి వాళ్ళే.

ఇది మనం సూఫీల వరకూ పోనక్కరలేదు. భగవద్గీతలోనే యానిశా సర్వ భూతానా మనే శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ భగవత్పాదులే అన్నారీ మాట. నిశేవ నిశా పరమాత్మ తత్త్వ మగోచరత్వాత్. ఇంద్రియాగోచర మైన పరమాత్మ రాత్రిలాంటి వాడేనట. ఇంతెందుకు. ఉపనిషత్తే చాటుతున్న దొక సత్యం. తద్యథ ప్రియయా స్త్రియా సంపరిష్వక్తో న బాహ్యం వేద నాంతరం - ఏవ మేవాయం పురుషః ప్రాజ్ఞే నాత్మనా సంపరిష్వక్తః న బాహ్యం కించన వేద నాంతరం - తద్వా అస్య ఏత దాప్త కామ మాత్మ కామ మకామం రూపం శోకాంతరం. తన కిష్టమైన ప్రేయసి ఎదురు వచ్చి గట్టిగా కౌగిలించుకొంటే పురుషుడెలా బాహ్య స్మృతి అంతఃస్మృతి రెండూ కోలుపోతాడో - అలాగే ఆ పరమాత్మ కూడా వాటేసుకొంటే సుషుప్తి దశలో ఈ జీవుడికి బాహ్యాంతర ప్రజ్ఞ లేకుండా పోతున్నదట. చూచారా. ఇక్కడ పరమాత్మను స్త్రీతో పోల్చి వర్ణిస్తున్న దుపనిషత్తు. సూఫీ కవులు కాళిదాసు తరువాతి వారైనా ఉపనిషత్తు లాయనకు ముందున్నవే గదా. ఈ ఉపనిషత్కల్పన ఆయన మనసు నెంతగా దోచుకొన్నదో - ఆ కల్పనమే దోచుకొని మహా కవి తన స్త్రీ పాత్రలను పరమాత్మ కభిన్నంగానే భావించి కావ్య నాటకా లన్నిటిలో చిత్రించి చూపాడు. సందేహంలేదు. మామూలుగా స్త్రీ పురుషుణ్ణి తన పాటికి తాను స్వయంగా వచ్చి కౌగిలించు కోదు. ఇక్కడ పరమాత్మ స్త్రీ కావటమే కాక స్వయంగా ఆలింగనం చేసుకొన్నట్టు వర్ణించబడింది. అయితే ఆయన అలా కౌగిలించు కోవాలంటే జీవు డందుకోసం తపన చెందాలి. ఆరాట పడాలి. అప్పుడే ఆ

స్వయం గ్రాహ సుఖం. సరిగా కాళిదాసు నాయికా నాయక వ్యవహా రమిదే. ఇలాగే సాగింది. చూచారో లేదో నాటకాలే చూడండి. మూడు నాటకాల్లోనూ నాయకులు ముందు ఆయా నాయికల పొందు కోస మెంతో తహ తహ పడతారు. వారి కంతకు ముందు కాంతలు లేరని కాదు. అసంఖ్యాకంగా ఉన్నారు. పైగా వారందరికీ ఒక పట్ట మహిషి కూడా ఉంది. అది వసుమతి కావచ్చు - ధారిణి కావచ్చు. కాదు కాదు. ఇది కవి కల్పించిన సంకేతం. వసుమతి ఈ వసుమతే. ధారిణి ఈ ధారిణే, అంటే భూమండలమే. ఇది అనుభవిస్తూనే ఆ దుష్యంతుడు గానీ ఆ పురూరవుడు గానీ దీనికి అదనంగా ఆ శకుంతలాదుల పొందుకై అవస్థలు చాస్తారు. ఎలాగో దీనిని ఒప్పించి చివరకు దానిని పొంది ఆనందిస్తారు. ఏమిటి అర్థం. భౌమమైన సంబంధం జీవుడి కెంత ఉన్నా అది తృప్తి నీయదు. దాని కతీతమైన దివ్య తత్త్వంతో సంబంధ మేర్పడితేనే పరిపూర్ణత. పరితృప్తి. అదే గదా అవస్థా త్రయంలో మనం చూస్తున్న విషయం. జాగ్రత్స్వప్నాలు రెండింటిలో భౌతికమైన సంబంధం వదలలేదు మనలను. దానితో సతమతమై ఆ శ్రమ తీర్చుకోవాలని గాఢ నిద్ర పడితే బాగుండునని దానికోసం తహ తహ లాడుతాము. చివరకు మంచి నిద్ర పడితే ఎంతో ఆనందం. బ్రహ్మానందం. బ్రహ్మంతో ఏక మవుతాము గనుగనే అలాటి ఆనందం.

చూడండి. ఈ సంకేత మెలా నరిప డుతున్నదో నాయికా నాయకుల వ్యవహారంలో. అసంఖ్యాకమైన రాణు లసంఖ్యాకంగా కనిపించే చరా చర జగత్తే కాళిదాసు దృష్టిలో. పట్టమహిషి ఎవరో కాదు. ధారిణి వసుమతి అని పేరు పెట్టిన భౌతికమైన సంబంధమే. జాగ్రత్స్వప్నాల లాగా దీనితో సతమత మవుతున్నాడు నాయకుడు. అంటే జీవుడు. అంచేత వాడు దీన్ని తప్పించుకొని అతిలోకమైన అభౌతికమైన సుషుప్తిలాటి ఒక స్థితి నందుకోవాలని దానితో సుఖ పడాలని చూస్తున్నాడు. అదే దుష్యంతుడు ఒక శకుంతల కోసం - అగ్నిమిత్రుడు ఒక మాళవిక కోసం - విక్రముడొక

ఊర్వశి కోసం ప్రాకులాడటం. శకుంతల ఒక అప్సరస కూతురే. ఊర్వశి ఒక అప్సరసే. ఇద్దరూ అభౌతిక స్వరూపలే. మాళవికా అదృష్టంగా మెలగుతూ అందరాని ఒక అప్సరస లాంటిదే. వారితో సాంగత్యం కోస మఱ్ఱులు చచటమూ - అది దూరమైతే పరితపించటమూ - మరలా వారు దగ్గరైతే ఆనందించటమూ - వారి సాంగత్యంలో బాహ్యాభ్యంతరాలు రెండూ మరచి పారవశ్యం చెందటమూ - ఇదంతా సుషుప్తి దశకూ జీవేశ్వర సంబంధానికీ తద్గతమైన ఆనందాను భూతికీ ప్రతీకగానే సృష్టించాడు మహాకవి. అంతే కాదు. శకుంతలాదులా నాయకులను గాంధర్వ వివాహం చేసుకోటమూ స్వయంగా వరించటమూ వారి పొందుకోసం తాము తమకించటమూ - ఇదీ ప్రతీకే.

ఏతావతా చెప్ప వచ్చేదేమంటే కాళిదాసు తన రచనలో స్త్రీ పురుషుల శృంగార మెక్కడ ఎలా వర్ణించినా అది లౌకికంగా భావించరాదు మనం. అలౌకికమైన జీవేశ్వర సంబంధాని కది లౌకికమైన సంకేతం. స్త్రీ ఆ పరాదేవతే ఆ దేవీ భక్తుడుకి. దూర దూరంగా తొలగి పోయే ఆ దేవత సాక్షాత్కారానికీ సాంగత్యానికీ చేసే నిర్విరామ మైన కృషే నాయకుల ప్రవృత్తిలో చూపాడాయన. పోతే తీవ్రమైన ఆ కృషి కనుగుణంగా ఆ దేవత స్పందించి చివర కతనికి ప్రసన్న అయి తన సాయుజ్య సుఖాన్ని అనుగ్రహించటమే శకుంతలాది నాయికల వ్యవహారంలో ప్రదర్శించాడు. అంతే గాని శకుంతల శకుంతలా గాదు. ఊర్వశి ఊర్వశీ కాదు. ఆ నేపథ్యంలో దాగి ఉన్న పరా దేవతే వారు. అవ్యక్త అయిన ఆ దేవి వ్యక్త రూపాలు. అలాటి దేవీ స్వరూపిణులు గనుకనే ధీరోదాత్తులూ సకల దైవ గుణ సంపన్నులూ అయిన ఆ చక్రవర్తు లంతగా వారి సాంగత్యం కోసం ప్రాకులాడటం. చక్రవర్తు లేమిటి. సాక్షాత్తూ పరమేశ్వరుడే తాళలేక పోయా డావిడ నెడబాయటానికి. తాళలేక కపట బ్రహ్మచారిగా అవతరించాడు. పొమ్మని కసరి కొట్టినా వెళ్ళిపోక చేయి పట్టుకొంటాడు. తన నిజరూపం చూపి సిగ్గుపడి ఆవిడ వెళ్ళిపోతే

సప్త ఋషులను పిలిచి మరలా రాయబారం పంపుతాడు. పెండ్లి ముహూర్తం నిర్ణయించుకొని వచ్చి మూడురోజు లోపిక పట్టవయ్యా అని చెప్పినా పట్టలేక పోయాడట ఆ మహాత్ముడు. వినండి. కాళిదా సేమంటున్నాడో. పశుపతి రపి తాన్యహాని కృచ్ఛ్రా దగమయ దద్రి సుతా సమాగమోత్కః - కమపర మవశం న విప్ర కుర్యుః విభుమపి తం యదమీ స్పృశంతి భావాః - ఆయన పశుపతి. ఆవిడ అద్రి సుత. అలాంటి వాడు కూడా ఆ యెడబాటు భరించలేక పోతే ఇక మనబోటి వాళ్ళ సంగతేమి టంటాడు. ఏమి టర్థం. పశువంటే జీవుడు. జీవుడు కాడు - జీవులకు పతి ఆయన. జీవుడిలాగా ఆరాట పడరాదు. కామానికి లోను కారాదు. అయినా అయ్యాడు. అలాగే అద్రి సుత ఆవిడ. ద్రవించని దేదో అది అద్రి. ఏ మాత్రమూ చలనం లేనిది. అంటే పరాశక్తి అని అర్థం. పశ్యంతి మధ్యమల లాగా చలనం లేనిది పర. అలాంటి దయి కూడా అది చలించి వచ్చి పార్వతిగా జన్మించింది. సుత అంటే జాత అనే అర్థం. జన్మ లేనిది జన్మించిందంటే అది వాస్తవ మెలా అవుతుంది. వాస్తవాని కొక ఆభాస. ఇలాటి ఆభాసను కోరుతున్న దేమి టిక్కడ. పశుపతి. వాస్తవమైన తత్త్వం. అప్పటికి వస్తుభూతమైన చైతన్యం తన శక్తిని తానే కామిస్తున్నది. కామేశ్వరుడై కామిస్తున్నాడు. కామేశ్వరి అయి కామించ బడుతున్న దావిడ. ఇద్దరున్నారా. లేరు. వేరను కొంటే ఇద్దరు. కారనుకొంటే ఒక్కరు. అలా కాదనుకొంటూ ఏకమయ్యే ప్రయత్నమే కామించటం. ఇది దుష్యంతుడి మాటల్లోనే మనకు ధ్వనిస్తుంది. కామీ స్వతాం పశ్యతి. కామి తాను కామించిన దాన్ని తన స్వరూపంగానే చూస్తాడట. సమస్త ప్రపంచమూ తన్మయంగానే దర్శిస్తాడంటే ఏమని అర్థం. పరశక్తి పాత గృహీత చేతస్కుడై ఆ పరా భట్టారిక రూపంలోనే ఈ జగత్తును చూస్తాడని భావం.

అప్పటికి కాళిదాసు పోషించిన శృంగారం భౌతికమా అభౌతికమా. కామమనేది శారీరకమా ఆధ్యాత్మికమా. భాహ్యమైన సంకేత కవచాన్ని భేదించి

అంతర్యమైన తత్త్వాన్ని చూచే చూపులేక పోతే కాళిదాసు మన దృష్టికొక పైలా పచ్చీసు సామాన్య రచయితే. సందేహం లేదు. కనుకనే ఇలాటి సామాన్య బుద్ధుల కలాగే కనిపించాడా మహా దార్శనికుడు. నిజంగానే వీరు భావించినట్లు మహాకవి ఉండి ఉంటే తన రచనలలో స్త్రీ పాత్ర నిర్మాణ మలా చేసేవాడు కాడు. అత్యుదాత్తంగా భావించాడు చిత్రించాడు స్త్రీ పాత్రను. స్త్రీని స్త్రీగా చూడలే దాయన. సాక్షాత్తు ఆ పరాదేవత గానే దర్శించాడు. తానే గాక తన నాయకుల నందరినీ అలాగే దర్శించమని బోధించాడు. ఆరాధించమని చెప్పాడు. పరాదేవతనే ఆయన కన్యగా చూచాడు. కాంతగా చూచాడు. మాతగా చూచాడు. కణ్వుడి కావిడ కూతురు. దుష్యంతుడికి పత్ని. భరతుడికి తల్లి. ఆ పరాశక్తే ఆయా భూమికలలో సాక్షాత్కరించిం దాయన మనో నేత్రానికి. మందాకినీ సైకతాలలో ఆడుతూ పాడుతూ ఒక రూపంలో - బర్హిస్సులూ బలి పుష్పాలూ తెచ్చి సేవ చేస్తూ ఒక రూపంలో - హావ భావాలు ప్రదర్శిస్తూ ఒక రూపంలో - అనుకొన్నది జరగకపోతే తపన చెందుతూ ఒక రూపంలో - అది మరలా ఫలించబోతుంటే సిగ్గుతో తల వంచుకొని మరి ఒక రూపంలో. పెళ్ళి పీటలమీద ఒక రూపంలో - మధు కౌముదిలో వేరొక రూపంలో - అన్ని రూపాలలో స్త్రీనొక దేవతగా ఆరాధించిన వాడాయన. కనుకనే స్త్రీ జాతిమీద ఆయన కెనలేని గౌరవం పూజ్య భావం. హిమవంతుడి దాంపత్య జీవనాన్ని వర్ణించిన ఘట్టం చదువుతుంటే తెలుస్తుంది వనకు. భారతీయ కుటుంబ వ్యవస్థను గూర్చిఅందులో స్త్రీ పాత్రను గూర్చి ఆయనకున్న అభిప్రాయమెలాంటిదో. ఏతే వయ మిమే దారః - కన్యేయం కుల జీవితం. ఇదిగో మేమున్నాము. మా ఆడవాళ్ళున్నారు. మా ఇంటికి వెలుగు లాంటిదీ కుమార్తె ఉన్నది. ఇవి సప్త ఋషులతో హిమవంతు డన్న మాటలు. తరువాత ఈశ్వరుడి సంబంధం ప్రస్తావించి నీ అభిప్రాయ మేమని వారడిగితే తనకు మనసులో ఇష్టమైనా పైకి తేలక శైలః సంపూర్ణ కామోపి మేనా ముఖ ముద్వైక్షత. తన భార్య మేనకవైపు తిరిగి ఆమె మొగం చూచాడట నీకిష్టమేనా అన్నట్లు. ఎందుకలా చూడటమంటే కాళిదాసంటాడు. ప్రాయేణ

గృహిణీ నేత్రాః - కన్యార్థేషు కుటుంబినః - ఆడపిల్లల విషయంలో ముఖ్యంగా గృహస్థుడైన వాడి కిల్లాలే నేత్రం లాంటిది. వ్యవహారం నడపవలసిం దావిడే నట. పోతే ఇక ఆవిడో. భర్త పెత్తన మిచ్చాడు కదా అని స్వతంత్రించేది కాదు. మేనే మేనాపి తత్పర్యం - భర్తురిష్టం పతివ్రతా. మీ ఇష్టమే నా ఇష్టమని చూపులతోనే సైగచేసి చెప్పిందట. ఏమి అన్యోన్యత ఆ దంపతులకు. పోతే వారి ప్రశ్నకు హిమవంతు డేమిచ్చాడు సమాధానం. సమాధాన మేదోగాదు. మంగళా లంకృత అయిన కుమార్తెను చూచి ఏహి విశ్వాత్మనే వత్సే - భిక్షాసి పరి కల్పితా. అమ్మా రా ఆ విశ్వనాథుడికే నిన్ను భిక్షగా అర్పిస్తున్నాను. అర్థించటానికి వచ్చారీ మహానుభావులు. ప్రాప్తం గృహ మేధి ఫలం మయా. గృహస్థాశ్రమ ఫలం నాకు లభించింది అని పిలుస్తూ అయ్యా ఇదుగో త్రిలోచన వధువు నీకు నమస్కరిస్తున్నది. ఆశీర్వదించండని ఆ మునులతో అంటాడు. వారి దీవనలు వడసి ఆవిడ అరుంధతీ దేవికి ప్రణమిల్లగానే అంక మారోప యామాస లజ్జమానా మరుంధతీ. సిగ్గుపడుతూ ఉన్న ఆ అమ్మాయిని లేవనెత్తి ప్రేమతో తన ఒళ్ళో కూచోబెట్టు కొన్నదట అరుంధతి. ఇక అమ్మాయి నాకు దూరమై పోతుందే అని తన్మాతరం చాశ్రు ముఖీం - దుహితృ స్నేహ విక్లబాం. కంట తడి పెట్టి దీనంగా చూస్తూ నిలుచున్న తల్లిని కాబోయే పెండ్లి కొడుకు గుణ గణాలు వర్ణించి చెబుతూ ధైర్యం చెప్పి ఓదార్చిందంటాడు కవి. ఇది చదువుతుంటే ఆ మేనకా దేవికాదు. మనం కూడా రసార్ద్ర హృదయులమై కంట తడి పెట్టవలసిందే. ఉత్తమ దాంపత్యం - కుటుంబ జీవనం - ఎంతగా కళ్ళకు కట్టినట్టు చూపాడో చూడండి. అదీ హిమవంతుడూ మేనకా. మామూలుగా కనపడే పర్వతమది. మనకు పర్వతమైతే కాళిదాసుకది ఒక ఉత్తమ గృహస్థుడు. ఆయన గృహిణి ఎలాంటిది. మేనాం మునీనామపి మాననీయాం. మహర్షులే మెచ్చుకోవలసిన సద్గుణ సంపన్నురాలు. మరి అలాంటి వారి కూతురో. సాక్షాత్తూ ఆ జగజ్జననే.

ఈ జగజ్జనని మరలా ఆ జగదీశ్వరుడికే కుటుంబిని అయింది. వారి కళ్యాణోత్సవాన్ని తిలకించాడు కాళిదాసనే మహాగణపతి. జననీ జనకుల కళ్యాణ మేమిటి. తరువాత జన్మించిన తనయుడు దర్శించట మేమిటి. దర్శించి మనకు వర్ణించి చెప్పట మేమిటి. అది ఒకప్పుడు జరిగిన కళ్యాణమే అయితే అసంభవమే. కాని ఎప్పుడూ జరిగే కళ్యాణ మది. నిత్య కళ్యాణం పచ్చ తోరణం. శివ శక్తి సామరస్యం సార్వకాలికం. ఆ సామరస్యమే కళ్యాణ మంటే. అదే లోకాని కంతా కళ్యాణం. లోకమంతా అసలా శివ శక్తి మయమే గదా. సర్వత్రా నెలకొని ఉన్నా అది మనకు దృగ్గోచరం కాదు. కొంత గోచరమైతే కొంత అగోచరం. ఒకచోట ప్రకటమైతే మరొకచోట గుప్తం. అదే కాళిదాసు వంటి దార్శనికుడైతే ఎక్కడ బడితే అక్కడ ఎప్పుడు బడితే అప్పుడు ఏది పడితే అది నిర్విశేషంగా అలికినట్టు ఏక రూపంగా దర్శించ గలడు. ఆ విశ్వ రహస్యాన్నే మనకు మరలా వర్ణించి చెప్ప గలడు. పరస్పర విలక్షణంగా విభక్తంగా కనిపించే సమస్త భావాలలో అవిభక్తంగా పరుచుకొని ఉన్న ఒకే ఒక స్వరూపాన్ని పట్టుకొంటేనే మానవుడికి తరణోపాయం. నిజమైన పరనిర్వృతీ ఉపదేశమూ ఆలంకారికు లుద్దేశించింది ఇదే. కాళిదాసాది మహాకవుల రచనా ధోరణిని తరచి చూచే వారిలాటి మాట సెలవిచ్చి ఉంటారు. మరి ఆ మహాకవి వర్ణించిన ఆ సామరస్య మేమిటో ఇంత వరకూ ఏకరువు పెడుతూనే వచ్చాము. శివ శక్తి సామరస్య మన్నందుకు ఆ పురాణ దంపతుల అన్యోన్య భావాన్నే ప్రదర్శించాడు మొదట. కాగా దానినే విస్తరించి తాను సృష్టించిన సమస్త స్త్రీ పురుష పాత్రలలోనూ వ్యంజనా మార్గంలో ఒలక పోశాడు. అది కూడా మానవ జాతిలోనే కాదు. పశుపక్షి వృక్ష లతాదులలో కూడా సాక్షాత్కరించిం దాయన ప్రజ్ఞా చక్షువుకు. ఆ మాటకు వస్తే పశు పక్ష్యాది ప్రాణులే కాదు. నదీ సముద్ర పర్వత పట్టణాదులు కూడా స్త్రీ పురుష మూర్తులే. వారిలో కనిపించింది కూడా ఆ సామరస్య రహస్యమే ఆయన దృష్టికి. హిమవంతుని ఉదంతం విన్నారుకదా. మరి ఆ హిమవంతుని బిడ్డలెవరు. పార్వతి ఒకరైతే భాగీరథి మరొకతె. ఒకరిని పరమేశ్వరుని కిచ్చి

మరొకరిని పొరవారాని కిచ్చి కృతకృత్యు డయ్యాడా గృహస్థు. శకుంతల అత్తవారింటికి వెళ్ళుతూ తన పితృ పాదులు కణ్వునికి ఏమి చెప్పిందో తెలుసా. తన చెలికత్తెలు అనసూయా ప్రియంవదల సంగతి అలా ఉంచి దీర్ఘా పాంగ మనే ఆడు జింక గర్భవతి అయినది ప్రసవించ గానే ఆ శుభవార్త నాకు తెలియజేయ మంటుంది. లతా కాంత పుష్పించగానే కబురు పంప మంటుంది. ఆవిడ బయలు దేరుతోంది అనుమతించారా అని అడిగితే అక్కడి లతా వృక్షాలన్నీ కోకిలల విరావాలతో కణ్వునికి అనుమతి ఇచ్చారంటాడు మహాకవి.

ఈ విధంగా పిపీలికాది బ్రహ్మ పర్యంతం చరా చర జగత్తు నంతటినీ సమరస దృష్టితో దర్శించి నపుడే వాడు ఋషి. అలా దర్శించి తరించమని భావుక లోకానికంతా బోధించి నపుడే కవి. ఇలాటి ఋషిత్వం కవిత్వం వ్యాస వాల్మీకుల తరువాత ఎంతగానో సాధించినవాడు గనుకనే కాళిదాసు తన రచనలలో అవి పాత్రలే గాదు - వస్తువే గాదు - సన్నివేశమే గాదు - వర్ణనే గాదు - సర్వత్రా పెద జల్లి చూపాడా భావాన్ని - ఆ భావ సామరస్యం బాణి మనసులో జీర్ణించిన వాడు కనుకనే నేమో అతడొకరిని హెచ్చని ఒకరిని తగ్గనీ భావించడు. సృష్టి అంతా శివ శక్తి విలాసమే అయినప్పుడా శివ శక్తుల వివర్తమైన శబ్దార్థ శరీరమే కావ్య సృష్టి అయినప్పు డిక న్యూనాధిక భావానికి చోటెక్కడిది. త్రిమూర్తులలో చూడలేదా తేడా ఆయన - స్త్రీ పురుషులలో చూడలేదు. అంతే కాదు. స్వర్గ మర్త్య లోకాలకూ చూడలేదు. మహీతల స్పర్శన మాత్ర భిన్న - మృద్ధం హి రాజ్యం పద మైంద్ర మాహుః - అని హెచ్చరిస్తుంది సింహం దిలీపుణ్ణి. ఎక్కడ ఉంది స్వర్గం. ఎక్కడో లేదది. భూతలం మీదనే ఉంది. అదే ఉత్తమ క్షత్రియుడి పాలనలో పొందే సారాజ్య సుఖం. రఘువంశ రాజు లెక్కడ ఉన్నారు. వారేది పాలిస్తున్నారు. వారున్నది భూలోకంలో పాలించేది భూమండలాన్ని. కాని వారి స్నేహితు డెవరో తెలుసా. దేవేంద్రుడు. స్వర్గాధిపతి. అతని కేదైనా అవసర మేర్పడితే వీరి

నిక్కడి నుంచి అక్కడికి పిలిపిస్తాడు మాతలికి రథమిచ్చి పంపి. ఆ రథం అయోధ్యకు తెస్తాడా సుర సారధి. అది ఎక్కి స్వర్గ సీమలకు వెడతారా మహారాజులు. అనాక రథ వర్త్మనా మట. నాకం వరకూ వారి రథ మార్గమే. ఏమిటీ అతిశయోక్తి. ఎలా వెళ్ళగలరని అడుగుతా రేమో. వసిష్ఠ మంత్రోత్షణజ ప్రభావాత్ - ఉదన్వ దాకాశ మహీధరేషు. కుల గురువు వసిష్ఠులవారి అనుగ్రహ ముంటే చాలు. ఆయన మంత్రించిన రథం మాతలి తెచ్చిన దివ్య రథమే కానక్కరలేదు. పార్థివమైన రథమైనా దానికి అరణ్య పర్వత సముద్రాదు లేవీ అడ్డురావు. ఆకాశ మంచులు చూడ గలదు. శకుంతల ఎక్కడ పెరిగింది. కణ్వాశ్రమంలో. ఎక్కడ ఉందా ఆశ్రమం. భూలోకంలో. మరి భర్త నిరాకరిస్తే ఎక్కడికి వెళ్ళిందావిడ. ఆశ్రమానికే. అయితే ఆ ఆశ్రమం భూలోకంలో లేదు. స్వర్గ సీమలో ఎక్కడో దూరదూరాన ఉంది. అక్కడికి వెళ్ళి కూచుందావిడ. ఇది భూ సంబంధి. అది స్వర్గ సంబంధి. ఇది కణ్వాశ్రమం. అది కశ్యపాశ్రమం. వారిద్దరూ మరలా ప్రాణ మిత్రులే ఆ మహర్షులు. ఒకరి కొకరికి రాకపోక లున్నాయి. దుష్యంతుడు కూడా అక్కడికే వెళ్ళి చూచా డావిడను. మరి ఆ శకుంతల ఎక్కడ కన్నదా భరతుణ్ణి. స్వర్గంలో. అతడా తరువాత ఏ రాజ్యం పాలించాడు. అది స్వర్గ రాజ్యం కాదు. భూరాజ్యం. ఏమిటీ వ్యవహారమంతా. జుట్టూ జుట్టూ ముడి వేసినట్టు ఎక్కడ స్వర్గం ఎక్కడ భూమి. రెంటినీ కలిపి ముడి వేశాడు మహాకవి. ఆయన దృష్టికి స్వర్గమే భూమి భూమే స్వర్గం. తేడా లేదు. పైగా స్వర్గ వాసులకు భూతలమంటే ఇష్టమట. ఉదార రమణీయా పృథివీ అని మాతలి చేతనే అనిపిస్తాడు శాకుంతలంలో. ఊర్వశి స్వర్వాసిని అయిన అప్సరస. భూలోకవాసి పురూరవు డావిడను కామించాడు. ఆవిడా ఆయనను మోహించి భరతాచార్యుని శాపానికి గురి అయింది. భూలోక నివాస సౌఖ్య మనుభవించ వచ్చు గదా అని అది ఆవిడ ఒక గొప్ప అనుగ్రహంగా భావించిందట.

పోతే హిమవంతు డెవరు. అది ఒక పర్వతం. భూతలం మీద మన అందరికీ దర్శన మిస్తున్నదది. అది దేవతలతో సంబంధం పెట్టుకొన్నది. దానికి జన్మించిం దెవరో కాదు. సాక్షాత్తూ ఆ పరాశక్తే. ఆ పర్వతం ప్రక్కనే ఉంది కైలాసం. దాని అధినేత ఈశ్వరుడు వచ్చి ఎక్కడో కాదు ఆ హిమవంతం మీదనే కూచుని తపస్సు చేస్తున్నాడు. అక్కడే కామ దహనం. అక్కడే అమ్మవారి తపశ్చర్య. అక్కడ వారి కళ్యాణం. దాని కన్ని ఊర్ధ్వ లోకాల నుంచీ బంధు మిత్ర పరివారమంతా తరలి రావటం. బ్రహ్మ వచ్చాడు. విష్ణువు వచ్చాడు. అందరూ వచ్చి ఆ పర్వతం మీదనే సమావేశ మయ్యారు. చివరకు శివ పార్వతుల చంద్రికా విహారం గూడ అక్కడే. ఇది దివ్యమూ భౌమమూ ఈ సన్నివేశం. కాళిదాసు నడిగితే అంటాడు. ఇత్యభౌమ మనుభూయ శంకరః- పార్థివం చ దయితా సఖస్సుఖం. భౌమమేమిటి. దివ్యమేమిటి. రెండూ అనుభవించారట ఆ దంపతులు. అత్తవారింట్లో ఉండి కొంత అక్కడక్కడా తిరుగుతూ కొంతా. మరి మేఘ సందేశంలో చూస్తే యక్షుడెక్కడి వాడు. అలకా నగర నివాసి. అది గుహ్యక లోకం. మనది కాదు. కాని శాప గ్రస్తుడయి అతడు వచ్చి కూచున్న దెక్కడ. రామ గిరి - చిత్రకూటా శ్రమం. పట్టుకొన్న దెవణ్ణి. మేఘుణ్ణి. వర్ణించిన మార్గమేది. పూర్వమేఘంలో మన ఈ భూమండలంలో చూచే వన నదీ పట్టణ పర్వతాదులూ - ఉత్తర మేఘంలో అతిలోకమైన యక్షలోక వృత్తాంతమూ.. ఏమిటి దంతా. ఏదో కాదు. కాళి దాస మహాకవి సమన్వయ దృష్టి. స్వర్గంలో భూమినీ భూమిలో స్వర్గాన్నీ చూస్తున్నదది. అది ఉచ్చ మిది నీచ మనే తేడా లేదా చూపుకు. అంతా త్రిపుర సుందరీ సౌందర్య విభూతే. సర్వత్రా చెదరి పడిన ఆ విభూతి శకలాలే ఒకటి స్వర్గమైతే ఒకటి భూతలమయింది. ఒకటి భూతల మైతే మరొకటి పాతాళ మయింది. పాతాళ వాసులైన రాక్షసులు స్వర్గం మీద విరుచుకు పడితే మధ్యమ లోక వాసులైన మహా రాజుల నూర్ధ్వ లోక వాసి దేవేంద్రు డర్థిస్తే అక్కడికి వెళ్ళి రాక్షసులతో యుద్ధం చేసి వాళ్ళను మట్టు పెట్టి స్వర్గ వాసుల అభినందనకు పాత్రులు కావటమా. త్రిలోకాలనూ

కలిపి ముడి వేసిన ఈ సత్సంబంధ సామరస్య మెక్కడైనా చూడగలమా మనం. ఎంత హృదయంగమ మైన సృష్టి ఇది. ఈ సృష్టిలోని ఆంతర్య మేమిటి. ఒక్క మానవుడే వాడి జీవితమే గాని మరేదీ లేదు. దైవ గుణాలూ అసుర గుణాలూ వాడిలోనే ఉన్నాయి. మొదటి దానిలో ఎంత దూరం పైకి ప్రాకితే అంత స్వర్గ సుఖ మనుభవిస్తాడు. రెండవ దానిలో ఎంత దిగ జారితే అంత పాతాళంలో పడిపోతాడు. రెంటిలో హేయాన్ని వదిలేసి ఉపాదేయాన్ని మాత్రం పట్టుకొని పోతే వివేక శాలి అయిన మానవు డవుతాడు- విజయాన్ని చవి చూస్తాడని చెప్పటమే కవి తాత్త్విక హృదయం.

దేవత లేమిటి. మానవు లేమిటి. దైవ గుణముంటే వాడే దేవత. మానవుల మధ్య తిరిగే ఆ దేవత లెవరో కారు. మహర్షులు. తపస్సంపన్ను లైన కణ్వ కశ్యపాది మహర్షి పాత్రలను కాళిదాసు సృష్టించింది ఈ దృష్టితోనే. వారు నిర్లిప్తులూ నిరాడంబరులూ. పోతే వారెవరి ఏలుబడిలో ఉన్నారో వారు మహారాజులు. భోగులూ యశో భాగులూ. వారికీ వీరికీ ముడి పెడతాడు కాళిదాసు. పైగా రాజ్యాశ్రమ మునిం మునిః - అంటాడు. వరాశ్రమ వాసులైతే ఈ రాజులూ అలాటి వారేనట. వీరి ఆశ్రమం రాజ్యమే. వీరి తపస్సు ప్రజాపాలనమే. ఏమిటీ మాట. వారు చూడని తేడా మనకు దేని కంటాడు కవి. అంతేనా. ఎంత నిరాడంబరులో అంత లౌకికు లా మహర్షులు. ఎంత భోగ జీవులో అంత త్యాగ ధనులీ రాజులు. ఈ చిత్రం చూడండి. త్యాగాయ సంభృతార్థానా మని వర్ణించాడు కవి ముందుగానే. రఘు మహారాజు దిగ్విజయం చేశాడు. ఎన్నెన్నో ధన రాసులు పోగు చేసుకొన్నాడు. ఎందుకు. తానొక్కడే పావుకోటానికా. కాదు. విశ్వజిత్తనే యాగం చేశాడు తరువాత. అది ఒక నెపం. దానితో పోగు చేసిందంతా పేద సాదలకు యాచకులకు దానం చేశాడు. నిర్ధను డయ్యాడు. ధనం సంపాదించే టపుడూ లేదు స్వార్థం. దానం చేసి నిర్ధను డైనపుడూ లేదు దాని చింత. అప్పుడు రాజైతే ఇప్పుడు తపస్వి అతడు. ఒక తపస్వి వచ్చాడాయన వద్దకు డబ్బు కావాలని.

అయినా తెచ్చి ఇస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. ఇలాగే ఆ కౌత్సుడనే తపస్వి ఉన్నాడు. అతడు సహజంగానే నిర్ధనుడు. అయినా గురువుగారి కోసం డబ్బు కోరి వచ్చాడు. తీరా కుబేరుడు కనక వర్షం కురిపించి కోశాగార మంతా బంగారు నాణాలతో నిండి అది రాజు గారు దానం చేయబోతే - నాకంత అక్కర లేదు కోరిందే ఇవ్వమంటాడా వటువు. నాకెందుకి దంతా నీకోసం కదా దేవత లిచ్చారు నీవే తీసుకు పొమ్మంటాడు రఘువు. ఎవడు తపస్వి . ఎవడు చక్రవర్తి. భోగం త్యాగం రెండూ సమానమే ఇద్దరికీ. మరి కణ్వ కశ్యపు లున్నారు. ఇద్దరూ ఇద్దరే. వారు ముక్కు మూసుకొని ఎక్కడో తపస్సు చేస్తున్నారా - కళ్ళు తెరచి చుట్టూ ఉన్న లోకంతో వ్యవహరిస్తున్నారా. తపశ్చర్యా ఉంది. లోక వ్యవహారమూ ఉంది. రెండూ ఉన్నాయి. రెండూ లేవు. కణ్వుడే అంటాడు వనౌక సోపి లోకజ్ఞా వయ మని. అసలు మహర్షుల పాత్ర రాని కావ్యం లేదు నాటకం లేదు - కాళిదాసు రచనలో. అలాగే రాజుల పాత్ర లేనిదీ లేదు. ఇరువురికీ భేంటు చేయని సన్నివేశమూ లేదు. అలా ఆ రెండు పాత్రలూ దగ్గర పడి మాటాడుతుంటే ప్రవృత్తి నివృత్తి భావాలు రెండూ ఒకదాని నొకటి పలకరిస్తున్న అనుభూతి కలుగుతుంది రసజ్ఞుడికి. ఇద్దరిలో రెండు భావాలూ మిళితం కావటం మూలాన్నే రాజులకు వన గమనమంటే ఎంతో ఇష్టం. అలాగే మహర్షులు రాజ దర్శనార్థం నగరానికి రావటమంటే నిర్భయం. సమాధి వ్యవహారం రెండూ పరస్పర విరుద్ధంగా చూడరు వారు. రెండింటినీ గొప్పగా సమన్వయించుకొన్న జీవితాలు వారివి.

వీరి విషయమే గాదు. రాజులూ ప్రజలూ - వీరిద్దరి విషయంకూడా అద్భుతం. ఆనంద దాయకం. ప్రజాః ప్రజాః స్వా ఇవ పాలయిత్వా అంటాడు మహాకవి. ప్రజలంటే ప్రజలే రాజుకు. అంటే సొంత బిడ్డలే. ప్రజానామేవ భూత్యర్థం. వారి మేలుకే వీరి ప్రతి చర్య. మరి ఆ ప్రజలో. ఆ మనో ర్వర్త్మనః పరం నవ్యతీయుః - ధర్మ మార్గం తప్పరాదు. తప్పితే శిక్ష తప్పదు. యథా పరాధ దండానాం. వారికా రాజెలా కనిపించేవాడు. అధృష్య శ్చా భి

గమ్యశ్చ). సముద్రంలాగా గంభీరుడూ ఆ కర్షణీయుడూ కూడా. దండ పారుష్యం లేదా పాలనలో. దండశైథిల్యమూ లేదు. నాతి శ్రమాప నయనాయ నచ శ్రమాయ. శ్రమ ఉందా లేదా పాలనలో. ఉందీ లేదు. ఒక ఛత్రం పట్టుకొని ఎండలో నడుస్తున్నట్టే. పట్టుకొనే కష్టమూ ఉంది. ఎండ తగల లేదనే సుఖమూ ఉంది. కేవల సుఖం కేవల దుఃఖం సృష్టిలోనే లేదు. రెండూ అగ్రాలే. అగ్రాలలో శాంతి లేదు. రెండింటి మధ్యనున్న మార్గంలోనే ఉంది సామరస్యం. చూడండి ఈ శ్లోకంలో కాళిదాసు బయటపడి ఎలా చాటుతున్నాడో ఈ సమన్వయ రహస్యాన్ని. అజ మహారాజు రాజనీతి చాతుర్యాన్ని వర్ణిస్తూ ఇలా అంటాడొక మాట. న ఖరో న చ భూయసా మృదుః - పవమానః పృథివీ రుహా నివ - స పురస్కృత మధ్యమ క్రమో - న మయా మాస రిపూ నసుద్ధరన్. ఒక మారుతం లాగా ఉండాలట దేశమేలే రాజు వ్యవహారం. గాలి బ్రహ్మాండంగా వీస్తే చెట్లు పెళ్ళగిలి పడిపోతాయి. అలాగని అసలే వీచకపోతే అవి తలలు పైకెత్తి దాన్ని వెక్కిరిస్తాయి. వీచాలి - వాటిని క్రిందికి వంచాలి. అంతేగాని పడగొట్టకూడదు. ఇదీ ఉపమానం. ఇక దీన్ని అన్వయిస్తున్నాడా రాజు ప్రవర్తనకు. ఆ రాజు కూడా శత్రు రాజుల మీదికి దండెత్తి పోయి వారిని వంచే వాడే గాని త్రుంచే వాడు కాడట. అలాటి మార్గ మాయనది. మధ్యమ మార్గం via media దీన్నే పూర్వం యవనులు Golden Mean అని పేరు పెట్టి వర్ణించారు Mean అంటే మధ్యమ మార్గమనే అర్థం. అది Golden బంగారం లాంటిది. ఏ కొస పట్టుకొన్నా సుఖం లేదు. తనకూ లేదు ఇతరులకూ లేదు. ఉభయ తారక మైనది మధ్యమ క్రమమే ఎప్పుడూ. ఎందుకని. ఉభయ లక్షణాలూ దానిలో ఉన్నాయి గనుక.

ఇలాంటి మధ్యే మార్గంలో పయనించే కవి దృష్టికీ సృష్టి అంతా ఇక బంగారమే. ఇది రమ్య మిది జుగుప్సిత మిది నీచ మిది ఉదారమనే వైషమ్యం లేదు. వైరుధ్యం లేదు. ఏదీ గుణం కాదు ఏదీ దోషం కాదు. దోషమే గుణం కావచ్చు. గుణమే దోషం కావచ్చు. దేని స్థానంలో ఏది ఉంటే అది గుణం. స్థానం తప్పి ఉంటే అది దోషం. అన్ని గుణాలూ ఒకచోట పెట్టి సృష్టించలేదే

ఆ సృష్టికర్త అని నీకూ నాకూ అని పించవచ్చు. అలా సృష్టిస్తే అది ఒక అతి. అన్నీ దోషాలే పెట్టి సృష్టిస్తే అది ఒక అతి. ఎందులోనూ సమన్వయం లేదు. సామరస్యం అంతకన్నా లేదు. సామరస్యమే సృష్టి లక్షణం. ఇది గమనించి చేసిన కావ్య సృష్టే దానికి సలక్షణం. పరాఙ్ముఖీ విశ్వ సృజః ప్రవృత్తిః అని కాళిదాస న్న మాటలో ఉన్న ఆంతర్య మిప్పుడర్థ మవుతుంది మనకు. సకల గుణాలూ ఒక చోటనే కుప్పబోసి సృష్టించ లేదా పరమేష్ఠి. అలా సృష్టించట మాయన కిష్టం లేదని వాకొనటం పొరబాటు. అలా సృష్టించటం కాదు అందం. సృష్టించక పోవటమే నిజానికి. ఎందుకంటే అందమనేది వైరస్యంలో లేదు. సామరస్యంలోనే ఉంటుందది. ఏది ఎక్కడ ఉండాలో అది అక్కడ ఉండటమే గదా ఔచిత్యమని చెప్పాము. ఔచిత్యానికి మారు పేరే సామరస్యం. అలాంటప్పు డిది హేయ మిది ఉపాదేయమనే ప్రసంగ మెందుకు వచ్చింది. కిమివ హి మధురాణాం మండనం నాకృతీనాం అని కవి లోకానికి చాటి చెప్పాడంటే ఏమిటాయన హృదయం. సరసిజ మంద మైనదే. కాని దానిని కప్పి ఉన్న శైవలమో. కాదంటావు నీవు. కాదన్నా అది అక్కడే ఉంది. అది లేకుంటే గాదు. ఉంటేనే అందమూ సరోజానికి. అలాగే శకుంతలా లావణ్యానికి వల్కలం మొరటుగా లేదట. మీదు మిక్కిలి రమ్యంగానే ఉందట. ఏకోహి దోషో గుణ సన్ని పాతే నిమజ్జతి. ఒకానొక దోషమున్నా పరవా లేదు. గుణాల నడుమ అది కూడా గుణంగానే కనిపిస్తుందట. మరీ అంత అందంగా ఉన్నా కన్నులు కొరగిస్తాయి. అసలలా ఉంటేనే కృత్రిమం. సమ పాళ్లలో ఉంటేనే సబబు. గుణా గుణాలు రెండూ పాలు పంచుకొని దేని స్థానంలో అది ఉండటమే రామణీయకం. సర్వమేవ తమసా సమీకృతం - ధి ఙ్మహత్త్వ మసతాం హతాంతరం. చీకటిని వర్ణిస్తూ అంటాడు కవి. మిట్టు పల్లాలనే తేడా లేకుండా అన్నీ ఏకంచేసి చూపుతున్న దట చీకటి. పనికి రాని వాళ్ళకు పెత్తనమిస్తే ఇంతే. మంచీ చెడ్డ తేడా చూడరంటాడు. ఇంతెందుకు. పరాఙ్ముఖీ అని ముందు పేర్కొన్నాడ కవి. చివరలో ఏమన్నాడో చూడండి అతడే మరలా. ఉన్నతేషు శశినః ప్రభా స్థితా - నిమ్న సంశ్రయి

పరం నిశా తమః - నూన మాత్మ సదృశీ ప్రకల్పితా వేధసైవ గుణ దోషయో గ్గతిః - పల్ల ప్రదేశాల్లో చీకట్లు పడిపోయాయి. ఉన్నత ప్రదేశాల్లో వెన్నెల కాంతులు ప్రసరించ సాగాయి. ఇది న్యాయమే. వాటి వాటి స్వభావానికి తగినట్టే కల్పిస్తాడ విధాత గుణ దోష విభేధాన్ని అని సమర్థిస్తాడు. ఇవి రెండూ ఒక్క సారిగా చదివితే మన కనుమానం కలగవచ్చు. కాళిదాసు సృష్టిలో వైషమ్య మేమిటని తప్పు పడుతున్నాడా లేక సమర్థిస్తున్నాడా అని. ఆక్షేపించటమూ కాదిది క్రొత్తగా సమర్థించటమూ కాదు. గుణమనీ దోషమనీ కాదు చూడవలసింది. ఏది ఎక్కడ ఉండాలో అది అక్కడ ఉంటేనే గుణం. లేకుంటేనే దోషం. అందుకే నీవన్ని గుణాలూ ఒక్క చోట ఉండాలని ఆశ పడ్డ లాభం లేదు. విశ్వ కర్త అలా కేవల గుణాన్నీ కేవల దోషాన్నీ సృష్టించటాని కిష్టపడ డని పూర్వాపరాలు కలియ బోసుకొని చూస్తే మనకు స్ఫురించే నిగూఢమైన కవి హృదయం.

కాబట్టి ఏక పక్ష పర్యవసాయి కాదు కాళిదాసు దృష్టి. అది జీవితంలో అన్ని కొసలనూ కలిపి పట్టుకొన్న సమగ్రమైన సమన్వయ దృష్టి. అది ఆదర్శ మానవ జీవితాన్ని కేంద్రంగా పెట్టుకొని అక్కడి నుంచి పరిధికి - పరిధి నుంచి మరలా కేంద్రానికీ పయనం సాగించే వాడికే అలవడుతుంది. ఎంత దూరం పయనించినా ఎంత పెద్ద వలయం గీచినా కేంద్ర బిందువును విస్మరించ లేదు. మరలా అక్కడికి రావలసిందే. అన్ని వైపులా ప్రసరిస్తూ పోయిన భావ రేఖలన్నీ మరలా ఆ బిందువులో చేరి పోవలసిందే. అప్పుడే సమన్వయ మనే మాట చరితార్థ మవుతుంది. ఏమి కారణం. మానవ జీవితమే సంసార చక్రానికి కేంద్ర స్థానం. కారణం. దృష్టాచ్చ అదృష్ట సిద్ధిః అన్నారు శాస్త్రజ్ఞులు. దృష్టాన్ని బట్టే అదృష్టం వైపు సాగి పోవాలి మన దృష్టి. మన లోకం మనకు దృష్టం. మన జీవితం మనకు దృష్టం. మన సుఖ దుఃఖాద్యనుభవాలు మనకు దృష్టం. మనమిక ఏది ఆలోచించినా ఎంత దూర మాలోచించినా అందుకోవాలని ప్రయత్నించినా - మన దగ్గరి నుంచే సాగాలా

అన్వేషణ. మరలా మన దగ్గరికే వచ్చి మనలోనే పర్యవసితం కావాలి. మన జీవితానికే అది ఫలిత మివ్వాలి. అప్పుడే మన కభివృద్ధి ఆశయ సిద్ధి. ఒక నది ఎక్కడ పుడుతుంది. కొండలో కోనలో అంటావు నీవు. కాదు. అది పుట్టేది సాగరంలో. సాగర జలమే సూర్య భగవానుడు సహస్ర ముఖాలతో పీల్చి మేఘ మండలం సృష్టి అయితే అది కొండల మీద వర్షించి సెలయేరులై నేల జారితే అవి గంగాది నదులై సాగుతూ పోతే - అవే మరలా సాగరంలో కలుస్తున్నాయి. అప్పటికి సాగర జలమే సాగరంలో చేరిపోతున్నది. అంటే ఏమన్న మాట. ఏదైనా సృష్టిలో ఒక పదార్థం తన నుంచి దూరం పోయి మరలా ఎప్పటికో ఒకప్పటికి తనలో తాను చేరిపోవటమే పరపూర్ణత. అలాగే ప్రస్తుతం మనం మన జీవితాల దగ్గరి నుంచి ముందుకు సాగిపోతున్నాము ఆయా లోకాలన్నీ విహరిస్తున్నాము మన భావనలో. తిరిగి ఆ భావనా జగత్తు నంతా తెచ్చి మన జీవితంతోనే ముడి పెట్టుకొని చూస్తున్నాము. చూచే కొద్దీ మన ఈ మానవ జీవితమే పరిపూర్ణమయి దివ్యమైన అనుభూతిని మనకు ప్రసాదిస్తుంది. ఇదీ మానవుని విజ్ఞాన ప్రపంచ యాత్ర అంతటిలో దాగి ఉన్న గొప్ప రహస్యం. ఈ పరమ రహస్యాన్ని భేదించి పట్టుకొన్న వాడే నిజమైన ద్రష్ట. దాన్ని రచనా ముఖంగా వర్ణించి చెప్పిన వాడే స్రష్ట. ఈ విలువైన శమంతక చింతామణులు రెండూ సాధించిన పెద్ద రత్నాల వర్తకుడు కాళిదాసొక్కడే కవితా వాణిజ్య రంగంలో.

చూడండి. ఆ మహానుభావుడి రచనలో ఎక్కడ ఏది వర్ణించినా మానవుడే అతని మనసులో మెదిలే పాత్ర. అతని జీవితమే ఎటు చూచినా దర్శన మిచ్చేది. స్వర్గ పాతాళా లెక్కడో లేవు. మానవ లోకం కేంద్రమైతే అవి రెండూ రెండు కొస లతని దృష్టికి. ఊర్ధ్వ లోక మొక కొస. అధోలోక మొక కొస. అవి రెండూ వాటి కోసం కాదు. మానవుని కోస మున్నాయి. మానవుడి పురోగతి కోసం అతని పురుషార్థ సిద్ధి కోస మున్నాయి. స్వర్గ మెక్కడ ఉంది. కాళిదాసు నడిగితే హిమాలయం మీదనే ఉందంటాడు.

దేవతాత్ముడు హిమవంతుడు. సిద్ధ సాధ్యాది దేవతలందరూ అక్కడే తిరుగుతుంటారు. దేవర్షులు అక్కడే తపస్సు చేస్తుంటారు. యశ్చాప్సరో విభ్రమ మండనానాం. అప్సరస లందరికీ నేపథ్య విధాన మాయన గైరికాది ధాతువులే సమకూరుస్తుంటాయి. దివిజ గంగ అక్కడి నుంచే ప్రవహిస్తుంది. కైలాసం కూడా ఎక్కడో లేదు. దానికి దగ్గరే. పరమ శివు డెక్కడో గాదు అక్కడే తపస్సు చేస్తూ కూచున్నాడు. మరి జగన్మాత ఆ హిమవంతుడి కూతురే. పితృదేవతల మానస కన్యక మేనక ఆయన అర్ధాంగి. సప్త మహర్షులు కైలాసం నుంచి వచ్చి ఆయనతో పెండ్లి మాటలు మాటాడుతారు. పోతే గౌరీ శంకరుల కళ్యాణోత్సవ మక్కడే ఏర్పాటయింది. ఆ ఓషధీ ప్రస్థమే వివాహ వేదిక. దానికి ఈశ్వరుడు తరలి రావటమలా ఉంచి ఆయనతో పాటు వచ్చిన వారెవరెవరో తెలుసా. స్వర్గవాసులైన ముప్పది మూడు కోట్ల దేవతలూ - వైకుంఠ వాసి ఆది విష్ణువూ - సత్య లోకాధి పతి బ్రహ్మ. లక్ష్మీదేవి పెండ్లి కుమారుడికి గొడుగు పడితే - సరస్వతీ దేవి శ్లోకాలు చదివి కీర్తిస్తున్నదా దంపతులను. ఇంకా చిత్రమేమంటే గంగాది నదులు స్త్రీ రూపాలలో వచ్చి వీచోపులు వీచటం. పార్వతీ పరమేశ్వరుల పెండ్లి వర్ణించినా అది దేవతల పెండ్లి కాదు. మానవ లోకంలో ఒక గొప్ప రాజ దంపతుల వివాహ వర్ణన. ఖడ్గే నిషక్త ప్రతిమం దదర్శ. ఒక క్షత్రియ కుమారుడి లాగా ఈశ్వరుడు కూడా ముస్తాబు చేసుకొని అద్దంలో కాకుండా ఖడ్గంలోనే చూచుకొన్నాడట తన సౌందర్యం. తరువాత వధూవరుల శృంగార విహారాదులు వర్ణించటం చూస్తే అది దేవతలదా మానవులదా. ఆశ్చర్య మేమంటే దేవతలను మానవుల స్థాయికి దించి అలా దించుతూనే మరలా మానవులను దేవతల స్థాయికి పెంచుతూ వర్ణించినట్టు ఒక అపూర్వమైన మధురానుభవాన్ని ఇస్తుంది ఏ వర్ణన చూచినా. కాళిదాసుకు స్వర్గ మెక్కడో లేదు. దేవత లెక్కడో లేరు. కావలసిన వన్నీ సమకూరిన ఈ భూతలమే స్వర్గం. ఇందులో ఉదాత్త భావాలతో బ్రతికే మానవులే దేవతలు.

ఇంతెందుకు. పార్వతిని పెండ్లాడాలని కైలాసంలో పరమ శివు డెంత తహ చహ లాడాడో - మానవేంద్రుడైన దుష్యంతుడు భూతలంలో కూడా అంతగానే ఆరాట పడతాడు శకుంతలను చెట్టపట్టాలని. అది చాలా చమత్కారంగా ధ్వనింప జేశాడు కూడా కవి తన మాటల్లో. క మపర మవశం న విప్ర కుర్యు - ర్విభుమపి తం యదమీ స్పృశంతి భావాః - మహాదేవుడే ఇలాటి భావ వికారాలకు లోనైతే ఇక మర్త్య లోక వాసులైన మిగతా జీవుల సంగతి చెప్పే దేముందని. చూడండి చమత్కారం. ఈశ్వరుడు హిమాలయానికి దిగి వచ్చి హైమవతిని పెండ్లాడితే - దుష్యంతుడు స్వర్గానికి పయనమై పోయి అక్కడ శకుంతలను మరలా కలుసు కొంటాడు. ఒకటి మానుష మైన స్థాయికి దించి చూపాడు - మరొకటి అతి మానుష మైన స్థాయి కెదిగించి చూపాడు మహాకవి. ఈ కవి లీల లింతే కాదు. ఇంకా ఉన్నాయి. వివాహా నంతరం నూతన వధూవరులు పురవీధుల్లో ఊరేగటం - అది వివిధ రీతుల్లో కవులు వర్ణించి చెప్పటం పరి పాటి. కాళిదాసా సన్నివేశాన్ని ఎంత సహజంగా వర్ణించాడో అంత మనోహరంగా వర్ణించాడు. ఒక్కొక్క పుర సుందరి వారిని చూడటానికి బయటికి వచ్చి నపు డొకొక్క భంగిమను చిత్రకారుడి లాగా అద్భుతంగా చిత్రించి మనకు నేత్రోత్సవం చేస్తాడు. అది కూడా కాదు. అందులోనూ చిత్ర మేమంటే దివ్య దంపతుల ఊరేగింపు నెలా వర్ణించాడో మర్త్య దంపతులను కూడా అలాగే వర్ణించటం. కుమార సంభవంలో పార్వతీ పరమేశ్వరులను దర్శించిన పౌర కాంతల విలాసాలే రఘు వంశంలో ఇందుమతి అజ కుమారులను చూచిన కాంతల లోనూ కనపడతాయి. ఎలాటి మార్పూ లేకుండా ఆ శ్లోకాలే ఇక్కడ మనకు దర్శన మిస్తాయి. మహా అయితే ఈశాన సందర్శన లాలసలు వారైతే - నరేంద్ర సందర్శన లాలసలు వీరు. ఈశాన నరేంద్ర అనే మాటలలో తప్ప లాలసలో తేడాలే దిరువురికీ. ఆలోక మార్గం సహసా వ్రజంత్యా కయాచి దుద్వేష్టన వాంత మాల్యః. బద్ధుం న సంభావిత ఏవ తావత్ కరేణ రుద్ధోపి చ కేశ పాశః - కిటికీ దాకా హడావుడిగా వస్తున్న దొకతి ఊరేగింపు చూతామని.

ఆ తొందరలో జుట్టు ముడి వీడి చెరివిన పూలదండ జారిపోయింది. జుత్తు ముడి వేసుకొందామని చేతిలోకి తీసుకొన్నదే గాని వేసుకో లేదింతకూ. విలోచనం దక్షిణ మంజనేన సంభావ్య తద్వంచిత వామ నేత్రా - మరొకతి కాటుక కుడి కంటికి పెట్టుకొని ఎడమ కంటికి పెట్టుకొనే లోపలనే ఊరేగింపు వస్తుంటే శలాక నలాగే చేత బట్టు కొని బయలు దేరిందట. ఎంత సహజ సుందరంగా ఉన్నాయో చూడండీ వర్ణనలు. ఇంతకూ ఇవి పరమేశ్వరుణ్ణి చూడాలని బయలు దేరిన పడతుల వాలకాలు. ఇవే వాలకాలు ప్రదర్శిస్తారు అజుణ్ణి చూడాలని హడావుడిగా పరుగెత్తే కాంతలు కూడా. ఆఖరకు పరస్పరేణ స్పృహణీయ శోభమని వారిని ప్రశంసించినట్టే సమ గుణ యోగమీ జంట అని వీరినీ కీర్తిస్తారా పౌరకాంతలు.

ఏమిటీ వర్ణనలను బట్టి మనం గ్రహించ వలసిన విషయం. జీవితంలో కలిగే ప్రతి అనుభవమూ దేవతల కెలాగో మానవులకూ అలాగే. వారికీ వీరికీ అనుభవంలో తేడా చూడబోడు మహాకవి. అసలు దేవతలనే వారిని మనం చూచామా. చేశామా. మానవుడి భావనే గదా. అందులో ఉన్నతమైన గుణాలతో దేవతల నూహించింది అధమమైన లక్షణాలతో దానవులను భావించింది. పోతే మానవుడీ రెండు వర్గాలకూ మధ్యస్థుడు. మధ్యే తిష్ఠంతి రాజసాః అని కదా శాస్త్ర వచనం. రజో గుణం మానవ లక్షణం. అది చలనాత్మకం గనుక అటూ ఇటూ ప్రసరిస్తుంటుంది. అలాటి దశలో తమస్సును కూలదన్ని సత్త్వాని కనుకూలమైతే అభ్యుదయం మానవుడికి. విక్రమోర్వశీయంలో ఊర్వశిని చెర బట్టు కొని పోతున్నాడు కేశి అనే దానవుడు. తోడి అచ్చర కాంతలంతా వాపోతుంటారు త్రాయధ్వం త్రాయధ్వమని. అప్పుడే సూర్యోపస్థానం నుంచి మరలి వస్తూ విన్న పురూరవుడా దానవ సైన్యాన్ని పారదోలి వారి నాదు కొంటాడు. దానికి స్వర్గాధిపతి దేవేంద్రుడు సంతసించాడట. ఇంతకూ చెప్పేదేమంటే ఊర్వశి రక్షోబంధం నుంచి బయట పడినా భయంతో కనులు మూత పడి శరీరం

Vallamraju Brahmasri Srinivasa Rao
www.advaitavedanta.in

వణకు పట్టటం మూలాన క్రమంగా మూర్ఛనుంచి తేరుకొంటున్నదట. ఎలా ఉందా దశ. గంగా రోధః పతన కలుషా గచ్ఛతీవ ప్రసాదం. గట్టు విరిగి పడి కలుషితమైన గంగా జలం మెల్ల మెల్లగా తేరుకొన్నట్టున్న దంటాడు కవి. గంగా జల మేదో గాదిక్కడ. మానవుడి బుద్ధి. అది అసుర సంపత్సంపర్కం చేత మలీ మసమైనా దాని పట్టు విడి పించుకొని అంతకంతకూ రజః స్వభావమైన ప్రయత్న బలంతో సత్త్వ శుద్ధి సంపాదించి బాగు పడాలని కవి నిగూఢమైన ఆశయం. అలాటి ఆశయ మున్నదని మన మూహించటం కాదు. కాళిదాసే ఇలాటి సూచన లక్కడక్కడా చేస్తుంటాడు మనం కొంత సవిమర్శంగా చూడగలిగితే. కృత్వా తాసా మభిగమ మపాం సౌమ్య సారస్వతానాం - అంతశ్శుద్ధ స్త్వమసి భవితా వర్ణ మాత్రేణ కృష్ణః - మేఘ సందేశంలోని శ్లోకమిది. సరస్వతి అని ఒక నది. దాని జలం సారస్వతం. అది ఒకప్పుడు బలరాముడు తీర్థయాత్రకు వెళ్ళి సేవించాడు. అదే నీవూ సేవించు. సేవిస్తే బాహ్యానికి నీవెంత నల్లనివాడవైనా ఆంతర్యంలో పరిశుద్ధుడ వవుతావని ఆశీర్వదిస్తాడు మేఘుణ్ణి యక్షుడు. ఇక్కడ ప్రస్తుతార్థ మిదే అయినా ఆ వాడిన మాటలను బట్టి ఆలోచిస్తే వేరొక గొప్ప భావం కూడా స్ఫురిస్తున్నది. సారస్వతమైన జలం సాహిత్య రసమే. దాని నాస్వాదిస్తే చాలు వాడెలాటి వర్ణంలో పుట్టినా శారీర కంగా వాడెలాటి వాడైనా మానసికంగా పవిత్రుడే. పావన చరిత్రుడే. మానవుడి నిసర్గానికీ సంస్కారానికీ ఎలాటి ముడి వేశాడో కవి. నిసర్గతః మానవులమే కావచ్చు. సంస్కార హీనులమైతే దానవులం. ఉదాత్త సంస్కార వంతులమైతే మనమే దేవతలం. బలరాముడు సేవించాడని గదా వర్ణించాడు. అతడు కృష్ణుని అగ్రజుడు. అవతార పురుషుడు. కాబట్టి దివ్య గుణ సంపన్నుడే. అతడు సేవించిన సారస్వతామృతం మేఘుడిలాంటి మానవుడూ సేవిస్తే సహజమైన రాజస తామస గుణాలకు స్వస్తి చెప్పి సాత్త్విక గుణాన్ని గడించగలడు. మేఘుడిలాగా ఘనుడనిపించుకొని భావాంబర వీధిలో విహరించగలడు. ఇంత దూరముంది ఇందులో సారస్యం. ఇదే కాళిదాసు ప్రవచించే జీవిత సామరస్యం.

ఆయన దృష్టికి మీదనే కాదు క్రిందనూ కనపడు తుంది స్వర్గం. అలాగే క్రిందనే కాదు మీద కూడా భాసిస్తుంది భూమండలం. రెండింటినీ సమరసంగా చూడగల డాయన సరసంగా వర్ణించి చూపగలడు. కుమార సంభవంలో అమ్మవారు పరమ శివుడికి పరి చర్య చేస్తూ అలసి పోయేది. అప్పు డాయన శిరశ్చంద్ర పాదాలు చల్లగా సోకి ఆవిడ తాపాన్ని హరించేవి. మరి ఆభరణా లేమైనాయో ఏమో. పద్మ రాగాల బదు లశోక పుష్పాలూ - కనకానికి బదులు కర్ణికారాలూ ముత్యాల దండలకు బదులు సిందువారాలు ధరించిందావిడ. పిమ్మట తపస్సు గావిస్తుంటే ఆవిడను చూచి కపట బ్రహ్మచారి చాలా బాధ పడతాడు - పెదవుల కోష్ఠ రాగం లేదని పాదాలకు అలక్తకం లేదని. ఇందులో చమత్కార మేమంటే అది లేకపోవటమూ ఉండటమూ ఒకటే. సహజ కాంతులు విరజిమ్మే రంగు రంగుల పుష్పాలు కృత్రిమంగా చేయించుకొన్న సొమ్ములకు తీసిపోవు. కిమివహి మధురాణాం మండన మని గదా తానే చెప్పాడొక సుభాషితం. సుందరమైన రూపాని కంతా సుందరమే. ఇంకొక్క చక్కని సన్నివేశ మిక్కడ ఉదాహరించి తీరాలి. అద్భుతమైన వర్ణనమది. పరమేశ్వరుడు కైలాస గిరి మీద ముస్తాబు చేసుకొంటున్నాడు పెండ్లికి. కానీ పెండ్లి కొడుకుకే ఆభరణాలూ లేవు. ఆది భిక్షువాయె. ఎక్కడి నుంచి వస్త్రాయా భరణాలు. అందుకే బభూవ భస్మైవ సితాంగ రాగః. భసితమే అనులేపన మయింది. కపాల మేవామల శేఖర శ్రీః. కపాలమే కిరీటమైంది. ఉపాంత భాగేషుచ రోచనాంకో గజాజినస్యైవ దుకూల భావః. గోరోచన కాంతు లు చిమ్మే అంచులు గల గజ చర్మమే పట్టు దుకూల మయిందట. ఫాలనేత్రమే ఎఱ్ఱని తిలక మయిందట. ఇదంతా అలా ఉంచండి. యథా ప్రదేశం భుజగేశ్వరాణాం కరిష్యతా మాభరణాంతరత్వం - శరీర మాత్రం వికృతిం ప్రపేదే తథైవ తస్థుః ఫణ రత్న శోభాః. ఒంటి మీద ధరించిన సర్పాలన్నీ ఆయా స్థానాలలో వాటికనురూపమైన అలంకారాలుగా మారాయట. అయితే శరీరాల వరకే ఆ మార్పు. పడగల మీద ఉండే రత్నాలు మాత్రం మార నక్కర లేదు కాబట్టి అలాగే ఉండి

పోయా యంటాడు కవి. ఏమిటిది. ఇత్యద్భుతైక ప్రభవః ప్రభావా త్తని తరువాత చెప్పబోతాడు. పరమేశ్వరుడు గదా ఆయన . అలంకారాల కేమి లోటు. భసితమే అను లేపనం. అంటే భస్మం అనులేపనంగా మారింది. కపాలం కిరీటంగా మారిపోయింది. ఇలా అన్నీ ఆభరణాలుగా మారాయని అర్థం చేసుకోవాలి మనం. సర్ప శరీరాలు అలా మారాయనే గదా కంఠోక్తిగా వర్ణించాడు. ఎలా మార గలిగాయంటే ప్రభావాత్. ఆయన ప్రభావ మలాంటిది. పరాశక్తి ఆయన వశంలో ఉన్నప్పుడిది ఎంతపాటి విషయమని తాత్పర్యం. మరొక దృష్టితో మాటాడితే భస్మమూ అంగరాగమూ అనే తేడా లేదు - రెండూ ఒకటే పరమేశ్వరుడికి. కాదు కాదు. కవీశ్వరుడికి. ఏకైశ్వర్యే స్థితోపి ప్రణత బహుఫలే యః స్వయం కృత్తి వాసాః. అనే మాళవిక నాందీ శ్లోకమే బయట పెడుతున్నదీ సామరస్యం మనకు. గజ చర్మం ధరించి అదే ఐశ్వర్యమని భావిస్తా డీశ్వరుడు. అర్ధ శరీరంలో కాంతను ధరించి కాముకుణ్ణే కానంటాడు. ఈశ్వరుడు కాదనటం. ఈశ్వరుడి మీద నెపంపెట్టి కవీశ్వరుడైన కాళిదాసు. దేవాది దేవుని నిర్లిప్తతను వర్ణించాడంటే మానవుల నలాటి భావ మలవరుచుకో మని చెప్పటానికే గదా. మరి మానవు డలాటి ఉదాత్త గుణ మలవరచు కొంటే వాడు దేవతే. అదే గదా రఘు వంశ రాజులను గూర్చి చేసిన వర్ణన. అసక్త స్సుఖ మన్వ భూత్తని వారిని వర్ణిస్తాడు కవి. ఏది అనుభవించినా అందులో నిమగ్నమయి పోకుండా అనుభవిస్తారట వారు. అనుభవించటం మానేయ లేదు. అలాగని దానిలోనే పడిపోరు. ఇదే అనాసక్తి యోగమంటే. ఇలా దేవతలను మానవులను ఒకరి స్థాయికి మరొకరిని చేర్చి వర్ణించట మొక్క కాళిదాసుకే తగు. ఇది ఆయన రచనలో చూడగల ఒక గొప్ప సామరస్యం.

ఇంతే కాదు. ఇంత కన్నా దూరం పోయాడు కవి. మానవులలోనే హెచ్చు తగ్గు లెన్నో ఉంటాయి. అవి వారి వారి సంస్కారాన్ని బట్టి ఏర్పడుతుంటాయి. అవన్నీ వాటి వాటి స్థానంలో చూచి సానుభూతితో

వ్యవహరించాలి గాని ఇదేమి ఇలా ఉంది - అదేమిటలా ఉందని ఆక్షేపించ రాదు. ద్వేషించరాదు. ఈ చరా చర సృష్టి త్రిపుర సుందరి లీలా విభూతే అని గదా చెప్పాము. ఇందులో ఒకటి ప్రియ మొకటి అప్రియమనే మాట కర్థం లేదు. అయితే అంతా ప్రియమే కాకుంటే అంతా అప్రియమే. దేని స్థానంలో అది సముచితం. కనుకనే పరమేష్ఠి దాని నలా సృష్టించాడు. అది గుర్తించే కవి పరమేష్ఠి ఇలా చేసి చూపుతున్నాడు కావ్య సృష్టి. కాళిదాస కవి కృతులలో ఎక్కడ ఎన్ని పాత్రలు మన కనులముందు మెదులుతున్నా - వారిలో ఎన్ని హావ భావాలు వర్ణించినా - వారందరి మీద మనకు సానుభూతి కలిగే లాగే వర్ణిస్తాడు కాళిదాసు. అసలా పాత్ర లొకరితో ఒకరు వ్యవహరించే టపుడు కూడా సమరస భావమే కనిపించేలా చేస్తాడు. ఒక మాళవికాగ్ని మిత్రమే తీసుకొని చూడండి. అగ్ని మిత్రు డున్నాడు. ఆయన ఒక దేశ మేలే మహా రాజు. ఎంతైనా దర్జాగా దర్పంగా ఉండవచ్చు. ఉండడు. విదూషకుణ్ణి తనకు సరి సమానంగా భావిస్తాడు. ఎవడీ విదూషకుడు. ఒక పేద బ్రాహ్మణుడు. ఏదో కొంత విద్యా బుద్ధు లున్నవాడు కావచ్చు. రాజు గారిని రాణీగారిని ఆశ్రయించుకొని వారి మనసుకు వినోదం కలిగిస్తూ తదనుగ్రహంతో కాలం గడుపుతుంటాడు. అయినా వారాయనను తక్కువగా చూడరు సరిగదా. అతడు వారితో ఎంతో చనువుగా ప్రవర్తిస్తూ కూడా బ్రాహ్మణుడనే గౌరవం నిలపెట్టుకొంటాడు. ఆ మాటకు వస్తే కాళిదాసు నాటకాలలో ముగ్గురు విదూషకులూ ఇంతే. పోతే కేవలం తిండిపోతే గాక రాజుకు ప్రియా సంగమాదులలో సలహాలిస్తూ సహాయం కూడా చేస్తాడు ఈ నాటకంలో విదూషకుడు. మరి గణదాసాక నాట్యాచార్యుడు. రాణీ గారికి సన్నిహితుడు. రాజు గారికి కూడా ఇష్టుడే కాని ఎటువచ్చీ మాళవిక అతని శిష్యురాలు. పట్టపురాణికి రాజుకు మాళవిక కంటబడట మిష్టంలేదు. అది తెలిసి రాజూ విదూషకుడూ పన్నాగం పన్నుతారు గణదాసుకు హరదత్తుడనే మరొక నాట్యాచార్యుడితో తగాదా కల్పించి. శాస్త్ర జ్ఞానం కాదు - ప్రయోగించి చూపమంటారు నాట్యం. దానితో మాళవిక బయట పడక తప్పింది కాదు.

అచ్చం దేవి అయితే పక్షపాతిని అని చెప్పి పండిత కౌశికి సమక్షంలో మాళవిక అభినయం ఏర్పాటు చేయమంటాడు రాజు. ఇందులో రాజుగారి దగ్గర నాట్యాచార్యులిద్దరూ పేచీ పడుతుంటే రాజు ఎటూ మాటాడడు. ఇద్దరినీ ఆదరిస్తాడు. దేవి మనసు కూడా నొప్పించడు. పరివ్రాజిక అయిన కౌశికి కెంతో గౌరవ మిస్తాడు. ఆవిడ ఎవరో కాదు. మాధవ సేన సచివుడు సుమతి అనే వాడి సోదరి. రాజుకు దగ్గరివారు వారంతా. ఇంతకూ చెప్ప వచ్చే దేమంటే విదూషకుడు మొదలుకొని పట్టపురాణి వరకూ తనకన్నా తక్కువ వారైనా ఎక్కువవారైనా స్త్రీలను గాని పురుషులను గాని ఎవరినీ దూరంగా చూడడు రాజు.

ఈ ఒక్క అగ్ని మిత్రుడే కాదు. ఆ మాటకు వస్తే మిగతా నాటకాలలో కూడా ఏ కథా నాయకుడైనా ఇదే బాణీ. పురూరవుడైతే దేవతలు దేవేంద్రుడి మాట అటుంచి ఆపదలో చిక్కి తన్ను శరణు వేడిన అచ్చర లేమలనే ఎంతో ఆదరిస్తాడు. ఊర్వశినే గాదు రంభాదులైన ఆవిడ చెలికత్తెలను కూడా మర్యాదగా పలకరిస్తాడు. ఊర్వశి ప్రేమ వాగురలో తగులుకొన్నా కట్టుకొన్న పట్టపురాణిని విస్మరించడు. తక్కువగా చూడడు. ఆవిడ కెక్కడ కోపం వస్తుందో నని తాపత్రయం. శాకుంతలంలో దుష్యంతు డిక చెప్పనే అక్కరలేదు. కణ్వ కశ్యపులంటే ఆయనకు దైవ సమానులు. వారి యెడల చూపే గౌరవ ప్రపత్తు లెనలేనివి. కశ్యపుణ్ణే అయినా చివర సారిగా చూచాడేమో గాని అసలు కణ్వుణ్ణే చూడనే లేదు. ఏడంకాల నాటకంలోనూ ఒకరికొకరు తటస్థ పడనే లేదు. అయినా కణ్వుడికా రాజంటే అభిమానం. రాజుకాయన అంటే గౌరవం. తన పరోక్షంలో ఆశ్రమంలో ప్రవేశించి కూతురిని చెట్ట బట్టి ఆవిడ గర్భవతి అయిన సంగతి తెలిసి కూడా ఆగ్రహించలేదా మహర్షి. అలాగే ఆయన తన దగ్గరికి శిష్యులను పంపాడని తెలిసి వారినా మహర్షిని చూచినట్టే భక్తి తాత్పర్యాలతో చూస్తాడా రాజు. శకుంతలనే గాక ఆవిడ ప్రియ సఖులను కూడా అభిమానిస్తాడు. తుదకు శాప గ్రస్తుడై కూడా తన్ను

ఉపాలంభించే అంతఃపుర కాంతల మాటలకు కూడా ఆగ్రహించడు. తన బంధు వర్గమే గాదు. స్వర్గం నుంచి వచ్చిన సుర సారధి మాతలిని కూడ బహుమాన పురస్సరంగా చూస్తాడు. నౌ వ్యసనంలో కన్ను మూసిన ధన మిత్రుడనే సార్థ వాహుడి కుటుంబ విషయం తలచుకొని బాధ పడతాడు. అంతకు పూర్వం శకుంతల పోగొట్టుకొన్న తన అంగుళీయకం దొరకిందని తెలిసి ఆ బెస్త వాడిని మెచ్చుకొని వాడికెంతో బహుమాన మందజేస్తాడు. ఇలా కథానాయకులైన రాజులే కాదు. వారితో వ్యవహరించే మిగతా పాత్రలు కూడా కనిపిస్తారు. రాజులు మహర్షులనూ వారి శిష్యులనూ దేవతలనూ - ఇలాటి వారిని సగౌరవంగా చూస్తే వారూ ఆ రాజులను సాభిమానంగా చూస్తారు. పరస్పరం వారు చూపే గౌరవ మర్యాదలు కవి వర్ణిస్తుంటే ఎంతో ముచ్చటగా ఉంటుంది వినటానికి. పోతే రాజులెంత రసికులైనా దేవేరుల మనసెక్కడ నొచ్చుకొంటుందో నని పడే భయ సాధ్వస సంకోచాదులు చూస్తే మరీ ముచ్చట వేస్తుంది. ఎలాగైనా వారి నొప్పించి వారి అనుమతి తోనే ద్వితీయలను స్వీకరించిన సన్నివేశ మింకా వినోదకరం మనకు.

ఇలా మానవులు మానవుల సంబంధమే గాదు. మానవులకు తక్కువ జాతి అని మనం భావించే పశు పక్ష్యాదులూ కడకు లతా వృక్ష గుల్మాదులూ - వీటి విషయంలోనూ ఇదే సామరస్యం చూస్తూపోతుంది మహాకవి దృష్టి. శాకుంతలంలో కథానాయిక శకుంతలకు అనసూయా ప్రియం వద లెంత ఆప్తులో వన జ్యోత్స్న అంతకన్నా ఆప్తమైనది. దీర్ఘాపాంగమని ఒక జింక పిల్ల ఉన్నదా ఆశ్రమంలో. అదంటే ప్రాణ మావిడకు. ఎంత ఇష్టమంటే అది సర్వ స్సగంధేషు విశ్వసితి. ప్రతి ఒక్కరూ లోకంలో తన జాతి వారంటే అభిమానం చూపుతారని దుష్యంతుడు కూడా పరిహాస మాడుతాడు. ఆఖరుకు ఏషా గర్భ మంథరా వధూ ర్యదా అనఘ ప్రసవా భవతి - తదా మహ్యం కమపి ప్రియ నివేద యిత్సకం విసర్జ యిష్యథ. గర్భవతి అయిన ఈ హరిణాంగన ప్రసవిస్తే ఆ శుభవార్త నాకు వెంటనే తెలియ జేయు మంటుంది

అత్తవారింటికి వెడుతూ శకుంతల తండ్రితో. మరి ఆవిడను సాగనంపే టపుడా మహర్షి అడగకుండానే క్షౌమం కేనచి దిందు పాండు తరుణా మాంగల్య మావిష్కృతం. ఆశ్రమ వృక్షాలే ఒకటి పట్టు చీరలు సమకూరిస్తే ఒకటి పాదాలకు లత్తుక సవదరిస్తే - ఇక కొన్ని వన దేవతా హస్తాల నుంచి నవాభరణాలనూ కుమ్మరిస్తాయి. ఈ వన దేవత లేమిటో వన జ్యోత్స్న లేమిటో - వారితో ఈ మానవుల కనుబంధ మేమిటో. కాళిదాసే కలిపాడీ సామరస్య సూత్రంతో ఇరువర్గాలను. వీరికే ఏమి వచ్చె. శకుంతల వెడుతున్నది - మరలా ఎప్పుడు చూస్తారో - మీరావిడకు అనుమతి ఇచ్చారా అని మహర్షి అక్కడ ఉన్న వృక్ష లతాదుల నడిగితే - అనుమత గమనా శకుంతలా తరుభి రియం వనవాస బంధుభిః - అనుమతి ఇచ్చా మన్నాయట అవి. ఏదీ ఎలా ఇచ్చాయి - ఇచ్చాయని ఎలా ఋజువని అడిగితే అదుగో వాటిమీద నివసించే పక్షులు చేసే కిల కిలా రావాలే అనుజ్ఞా వచనా లంటాడు కవి. ఎలాంటి వట ఆ వృక్షాలు. వనవాస బంధువులు. శకుంతల ఆశ్రమంలో పుట్టి పెరిగి నప్పటినుంచీ ఆవిడకు విడరాని చుట్టాలట అవి. ఈ విధంగా చెట్లూ చేమల దగ్గరినుంచీ మహర్షులూ దేవతల వరకూ అన్ని భూమికలతో సంబంధమే మానవుడికి.

రఘువంశంలో దిలీపుడు సుదక్షిణతో కలిసి వసిష్ఠాశ్రమానికి ప్రయాణం చేస్తూ మార్గ మధ్యంలో ఘోష వృద్ధులు తమ్ము చూడటానికి వస్తే దారి ప్రక్కనున్న చెట్ల పేర్లేమిటని వారినడిగి తెలుసుకొంటాడు. మహారాజేమిటి. గ్రామీణులైన ప్రజలేమిటి. వారితో సంభాషణ మేమిటి. ప్రజార్థై గృహమేధినా మని దేశ ప్రజల కోసమే గృహస్థాశ్రమం స్వీకరించిన నిస్స్వార్థ జీవులా రాజులు. ఎలాటి స్థాయిలో ఉన్న ప్రజానీక మైనా సమానమే వారి దృష్టికి. చెట్లూ చేమలు కూడా ప్రాణులే. ఎన్నో విధాల ఉపయోగ పడుతున్నాయి మానవ జాతికవి. అది గ్రహించిన సహృదయులు గనుకనే అవి అన్నా సానుభూతి ఆ రాజన్యులకు. అంతే కాదు. సంతానం కోసమని

సేవిస్తూ వచ్చాడొక ధేనువు నామహాత్ముడు. అది మామూలు ధేనువుగా దాయన పాలిటికి. కామ ధేనువు. తల్లి లాగా సేవించాడు దాన్ని. అది ఆ రాజును బిడ్డలాగే చూచింది. ఉత్తిష్ఠ వత్సే త్యమృతాయ మానం వచః. లే నాయనా అని తన్ను సంబోధించిన దాని మాట అమృతంలాగా సోకా యా యన చెవులకు. దానికొక ఆపద కలిగిందంటే ఆయన మనసు నలిగి పోతుంది. తన శరీరమైనా త్యాగం చేస్తానని కూచున్నాడు చివరకు. ఇది చూస్తే విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని అని భగవద్గీత బోధించే సమదర్శనం జ్ఞప్తికి వస్తుంది. మరలా ఈ గోమాత రఘువు యుద్ధంలో మూర్ఛ పోయినపుడు సాక్షాత్కరిస్తుంది. దాని పంచితంతో కనులు తుడుచుకొంటే ఆ రాజుకు అలౌకికమైన చూపు లభిస్తుంది. గోవు గోవు గాదు. సాంకేతికంగా చెబితే జ్ఞాన స్వరూపిణి జగన్మాత పరాశక్తి. గో అంటే జ్ఞానమనే అర్థం. పరశక్త్యు పాసనే సర్వాభీష్ట ప్రదాయిని అని కవి ఆంతర్యం. కాళిదాసుడు గదా ఆయన. ఇది గాక ఏ ముంటుం దిక కవి హృదయం. దీనికి తగినట్టు ఆ ధేనువు అరుణ వర్ణ. అరుణ ప్రభా భాసుర ఆ మహాదేవి కూడా. పోతే ఒక గోవేమిటి అశ్వమేమిటి. ఆ రాజులకు ప్రజలెంతో సమస్త ప్రాణులూ అంతే. పాలనీయులే. దశరథుడి వేట వర్ణన చూచాము గదా. హరిణాంగన హరిణ వల్లభుని బాణపాతం తగలకుండా అడ్డుపడితే బాణ ముపసంహరించ వలసి వచ్చిందాయన. తన అశ్వాని కతి సమీపంలో ఎగురుతున్న మయూరాన్ని కూడా తన కాంత కబరీభరం గుర్తుకు వచ్చి చూస్తూ కూడా కొట్టలేక పోయాడు. చమరీ మృగాల వాలం మాత్ర మూడగొట్టి ప్రాణాలు కాపాడుతాడు. ఏమిటీ వ్యవహారం. మానవులెంతో జంతువులూ పశులూ అన్ని ప్రాణులూ అంతేనని సమరస భావ మందివ్వటమే కవి హృదయం. ఇక రామ చంద్రుడికైతే పంపా సరస్సు దగ్గరి నుంచీ జటాయువు నుంచీ గంగా సాగరాల నుంచీ కడకు సీతా దేవి కాలి అందె వరకూ అంతా బంధు కోటే. ఆయన కుమారుడు కుశ మహారాజేమీ తక్కువ వాడు కాడు. అర్ధ రాత్రి వేళ పడక గదిలోనికి ముక్కూ మొగం తెలియని పడతి వచ్చి కనిపిస్తే

ఆవిడ ఉద్దేశం తెలిసే వరకూ గాబరా పడ్డ ఋజు వర్తనుడు. తెలిసిన తరువాత ఆవిడ తన బాధలు చెప్పుకొంటుంటే విని ఎంతగానో జాలి పడ్డ రసార్ద్ర హృదయుడు. పితృ దత్తమైన కంకణం సరస్సులో పడి మాయమైతే అమోఘమైన శరంతో సరోవరాన్ని ఒక నేలకు కోలకు తెచ్చి - అది ఎరిగి నాగరాజు పాతాళం నుంచి వచ్చి కుముద్వతి అనే కన్యతో సహా ప్రత్యక్షమై కంకణాన్నీ కన్యామణినీ సమర్పిస్తే సమాధాన పడతాడు. ఎక్కడి పాతాళం. ఎక్కడి భూలోకం. భూలోక వాసికి పాతాళ వాసిని నాగకన్య సహధర్మ చారిణి. ఆ నాక రథ వర్త్మనా మని నాకం వరకూ రథం నడపిన రాజన్యులకు నాగం వరకూ దృష్టి సారించట మొక విశేషమా. రెండు కొసలూ స్పృశించిన జీవితాలవి. అలాటి మానవ జీవితమే పరిపూర్ణ జీవితమని కవి వివక్షితం.

కుమార సంభవంలో చూడండి. ఇక జడం లేదు. చేతనం లేదు. ప్రకృతి అంతా ఏకమే. మానవుడికి సృష్టి అంతా విహార రంగమే. జడమైన పర్వతంతో ప్రారంభ మయింది కథా గమనం. జడమా అది. చేతనాలలో చేతనం. అచేతనాలలో అచేతనం. పితృదేవతల మానస కన్య మేనకను వివాహ మాడింది పర్వతం. గంగా గౌరీ లనే కన్యలను కాంచింది. అంతకు ముందే మైనాకుడనే కుర్రవాడికి జన్మ నిచ్చింది. ఈశ్వరుడు తన కతిథిగా వస్తే ఆశ్రయ మిచ్చింది. కుమార్తె చేత ఆయనకు పరిచర్య చేయించింది. చివరకు సప్త మహర్షులతో పెండ్లి మాటలు మాటాడింది. అప మేఘోదయం వర్షం. మీరాక మేఘం లేని వర్షం మా పాలిటికి. జంగమం ప్రేష్య భావేవః స్థావరం చరణాంకితం. నా జంగమ దేహం మీ సేవకైతే నా స్థావర శరీరం మీ నివాసాని కర్పిత మంటుంది. దానికి వారే మంటారో తెలుసా. మనసః శిఖరాణాం చ - సదృశీ తే సమున్నతిః. నీవు మహానుభావుడవు. నీ శిఖరాలకు తగినట్టే అత్యున్నత మైనది నీ మనస్సు అని అభినందిస్తారు. ఏమిటీ చిత్రం. ఏది అచేతన మిందులో ఏది చేతనం. చేతనా చేతనాల పరస్పర సంవ్యవహార మెంత అద్భుతంగా సాగిందీ వర్ణనలో. ఇంతకన్నా సామరస్య మేముంది

సృష్టిలో. అంతకు ముందు పరమేశ్వరుడు తపస్సు చేస్తుంటే అకాల వసంతోదయాని కా వన మంతా పులకిస్తుంది. జంతువు లేమిటి పక్షు లేమిటి వృక్ష.లేమిటి. అన్నీ కూడా అక్కడ ఉన్న ప్రమధ గణాలతో కింపురుష గంధర్వాదులతో చేతులు కలిపి శృంగార విలాసాలతో సమానంగా పాలు పంచుకొంటాయి. అమ్మవారి తపస్సుకైతే షడృతువులూ సాక్షులే. విద్యుల్లతలనే కనులు మూస్తూ తెరుస్తూ కనిపెడుతూనే ఉన్నది వర్షా లక్ష్మి ఆవిడ తపోదీక్ష. కనురెప్పల మీది నుంచి ప్రయాణం చేసి నాభి రంధ్రం చేరే వరకూ ఆ త్రిపురసుందరీ విగ్రహాన్ని సేవిస్తూనే ఉన్నాయి వర్షాగ్ర బిందువులు.

పోతే ఇక విక్రమోర్వశీయ మేఘ సందేశాలది ఒక లోకం. భూలోక వాసి పురూరవు డేమిటి దేవలోకంలో విహరించట మేమిటి. దేవలోక వాసిని ఊర్వశి ఏమిటి. భూతలం మీది కవతరించి ఈ రాజుతో క్రీడించట మేమిటి. తుదకావిడ కుమార వనంలో ప్రవేశించి లతగా మారట మేమిటి. అది గానక పెర్రి వాడయి ఆ రాజు ఈ కొండా ఆ కోనా క్రుమ్మరట మేమిటి. సృష్టినంతా పన గలిపి చూపిన ఘట్టమిది. ఈ సందర్భంలో ఆయన పలకరించని మృగం లేదు. పక్షి లేదు. పర్వతం లేదు. మేఘం లేదు. మేఘోదర వినిర్ముక్త శంపాలత లేదు. అన్నీ ఆయన సంబోధించ దగినవే. సానుభూతి చూప వలసినవే. సమస్తమూ మానవుడికి క్రీడా రంగమే ఈ ప్రకృతి. జడ చేతన మనే వివక్ష లేదు. చేతన సృష్టిలోనూ ఆ కీట మూ కైటభమూ సమాన జాతీయమే. విజాతీయ మేదీ కాదు. మానవుడి చిత్త స్పందానికి ప్రతి స్పంద మివ్వ వలసిందే ప్రతిదీ. ఇచ్చిందని కూడా వర్ణిస్తాడు కాళిదాసు. సర్వ క్షితి భృతాం నాథ - దృష్టా సర్వాంగ సుందరీ - రామా రమ్యే వనాంతేస్మిన్ - మయా విరహితా త్వయా. సమస్త భూమండలాన్నీ ధరించే ఓయీ ఈ వనాంతంలో ఒక సర్వాంగ సుందరి నాచేత విరహిత అయినది నీ చేత దృష్ట అయినదా అని అడిగాడొక పర్వతాన్ని ఆ రాజు. అడిగితే అది ఆయన కలాగే జవా బిచ్చింది. పర్వతం గదా అది. పర్వత

గుహ ఆయన చేసిన ధ్వనికి ప్రతి ధ్వనించింది. ప్రతిధ్వనిస్తే అది తన ప్రశ్నకు సరి అయిన సమాధానంగా భావించా డాయన. చూడండి చమత్కారం. ఈ పద్యం ప్రశ్న అనుకొంటే ప్రశ్న. సమాధాన మనుకొంటే సమాధానం. క్షితిభృత్తంటే పర్వతమూ కావచ్చు. దేశమేలే ప్రభువూ కావచ్చు. ప్రభువు క్షితిభృతాం నాథ అని సంబోధిస్తే అదీ ఆయనను క్షితిభృతాం నాథ అని పలకరించటం సబబే. పోతే మయా విరహితా త్వయా దృష్టా. నేను కోలుపోయినది నీకు కనపడిందా అని రాజు గారి మాట అయితే త్వయా విరహితా మయా దృష్టా. నీకు దూరమైనది నాకు కనిపించిందని దాని మాటగా భావించాలి ఈ వాక్యాన్ని. అలాగే భావించి భ్రాంతి పడ్డ డంటాడు మహాకవి.

వాస్తవమే. మానవుడెలా భావిస్తే అలాగే కనిపిస్తుందీ ప్రకృతి. భావనను బట్టే అనుభవం. వస్తు సిద్ధం కాదేదీ. బుద్ధి సిద్ధం. బుద్ధి సవ్యంగా చూస్తే ప్రకృతి అంతా సవ్యమే మనకు. అపసవ్యంగా చూస్తే అపసవ్యమే. మేఘసందేశ మంతా ఈ సూత్రం మీదనే నడచింది. కాకపోయినా మేఘుడెవడు. యక్షుడెవడు. ఇద్దరికీ ఏమిటా అన్యోన్య వ్యవహారం. ఒక రచేతనం. ఒకరు చేతనం. కవే అన్నా డా మాటకు వస్తే. ధూమజ్యోతి స్సలిల మరుతాం సన్నిపాతః క్వ మేఘః - సందేశార్థాః క్వ పటు కరణైః ప్రాణిభిః ప్రాపణీయాః. ప్రాణం లేని మేఘం సందేశాన్ని అందించట మేమిటి. అసలెలా సంభాషించాడు దానితో ఆ యక్షుడు. కామార్తా హి ప్రకృతి కృపణాః అని కవి సమాధానం. కామమోహితు డతడా సమయంలో. ఎవరితో ఏమి మాటాడుతున్నాడో అతనికే తెలియదు. చేతనా చేతన వివేకం లేకనే అలా వ్యవహరించాడట. అలాటి భావంతోనే సంతప్తానాం త్వమసి శరణం అని దాన్ని శరణు వేడాడు . తన అభీష్టం నెరవేర్చ గల ఉదారత కూడా అతని కుందని విశ్వసించాడు. పుష్కరావర్తక వంశంలో పుట్టిన పెద్దమనిషా మేఘు డతని పాలిటికి నిజంలో ఒక ఆపద్బాంధవుడే. యక్షుడికి మేఘుడు మిత్రుడైతే ఆ మేఘుడి కెవరో తెలుసా వయస్యుడు. ఆ చిత్ర కూటమనే

పర్వతం. కాలే కాలే భవతి భవతో యస్య సాంగత్య మేత్య - స్నేహ వ్యక్తి శ్చిర విరహజం ముంచతో బాష్ప ముష్ణం. ప్రతి వర్షర్తువులో వచ్చి తన మిత్రుణ్ణి కలుసు కొంటుందా మేఘం. అలా కలుసు కొన్నప్పుడు బహుకాలం దాన్ని ఎడబాసిన విరహాశ్రువులు వాన జల్లులనే నెపెంతో రాలుస్తుందట. అలాటి మిత్రుడికి ఆ పృచ్ఛస్వ వీడుకోలిచ్చి వెళ్ళమంటాడు దాన్ని. దారిలో ఇక దానికెన్ని హెచ్చరికలు చేస్తాడో సలహా లిస్తాడో చెప్పలేము. వాన కోయిలల దాహం తీర్చే వదాన్యుడుగా - వారకాంతల నఖక్షత వేదన తీర్చే రసజ్ఞుడుగా - జానపద స్త్రీల చూపులకొక అందగాడుగా - సారస్వతాం బువులు సేవించే ఒక సంస్కార వంతుడుగా - ఆదిమ దంపతుల నారాధించే ఒక సేవకుడుగా తుదకు విద్యుత్కళత్రాన్ని విడిచి ఉండని ఒక సద్గృహస్థుడుగా - తన కాంతకు సాంత్వన వచనాలు చెప్పే ఒక ఆప్త మిత్రుడుగా - ఎన్ని విధాల దర్శిస్తాడో వర్ణించలేము. మేఘుణ్ణి ఇలా భావించటమే గాదు. అక్కడక్కడ పర్వతాలు పట్టణాలు నదులు ఉద్యాన వనాలు ప్రకృతిలో అన్ని దృశ్యాలూ - అవి చేతనమా అచేతనమా అని తేడా లేదు. సర్వం జగన్నాథ మన్నట్టు అంతా మానవుడి కాంతరంగికమే. జీవిత సర్వస్వమే. యక్షుణ్ణి నెపంగా చేసుకొని అలాగే భావించాడు వర్ణించాడు మహాకవి. ఇలాటి అద్భుతమైన సామరస్యమే ఆయన రచనా రహస్యం.

దేశానికి వ్యాపించిందీ సామరస్య దృష్టి కాలానికి వ్యాపించింది - వస్తు ప్రపంచానికీ వ్యాపించింది కాళిదాసులో. ఒక విధంగా చూస్తే మూడు కావ్యాలూ మూడింటి కుదాహరణ ప్రాయంగా చెప్పినా చెప్పవచ్చు. పర్వతంతో ప్రారంభమయి పర్వతంతో సమాప్త మయింది కుమారసంభవం. మధ్యలో కథ ఎన్ని పోకడలు పోయినా దైశైక్యాన్ని వదలలేదు కవి. పోతే రఘువంశంలో దిలీపుడు మొదలుకొని అగ్నివర్ణుడి వరకూ ఆయా రాజుల హయాము లెన్ని గడిచాయో చెప్పలేము. కాని అన్ని జీవితాలూ శైశవే భ్యస్త విద్యానా మని ఒకే ఒక ప్రణాళిక మీద సాగి పోయాయి. ఇది కాలైక్య దృష్టిని పట్టి ఇస్తున్నది.

ఇక మేఘ సందేశ మంటారా. రామగిరి నుంచి అలకా నగరం దాకా ఒకే ఒక గొప్ప రాచబాట వేశాడు కవి. ఆ బాటలో పయనిస్తుంటే అవి పర్వతాలేకావు పట్టణాలేకావు అరణ్యాలేకావు నదులే కావు ఉద్యానాలే కావు పక్షులేకావు పశువులే కావు మానవ దేవ జాతులే కావు. జడ చేతనాత్మక వస్తు ప్రపంచమంతా కన్నులకు కట్టినట్టు సాగుతుంది రచన. మొత్తాని కేది వర్ణించినా ఎంత వర్ణించినా ఒకటి ఎక్కువ అని మరొకటి తక్కువ అని భేద దృష్టితో చూడడు మహా కవి. మహా కాలుని ఉత్సవ వర్ణన ఎలా చేస్తాడో మహోద్ధతమైన సురత వర్ణన కూడా అలాగే చేసి చూపుతాడు. భంగీ భక్తితో శరీరాన్ని ఆదిమ దంపతులకు సోపాన పంక్తిగా ఎలా సవదరిస్తాడో- వేత్రవతీ ముఖ రసాస్వాదం కూడా అలాగే సాగిస్తాడు. ఎక్కడి కక్కడ దేనికదే సమంజసం సమరసం మహా కవి దృష్టికి.

ఆఖరుకు ముక్తక కావ్యంగా రచించిన ఋతుసంహారం లాంటిదే తడవి చూడండి. మీకే తెలుస్తుం దాయన అభేద దర్శన మెలాంటిదో. ఆరు ఋతువులనూ వర్ణించాడు మహాద్భుతంగా ఆ కావ్యంలో. అందుకే ఋతుసంహారమని పేరుపెట్టాడు దానికి. సంహారమనే మాటే ఎంతో సాభిప్రాయమైనది. అన్నింటినీ సమన్వయించట మని అర్థం. బహుశా అమ్మవారి సర్వసంహార చక్రం జ్ఞప్తికి వచ్చి ఉంటుందా దేవీ భక్తుడికి. అన్ని రేఖలూ కోణాలూ దళాలూ బిందువులోనే చేరిపోతాయి. అలాగే కాల చక్రంలో ఆకుల లాంటివీ వసంతాది ఋతువులన్నీ. దేనిపాటి కది వేర్వేరు లక్షణాలతో కనిపిస్తున్నా అది అలా చూచే మానవుడి దృష్టికే. సృష్టిలో లేదా తేడా. సృష్టిలో లేకుంటే కవి దృష్టిలో అంతకన్నా లేదు. కనుకనే

కమల వన చితాంబుః - పాటలామోద రమ్యః
సుఖ సలిల నిషేకః - సేవ్య చంద్రాంశు హారః
వ్రజతు తవ నిదాఘః - కామినీభి స్సమేతో
నిశి సులలిత గీతే - హర్మ్య పృష్ఠే సుఖేన

అని గ్రీష్మన్నీ

బహుగుణ రమణీయః - కామినీ చిత్త హారీ
తరు విటప లతానాం - బాంధవో నిర్వికారః
జలద సమయ ఏష - ప్రాణినాం ప్రాణ భూతో
దిశతు తవ హితాని - ప్రాయశో వాంఛితాని

అని ప్రావృట్కాలాన్నీ

వికచ కమల వక్త్రా - ఫుల్ల నీలోత్ప లాక్షీ
వికసిత నవ కాశ - శ్వేత వాసో వసానా
కుముద రుచిర కాంతిః - కామినీ వోన్మదేయం
ప్రతిదిశతు శరద్వ - శ్చేతసః ప్రీతి మగ్ర్యాం

అని శరదృతువునూ

బహుగుణ రమణీయో - యోషితాం చిత్తహారీ
పరిణత బహుశాలి - వ్యాకుల గ్రామ సీమా
సతత మతిమనోజ్ఞః - క్రౌంచ మాలా పరీతః
ప్రదిశతు హిమయుక్తః - కాల ఏష ప్రియం వ

అని హేమంతాన్నీ

ప్రచుర మదవికారః - స్వాదు శాలీక్షు రమ్యః
ప్రబల సురతకేళి - ర్జాత కందర్ప దర్పః
ప్రియ జన రహితానాం - చిత్త సంతాప హేతుః
శిశిర సమయ ఏష - శ్రేయసే వోస్తు నిత్యం

అని శిశిరాన్నీ చివరకు

Yalamraju Srinivasa Rao
www.advaitavedanta.in

ఆమ్రీ మంజుల మంజరీ వరశరః సత్కింశుకం యద్ధనుః
జ్యా యస్యాలి కులం కలంక రహితం ఛత్రం సితాంశుః సితం
మత్తేభో మలయానిలః పరభృతో యద్వందినో లోకజిత్
సోయం వో వితరీతరీతు వితను ర్భద్రం వసంతాన్వితః

అని వసంతకాల వైభవాన్ని సరి సమానంగా భావించి వర్ణించ గలిగాడా మహాత్ముడు. పరస్పర విలక్షణంగా కనిపించే ఋతువులలో ఒకానొక సామరస్యాన్ని గుర్తించగల సామర్థ్య మున్నదా చూడ్కి. అంతే కాదు మామూలుగా కాలం వసంతంతో ఆరంభమయి శిశిరంతో సమాప్తం కావలసి ఉంది. కాని కవి అలా దర్శించలేదు. గ్రీష్మంతో మొదలు పెట్టి వసంతంతో ముగించాడు వర్ణన. ఏమి టాంతర్యం. దుస్సహమని భావించే కాలం నీకు నిజానికి సుఖ ప్రదమే సుమా. ఆ మాటకు వస్తే ఏదీ ఏకాంత సుఖమూ కాదు ఏకాంత దుఃఖమూ కాదు. దుఃఖంలో సుఖముంది. సుఖంలో దుఃఖముంది. రెండింటినీ ఒకదాని కొకటి ప్రతిద్వంద్వి అనుకోక పోతే ప్రతి దానిలోనూ సుఖాన్నే చూరగొన వచ్చు నని కాలంమీద నెపం పెట్టి జీవన కాలమంతా సమరసంగా చూచే మానవుడి కంతా సమసుఖ దాయకమే నని ఒక మహోన్నతమైన సందేశ మందిస్తున్నాడు కవి. ఇందుమతి హఠాత్తుగా కన్నుమూస్తే సమ దుఃఖ సుఖమైన సఖీ జనమంతా ఏమై పోవాలని వాపోతా డజుడు. రతీ దేవి పతి వియోగంతో నేలమీద పడి పొరలుతుంటే సమ దుఃఖామివ కుర్వతీ స్థలీం. ఆ స్థలం కూడా ఆవిడతో పాటు శోకిస్తున్నదా అంటాడు కవి. ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున - సుఖంవా యదివా దుఃఖం. సుఖం గాని దుఃఖం గాని ఏదైనా ఎదటి వాడి అనుభవం నీ అనుభవంగా - నీ అనుభవమే వేరొకడి అనుభవంగా చూచినపుడే పరిపూర్ణమైన సామరస్య మది. అంటే ఏ సంఘటనగాని అనుభవిస్తున్నప్పు డెదటి వారి దృష్టి పెట్టుకొని చూడాలి కాని కేవలం నీ దృష్టినే ప్రమాణంగా తీసుకోరాదు. అది ఏకపక్ష వా దమవుతుంది. పరిపూర్ణత లేదందులో. ఇలాటి పాక్షికమైన చింతన ఎవరి విషయంలోనూ మన్నించడు కాళిదాసు.

వర్ణిస్తా డలాటి సన్నివేశం. వర్ణించక పోడు. అయినా దానికి తాను చేయవలసిన పరిష్కార మేమిటో వెంటనే వ్యంగ్యంగా చేసి చూపుతాడు.

అదీ రెండు భంగిమలలో చేస్తాడు కాళిదాసు. ఒకటి చాలా తీవ్రమైన స్థాయి నంతకు ముందొక సందర్భ మందుకొని మన హృదయం బరువెక్కి - భరించలేని స్థితికి వస్తే - తరువాత దాని తీవ్రతను క్రమంగా తగ్గించి మన హృదయ భారం దూరంచేసి తేలిక పరుస్తాడు. చూడండి. కుమార సంభవంలో శివపార్వతుల పరస్పరాలోకనం శృంగార భావం చిగిరించే లోపలనే తపఃపరామర్శ వివృద్ధ మన్యుడైన ఆ మహాకాలుడి ఫాలనేత్రానలం మన్మథుణ్ణి దారుణంగా కాల్చివేస్తుంది. స్త్రీ సన్నికర్ష ఇక పనికి రాదని పరమేశ్వరు డక్కడినుంచి అంతర్ధాన మైపోతాడు. రతి ఆవేదనతో నేల వాలుతుంది. హైమవతి తన ఆకృతినే నిందించి ఘోరమైన తపశ్చర్యకు పూనుకొంటుంది. కాగా అంత భీష్మించుకొని బిర్ర బిగిసి పోయిన ఆ ఈశ్వరుడు మరలా కుహనా బ్రహ్మచారి వేషంలో వచ్చి ఆవిడతో ఎంతో చపలంగా వ్యవహరిస్తాడు. అంతకు ముందు పెదవి విప్పి ఒక్క మాట మాటాడని వాడెన్ని మాటలో ఎన్ని ఎకసకాలో. అలాగే మదన పత్ని అంత పతి వియోగంతో చేసిన విలాపమూ తరువాత శివ పార్వతుల కళ్యాణంతో పతి పునరుజ్జీవితు డైతే ఆయనతో కలిసి ఆ దంపతుల సురత వ్యాపారంలో చరితార్థ మవుతుంది. అలాగే పతి చేత నిరాకృత అయి తపఃక్లేశంతో కృశించిన ఆ దేవిని చూచి నిర్వేద పడిన మనం మరలా సప్తమహర్షుల రాయబారం ఫలించి ఆయననే చెట్టబట్టి దేదీప్యమానంగా వెలిగి పోయినట్లు కవి వర్ణిస్తుంటే సమాశ్వాసన చెందుతాము. ఇలాగే రఘువంశంలో అజుడు భార్యా వియోగంతో అలా బాధ పడుతుంటే చూడలేక పోయాడు కవి. సాదృశ్య ప్రతి కృతి దర్శనంతో పగళ్ళూ - స్వప్నంలో క్షణ కాలం సమాగమోత్సవంతో రాత్రులూ గడిచాయని చెబితేగాని ఆయన తృప్తి పడలేదు. అంతే గాదు. తేనాష్టా గమితా స్సమాః కథంచిత్. ఎంతో కష్టం మీద గడపగలిగా డద్దైనా ఆ

రాజు. పోతే ఆయన మనో వేదన పూర్తిగా తొలగి పోయే దెలాగా. ఆలోచించాడు మహాకవి దానికొక ఉపాయం. భిషజా మసాధ్యం. రాజవైద్యులకు కూడా దుర్భేద్యమైన ఆ వ్యాధి కా రాజు గంగా సరయూ సంగమంలో శరీర త్యాగం చేసి ఒక దివ్యమైన శరీరంతో స్వర్గంలో ప్రవేశించి లీలా గారే ష్వరమత పున ర్నందనా భ్యంతరేషు. నందన వనంలో దేవతలు నిర్మించిన క్రీడ మందిరాల్లో అహోరాత్రాలూ ఆ ఇందు మతితోనే మరలా విహరించాడట. అలా చేశాడని వర్ణించేవరకూ నిద్ర పట్టలేదు కాళిదాసుకు. మరి ఆ రఘువంశంలోనే సీతా రాముల పూర్వ జీవితమంతా అంత ఒడుదుడుకులుగా నడచినా తిరుగు ప్రయాణంలో ఆకాశమార్గంలో పుష్పక విమానంలో వారు సాకేతానికి తరలి రావటమూ వారి పట్టాభిషేకమూ కవి వర్ణిస్తుంటే మన మనసులెంతో తేలిక పడ్డట్టు కనిపిస్తుంది. దుష్యంతుడు శాకుంతలంలో శాప గ్రస్తుడైన దానికంటే అంగుళీయక దర్శనంతో అనుభవించిన వేదన అంతా ఇంతా గాదు. ఆ హృదయభార మాయన మరలా స్వర్గ సీమకు మాతలితో కలిసి పయనించటమూ - అక్కడ మరీచాశ్రమంలో క్రమంగా భరతునీ తద్వారా శకుంతలనూ గుర్తించటమూ - కశ్యప దర్శనం చేసుకోవటమూ - ఈ ఘట్టాలను కవి వర్ణిస్తుంటే సడలిపోయి తేలిక పడక మానదు. ఇక విక్రమోర్వశీయంలో నైతే ఊర్వశీ వియోగంతో ఎంతగా పలవించాడో పురూరవుడు. ఎంతగా వర్ణించాడో ఆ విలాపాన్ని మహా కవి. దానితో బరువెక్కింది ఆ రాజు హృదయమే కాదు. మన హృదయాలు కూడా. వీటి కూరట ఇవ్వటానికా అన్నట్టు దేవేంద్రుడి అనుమతితో మరలా ఆ ఊర్వశి వచ్చి రాజును ఆశ్రయించిందని చెబితేగాని అసలు కాళిదాసుకు ఊరట లేదు. ఇలా ఒక భావ తీవ్రత ఎంత పైకి పోతుందో మరలా దాన్ని అంత క్రిందికి దించి చూపుతాడు కాళిదాసు. వేడినీళ్ళకు చల్ల నీళ్ళన్నట్టు రెండింటినీ పాట్లు చేసి రెంటికీ ఒక సామరస్యాన్ని ప్రదర్శిస్తాడు. ఇది ఒక బాణీ.

ఇంకొక బాణీ ఏమంటే ఎవరెవరు ఏకదేశమైన దృష్టితో ప్రవర్తిస్తారో వారి నీశ్వరుడే మౌనంగా శిక్షించి సరియైన మార్గంలో వారిని ప్రవేశ పెట్టినట్టు వర్ణిస్తాడు. సృష్టిలో ఏది జరిగినా అది తన కోసమే నని భావించటం మానవుడి కలవాటు. కామీ స్వతాం పశ్యతి. ఒకటి కావాలని కోరినవా డది తనకే దక్కాలి మరెవరికీ చెంద కూడదనే చూస్తాడు. అంతే గాదు. సర్వః కాంత మాత్మానమ్ పశ్యతి. ప్రతి వాడూ తన్నుతాను గొప్పగా భావిస్తాడు కూడా. ఇవి దుష్యంతుడి నోట వచ్చిన మాటలు. శకుంతలను చూచి నప్పటి నుంచీ ఆవిడ నెలా పొందాలా అనే ఆరాట మాయనకు. అది ఆశ్రమమే గానీ ఆశ్రమాధిపతి కణ్వ మహర్షి అక్కడ లేకనే పోనీ. పొందాలావిడ నెలాగైనా. ఏమి. తొందరేమి. కణ్వు డెలాగూ ఆవిడ నాయనకే ఇవ్వాలను కొన్నాడు గదా. అనసూయా ప్రియంవదలకు తెలిసిన మాత్రమా మహారాజుకు తెలియదా. తెలిసినా తెలియకున్నా ఒకరి అభిప్రాయ మేమిటో - కడకు తాను కోరిన ఆ కన్య అభిప్రాయ మేమిటో కూడా తన కక్కర లేదు. తన దృష్టే దృష్టి. అది నెరవేరటమే తనకు కావలసినది. అలాగే ప్రవర్తించాడు. హడావుడిగా తన కోరిక తీర్చుకొన్నాడు. అన్ని హామీ లిచ్చా డావిడకు. చివర కేమయింది. శాపం నెత్తికి తెచ్చుకొన్నాడు. తాను స్వకీయగా భావించిన దాన్నే మరచి పోయాడు. ఈశ్వర శక్తి దుర్వాసుడిలో చేరి అతణ్ణి శపించింది. అలాగే తండ్రి అనుమతి లేకుండా అతనితో సురత వ్యాపారం సాగించి నందుకు దుష్యంతుడి విస్మృతిలో చేరి ఈశ్వర శక్తి శకుంతలను దూరంగా పారదోలి శిక్షించింది. ఇద్దరూ పాక్షికమైన స్వార్థ బుద్ధితో ప్రవర్తించి నందు మూలాన్నే అలాటి శిక్షకు పాత్రు లయ్యారు.

పోతే కణ్వ కశ్యపు లిలాటి పాక్షిక దృష్టి కలవారు కారు. వారిది సామాన్య దృష్టి. బృహదారణ్యకంలో చెప్పిన మహా సామాన్య దృష్టి. మహా సామాన్యంలో నుంచే విశేషాలన్నీ ఆవిర్భవిస్తాయి. అందులోనే మెలగుతుంటాయి. మరలా అందులోనే లయ మవుతాయి. ఒక మృత్తికలో నుంచి వచ్చిన ఘట శరావాది

పాత్రల లాంటివవి. అయితే చిత్రమేమంటే సామాన్యంలో విశేషాలు లయ మవుతున్నా సామాన్య దృష్టి లేనంత వరకూ లయ మవుతున్నట్టు తెలియదు. విశేషాలే గోచరిస్తుంటాయి. అది తెలిసి చూస్తున్నప్పుడే నిజమైన లయం. అప్పటికి విశేషాలన్నీ సామాన్యరూపంగానే భాసిస్తాయి కాబట్టి వాటి ఒత్తిడి మనసు మీద పడదు. సామాన్యమే గదా అనే ప్రతి సంధానం దాన్ని తేలిక పరుస్తుంది. ఇదీ ఇందులో దాగి ఉన్న ఆధ్యాత్మిక రహస్యం. దీన్ని ఎంతగా పట్టించుకోవాలో అంతగా ఒంట పట్టించు కొన్న వారు మహర్షులు. అలా పట్టించు కొంటేనే అసలు మహర్షి. కణ్వ కశ్యపుల దలాంటి ఉదాత్త విశాల దృష్టి. కనుకనే కణ్వుడు తన పరోక్షంలో తన సమ్మతి లేకుండా జరిగిన శకుంతలా దుష్యంతుల వ్యవహారాన్ని తాను అగ్ని ముఖంగా విని మనసులో అణు మాత్రం కూడా ఆందోళన చెందలేదు. ఆగ్రహించి వారిని మందలించ లేదు. తొందర పడి నిష్ఠురంకూడా ఆడ లేదు. మౌనంగా ఉండిపోయాడు. పైగా శకుంతల సిగ్గు పడుతూ తన ఎదుట నిలుచుంటే ఎందుకమ్మా కంట తడి పెడతావు నీవేమి తప్పుచేశావని - దిష్ట్యా ధూమాకుల దృష్టేరపి యజమానస్య పావక ఏవాహుతిః పతితా - సుశిష్య పరిదత్తా విద్యేవ అశోచనీయా సంవృత్తా - అద్యైవ ఋషి రక్షితాం త్వాం భర్తు స్సకాశం విసర్జయామి - అని సాంత్వన వచనాలు పలుకుతాడు. ఒకానొక వ్యామోహంతో కళ్ళు మూసుకు పోయి ఆవిడ ఆ పని చేసినా కళ్ళలో పొగ చేరి యజమానుడు హోమంచేస్తే అది సరిగా పోయి అగ్నిహోత్రంలోనే పడ్డట్టుందట. చేసిన ఉద్దేశం మంచిది కాకున్నా దాని ఫలితం చివరకు మంచిదే నని భావం. అంతే కాదు. అర్హుడైన శిష్యుడికి చక్కని విద్య నప్పగించి నట్టయిందట. అంచేత బాధ పడవలసిం దేమీ లేదంటాడు. విద్య ఎవరిక్కడ. శకుంతల. దాని నందుకొనే అర్హత గల శిష్యుడెవడు. దుష్యంతుడు. ఇక బాధ దేనికి. గురు వప్పగించ కుండానే శిష్యుడు పరిగ్రహించా డనే కొరత. అది కూడా లేదంటా డాయన. అంచేత భర్త దగ్గరికి పంపట మొక్కటే తరవాయిగా భావించాడ మహర్షి. పంపుతాడు వెంటనే. పంపిన తరువాత వెనక్కు మరలి ఆశ్రమానికి

వస్తూ తనలో తాను అనుకొన్న మాట వినండి. ఎంత నిర్లిప్తుడో తెలుపుతుందా మహర్షిని. అర్థోహి కన్యా పరకీయ ఏవ - తామద్య సంప్రేష్య పరిగ్రహీతుః - జాతో మమాయం విశదః ప్రకామం - ప్రత్యర్పిత న్యాస ఇవాంతరాత్మా. ఎంత గొప్ప మాట ఇది. కన్య అనేది ఒక ధనం. అది మనది కాదు. పరులది. మన దగ్గర కేవలం న్యాస మున్నది. మరలా దాన్ని సకాలంలో వారి కంద జేస్తే ఎలా ఉంటుంది మనసుకు. అలాగే ఉంది శకుంతల నిప్పుడత్త వారింటికి పంపితే ఆ మహర్షికి. ఇల్లడ పెట్టిన సొమ్ము హక్కుదారు కప్పగిస్తే ఎలా తేలిక పడుతుందో అలా తేలిక పడిందాయన మనసు. ఎంత గొప్ప నిర్లిప్తతో చూడండి ఆ మహర్షిది. ఇదే సామాన్య దృష్టి అంటే. విశేష దృష్టి ఉన్నవాడి కిది అబ్బదు. అందుకే నేమో దుష్యంతుడికి సందేశం పంపుతూ సామాన్య ప్రతిపత్తి పూర్వక మియం దారేషు దృశ్యా త్వయా. నీవీ కన్యను మాకన్య గదా అని సవిశేషంగా చూడ నక్కరలేదు. నిర్విశేషంగా సర్వసామాన్యంగా చూస్తే చాలు నంటాడు. తన దృష్టి అలాంటిది గనుకనే ఆ మాట అన గలిగాడాయన. ఈ సామాన్య దృష్టి సంపన్నుడు గనుకనే ఒక్క సారి శకుంతల నత్త వారింటికి పంపాడో లేదో ఇక ఆవిడను మరలా స్మరించ లేదాయన. ఆవిడ అక్కడ ఏ బాధలు పడిందో తెలియదా అంటే తెలియని వాడు కాదు మరలా. తెలుసు నంన్నందుకు నిదర్శనం సప్తమాంకంలో కశ్యపుని మాటలలో మనకు తెలిసిపోతుంది. శకుంతలా దుష్యంతులు కలుసుకొన్న ఈ శుభవార్త కణ్వ మహర్షి కంద జేయాలని ఒక శిష్యుడంటే - అక్కర లేదాయన ఈ పాటికే తపో బలంతో అన్నీ గ్రహించి ఉంటాడు. అయినా లోక ధర్మంగా అంద జేస్తే చేయవచ్చు నంటా డాయన. దీన్ని బట్టి మొదట కూడా శకుంతలా వ్యవహార మాయనకు తెలిసే ఉంటుంది. అయితే దానితో పాటు దుర్వాసుని శాపమూ - తన్నిమిత్తమైన దుష్యంతుని విస్మరణమూ - అదీ తెలుసును కాబట్టి అంతా దైవికమని చెప్పి ఊరకున్నాడు. అంతే కాదు. శకుంతల ఎప్పుడు నాన్నా మరలా నిన్ను చూడగలిగేదని అడిగితే - నీవూ నీ భర్తా పుత్రుడూ అందరూ కలుసుకొని

ఆలజాలంగా ఉంటే నా ఊసు నీవు స్మరించ వంటాడు. భర్త్రా తదర్పిత కుటుంబ భరేణ సార్ధం - శాంతే కరిష్యసి పదం పునరాశ్రమేస్మిన్. కుమారుడికి రాజ్య భార మప్పగించి నీ నాథునితో కలిసి నీవు మరలా ఆశ్రమంలో అడుగు పెడతావని దీవిస్తాడు. ఏ నోట అన్నాడో ఆ మాట అలాగే ఫలించింది. కణ్వాశ్రమంలో కాకున్నా కశ్యపాశ్రమంలో కలుసుకొన్నారా లేదా చివరకా కుటుంబ సభ్యులంతా. అక్కడ కణ్వుని ప్రశంస వచ్చిందా లేదా. ఇదీ విషయం.

ఇలాగే కశ్యప మహర్షిది కూడా సామాన్య దృష్టే. కణ్వు డత్తవారింటికి పంపి అప్పుతీర్చిన వాడిలాగా ఆవిడ ఊసిక పట్టించుకోలేదు. దుష్యంతుడు చూతామా దుర్వాసుడి శాపం పని చేసి అసలావిడ ఎదుట నిలుచోటం కూడా సహించలేక పోయాడు. వెంటవచ్చిన కణ్వ శిష్యులా మహా ఘటికులు ఆవిడ వెనక్కు తిరిగి చూచినా మండిపడి తమతో రావటాని కసలే సమ్మతించలేదు. ఏదో కొంత అభిమానంతో రాజ పురోహితు డావిడను తన ఇంట్లో పెట్టుకోటానికి సుముఖంగా ఉన్నా అంతకన్నా ఆ పరిస్థితిలో తల్లే ఆదుకోటం మంచిదని సహజమైన మాతృ వాత్సల్యంతో మేనక ఆవిడను స్వర్గసీమ కెత్తుకుపోయి అక్కడ సకల దేవతలకూ పూజాపాత్రుడైన కశ్యప మహర్షి ఆశ్రమాన్నే చేర్చింది తన బిడ్డను. ఇంత మంది చేత పరిత్యక్త అయిన ఒక అభాగ్యురాలిని ఎంతో ప్రేమతో ఆదుకొన్నా డంటే ఆ మహర్షి ఎంత విశాల హృదయుడు. ఎంత కరుణాళుడు. కారణం. వారందరిదీ పాక్షికమైన దృష్టి అయితే సర్వ ప్రాణి సాధారణమైన నిష్పాక్షిక దృష్టి ఆయనది. పూర్వాపరాలు రెండూ ఆకళించుకొని మధ్యలో జరిగిన పరిస్థితిని వాటితో ముడి పెట్టి చూచి అర్థంచేసుకోగల మహనీయులు గనుకనే అటు కణ్వుడు గాని ఇటు కశ్యపుడు గాని తొందర పడలేదు. ఈసడించలేదు. త్రోసి పుచ్చలేదు. అంతా దైవలీల అని ఆ ఈశ్వర సంకల్పాని కనుగుణంగా ప్రవర్తించ సాగారు. ఇలాటి సమరస భావ మున్నప్పుడు రాగ ద్వేషాలకు తావు లేదు. అటూ ఇటూ మొగ్గ

చూపినప్పుడే అవి వచ్చి మెడకు చుట్టుకొనేది. ఆ మొగ్గు చూపటం ఒకటి ప్రియ మొకటి అప్రియమని విశేష దృష్టితో దర్శించినపుడే. అది లేనపు డేదీ లేదు. అంతా మనదే. ఏదీ మనది కాదు. మనమే నని చూస్తే మనదనే దేముందిక. మనదైనా మనది కాదన్నా రెండూ మనలోనే చేరిపోతాయి. సర్వాత్మ భావమంటే ఇదే.

ఇది మహర్షులకు తప్ప మరెవరికీ లేదు. ఆఖరుకు మహర్షి శుశ్రూషలో జీవిత యాత్ర గడుపుతూ వచ్చిన వారి శిష్య పరమాణువులకే కరవైనది. కణ్వుడి శిష్యులు ఒకడు శారద్వతుడు మరొకడు శార్ఙరవుడు. ఇద్దరూ ఇద్దరే. గడుగ్గాయులు. కణ్వుడి దగ్గర వేద వేదాంగా లభ్య సించారేమో గాని ఆయన సంస్కారమూ వివేకమూ వీరికబ్బలేదు. శకుంతల నొంటరిగా పంపటం సముదాచారం కాదని వీరిని తోడిచ్చి పంపాడ మహర్షి. అలాంటి గురువు గారికే సముదాచారం నేర్పుతాడా శారరవుడు. శారంలాగా రవం చేసే వాడు కాబోలు. బాగా వెదకి పెట్టాడా పేరు కాళిదాసు. ఓదకాంతం స్నిగ్ధో జనోను గంతవ్య ఇతి శ్రూయతే అని ఆ యన సమక్షంలో తన పాండిత్యం ఒలక బోస్తాడు. ఆ మాత్రం తెలియదా మహర్షికి. వనౌకసోపి సంతో లోకజ్ఞా వయమని చాటిన వాడాయన. పోతే ఇక రాజుగారి నగరానికి వెళ్ళారో లేదో అక్కడికి వెళ్ళినప్పటి నుంచీ ఆపసోపాలే శిష్యు లిద్దరికీ. ఒకడు జనాకీర్ణమైన ఈ నగరం హుతవహ పరీతమైన గృహంలా ఉందంటే - ఇంకొకడు అభ్యక్త మివ స్నాతః శుభ్రంగా స్నానం చేసి వచ్చిన వాడికి తలంటుకొన్న వాణ్ణే చూస్తున్నట్టు - ప్రబుద్ధ ఇవ సుప్తం నిద్ర పోయే వాణ్ణే మేలు కొన్న వాడు చూస్తున్నట్టు - బద్ధమివ స్వైరగతిః స్వేచ్ఛగా తిరిగే వాడు ఒక చోట కట్టు బడ్డ వాణ్ణే చూస్తున్నట్టు - భోగ లాలసులైన ఈ నగర వాసులను చూస్తుంటే నాకు తోస్తున్న దంటాడు. తీరా లోపలికి వెళ్ళి రాజు గారితో సంభాషణ కుపక్రమించారో లేదో ఇక మొద లయింది వారి దూకుడు. ఆయన ఏమిటి మీరు చెబుతున్న మాట అన్నాడో లేదో - అప్పుడే అందుకొన్నాడు

శారరవుడు మీరేనా లోక వృత్తాంత నిష్ణాతులు ఇలాటి మాట అనవలసింది. మూర్ఛంత్యమీ వికారాః - ప్రాయే ణైశ్వర్య మత్తేషు. ఐశ్వర్య మద మత్తులు గదా రాజులంటే. ఏ పని చేసినా సరిపోతుంది మీకని పరుషంగా మాటాడుతాడు. ఇలాగే తీవ్రమైన పదజాలంతో ఘాటుగా మాటాడి చివరకా శకుంతల తమతో ఎక్కడ వస్తుందో నని ఆమెనూ కఠినంగా మందలించి ఆ రెండవ వాడితో కలిసి వెళ్ళి పోతాడు. ఇక్కడ మనం గమనించ వలసిందే మంటే ఆ శిష్యుడికి తెలుసునే గాని రాజుకే మాత్రమూ గుర్తులేదు శకుంతలను పరిణయ మాడినట్టు. శాపగ్రస్తు డాయన. కాబట్టి కణ్వ శిష్యులు తన్ను నానా మాట లంటుంటే అనవసరంగా అంటారేమా అని ఎంతైనా రెచ్చిపో వలసింది. అయినా కులపతి పంపితే వచ్చిన శిష్యులు వారు. ఆశ్రమవాసులు. తపస్వులు. వారు తొందర పడ్డా తాను పడటం భావ్యం కాదని మర్యాద పాటిస్తాడు. అది ఆయన గొప్పతనం. పోతే తమకు తెలియక పోవచ్చు గాక అతని శాప వృత్తాంతం. అయినా తపో ధనులు గదా తాము. ఎందుకా ఇలా ఉదాసీనంగా ఉన్నాడీ రాజని పరామర్శ చేయ వచ్చు గదా. అలా చేయక పోగా ఎలా పడితే అలా అధిక్షేపించటం చాలా అర్భకంగా కనిపిస్తుంది మనకు. చూడండి. తరువాత ఆశ్రమానికి వెళ్ళి చెప్పి ఉంటారు గదా గురువుగారికి జరిగిన దంతా. ఆయనా ఆలకించి ఉంటాడు గదా. వీరిలాగా ఎందుకు తొందర పడ లేదాయన. తెలుసు నాయనకు ఇలా జరుగుతుందని - జరిగిందని. అందులో మహారాజు తప్పేమీ లేదని. పిల్ల కాకులకు వీళ్ళకే తెలియదు వెనుకా ముందు. ఏక దేశ నియంత్రితమైన దృష్టి ఇదే. ఇది పూర్వా పరాలను అను సంధానం చేసుకో నీయదు మానవుణ్ణి. లేడికి లేచిందే పరుగన్న ట్టుంటుంది వారి వ్యవహారం. తమ ఆలోచనే సరియైనది - తమ మాటే విలువైన దని వారి దురాగ్రహం. మంచి వారే కావచ్చు. విద్యా వంతులే కావచ్చు. కాని వివేక వంతులు కారు. వినయ వంతు లంతకన్నా కారు. రఘువంశంలో రఘు మహారాజు వద్దకు వచ్చిన కౌత్సుడనే ముని కుమారుడు కూడా ఇంతే. అతడు అన్ని విద్యలలో ఆరి తేరిన వాడే. లోకజ్ఞతలో మాత్రం కాదు.

వచ్చాడు యకా యకీ రాజు దగ్గరికి గురుదక్షిణ కోసమని. డబ్బిస్తాడని ఆశ పడ్డాడు. కాని మృణ్మయ పాత్రలో అర్ఘ్యం తేవటం చూచే సరికి కళ్ళూ కాళ్ళూ చల్ల బడ్డాయి. ధాన్యంలేని నివ్వరి కాడలా అయిపోయావు నీవేమిస్తావు నాకు మరో రాజు దగ్గరికి వెళ్ళి తెచ్చుకొంటానని నిర్మొగమాటంగా మాటాడి వెళ్ళబోతాడు. ధనం లేకుంటే వెళ్ళి పోతానంటాడు ఆ బ్రాహ్మణుడు. దగ్గర లేకున్నా ఎంత కావలో చెప్పు ఇస్తానంటాడీ రాజు. నిజంలో ఒక్క పైసా లేదా రాజు దగ్గర ధనం. కాని సంస్కార ధనం పుష్కలంగా ఉంది. పిచ్చివాడా ఎక్కడికి వెడతా వెవ్వ రివ్వగలరు నీకింత ధనం. రెండు మూడు రోజులు వ్యవధానమీ. నేనే నీకు తెచ్చి ఇస్తానని బరవసా ఇచ్చి నిలుపుతాడు. కుబేరుడి మీదికి దండెత్తి పోదామని వసిష్ఠ మంత్రోక్షిత మైన స్యందన మెక్కి కూచుంటాడు. తెల్లవారే సరికి సువర్ణ వర్షం కురిసింది. అంతా ఆ బ్రహ్మచారికే ఇచ్చి పంపమంటాడు. ఏమిటీ ఉదారత. విశాల హృదయత. నిర్లిప్తత. మహారాజులకే ఉందది. తపో ధనులైన మహర్షులకే ఉందా అని అనుమానించ వలసి వస్తుంది. లేకుంటే చూడండి. తాపసులు పట్టణానికి వచ్చి అక్కడి జీవనాన్ని ఈసడించు కొన్నారుగాని దిలీప దుష్యంతాది రాజన్యు లప్పుడప్పు డరణ్య సీమలకు వెళ్ళినా మున్యాశ్రమాలు తిలకించినా అక్కడి నిరాడంబర ప్రశాంత జీవనాని కెంతో సంతోషించారు. దిలీపుడైతే సంతానార్థి అయి వసిష్ఠాశ్రమానికి వచ్చి ఆ రాత్రి ఆయన ఒక కుటీరాన్ని చూపితే అక్కడే సంవిష్టః కుశ శయనే నిశాం నినాయ. దర్భ శయనంలోనే నిద్రించి రాత్రి మూడు జాములూ గడపి నాలుగో జామున్నే మేలుకొని గోసేవ కుపక్రమిస్తాడు. దుష్యంతుడైతే ఆశ్రమ వాసుల కెక్కడ ఉపరోధం కలుగుతుందోనని రథాన్నీ అశ్వాలనూ దూరంగా నిలిపి తన పరివారాన్ని దూరంగా పంపి వినీత వేష ప్రవేశ్యాని తపో వనాని నామ - తపో వన మంటే ఎంతో నిరాడంబరమైన వేషంతో లోపల ప్రవేశించ వలసి ఉంటుందంటాడు.

www.advaitaveda.in

ఇంతకూ చెప్ప వచ్చే దేమంటే వీరు వారని లేదు. స్త్రీలూ పురుషులని లేదు. ఈ వర్ణ మా వర్ణమని లేదు. ఎవరికైనా సమష్టి జీవితాలోకన క్షమమైన వీక్షణ ముండాలి. ఏకదేశ పర్యవసాయి కాగూడదది. అలా అయితే ఒక జీవనదికీ పల్వలానికీ గల తారతమ్య ముంటుంది వాటికి. ఉంటే సామరస్యం కాదది వైరస్యం. మానవులకే గాదు. మానవాతీత ప్రభావు లనిపించు కొన్న దేవతల కుంటేనే చెల్లదది. మహర్షుల విషయం చూచాము గదా. మహారాజుల విషయం చూచాము గదా. సాక్షాత్తూ శ్రీమహావిష్ణు అవతార పురుషుడైన శ్రీరామ చంద్రుడే అలా సంకుచితంగా ప్రవర్తించాడంటే మెచ్చలేదు కాళిదాసు. ఎవడో ఒక పనికిమాలిన వాడ క్షేపించాడని ఆ నెపంతో నిండు చూలాలిని కారడవులలో దించి రమ్మని ఆజ్ఞాపించాడని తెలిసి వాల్మీకి లాంటి మహర్షే భరించలేక ఇలా అంటా డావిడతో. ఉత్ఖాత లోక త్రయ కంటకేపి సత్య ప్రతిజ్ఞే ప్యవిక త్థనేపి- త్వాం ప్రత్యకస్మాత్ కలుష ప్రవృత్తా అస్త్యేవ కోపో భరతాగ్రజే మే. అమ్మా లోక కంటకులైన దానవులను రూపు మాపే ఉండవచ్చు. ఆడిన మాట నిలబెట్టుకొనే వాడు కావచ్చు. ఆత్మ స్తుతి పర నింద లేని వాడే కావచ్చు. ఎన్ని మంచి గుణాలున్నా నీ విషయంలో ఇలాటి ఘోరమైన తప్పిదం చేశాడంటే నేను సహించలేను. చాలా కోపంగా ఉంది నీ భర్త అంటే నాకం టాడు. ఎవరీ మాట అంటున్నది. వాల్మీకి. రామాయణ కావ్య కర్త. రాముడు సీతను పరిత్యజించి రాజధర్మం చక్కగా పాటించాడని తన కావ్యంలో ఆయనకు కితా బిచ్చిన వాడు. అలాటి మహర్షి నోటనే ఇలాటి మాట అనిపించాడంటే ఎంత గడుసరో చూడండి కాళిదాసు. ఆయన సమరస భావ దృష్టి చూడండి ఎంత అనన్యా దృశమో. ఆ దృష్టి కొరవడితే ఏ పాత్రనూ మన్నించ లేడాయన. అలాటి పాత్రలను చిత్రించిన ఏ కవినీ భరించలేడు. కనుకనే నేమో కాలీన భీతేన గృహా న్నిరస్తా - నతేన వైదేహ సుతా మనస్తః. అని తన మనసుకు నచ్చ చెప్పు కొనే వరకూ నిద్ర పట్టలేదా మహా కవికి. సామరస్యమే సారస్య మాయన జీవితానికి. కావ్య జీవితానికి కూడా.

అసలా మాటకు వస్తే భౌతిక జీవితానికీ అదే. దాని మీద ఆధారపడి నడుస్తున్నదే ఈ సృష్టి చక్ర మంతా. సృష్టి అంతా శివ శక్తి సామరస్య మయమే నని గదా పేర్కొన్నాము. శివ శక్తులంటే శబ్దార్థాలే. శబ్దం దేవీ తత్త్వమైతే అర్థమనేది శివ తత్త్వం. శబ్ద మ్మర్థాన్ని చెబుతుంది. అర్థం దాని వల్ల స్ఫురిస్తుంది. ఎంతెంత ఇది బయట పెడితే దాన్ని - అంతంత అది ప్రకాశిస్తుంది. ప్రపంచమంతా వైఖరీ రూపమైన అమ్మవారి విలాసమే గనుక ఇందులో ఇది సుందర మిది అసుందర మనే భేద భావానికి చోటు లేదు. త్రిపుర సుందరి నిర్మాణమిది. అసుందర మెలా అవుతుంది. సుందరమైనా అసుందరమైనా రెండూ సత్యమైన ఆ శివ తత్త్వాన్ని చూపవలసిందే. సంకేతాలే ఇవి దానికి. అది ఈ రెండిటి లోనూ సమానంగా పరచుకొని ఉంది. సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వర మని భగవద్వాణి. అవిభక్తం విభక్తేషు పరస్పర విభిన్నంగా కనిపించే సకల భావాలలో అభిన్నంగా ఉన్నదా సత్యం. అది మనకు భాసించాలంటే శబ్దరూపమైన ఈ సృష్టి కూడా అభిన్నంగానే మన కను సంధానం కావాలి. అలాటి సామరస్యాన్ని సృష్టిలో సర్వత్రా దర్శించమని భగవద్గీతే చెబుతున్నది. విద్యా వినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని శునిచైవ శ్వపాకేచ. వీటన్నిటినీ సమంగా చూడాలట మానవుడు. ఇలాటి ప్రబోధమే ఉత్తమ శ్రేణికి చెందిన మహాకవి కూడ లోకానికి చేయవలసి ఉంది. కవులలో ఉత్తమోత్తముడు కాళిదాసు. కనుక ఇంట గెలిచి రచ్చ గెలవ మన్నట్టు మొదట తాను దర్శించాడా సత్యాన్ని. పిదప చాటాడది లోకానికి రచనా ముఖంగా. వాగర్థావివ సంపృక్తౌ అనే ప్రార్థనా శ్లోక మీ రహస్యాన్నే బయట పెడుతున్నది. వాగర్థాలేవి ఆయనకు. పార్వతీ పరమేశ్వరులే. అంటే శివ శక్తులే. ఒకటి సృష్టి మరొకటి స్రష్ట. సృష్టినిబట్టి స్రష్టనర్థం చేసుకోవాలి భావుకుడు. స్రష్ట సర్వ సముడు. అలాటి సమత్వాన్ని అనుభవానికి తెచ్చుకోవా లంటే దాని కనుభావక మీ సృష్టే. సర్వమూ సమమని చూస్తేనే ఇది ఆ సమత్వాన్ని చూపుతుంది మనకు. లేకుంటే ఇదీ విషమమే ఈ అద్దంలో కనిపించే అదీ విషమమే మన పాలిటికి ఇహైవ తై ర్జితః సర్గః - యేషాం

సామ్యే స్థితం మనః అన్నది గీత. సామ్య దృష్టే జయం మానవుడుకి. వైషమ్య దృష్టి కాదు. అసలు వైషమ్యం లేదు సృష్టిలో. అది ఉన్నది మన దృష్టిలో. వస్తు సిద్ధంగా సామ్యమే ఉన్నది. మానవుడి దృష్టిగత మైనపుడే అది వైషమ్యంతో కప్పబడి కలుషితంగా సంకుచితంగా విపర్యస్తంగా భాసిస్తుంది. ఇది ఆభాసే గాని వస్తువు గాదు. వస్తువు శివ శక్త్యాత్మకమైన సత్య సౌందర్యాల పరస్పరా శ్లేషమే నని ఆ పురాణ దంపతుల దాంపత్యమే చాటుతున్నది. అది శబ్దార్థాల దాంపత్యం ద్వారా లోకానికి చాటి చెప్పటమే కాళిదాసు పట్టుకొన్న ప్రత్యభిజ్ఞ. పెట్టుకొన్న ప్రతిజ్ఞ. దాన్ని తూచా తప్ప కుండా పాటించాడు చివర దాకా. ఎన్నుకొన్న కథ వస్తువులో చిత్రించిన పాత్రలలో పోషించిన రస భావాలలో చేసిన వివిధ వర్ణనలలో ఎక్కడ చూచినా మనం దాని విశ్వ రూపాన్నే దర్శించ వచ్చు. అది శివ శక్తుల లీలా విభూతే.

ప్రయాగ దగ్గర గంగా యమునా సంగమం వర్ణిస్తున్నాడు కవి. ఎలా ఉందా నదీద్వయ సంగమం కళిదాస మహాకవి దృష్టికి. శివ పార్వతుల సంగమమే అది. శివుడు గంగ అయితే పార్వతి యమున. గంగ తెలుపు యమున నలుపు. పాండు రంగుడైన శివుడి కొకటి సంకేతమైతే మహా కాళి అయిన పరా భట్టారిక కొకటి సంకేతం. ఈ సంకేతార్థం బహుశా మనసులో పెట్టుకొనే చేసి ఉంటాడీ వర్ణన కాళి దాసు. చూడండి.

క్వచిత్ప్రభా లేపిభి రింద్ర నీలైః - ముక్తా మయీ యష్టి రివాను విద్ధా
అన్యత్ర మాలా సిత పంకజానా - మిందీవరై రుత్ఖచితాంతరేవ.

క్వచి త్ఖగానాం ప్రియ మానసానాం - కాదంబ సంసర్గ వతీవ పంక్తిః.
అన్యత్ర కాలాగురు దత్త పత్రా - భక్తిర్భువ శ్చందన కల్పితేవ.

క్వచి త్ప్రభా చాంద్రమసీ తమోభి - శ్ఛాయా విలీనై శ్శబలీ కృతేవ
అన్యత్ర శుభ్రా శరదభ్ర లేఖా - రంధ్రే ష్వివా లక్ష్య నభః ప్రదేశా

క్వచి చ్చ కృష్ణోరగ భూషితేవ - భస్మాంగ రాగా తను రీశ్వరస్య
పశ్యాన వద్యాంగి విభాతి గంగా - భిన్న ప్రవాహా యమునా తరంగైః

అయోధ్యకు పుష్పకంలో మరలి వస్తూ పైనుంచి క్రిందికి చూస్తూ సాక్షాత్తూ రామచంద్ర మూర్తి చేస్తున్న వర్ణన ఇది. ఎలా ఉందాయన దృష్టికా నదీ సంగమం. ఇంద్ర నీలాలూ ముత్యాలూ కలిపి నిర్మించిన ఒక యష్టిలాగా - నల్ల కలువలతో చేర్చి కూర్చిన తెల్లని పద్మ మాలిక లాగా ఉందట. అంతే కాదు. మానసానికి బయలు దేరిపోయే తెల్లని రాజహంసలతో నల్లని రంగు గల హంసలు కూడ బారులు దీరి పోతున్నట్టుందట. అంతే కాదు. తెల్లని చంద్రకాంతులు నల్లని చెట్ల నీడలతో కిర్మీరితమై నట్టు కనిపిస్తున్నదట. అంతే కాదు. నల్లని త్రాచులనే నవాభరణాలుగా ధరించి భసితాను లిప్తమైన తెల్లని పరమేశ్వరుని శరీరంలా కూడా ఉందట. అసలు కవి చెప్ప దలచిన భావమిదే. చివరకు బయట పెట్టాడు. నల్లత్రాచు లేవో గావు అమ్మ వారి రూపమే. కుండలినీ శక్తి గదా ఆ మహా కాళి. ఉరగం కాకపోవట మేమిటి. కృష్ణం కాకపోవట మేమిటి. అలాగే భస్మాంగరాగ భూషిత మైన శరీరం పరమ శివునిదే. అది వాచ్యంగానే సెలవిచ్చాడు కవి. అప్పటికి గంగా యమునల నలుపు తెలుపులు వాటివి గావు. శివ శక్తులవే వాటిలో ప్రతిఫలించి కనిపించాయి కవికి. ఇలాటి పరస్పర విలక్షణంగా కనిపించే గుణ సామరస్యమే సృష్టి అంతా కమ్ము కొని ఉంది. అందులో ఒకటి హెచ్చు లేదు ఒకటి తగ్గ లేదు. అన్యూనానతి రిక్తం సమస్తమూ. దానినలా దర్శించటమే క్షేమం లోకానికి. అది విశేషరూపమైన అనేకత్వం నుంచి సామాన్య రూపమైన ఏకత్వం వైపు మనలను తీసుకెడుతుంది. ఆ ఏకత్వమే శివశక్త్యైక్యం. శక్తి వివర్తమైన అనేకత్వం ఏక రూపమైన శివ తత్త్వంలో లీనమై పోవాలి. అందులో ఇక ఐశ్వర్యమూ అనైశ్వర్యమూ అనే ప్రశ్న లేదు. ఏకైశ్వర్యే స్థితోపి .....యః స్వయం కృత్తివాసాః. రెంటినీ సమ దృష్టితో చూడగలడు. కామ మకామమనే తేడా లేదు. కాంతా సంమిశ్ర దేహోపి..... యతీనాం. కాంతతో ఉన్నా ఏకాంతుడే.

అభిమానం నిరభిమానమనే భేదం లేదు. అష్టాభిః....నాభిమానః. ఎనిమిది శరీరాలున్నా ఏ శరీరంమీద మమకారం లేదు. పృథివ్యాదులైన అష్టమూర్తులూ నావే. ఏదీ నాది కాదు. ఇదుగో ఇలాటి ఆలోకం మన కందినపుడే తామసమైన బ్రతుకంతా దేదీప్య మానంగా వెలిగిపోతుంది.

మాళవిక నాందీ శ్లోకం నెపంగా మన కందిస్తున్న సమరస భావ మిదే మహాకవి. పరిగత శక్తి రాత్మభూః. అని శక్తి సమాలింగిత శివ తత్త్వా రాధకుడై గ్రహించ గలిగాడీ రహస్యం కాళిదాసు. శివ శక్తులకు ప్రతీకగా ఆయా పాత్రలను సృష్టించి వారి అవినాభావానికి ప్రతీకగా ఆయా కథలల్లి వారి విభానుభావాలనే అందులో ప్రత్యక్షరమూ పొందు పరిచి చివరకు వారి ఐక్యానుసంధానమే కావ్య ధ్వనిగా లోకానికి బోధించి - మమాపిచ క్షపయతు పునర్భవ మని తనకూ మనకూ కూడా పునరావృత్తి రహితమైన శాశ్వత కైవల్య పదాన్ని తత్త్వ్యా నాటక రచనాప దేశంతో ప్రసాదించి తాను కృతార్థుడై సహృదయ జగత్తునంతా కృతార్థులను గావించి కడకు శివ సాయుజ్యం చెందాడా మహాను భావుడు.

వస్తుత శ్శివమయే హృది స్ఫుటం - సర్వత శ్శివమయం విరాజతే
నాశివం భవతి కస్యచిద్వచః - తేన వ శ్శివమయీ దశా భవేత్

అని లోకాని కంతా చాటిపోయిన మహా మాహేశ్వరుడూ శివాద్వయ దర్శన పారదర్శనుడూ అయిన అభినవ గుప్త పాదాచార్యుల మహోజ్జ్వల సందేశ మొకటి రసజ్ఞుల మనసులో నాటితే చాలు. అంతా శివమే. ఇలాటి శివాద్వయ ప్రత్యభిజ్ఞా మయమే కాళిదాసు జీవితం. దాని ప్రతిచ్ఛాయా మయమే ఆయన వాఙ్మయ జీవితం.

ఇతి సర్వం శివం.



Yallamraju Srinivasa Rao
www.advaitaveda.in